కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య

# మంత్రగీత


(భగవద్గీతా వివరణము)



కులపతి బుక్ ట్రస్ట్

The content of this publication is given for free as an act of goodwill and for personal use only. It is our responsibility to keep it that way.
Commercialization by any means or on any platform is prohibited, as well as distribution and/or publication in whole or in part without the express written permission of the publisher. All rights reserved.


# మాస్టర్ ఇ.కె. గ్రంథమాల





































**ప్రతులకు :**

**కులపతి బుక్ ట్రస్ట్, 15-7-1, 'ఏంజిల్స్ ఎన్‌క్లేవ్', కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.**

☎ 0891-2565291, 2701531. e-mail : kulapathibooktrust@gmail.com

# మంద్రగీత

(శ్రీమద్భగవద్గీతా వివరణము)

కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య

కులపతి బుక్ ట్రస్ట్

విశాఖపట్టణము - 530 002.

1వ ముద్రణ (1976) నుండి
8వ ముద్రణ (2018) వరకు : 8,000 ప్రతులు
9వ ముద్రణ 2022 : 1,000 ప్రతులు
మొత్తము : 9,000 ప్రతులు

© కులపతి బుక్ ట్రస్ట్, విశాఖపట్నం.

వెల : రూ॥ **180-00**

ప్రతులకు :
**కులపతి బుక్ ట్రస్ట్,**
15-7-1, *'ఏంజిల్స్ ఎన్‌క్లేవ్', కృష్ణనగర్,*
విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2565291, 94942 05291.
**e-mail : kulapathibooktrust@gmail.com**
**ISBN : 978-93-82199-65-6**

*ప్రతులకు :*
**ఓం నమశ్శివాయ జెరాక్స్**
మహారాణిపేట, విశాఖపట్నం -530 002.

# పరిచయము

**మా**నవ జాతికి సర్వకాలములందును కావలసిన యుపదేశము భగవద్గీత. అది సర్వసమస్యల పరిష్కారము. సత్యమయిన సుఖము కోరినవా డవశ్య మాచరింపవలసిన మార్గ మిందున్నది. అన్ని భూఖండములలో ప్రసిద్ధములైన భాష లన్నింటిలోనికి నిది యనువాదము చేయబడినది. ఆంగ్లభాషలో దీని యనువాదములకు లెక్కలేదు. తెనుఁగున గూడ మహనీయు లెందరో దీనిని లెక్కకు మిక్కిలిగా ననువాదములు చేసియున్నారు. మతాచార్యులగు పెద్దలు గూడ వ్యాఖ్యానముతో కూడిన అనువాదములను దేవభాషలో సంతరించి యున్నారు. ఈ "మంద్రగీత" యను నీ గ్రంథము జగత్ప్రసిద్ధమగు భగవద్గీతను తెనుగున మరల రచించు ప్రయత్నమే.

తెనుగున యనువాదములు పెక్కుండగా మరల ననువదించుట యేల? దీని కొక ప్రయోజన మున్నది. ఇది భగవద్గీతలోని శ్లోకముల కనువాదము కాదు. భగవద్గీతలో మంద్రముగా అనగా నంతర్లీనమై యున్న యుపదేశమునకు శ్లోకముల ననుసరించి చేసిన వివరణము. పండిత శిఖామణులకు వివరింపవలసిన పనిలేదు. పామరులకు శాస్త్ర సంకేత పదములతో వివరించుట వలన నుపయోగము లేదు. పరిశుద్ధమైన ఆస్తిక హృదయము కలిగి పాండిత్య భారము లేని సామాన్య సాధుజనుడు భగవద్గీత నభ్యసించుటకు కావలసిన వివరణ మిందు చేయబడి యున్నది. భగవద్గీతలోని యోగవిద్యకు ఆచరణ మొక్కటే ప్రధానము గనుక పామర సాధు జనులకే ఈ పవిత్ర గ్రంథము యొక్క యుపయోగ మెక్కువ. ఈ సంకల్పముతో "మంద్రగీత" యను పేర ప్రస్తుత గ్రంథముగా భగవద్గీత తెనుగున రచింపబడినది.

మూలము నుపదేశించుట కావశ్యములైన యుదాహరణలు, దృష్టాంతములు నిందు కూర్చబడి యుండుటచే దీనిని శ్లోకానువాద మనరాదు. ఇందలి అంకెలు మూలమందలి శ్లోకముల ననుసరించి

యుంచబడినవి. మరియు మూలమందలి సంకేత పదములు, కవి సమయములు, శాస్త్రసమయములు, ప్రత్యేకముగా వివరింపబడినవి. గ్రంథగ్రంథులు విడదీయబడినవి. మరియొక చిన్న విషయము. మూల గ్రంథమునకు పరంపరగా వచ్చుచున్న అధ్యాయముల పేర్లు, గ్రంథ కర్త యగు వ్యాసునిచే నుంచబడినవి కావని వాని పద్ధతి వలన తెలియుచున్నది. ఆ శీర్షికలు "అర్జున విషాదయోగము, సాంఖ్య యోగము" మొదలుకొని వరుసగా పెద్దలెవరో నిర్ణయించినట్లు కనుపించును. కనుక నొక్కొక్క తావున నధ్యాయము యొక్క సార్థకత ననుసరించి ఇవి మార్పు చేయబడినవి. ఈ మార్పు కూడ సామాన్య సాధుజనుల కెక్కువగా నుపయోగించును.

గీతామాహాత్మ్యము, ఫలశ్రుతి యను పేర కొన్ని శ్లోకములు పరంపరగా వచ్చుచున్నవి. ఇవి వరాహ పురాణములోనివని జనశ్రుతి కాని, నిష్కామ కర్మయోగము నుపదేశించు భగవద్గీతకు ఫలశ్రుతి అసందర్భము. ఫలము నాశింపక యజ్ఞార్థకర్మ నలవరచు కొమ్మని గీత బోధించు చుండగా దానిని పఠించుట వలన నిట్టి ఫలితములు కలుగునని వ్యాసప్రోక్తమైన వరాహ పురాణ మెట్లు బోధించును? మరియు భగవద్గీతలో కొంతభాగము చదివినను, ఒక శ్లోకము చదివినను చాలునని చెప్పు నసందర్భ వాక్యములు గూడ గీతా శాస్త్రమునకు వ్యతిరేకముగా నిందు కనిపించుచున్నవి. అందలి యుపదేశము గీతోపదేశమునకు వ్యతిరేకమగుటచే నీ శ్లోకములు ప్రక్షిప్తములని యెరిగి యిందు పాటింపబడలేదు. బుద్ధిమంతులై సమగ్రముగా గీతోపదేశ మభ్యసింప దలచిన వారికొరకు మాత్రమే ఈ మంద్రగీత యుద్దేశింప బడినది.

సంప్రదాయ సిద్ధమైన ఆస్తిక సుప్రసిద్ధ వణిగ్వంశ సంభూతులైన శ్రీ కంచర్ల దత్తు గృహమున నేను 1970 నుండి 1974 సం॥ము వరకు గీతా ప్రబోధము చేసిన దినములలో వారి గృహలక్ష్మి, శ్రీమతి అన్నపూర్ణాదేవి ఈ యుపదేశములను చెవులతోనే గాక హృదయముతో స్వీకరించినది. ఆమె చేసినది ఆదరపూర్వకమైన యాధ్యాత్మిక శ్రవణము. ప్రతి ప్రవచనమునకు ముందు గీతాచార్యున కామె చేయుచుండిన పుష్పమాలాలంకరణము, ప్రవచనాంతమున భక్తులు స్వీకరించు చుండిన యామె చేతి ప్రసాదము

కాల చక్రమున స్పష్టముగా ముద్రింపబడి యున్నవి. **1975** మార్చి **1**వ తేదీన మెఱపు తీగవలె ఆమె భౌతిక దేహమును విడిచి స్వామి పాద సన్నిధిని చేరుకున్నది. కంచర్లవారి యింట శాశ్వత పుణ్యగేహినియై యావత్కుటుంబముచే పసుపు, కుంకుమలతో పూజింపబడు మంగళ దేవతగా మారినది. ఆమెను శ్రోతగా నుద్దేశించి మే మీ మంద్రగీతను కూర్చితిమి. నిస్వార్థమైన అభిలాషతో పాటు గీతాచార్యుని మందస్మితములు, మధుర వేణుగానము ఆమె కుటుంబము వారిని, పాఠకులను రక్షించుచు వారి సంతతికి చిరకాలము కడుపుచలువ కలిగించునుగాక!

ఈ జనవరి **11, 12, 13** తేదీలలో జరుగుచున్న మాస్టరు సి.వి.వి. గురుపూజా మహోత్సవములలో దీని యావిష్కరణము జరుగును. గురుపూజా మహోత్సవములకు విచ్చేయు సోదర బృందమునకు గీతాచార్యుడు ఆయురారోగ్యైశ్వర్యములు చేకూర్చి యోగ సంసిద్ధి కలిగించును గాక!

ఇట్లు



విశాఖపట్నం
**11-1-1976**

# ముందుమాట

**భ**గవద్గీతకు ఎన్నో వ్యాఖ్యానములు, భాష్యములు కలవు. భగవత్ స్ఫూర్తి కలిగిన వారందరునూ భగవద్గీతపై తమదైన వ్యాఖ్యను వ్రాయుట భారతీయ సంప్రదాయమున కన్పట్టుచున్నది. సాక్షాత్తు భగవంతుడే బ్రహ్మతత్త్వమును, ఉపనిషత్సారమును, యోగవిద్యను సమన్వయించి అందించిన పరమోత్కృష్ఠ గ్రంథము శ్రీమద్భగవద్గీత. అందు సూచింపబడిన విషయమును గ్రహించి, ఆచరించి, ముముక్షువులైన వారెందరో గలరు.

చైతన్య గీతికగా భగవద్గీతను దర్శించి దానిని లోకమున కందించినవారు శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు. చైతన్యమునకు మరొకపేరు మంత్ర మని, కావున తాను దర్శించిన భగవద్గీత "మంత్రగీత" యని వారు పేర్కొనిరి. అంతియేకాక, పదునెనిమిది అధ్యాయములకు తనదైన శైలిలో నామకరణము చేసినారు. 'మాస్టర్ ఇ.కె.'గా వారి అనుయాయులచే కీర్తింపబడుచూ, నవ యుగమున ఒక ప్రసిద్ధ యోగాచార్యునిగ కృష్ణమాచార్యులవారు దర్శనమిచ్చిరి. వారే గ్రంథము స్పృశించిననూ అందలి హృదయమును ఆవిష్కరింపగల ప్రతిభాశాలి, ఋషి, వారు గీతా శ్లోకములకు అతి సులభమైన శైలిలో, నిరుపమానమైన వ్యాఖ్యతో మంత్రగీతను అందించినారు. జ్ఞానపరము, యోగపరము లయిన ఎన్నియో విషయ ములను ప్రత్యేకించి ప్రకాశింప జేసినారు.

భగవద్గీతా వ్యాఖ్యానములలో మంత్రగీత కొక ప్రత్యేక స్థానము గలదు. కాలక్రమమున అది తెలియగలదు. శ్రద్ధాళువులైన సామాన్య జనులకు మంత్రగీత పరిపూర్ణ మార్గదర్శకము. కులపతి బుక్ ట్రస్ట్ మాస్టర్ ఇ.కె. రచనము లను, ప్రవచనములను సేకరించి, ప్రచురించి, వ్యాప్తి గావించు యజ్ఞమును చేపట్టినది. మంత్రగీతను సర్వాంగ సుందరముగ తీర్చిదిద్దిన కృషిలో పాల్గొనిన వారందరికీ ట్రస్ట్ యాజమాన్యము కృతజ్ఞతాపూర్వక అభినందనలను ప్రకటించు చున్నది.

ఇట్లు
**కంభంపాటి పార్వతీకుమార్**
అధ్యక్షులు
కులపతి బుక్ ట్రస్ట్

విశాఖపట్నం
**27-12-2000**

# శ్రీమద్భగవద్గీత - మంత్రగీత

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | గీతోపదేశ కథ | ........ | 10 |
| 1. | *అర్జున విషాద యోగః ।* | ........ | 13 |
| | కలవరము | ........ | 18 |
| 2. | *సాంఖ్యయోగః ।* | ........ | 23 |
| | కనువిప్పు | ........ | 30 |
| 3. | *కర్మయోగః ।* | ........ | 47 |
| | చక్ర భ్రమణము | ........ | 51 |
| 4. | *జ్ఞానయోగః ।* | ........ | 64 |
| | జ్ఞాన యోగము | ........ | 68 |
| 5. | *కర్మ సన్న్యాస యోగః ।* | ........ | 81 |
| | సన్న్యాసము - యోగము | ........ | 84 |
| 6. | *ధ్యానయోగః ।* | ........ | 91 |
| | యోగాభ్యాసము | ........ | 96 |
| 7. | *విజ్ఞానయోగః ।* | ........ | 107 |
| | శాస్త్ర విజ్ఞానము | ........ | 110 |
| 8. | *అక్షర పరబ్రహ్మ యోగః ।* | ........ | 117 |
| | దారులు - మెట్లు | ........ | 120 |

| | | | |
|---|---|---|---|
| 9. | *రాజవిద్యా రాజగుహ్య యోగః ।* | ........ | 128 |
| | రాజవిద్య - రాజగుహ్యము | ........ | 131 |
| 10. | *విభూతియోగః ।* | ........ | 139 |
| | దివ్య వైభవము | ........ | 143 |
| 11. | *విశ్వరూప సందర్శన యోగః ।* | ........ | 167 |
| | విశ్వరూప దర్శనము | ........ | 173 |
| 12. | *భక్తియోగః ।* | ........ | 182 |
| | భక్తి యోగము | ........ | 184 |
| 13. | *క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగః ।* | ........ | 191 |
| | క్షేత్రము - క్షేత్రజ్ఞుడు | ........ | 195 |
| 14. | *గుణత్రయ విభాగ యోగః ।* | ........ | 206 |
| | మూడు గుణముల విశేషములు | ........ | 209 |
| 15. | *పురుషోత్తమ ప్రాప్తియోగః ।* | ........ | 215 |
| | పురుషోత్తమ ప్రాప్తి | ........ | 217 |
| 16. | *దైవాసుర సంపద్విభాగ యోగః ।* | ........ | 237 |
| | దేవతలు - అసురులు | ........ | 240 |
| 17. | *శ్రద్ధాత్రయ విభాగ యోగః ।* | ........ | 247 |
| | శ్రద్ధలో పోకడలు | ........ | 250 |
| 18. | *మోక్ష సన్న్యాస యోగః ।* | ........ | 257 |
| | గురుశిష్య యోగము | ........ | 264 |
| | శ్రీమద్భగవద్గీత - శ్లోకాను క్రమణిక | ........ | 284 |



# గీతోపదేశ కథ

సృష్టిగా రూపొందిన వస్తువేది? అను ప్రశ్నకు సమాధానము ఒక్క సృష్టిలోనే లభించును. అది సృష్టిలో నిమిడియున్న వస్తువే. దానిని తెలిసికొన యత్నించుట యెందులకు? అను ప్రశ్నకు సమాధానముకూడ యత్నించు లక్షణములోనే లభించును. తెలిసికొనవలెనను ధర్మమున్నది గనుక తెలిసికొన యత్నించుట ధర్మమార్గము. తెలిసికొనబడునది ధర్మముయొక్క పరమావధి. అదియే పరమధర్మము. మనస్సున్నది గనుక భావించుట దాని ధర్మము. కనుకనే భావింపబడునది పరమధర్మము. మనస్సునకు ఇంద్రియము లుండుట ధర్మము. మనస్సునకు, ఇంద్రియములకు ప్రాణముండుట, ఇన్నిటికిని ఒక దేహముండుట ఆవశ్యకము. కనుక ఇన్నియు సృష్టింపబడినవి, ఇది సృష్టి ధర్మము.

మొత్తమును పరిశీలించి చూడగా పరమ ధర్మము, అందు అంతర్భాగము లైన వివిధ ధర్మములు, పరికరములైన పదార్థ విశేషములు, వాని కాధారమైన భౌతికతత్త్వము అనునని సృష్టియందు జీవులకు గోచరించు సత్యములు, ఇందొక్కొక్క భాగమును వేరుగా పరిశీలించినపుడు గోచరించు దానిని అసత్యమందురు.

దాని ననుసరించిన ప్రవర్తనను అధర్మ మందురు. ఆచరణము ధర్మము ననుసరించిపుడు కలుగునది సుఖము. అధర్మము ననుసరించినపుడు కలుగునది దుఃఖము. అందు మొదటి మార్గము వెలుగుబాట. రెండవది గ్రుడ్డిబాట. వెలుగుబాట ననుసరించిన జీవుని పంచేంద్రియములు పాండురాజు కొడుకులుగా, గ్రుడ్డిబాట ననుసరించిన వానిలోని అనేకములైన మానసిక వికృతి శక్తులు గ్రుడ్డిరాజు కుమారులుగా– రెండు పక్షములును అస్తిత్వము అను సామ్రాజ్యమును గురించిన యుద్ధ రంగమున రెండు పక్షముల సైన్యములుగా బారులు తీర్చినవి.

'నేను', 'నాది', 'నావారు' అని ముడిపెట్టుకొనిన మనస్సు తన దృష్టిని తాను సంకోచపరచుకొని, గ్రుడ్డిగా జీవితము గడుపును. 'నేను' అనునది మనలో నున్న వెలుగుగా తెలుసుకొని, ఆ వెలుగే అందరియందు, అన్నిటి యందు కలదని గ్రహించి ఈ 'నేను' సర్వాంతర్యామి యని గ్రహించిన మనస్సు వెలుగగును. ఆ వెలుగే పాండురాజు. ఆ పాండురాజు పుత్రులకును, గ్రుడ్డిరాజగు ధృతరాష్ట్రుని పుత్రులకును యుద్ధము జరిగిన రంగమే ఈ సృష్టి. కనుక ఇది సకల ధర్మముల కును నిలయమైన ధర్మక్షేత్రము. అన్ని విధము లైన ఆచరణములకును గూడ నిలయము గనుక అది కురుక్షేత్రము. క్షేత్ర మనగా దున్ని సాగు చేసికొని, పంట పండించుకొనవలసిన భూమి. దైవానుగ్రహముగా వర్షము లన్ని తావులయందును వర్షించినను దున్నుకొనినవాని క్షేత్రము మాత్రమే పండును. సత్కర్మాచరణము చేసినవానికే దైవానుగ్రహము అనుభవమునకు వచ్చునుగాని ఇతరులకు రాదు. ఈ శరీరము కూడ క్షేత్రమే.

భూమి మొత్తములో మన పొలము ఒక భాగమైనట్లు సృష్టి మొత్తములో ఈ శరీరము ఒక పరిపూర్ణమైన క్షేత్రము. కృషిని బట్టి మిగిలిన పొలములలో పండిన పంటలన్నియును మన భూమియందును పండును. అట్లే మన శరీర మందును ఈ సృష్టి సమస్త తత్త్వము అనుభవమిచ్చును. ఈ శరీరము క్షేత్ర మనబడునని భగవద్గీతయే చెప్పుచున్నది. అందు విజయము పొందువాడు విజయుడు. అతడు నరుడు. సర్వజీవులయందు సర్వమును నిర్వహించుచున్న

వాడు నారాయణుడు. ఇద్దరును యుద్ధ రంగమున నొకే రథముపై సిద్ధమగు చున్నారు. ఒకే శరీరమున నరుడును, నారాయణుడును 'నేను' అనబడి, ఏకవచనమున వ్యవహరింపబడు చున్నారు. యుద్ధరంగమున శరీర మనబడు రథమున వారిద్దరును దిగివచ్చి వ్యవరించు కథయే పరమధర్మము నుపదేశించు ఘట్టముగా రూపొందినది. ఈ కథయే గీతోపదేశము. ఇందలి పరమధర్మమే బ్రహ్మవిద్య. 'నేను' అనబడు నరుని 'నేను' అనబడు నారాయణునకు దగ్గరగా చేర్చును గనుక ఈ విద్యనే 'ఉపనిషత్తు' అందురు. నరునిలోనున్న శరీరము ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనబడు వేర్వేరు 'నేను'లు పూసలుగా నున్నప్పుడు, వానిని 'నేను' సర్వాంతర్యామి దారమునకు ఒకే దండగా గ్రుచ్చునట్టి విద్య గనుక నిది 'యోగవిద్య' యని కూడ వ్యవహరింప బడును. ఆ లోపలి దారము సర్వాంతర్యామి యనబడు దూదిచే విలాసముగా పేనబడినది గనుక, దానికి బ్రహ్మసూత్రమని పేరు.

ఈ మొత్తము దర్శనము చేసి అనుభవమునకు తెచ్చుకొనులోపున వివిధాంశములను, వాని ప్రవర్తనలను, సన్నివేశములను గుర్తుంచుకొనుటకు 'శ్రుతి' అను ధర్మము కావలెను గనుక స్మృతి కూడ నొక ప్రధాన పాత్రగా ఈ నాటకరంగమున నందింపబడినది. ఆ పాత్రయే సంజయుడు. వివిధాంశ ముల నతడే పూస గ్రుచ్చి వినిపించుచుండును. వివిధత్వమున సమ్యగ్దృష్టిని కోల్పోయిన గ్రుడ్డిరాజునకు ప్రశ్నలు మాత్రమే మిగులును. నరునిలోని నారాయణు నకు జగన్నాటక కర్తృత్వము, ఆధిపత్యము, దర్శకత్వము ఆపాదింపబడును. నారాయణునిలో నుండి ఒక భావముగా పుట్టి, స్వతంత్రముగా వ్యవహరించు నరుడు నాయక పాత్ర నభినయించును. నాటక సారాంశము అనుభూతి లేక యోగము.

శ్రీ కృష్ణాయ నమః ।

# శ్రీమద్భగవద్గీతా

ప్రథమోఽ ధ్యాయః ।

## అర్జున విషాదయోగః ।

*ధృతరాష్ట్ర ఉవాచ :*

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥ 1

*సంజయ ఉవాచ :*

దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా ।
ఆచార్య ముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥ 2

పశ్యైతాం పాండుపుత్రాణాం ఆచార్య మహతీంచమూమ్ ।
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 3

అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమాయుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥ 4

ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్ ।
పురుజి త్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥ 5

యుధామన్యుశ్చ విక్రాంతః ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6

అస్మాకం తు విశిష్టా యే తా న్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమితే ॥ 7

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ ॥ 8

అన్యే చ బహవ శ్శూరాః మదర్థే త్యక్త జీవితాః ।
నానాశస్త్ర ప్రహరణాః స్సర్వే యుద్ధ విశారదాః ॥ 9

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాఽభి రక్షితమ్ ।
పర్యాప్తం త్విద మేతేషాం బలం భీమాభి రక్షితమ్ ॥ 10

అయనేషు చ సర్వేషు యథాభాగ మవస్థితాః ।
భీష్మ మేవాఽభి రక్షంతు భవంత స్సర్వ ఏవ హి ॥ 11

తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చై శ్శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥ 12

తత శ్శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః ।
సహసైవాభ్యహన్యంత స శబ్ద స్తుములోఽభవత్ । 13

తత శ్శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ 14

పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15

అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।
నకుల స్సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ ॥ 16

కాశ్యశ్చ పరమేష్వాస శ్శిఖండీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకి శ్చాపరాజితః ॥ 17

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహు శ్శంఖాన్ దధ్ముః ప్రథ క్పృథక్ ॥ 18

స ఘోషో ధార్త రాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।
నభశ్చ పృథివీం చైవ తుములోఽ వ్యనునాదయన్ ॥ 19

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్త రాష్ట్రాన్ కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥ 20

హృషీకేశం తదా వాక్యమిద మాహ మహీపతే ।

*అర్జున ఉవాచ :*

సేనయో రుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥ 21

యావ దేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామా నవస్థితాన్ ।
కైర్మయా సహయోద్ధవ్య మస్మిన్ రణ సముద్యమే ॥ 22

యోత్స్యమానా నవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।
ధార్త రాష్ట్రస్య దుర్బుద్ధే ర్యుద్ధే ప్రియచికీర్షవః ॥ 23

*సంజయ ఉవాచ :*

ఏవ ముక్తో హృషీకేశో గుడాకేశన భారత ।
సేనయో రుభయో ర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥ 24

భీష్మద్రోణ ప్రముఖత స్సర్వేషాం చ మహీక్షితాం ।
ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూ నితి ॥ 25

తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄ నథ పితామహాన్ ।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ॥ 26

శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయో రుభయో రపి ।
తాన్ సమీక్ష్య స కౌంతేయ స్సర్వాన్ బంధూ నవస్థితాన్ ॥ 27

కృపయా పరయా విష్టో విషీద న్నిద మబ్రవీత్ ।
*అర్జున ఉవాచ :*
దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥ 28

సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29

గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నో మ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే ॥ 31

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగై ర్జీవితేన వా ॥ 32

యేషా మర్థే కాంక్షితం నో రాజ్యం భోగా స్సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనాని చ ॥ 33

ఆచార్యాః పితరః పుత్రా స్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రా స్స్యాలా స్సంబంధిన స్తథా ॥ 34

ఏతాన్న హంతు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ 35

నిహత్య ధార్త రాష్ట్రా న్నః కా ప్రీతిః స్యా జ్జనార్దన ।
పాపమే వాశ్రయే దస్మాన్ హత్వైతా నాతతాయినః ॥ 36

తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37

యద్య ప్యేతే న పశ్యంతి లోభోపహత చేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38

కథం న జ్ఞేయ మస్మాభిః పాపా దస్మా న్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భి ర్జనార్దన ॥ 39

కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మో ఽభిభవత్యుత ॥ 40

అధర్మాభిభవాత్ కృష్ణ! ప్రదుష్యంతి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ! జాయతే వర్ణసంకరః ॥ 41

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదక క్రియాః ॥ 42

దోషై రేతైః కులఘ్నానాం వర్ణసంకర కారకైః ।
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43

ఉత్పన్న కులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకే నియతం వాసో భవతీ త్యనుశుశ్రుమ ॥ 44

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజన ముద్యతాః ॥ 45

యది మా మప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్ ॥ 46

*సంజయ ఉవాచ :*
ఏవముక్త్వాఽర్జున స్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్న మానసః ॥ 47

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*అర్జున విషాదయోగో నామ ప్రథమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

# మంత్రగీత

*అధ్యాయము - 1*

## కలవరము

**1.** తన కొడుకులకై రాజ్యమును మనస్సున గట్టిగా పట్టుకొని పెనగులాడుచున్న గ్రుడ్డిరాజిట్లు ప్రశ్నించెను. "అన్ని ధర్మములకు, అన్ని ప్రవర్తనలకు క్షేత్రమైన రంగమున నావారును, పాండవులును యుద్ధమని చేరి ఏమిచేసిరి? సంజయా! నాకు విశేషములను తెలుపుము."

**2.** *సంజయుడిట్లు చెప్పదొడగెను.* "పాండవులసేన వ్యూహముగా నమర్చబడి యున్నది. దుష్టయోధనమునందు అభిలాష వహించిన రాజకుమారుడగు దుర్యోధనుడు గురువగు ద్రోణుని సమీపించి యిట్లనెను.

**3.** ఈ పాండుపుత్రుల మహా సైన్యమునకు, ఆచార్యా! నీ శిష్యుడు వ్యూహము పన్నినాడు. ద్రుపదపుత్రుడగు నీ శిష్యుడు మిక్కిలి సూక్ష్మబుద్ధి. (దృష్టద్యుమ్నుడు ద్రుపదునకు వరమున బుట్టినవాడు. ద్రోణుని చంపునట్లు అతనికి వరమున్నది. అయినను ద్రోణుని కడనే అతడు ధనుర్విద్య నభ్యసించెను. ఇందలి ద్రోణుని ఔదార్యము దుర్యోధనునకు భయకారణ మగుట దుర్యోధనుని అసూయను సూచించును.)

**4.** అందు యుయుధానుడు, విరాటుడు, మహారథుడగు ద్రుపదుడును యుద్ధమునందు భీమార్జునులతో సమానులు, విలువిద్యలో పెద్దవారు.

**5, 6.** ఇంకను ధృష్టకేతువు మున్నగువారు విక్రమమునందు వన్నెకెక్కిన వారు. సుభద్ర కొడుకు అభిమన్యుడు గట్టివాడు.

**7, 8.** మన బలమున పెద్దవారిని కూడ పేర్కొనుచున్నాను. తమరు, భీష్ముడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు మున్నగు పరాక్రమవంతులు మన పక్షము నలంకరించి యున్నారు.

**9.** యుద్ధమునందు ఆరితేరినవారు, అనేక శాస్త్రములు తెలిసిన వారు,

లెక్కకు మిక్కిలిగా నాకొరకు మమకారమున జీవితాశను కోల్పోయి యుద్ధమునకు సిద్ధమైనారు.

**10.** భీష్మునిచే రక్షింపబడుచున్న నా బలము లెక్కకు మిక్కిలియై పర్యవేక్షణకు లొంగకున్నది. పాండవుల బలము పరిమిత సంఖ్యయై హద్దులలో నిమిడియున్నది. దానిని భీముడు రక్షించు చున్నాడు.

**11.** ఎట్లైనను మీరందరు తమతమ స్థానములనుండి భీష్మని కాపాడు కొనుడు.”

**12.** ఇట్లు పలుకుచున్న దుర్యోధనుని మాటలలో గురువగు ద్రోణుని నెత్తిపొడుచుట, కొంత అధైర్యము గోచరించినవి. ఇట్టి భావములనుండి మరలించి, దుర్యోధనునకు హర్షము పుట్టించుచు భీష్ముడు సింహ నాదముగా తన మహాశంఖమును పూరించెను. అతడు వయస్సుతో నిమిత్తములేని ప్రతాపవంతుడని ఆ శంఖధ్వని చాటినది.

**13.** వెంటనే అనేక శంఖములు, భేరులు మున్నగు వాద్యముల ధ్వనులు కురుసైన్యముల నుండి వెలువడి భూనభోంతరాళములు నిండినవి.

**14.** అదే సమయమునకు నరనారాయణులు తెల్లని గుఱ్ఱములు పూన్చిన మహారథమున రంగము నడుమన కనిపించిరి. దివ్య శంఖములను పూరించిరి.

**15.** ఐదు ధ్వనులతో కూడిన కృష్ణుని శంఖధ్వని తాకిన హృదయము లందెల్ల అతడు హృదయముల కీశుడని ధ్వనించినది. నరుని శంఖధ్వని దేవదత్తమేగాని సామాన్యము కాదని తోచినది. వాయుపుత్రుని మహా శంఖధ్వని గాలిలో జాళ్ళుగా చెవులకు సోకినది.

**16.** ధర్మ స్వరూపమగు ధర్మరాజు శంఖమునుండి అనంత విజయము తథ్యమని ధ్వనించినది. నకులుని ధ్వనిలో శ్రావ్యత, సహదేవుని ధ్వనిలో విచిత్రమైన మెలపులు వెలువడినవి.

**17, 18.** కాశీరాజు మొదలుగాగల తక్కినవారును అభిమన్యునితో పాటు గంభీర శంఖధ్వనులు చేసిరి.

**19.** పాండవ సింహనాద ఘోషలు ధృతరాష్ట్ర సుతుల గుండెలను చీల్చుకొనుచు భూమ్యాకాశముల దద్దరిల్ల చేసినవి.

**20.** శరప్రయోగమునకు విల్లెత్తి యర్జునుడు కౌరవుల పక్షమును పరికించి కృష్ణునితో నిట్లనెను.

**21, 22.** రథమును రెండు సేనలకు నడుమ నిలుపుము. ఇందు నాతో యుద్ధము చేయదలచిన వారినందరిని ఒక్కమారుగా పరికింతును.

**23.** దుర్యోధనుని దుర్బుద్ధి కారణముగా యిందరకును యుద్ధ ప్రీతి కలిగినది.

**24, 25.** *సంజయు డిట్లు పలికెను :* సారథి యగు కృష్ణు డర్జునుని రథమును రెండు సేనల నడుమ నిలిపెను. భీష్ముడు, ద్రోణుడు మున్నగువారి నందరిని చూపి, "యుద్ధమునకై యిచట చేరిన కౌరవుల నిప్పుడు చూడుము" అని పలికెను.

**26.** అప్పుడర్జునుడు చూచినది వ్యక్తులను కాదు. అతడు కనుగొనినది చుట్టములను, చుట్టరికములను, తండ్రులను, తాతలను, గురువులను, సుతులను, మనుమలను, రెండు పక్షముల సేనలయందు పరికించెను.

**27.** వారిని చూచుసరి కతని కొక్కమారుగా మిక్కిలి జాలి కలిగెను. అది అతనికి చుట్టరికముల వలన కలిగిన జాలియేగాని, జీవికి జీవియందు కలుగునదికాదు. అతడిదివరకు లెక్కలేనన్ని యుద్ధములు చేసెను. అందు తనచేత చనిపోయిన వారిలో నొక్కరియందును జాలి కలుగలేదు. మనవారనగనే జాలి పుట్టుకొని వచ్చినది. "నా నొప్పి యితరుల నొప్పివంటిది కాదు" అన్నట్లున్న యీ జాలి అధర్మమును, క్షుద్రత్వమును సూచించును. దానిని పెద్దలు విషాద మందురు. అర్జునుడు విషాదముతో నిట్లు పలికెను.

**28.** కృష్ణా! మనవారిని చూడగనే నాకు శరీరము దుర్బలమైనది. నోరెండు చున్నది.

**29.** మేను కంపమంది రోమములు నిక్కబొడుచు చున్నవి. చేయి పట్టుతప్పి గాండీవము జారిపోవుచున్నది. దేహము మంటలు పుట్టుచున్నది.

**30.** ఇక నేను నిలబడలేను. నా మనస్సు తిరిగిపోవుచున్నది. శకునములు కూడ చెడ్డగా తోచుచున్నవి.

**31.** ఇంత తెలిసిన మనవారిని చంపుకొనుట వలన మనకేదైన శుభము కలుగునందువా? మనవారితో యుద్ధమేమి? నాకు విజయము పైన, రాజ్యసుఖములపైన కోరికలు చచ్చినవి.

**32.** కృష్ణా! రాజ్యము వలనను, సుఖభోగముల వలనను మనము సాధింపగలిగిన దేమి? అసలు జీవించుట వలన మాత్రము ప్రయోజనమేమి?

**33.** మనము రాజ్యము కోరినచో, సుఖమును, భోగమును కోరినచో అవి యెవరికొరకు కందువు? మనకొరకా? అవి యెవరికొరకో వారే ప్రాణధనములను త్యజించి ఇదుగో మన యెదుట నిలబడినారు.

**34.** వారే గురువులు, తండ్రులు, తాతలు, పుత్రులు, పౌత్రులు మొదలగు దగ్గర చుట్టములు. సుఖములనే ఆర్జించుకొనుట కలిగినచో అది యంతయు వీరికోసము కాదా?

**35.** వీరిని చంపవలెనను కోరిక నాకు లేదు. వారు నన్నుచంపినను సరియే! ముల్లోకములును చేజిక్కినను దీనివలన మనకు కలిగెడిదేమి?

**36.** మన ధృతరాష్ట్రుని కొడుకులను చంపి మనము పులుముకొనున దేమి? నిశ్చయముగా పాపమే. ఇది యుద్ధము కాదు, హత్య! మనము హత్యా నేరము చేసినవార మగుదుము గాని యుద్ధము చేసిన వారము కాము.

**37.** ఎవడైనను తనవారిని చంపుకొని సుఖపడిన వాడున్నాడా? మనమీ పని చేయుట మనకు తగదు.

**38.** లోభముచే వారి బుద్ధి నశించి యుండవచ్చును. పాపము! వారి కన్నులకు పొరగప్పి యుండవచ్చును. మన కన్నుల కేమి వచ్చినది! వంశనాశ మెంత దోషము? మిత్రద్రోహ మెంత పాపము?

**39.** వారికి తెలియనిచో మనమేల తెలిసికొనరాదు? వంశనాశము దోషమని యెరిగిన మనము, ఈ పాపము నుండి విముఖత చెందుట కేమి యభ్యంతరము?

**40.** వంశనాశము వలన సనాతనాచారముగా వచ్చుచున్న కుల ధర్మములు నశించును. ధర్మము నశించినచో మిగులునదేమి? వంశ మంతయు కలుషిత మైపోవును.

**41.** దానితో కులస్త్రీలకు శీలము చెడిపోవును. స్త్రీలు చెడిపోయినచో వంశము సంకరమగును.

**42.** దానితో వంశమునకును, వంశనాశము చేసిన వారికిని నరకము తప్పదు. పిండోత్పత్తి అపరిశుద్ధమగును. దానికి వలసిన తర్పణ జలములగు జాతివీర్యము లపవిత్రమగును. తరతరములుగా శరీరముల నాశ్రయించి వచ్చు ధర్మ ప్రజ్ఞామూర్తులైన పితరులు పతనము చెందుదురు.

**43.** ఇట్లు వంశనాశము చేసి, వర్ణ సంకరమునకు కారకులమైన మన వలన జాతి ధర్మములు, సంప్రదాయములు అడుగంటి పోవును.

**44.** వర్ణధర్మము లడుగంటిన మనుష్యులకు నరకము వ్రాసిపెట్టి యున్నదని పెద్దల వలన వినుచున్నాము గదా!

**45.** చూచితివా! ఇంతలో నెంతటి మహాపాపము చేయుటకు మనము సిద్ధపడితిమో! రాజ్యముపై, సుఖములపై లోభమున మన వారిని చంపుటకు తగుదునని సిద్ధపడి వచ్చితిమి.

**46.** నాకీ ప్రతీకారమార్గము వలదు. ఎందులకీ పట్టుదలలు? నేనిక శస్త్రము ధరింపను. వారే అన్ని శస్త్రములను ధరించి నన్ను యుద్ధమున చంపుదురు. అంతియేకదా! పోనిమ్ము. ఇంతకన్న నాకు అదియే క్షేమము.

**47.** ***సంజయు డిట్లనెను :*** అర్జును డిట్లు పలుకుచు విల్లమ్ములను విడిచి, శోక వేగమున మనస్సు కుములగా రథమున కూలబడెను.

ద్వితీయోఽధ్యాయః ।

# సాంఖ్యయోగః ।

*సంజయ ఉవాచ :*

తం తథా కృపయాఽఽవిష్ట మశ్రుపూర్ణాకులేక్షణమ్ ।
విషీదంత మిదం వాక్య మువాచ మధుసూదనః ॥ **1**

*శ్రీభగవా నువాచ :*

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥ **2**

క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ **3**

*అర్జున ఉవాచ :*

కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హా వరిసూదన ॥ **4**

గురూ నహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహ లోకే ।
హత్వార్థకామాంస్తు గురూ నిహైవ భుంజీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్ ॥ **5**

నచైత ద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామః తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ **6**

కార్పణ్య దోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।
య చ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ **7**

న హి ప్రపశ్యామి మమాపనుద్యా
ద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్ ।

అవాప్య భూమా వసపత్న మృద్ధం
రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్ ॥ 8

సంజయ ఉవాచ :

ఏవ ముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9

త మువాచ హృషీకేశః ప్రహస న్నివ భారత ।
సేన యో రుభయోర్మధ్యే విషీదంత మిదం వచః ॥ 10

శ్రీభగవా నువాచ :

అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాం శ్చ భాషసే ।
గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ 11

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమో జనాధిపాః ।
నచైవ న భవిష్యామ స్సర్వే వయ మతః పరమ్ ॥ 12

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిః ధీర స్తత్రన ముహ్యతి ॥ 13

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖ సుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోఽంత స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16

అవినాశి తు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి ॥ 17

అంతవంత ఇమే దేహా నిత్య స్యోక్తా శ్శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ॥ 18

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ 19

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషం పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥ 21

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥ 23

అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ ।
నిత్య స్సర్వగత స్థాణు రచలోఽయం సనాతనః ॥ 24

అవ్యక్తోఽయ మచింత్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే ।
తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితు మర్హసి ॥ 26

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ 27

అవ్యక్తాదీని భూతాని వ్యక్త మధ్యాని భారత ।
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥ 28

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి శ్రుత్వా ప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥ 29

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30

స్వధర్మ మపి చావేక్ష్య న వికంపితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥ 31

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వార మపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధ మీదృశమ్ ॥ 32

అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ 34

భయాద్రణా దుపరతం మన్యంతే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥ 35

అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।
నిందంత స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి ॥ 38

ఏషాతేఽభిహితా సాంఖ్యే బుద్ధి ర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥ 39

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41

యా మిమాం పుష్పితాం వాచం ప్రవదం త్యవిపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్య దస్తీతి వాదినః ॥ 42

కామాత్మానః స్వర్గపరా జన్మకర్మ ఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌ న విధీయతే ॥ 44

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 45

యావానర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే ।
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫల హేతుర్భూ ర్మా తే సంగోఽస్త్వకర్మణి ॥ 47

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ ।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే ।
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛం త్యనామయమ్ ॥ 51

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53

*అర్జున ఉవాచ :*

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కి మాసీత వ్రజేత కిమ్ ॥ 54

*శ్రీభగవా నువాచ :*

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ 55

దుఃఖేష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే ॥ 56

య స్సర్వత్రా నభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 60

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

ధ్యాయతో విషయాన్ పుంసః సంగ స్తేషూపజాయతే ।
సంగా త్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥ 62

క్రోధా ద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్ ।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ 64

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ 65

నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయతః శాంతి రశాంతస్య కుతః సుఖమ్ ॥ 66

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయు ర్నావ మివాంభసి ॥ 67

తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69

ఆపూర్యమాణ మచలం ప్రతిష్ఠమ్
సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ ॥ 70

విహాయ కామాన్ య స్సర్వాన్ పుమాం శ్చరతి నిస్స్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి ॥ 71

ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ! నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాఽస్యా మంతకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ 72

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*సాంఖ్యయోగో నామ ద్వితీయోఽధ్యాయః ।*
*ఓం తత్ సత్ ।*

అధ్యాయము - 2

# కనువిప్పు

**1. సంజయుడు :** జాలితో నిండి కన్నుల నీరు నింపిన యర్జునుని వ్యామోహమును గమనించి, కృష్ణుడు పరుష మధురముగా నిట్లు పలికెను.

**2. శ్రీకృష్ణుడు :** ఏమి యీ కలవరపాటు? ఇది నీకుగాని నీవిప్పుడున్న పరిస్థితికిగాని తగినదికాదు. వాస్తవమునకిది సత్ప్రవర్తనము కాదు. ఇన్ని యుద్ధములలో నిదివరకు కలుగని యీ జాలి వాస్తవ మందువా? మమకారము జాలియగునా? ఇదివరకు ఇతరులెందరో నీచే యుద్ధములో చచ్చినను, నీవారు మాత్రము చావకూడదా? ఓహో! ఏమి కీర్తిప్రదమైన మార్గము? త్రికరణ శుద్ధిలేని ఈ మమకారపు నటన వలన స్వర్గమును చంకబెట్టుకొన జూచితివా?

**3.** పరిస్థితులను, సన్నివేశములను ఎదుర్కొన లేకపోవుట షండత్వ మగునా, జాలియగునా? ఇది హృదయ దౌర్బల్యము. దీనిని నేను నీచబుద్ధి యనుచున్నాను. ఇది నీకు తగదు, విడిచి లేచి నిలబడుము.

**4. అర్జునుడు :** భీష్మద్రోణాదులు మనకు పూజింపదగిన వారు. నీవు కాదనగలవా? వారిని బాణములతో కొట్టుమని ఎట్లు చెప్పగలవు? నీవు శత్రువులను దమించువాడవు కావచ్చును. కాని ఇది తగునా? యోచింపుము.

**5.** మహానుభావులగు గురువులను నొప్పింపకుండు మార్గమున గదా శ్రేయస్సును పొందవలసినది? ఆ మార్గమున భిక్షాటనము చేసినను మనకు మంచిదే! ఇహలోక సుఖములకై గురువుల నిచ్చుటనే నరికి ఈ నెత్తుటి కూడు ననుభవించు గతి యేమి పట్టినది?

**6.** మనము వారిని గెలుచుటో, వారు మనలను గెలుచుటో ఈ రెండు మార్గములలో నేది శ్రేయస్సో మనము తెలిసికొనుట లేదు. జయించు నంత వరకేగాని, మనము వీరిని జయించిన క్షణమున నిక జీవితముపై వెగటు పుట్టదా?

**7.** జాలి వలన నా మనసు దైన్యము చెందినది. స్వభావసిద్ధ మగు నా వివేకము మాటుపడినది. ధర్మమునందు నా బుద్ధి సమ్మోహము చెంది

నది. ఇక నేను విమర్శించుకొనజాలను. మన కేది శ్రేయస్సో నీవే నిశ్చయించి నన్ను శాసింపుము. నేనిప్పుడు నీకు శిష్యుడనై శరణాగతి చేసితి ననుకొనుము.

**8.** సాటిలేని యుద్ధమున శత్రువులులేని ఏకచ్ఛత్రాధిపత్యము పొందినను, దేవతలపై నాధిపత్యము పొందినను, నా పంచేంద్రియములను మంటలు పెట్టు శోకమునకు పరిహారము కలుగునా?

**9. *సంజయుడు* :** కృష్ణునితో నిట్లుపలికి 'ఇక నేను యుద్ధము చేయ' నని యర్జునుడు మౌనము వహించెను.

**10.** *అతనివంక చూచి కృష్ణుడు చిరునవ్వుతో నిట్లనెను :* రెండు సేనల నడుమ కూర్చుండి తీరుబడిగా దుఃఖించుచున్నావు. నా మాటలు చెవికెక్కునో లేదో!

**11.** ఎందులకీ యక్కరలేని యేడుపు? ఏమి ముంచుకొని వచ్చినది? దుఃఖింపవలసిన కారణము లేనిచోట నీవు దుఃఖపడుట హాస్యాస్పదము. ఎవరేని చనిపోయినపుడు వారి బంధువులు దుఃఖింతురు. దుఃఖించుట వలన అతడు చావుమాని తిరిగి వచ్చునని నమ్ముచున్నారా? రాదని తెలిసికూడ దుః ఖింతురు. అది యెట్టిదో తెలియునా? చనిపోని వానిని చూచి 'అయ్యో! వీడు చనిపోలేదే?' అని దుఃఖించుట వంటిది. అనగా నర్థము లేదు. నీ దుఃఖము కూడ నట్టిదే! పెద్దవారు దీనిని మెచ్చరు.

**12.** మన మిప్పుడు బ్రతికి యుంటిమని నీవెరుగుదువు. ఇంతకు ముందుకూడ మన మున్నాము. ఇటుపైన కూడ నీవుగాని, నేనుగాని, లేకుండుట జరుగదు. మార్పులు కలిగినప్పుడెల్ల లేకుండ పోవుచున్నామా?

**13.** నీవిదివరకు చిన్నవాడవు. అది మారి యువకుడవైతివి. అది మారి పెద్దవాడవైతివి. ఇది మారి ముసలివాడ వగుదువు. ఇన్ని మారులును చనిపోవుచున్నావా? శిశువు పెద్దవాడైనపుడు శిశువు చనిపోయి పెద్దవాడు పుట్టుటలేదు. దేహముండగనే ఎన్నో మార్పులు జరుగుచున్నవి. అట్లే ఈ దేహము విడిచి ఇంకొక దేహము ధరించుటయు జరుగుచున్నది. తెలియని వారు దానిని చావు అందురు. తెలిసినవారు మోహపడరు.

**14.** సుఖము, దుఃఖము అనగా ఏమి? చలికాలమున వెచ్చని స్పర్శ

సుఖ మనబడును. వేసవి కాలమున చల్లని స్పర్శ సుఖ మనబడును. సుఖము, దుఃఖము అనునవి బాహ్య ప్రపంచమున అభ్యాసము చేత మన మేర్పరచుకొన్న స్పర్శలు. ఋతుధర్మములవలె నవి వచ్చుచు పోవుచుండును. వాని కందకుండ నిలబడ గలిగినచో వానిని సహించుట జరుగును. చూచి తివా? తెలివిగలవాడు చలికాలమున చలిమంటతోను, వేసవి కాలమున శీతల పదార్థములతోను ఋతుధర్మముల కందక సామ్య మనుభవించుట లేదా? అట్లే ఇంద్రియముల కందక బాహ్య స్పర్శలకు అతీతుడవు కావలెను.

**15.** ఈ బాహ్య స్పర్శలు నిన్ను బాధింపనపుడే సుఖదుఃఖము లుండవు. దుఃఖము నిన్ను తాకినపుడు నీవు దుఃఖముగా మారి జీవించుట కలుగును. ఈ మార్పులే మృత్యువు. వీని కందకుండు నీ యునికియే అమృతత్త్వము.

**16.** జీవులుండుట, పోవుట దృష్టిదోషము. ఉన్న వస్తువెప్పుడును లేకుండుట జరుగదు. ఈ రెండింటిని చూడగలుగుట సరియైన దృష్టి. ఉన్న వస్తువు శాశ్వతమని తెలియుటయే తత్వదర్శనము.

**17.** ఒక వస్తువు పగిలిపోవచ్చును. అది దేనితో చేయబడినదో దానికి పగిలిపోవుట కలుగదు. అట్లే ఈ సృష్టి అంతయు దేనితో నిండియున్నదో దానికి నాశము లేదు. దానికి వ్యయము కలుగదు. దాని కెవడును నాశము కలిగింపలేడు. కుండను బ్రద్దలుకొట్టినవాడు మట్టిని బ్రద్దలు కొట్టగలడా?

**18.** కుండ పగిలినట్లు ఈ దేహము అంతమగును. మట్టివలె లోపలి వాడు నిత్యుడు. వానికి నాశము లేదు. మట్టికి కుండయను పేరుగాని, ఆకారముగాని అంటనట్లు దేహము లోపలివానికి పేరు, చుట్టరికములు, ఆకారములు అంటవు.

**19.** వాని నొకడు చంపెనని యెంచినను, వానిచే నొకడు హతుడయ్యెనని యెంచినను నది యజ్ఞానము.

**20.** దేహముల లోపలివాడు పుట్టుట లేదు, చచ్చుట లేదు. ఒకమారు కలిగి, మరల యింకొకమారు కలుగుటయు లేదు. అతడు నిత్యుడు. చాలా కాలము నుండి యున్నాడు. వచ్చుచు పోవుచున్న దేహములలో నెప్పుడును రాకపోకలు లేక నిలిచియున్నాడు.

**21.** పుట్టని, తరుగని, నశింపని, యీ లోపలి వానిని శాశ్వతుడని తెలియుము. వాడు చంపగలుగుట, చంపబడుట యెట్లు?

**22.** చినిగిన వస్త్రములను విడిచి మానవు డెప్పుడును నూతన వస్త్రములను స్వీకరించుట లేదా? అట్లే శరీరములును.

**23.** ఈ యాకారముల లోపలి వానిని శస్త్రములు భేదింప లేవు. వాడియగుట వలన కత్తికి గాయ మగుచున్నాదా? వేడివలన నిప్పు కాలి పోవునా? నీరు తడసిపోవునా? గాలి యారిపోవునా?

**24.** ఆకారముల లోపలనున్న తత్త్వము తెగదు, కాలదు, తడిసిపోదు, హరించుకొనిపోదు. ఇన్నిటిలో నున్న దొక్కటే. అది శాశ్వతము! అది కదలుట కూడ లేదు. దానిచే చేయబడిన వస్తువులు మాత్రము కదలును. ఆకాశము నుండి పుట్టిన గాలి కదలుచున్నప్పుడు ఆకాశము కదలుచున్నదా? సర్వ వస్తువులును అణువుల, పరమాణువుల సముదాయము. అణువులు ఆకాశమున పుట్టును. ఈ వస్తువు లన్నియు కదలుచున్నప్పుడు అందలి తత్త్వమైన యాకాశము కదలుచున్నదా?

**25.** వస్తువుల కాకారమున్నది. ఆకాశమునకు లేదు. వస్తువులను గూర్చి నీ మనస్సు పనిచేయును. ఆకాశమును గూర్చి పనిచేయదు. అనగా మూలతత్త్వము మనస్సున కందదు, అంటదు. మట్టితో కుండ చేసినపుడు కూడ మట్టి మట్టిగనే యున్నది గాని కుండగా మారలేదు. అట్లే యీ మూల తత్త్వమునకు వికార మనబడు తత్త్వము మార్పు కలుగదు. ఈ క్రమమున తెలిసికొన గలిగినచో దుఃఖమునకు తావెక్కడిది?

**26.** అనేక జీవులు నిత్యము పుట్టుచున్నవి, నిత్యము చచ్చు చున్నవి యని కనిపించిన పద్ధతిని నమ్మువాడు భౌతికుడు. నీవట్లు నమ్మదలచినను దుఃఖింప బనిలేదు. నిత్యము పుట్టి చచ్చినవానికై దుఃఖించు వానిని చూచిననో నవ్వు వచ్చును.

**27.** పుట్టిన జీవి చావక మానదు. ఇది భౌతికుడెరిగిన సత్యము. చచ్చిన జీవి మరల పుట్టకమానదు. ఇది శాస్త్రజ్ఞుడెరిగిన సత్యము. ఈ యెరుక ప్రకారము కూడ చావు పుట్టుకలు తప్పవు. అయినను జీవు

లెచటికిని పోవుట లేదు. నీవు ఆపలేని ఈ అంశములకు దుఃఖించుట, కోరి దుఃఖమును తెచ్చుకొనుటయే యగును.

**28.** పుట్టకముందు, పోయిన వెనుక గలవారిని గూర్చి నీకు తెలిసిన దొక్కటియే. అది నీ కేమియు తెలియదను సత్యము! ఇక చావు పుట్టుకల నడుమ కనిపించు జీవులను గూర్చి ఏమి తెలిసినదని నీవు దుఃఖింతువు?

**29.** నీకు తెలియని దానిని గూర్చి విని తెలుసుకొనుట తప్ప వేరు గతిలేదు. కనుక చెప్పుచున్నాను వినుము. శరీరమందున్నవాడు కనిపించడు. వాని మాటలు వినిపించును. వాని చేష్ట లర్థమగును. ఆకలిదప్పులు మున్నగు నవి తెలియుచుండును. ఊహించుట, అర్థము చేసికొనుట, మున్నగున వన్నియు అర్థమగుచుండును. వాడెవడో తెలియక కనిపించిన శరీరమునకు పేరు పెట్టి కొనుట, చుట్టరికములను బిగించుకొనుట చేయుచుందురు. సూటిగా లోనివానిని గూర్చి చూచినప్పుడు ఆశ్చర్యముతో చూడవలసినదే ! వానితో మాటాడ బోయినపుడు ఆశ్చర్యముగా పలుక వలసినదే ! వాని పలుకులు విని కూడ వానిని గూర్చి విని యాశ్చర్యపడుట తప్ప, వాడెవడో నీకు తెలియుట యెట్లు?

**30.** దేహమున వాడున్నాడని గ్రహింపగలవు గనుక, ప్రస్తుతము వానికి దేహి యని పేరుపెట్టుము. నీవు చంపినచో వాడు చావడు. వాడు అన్నిజీవులలో నట్లే యున్నాడు. మరి యెవరిని గూర్చి నీవు దుఃఖించు చున్నావో తెలుపుము. సమర్థుడవైనచో వాని కులగోత్రములు, వానితో నీకున్న చుట్టరికము తెలుపుము! మరి తెలిసిన వానివలె నటించుచు ధర్మములు వల్లె పెట్టితివి గదా?

**31.** నీ ధర్మమును చూచి నీవు జంకినప్పుడు ఇట్టి వాక్యములు వల్లె వేయుట జరుగును. ఎవనిపని వాడు చేయుట ధర్మము. నీవు క్షత్రియుడవు. అనగా క్షతము నుండి రక్షింపవలసిన ధర్మమున పుట్టితివి. ఒక మంచిని దెబ్బతినకుండ రక్షించుట నీ ధర్మము. ధర్మము కొరకు యుద్ధము చేయుటకన్న వేరుగా పలుకుట అధిక ప్రసంగము.

**32.** ధర్మ రక్షణకై యుద్ధము చేయుట క్షత్రియునకు సదవకాశము. నీ సత్ప్రవర్తనవలన స్వర్గసుఖమునకు ద్వారములు తెరిచి యుంచునట్లు నీకీ యవకాశము లభించినది.

**33.** ధర్మము కొరకేర్పడిన నీ వీ యుద్ధము నాచరింపక మానితి వనుకొనుము. నీవు సాధించునదేమి? స్వధర్మము నుండి భ్రష్టుడగుట, అపకీర్తి పాలగుట, పాపము మూట కట్టుకొనుట మాత్రమే! ధర్మచ్యుతి పాపమని నీవే చెప్పితివి గదా!

**34.** రాబోవు కాలమున నీవిట్లు ప్రవర్తించితివని యెల్లరు నీ యపకీర్తిని కథలుగా చెప్పుకొందురు. గౌరవము ప్రధానముగా బ్రతికినవానికి దుష్కీర్తికన్న మరణము మేలు.

**35.** నీ శత్రువులు మహావీరులుగాని చేతలు చచ్చినవారు కారు. యుద్ధమునుండి నీవు విరమించుకొనుట తత్త్వజ్ఞాన మని వారు భావింతురా? భయపడి యుద్ధము నుండి పారిపోతివని చెప్పుదురు. నీ శౌర్యముపై వీరికి పూర్వముగల గౌరవమంతయు నిప్పుడు లాభమగును.

**36.** నీకు గిట్టనివారు నీ చేష్టలను గూర్చి మంచిగా చెప్పుకొందు రనుట కల్ల. నిన్ను గూర్చి అవాచ్యము లనేకములను పలుకుదురు. నీ సామర్థ్యమును తప్పక నిందించి ప్రచారము చేయుదురు.

**37.** మనకు శకునములు అనుకూలములు కావని పలికితివి. యుద్ధమున శకునము లేమి? తీరికగా తిరిగి యింటికి పోవచ్చునని ఎవ్వడును యుద్ధ భూమికి రాడు. చనిపోయినచో వీర స్వర్గము, జయించినచో రాజ్యము – అను నిర్ణయము నీకీనాడు క్రొత్తకాదు. కనుక లేచి యుద్ధమునకు సిద్ధపడుము.

**38.** ఒకపని చేయవలసినవాడు తన కర్తవ్యము సుఖమా, దుఃఖమా అని యాలోచించుట పొసగదు. జయింతుమో లేదోయని నిర్ణయించుకొని యుద్ధమునకు బోయిన బుద్ధిమంతు డెవరు? అట్లే కర్తవ్యమును గూర్చి లాభ నష్టములను యోచింపరాదు. నిర్ణయమున కెప్పుడును ఫలితములు సహాయ పడవు. చేసిన తరువాత వచ్చునవి ఫలితములు. అవి నిర్ణయ హేతువు లెట్లగును? వానిని విడిచి కర్తవ్య మాచరించిన వానికి పాప మంటదు.

**39.** ఇట్లు కర్తవ్యమునకును, తదవసానములైన లాభనష్టములకును కావలసిన వివేచనమునకు మార్గము తెలిపితిమి. ఆ మార్గము నెట్లు ఆచరణ రూపమున ప్రయోగింప వలయునో అను నంశమును వివరించెదను.

బుద్ధితో కర్మాచరణము సంధింపవలెను గాని, ఫలితములతో కాదు. చేసిన తరువాత కలుగునవి ఫలితములు. చేయుటకు ముందు దారిచూపు దీపము బుద్ధి. బుద్ధితో కర్మను కలుపుటయే యోగము. దాని వలన నీవుచేసిన పనుల ఫలితములు నిన్ను ముందుగా బంధింపవు. చేసిన వెనుక బుద్ధి వికసించును గనుక నెట్లును బంధింపవు.

**40.** ఈ మార్గమున ఎట్టి ప్రారంభమునకు నష్టము కలుగదు. ప్రారంభించుట యొక్కటే నీ దృష్టియందుండును గనుక విఘ్నము కలుగదు. ఈ మార్గ మవలంబించుచు ఏ కొంచెము పురోగమించినను, భయము నుండి విమోచనము కలుగును. భయ మెప్పుడును లాభాలాభములను గూర్చి ఆలోచించిన వానికి కలుగును. ఈ పని మంచిదా, కాదాయని నిర్ణయించుటకు ఫలితములను గూర్చి యూహించిన భయము కలుగును. బుద్ధితో కర్తవ్యము నెరిగిన వానికి భయము నుండి రక్షణము కలుగును.

**41.** మనస్సు, ఇంద్రియములు, శరీరము, వాక్కు, వివిధములు. వీనిని ఏకముఖమునకు గొనివచ్చినప్పుడు గోచరించు ప్రజ్ఞయే బుద్ధి. అనగా వీని యేకత్వమే బుద్ధి. ఒక పనివలన కలుగు ఫలితములు ఇంద్రియములకు, మనస్సునకును సంబంధించినవి. సంకల్పము ప్రయోజనము వైపు ప్రసరించినచో బహుశాఖలుగా విచ్ఛిన్న మగును. ఆచరణకు దిగినచో ఇంద్రియాదులను ఏకముఖమునకు కొనివచ్చును. ఇట్టి ఏకత్వముననే ప్రజ్ఞ నిలిచినప్పుడు బుద్ధి యనబడును.

**42.** లోకమున వేదవాదులమని గర్వపడువారు కొందరున్నారు. వారు పువ్వులు గ్రుచ్చినట్లు కర్మలను గూర్చి శాస్త్రీయముగా ప్రసంగింప జూతురు. వారి సిద్ధాంతమున సృష్టిలో నున్నవి రెండే యంశములు – కర్మాచరణము, దాని ఫలితము.

**43.** చేసిన పని యెల్ల అదియిచ్చు ఫలితమునకే యని వారి సిద్ధాంతము. ఆ ఫలితమునే వారు స్వర్గమందురు. అనేక కార్యాచరణముల జాబితాలను, వాని ఫలితముల జాబితాలను, సిద్ధపరచుకొనుచు కామదాసులై ప్రవర్తించు చుందురు. ఒక్కొక్కతండ్రి కామదాసుడై పుత్రున కిట్లు నూరిపోయును.

"కష్టపడి చదువుకొనుము. మంచి ఉద్యోగము వచ్చును. దానితో ధనము సంపాదించవచ్చును. పెండ్లి చేసికొనవచ్చును. చక్కగా బిడ్డలు కలుగుదురు. ధనమంతయు వారికి వెచ్చింపక కొంత వెనుక వేయవచ్చును. దానితో గృహారామ క్షేత్రాదులు చేకూర్చుకొనవచ్చును. ఇది యంతయు సుఖపడు మార్గము. ఈ సుఖమే స్వర్గము." ఇట్లు వారుచెప్పిన మార్గము సత్యమనుకొని పై ఫలితములనుగూర్చి గోరియెవడైన రోగాదులచే నడుమ మృత్యువు పొందుచున్న క్షణములలో మనసు దుఃఖాక్రాంతమై స్వర్గ సౌఖ్యము లన్నియు కూలిపోవును. లేదా ఉద్యోగాదులు లభింపక పోయినను, దారపుత్రాదులు దుశ్శీలురైనను నాడు కట్టుకొన్న కోరికల కొంప కూలిపోవును. చూచితివా? సత్కర్మకు కూడా దుఃఖమే పర్యవసాన మగును. ఈ సిద్ధాంతములను బోధించువారు భోగైశ్వర్యములకై పెదవులు నాకికొనుచు కర్మాచరణము చేయువారు.

**44.** భోగైశ్వర్యములలో మనస్సు చిక్కుకొన్నచో ప్రజ్ఞ వాని వెంట బరువెత్తి మనదికాక నశించిపోవును. ఆ ప్రజ్ఞ ఇంద్రియాదులలో బహుత్వము పొందును. ఏకత్వమును కోల్పోయిన వెనుక బుద్ధియు, సమాధియు కలలోని వార్తలు.

**45.** సృష్టిలో లీనమైయున్న తత్త్వము వేదము. అందు తెలియవలసిన యంశములకు మనస్సు, ఇంద్రియములు సాధనములు. ఈ సాధనముల నంటి త్రిగుణము లుండును. కనుక వేదమునకు త్రిగుణములు లక్ష్యములుగా వెలువడుచుండును. అవియే కర్మల ఫలితములు. బుద్ధిమంతుడు ఫలితములను విడచి వేదము నాశ్రయింపవలెను. గుణములను విడచి దానివలన తెలియబడుచున్న తత్త్వము నాశ్రయించవలెను. లాభాలాభములు మున్నగు ఫలితముల జంటలను విడచి కర్తవ్యమునందు సామ్యము నందవలెను. ఈ సామ్యమే నిత్య సత్యము. దానియందు జీవించువాడే ఆత్మవంతుడు. అనగా తన్ను తా నెరిగినవాడు.

**46.** సృష్టిలోని తత్త్వమగు వేదమునందు నీకు ప్రమేయమెంతవరకు? నీకేమి కావలయునో అంతవరకే నీవు పొందినచో నది జ్ఞానము. మిగిలిన దానితో అనగా ఫలితాదులతో నీకు ప్రసక్తిలేదు. చెరువునగల నీరెంత? అనునది నీకు అనావశ్యకము. 'నీవు గ్రోలవలసిన నీరెంత?' యనునది ఆవశ్యకము. అవే జలములు పరిమితిని బట్టి స్వీకరింపబడినచో దప్పిక

తీరును. జలములలో దుమికినచో ఆ జలములే ప్రాణము తీయును. సృష్టి లోని తత్త్వమగు వేదముతో కూడ నీకుగల సంబంధ మిదియే. వేదమును చక్కగా నెరిగిన బుద్ధిమంతుడు వేదముతో చెలగాటలాడడు.

**47.** ఎవరికైనను పనిచేయుట యందే అధికారము కాని, ఫలితముపై నధికారము లేదు. పనిచేయుటకు వలసిన అవయవములు, నింద్రియములు, మనస్సు మనకు లభ్యపడి మనయందున్న వస్తువులు గనుక వానిపై మన కధికారమున్నది. ఫలితము కర్మాచరణము. అది తరువాత కనుపించని పరిస్థితి నుండి దిగివచ్చును. గనుక దానిపై మన కధికారము లేదు. తన వశమున లేని దానిపై నధికార మున్నదనుకొనుటవలన దుఃఖము కలుగును. తన మాట వినని భార్య తనకు విధేయురాలుగా నుండవలెనని ఆశించు వానివలె నితడును దుఃఖము పొందును. మనము చేయుచున్న పనియెల్ల మనచే నాచరింప బడుచున్నదిగాని, మనవలన నాచరింపబడుట లేదు. సాధనములు సమకూరుట, సంకల్పము కలుగుట మన చేతిలోనివి కావని బుద్ధిమంతుడు గ్రహించును. ఇల్లు కట్టువాడు కట్టించువాడగునా? అట్లే సృష్టిలో తన ప్రకృతి ననుసరించి సిద్ధపడి పనులనే ఎవడైన ఆచరింప గలుగును.

అట్లే ఏ పనియొక్క ఫలితమునకు నీవు కారకుడవు కారాదు. అనగా నీ దేహము, మనస్సు, ఇంద్రియములు కారణములుగా నేపనియు నారంభింప రాదు. ఆకలి తీరుటకు, జీవించుటకు భుజించు వానికి భోజన మెట్లు యను సమస్య పుట్టును. ఒక పెద్ద సంస్థలో నొక మంచి పని చేయుచున్న వానికి భోజనము, ఆకలి తీరుట, జీవించుట అప్రయత్న సిద్ధము లగును. ఈ సృష్టియొక పెద్ద సంస్థ. అందు తనకొరకే పని చేసినను సమస్యలు పుట్టును. ఒక మంచిపని కొరకు తాను జీవించుటతో సమస్యలు తీరిపోవును.

**48.** దీని సారంశ మేమనగా కార్యసిద్ధిని, కార్యభంగములను గమనింపక యేపని యందును ప్రత్యేకాభిలాషగాని, యేవగింపుగాని చెందక తన పనులను తా నాచరించుచున్న వానికి కర్మలంటవు. ఫలితములకై దేబిరింపు కలుగదు. జీవనయాత్ర అప్రయత్నముగా సిద్ధించును. చేయవలసిన కర్మల నిట్లు దర్శించుటయే సమదృష్టి. ఈ సమత్వమే యోగ మనబడును.

**49.** ఇంద్రియములు సంసర్గ సుఖమును గోరును. బుద్ధి యుక్తా యుక్త పరిజ్ఞానమును, సృజనాత్మక శక్తిని ప్రసాదించును. కర్మలను బుద్ధికి గురిచేయవలెను, బుద్ధిచే శుద్ధి చేయబడని కర్మలు నీచములు. అవి ఫల హేతువులై, ఆచరించిన వానికి దైన్యము కలిగించును. ఫలములకై యెదురు చూచుటతో ఫలితము కలుగునా లేదా యని భీతియు, కలుగనిచో దుఃఖము, ఇతరులపై చిరాకు, మున్నగు వానిని కలిగించును. ఫలితము సమగ్రముగా కలిగినను మనస్సు దానియెడ తృష్ణచెంది, అనంతర కార్యమునకు ఉన్ముఖము కాకుండును. దానితో పతనము కలుగును. ద్యూతము మున్నగు తేలిక పద్ధతులలో ధనమార్జించినవారు ధనలోలురై, ఆర్జనమార్గము విడిచి దుర్వ్యయమున దరిద్రులై బిచ్చ మెత్తుకొనుచున్నారు. వారిగతి యెట్టిదో, ఫల హేతువులైన పనులు చేయువారి గతికూడా నట్టిదే. ఇందు కర్త ఓడినను, గెలిచినను కూడ చెడిపోవును. బుద్ధికి మానవుడు తా నాచరించు కర్మలను గురిచేసి శరణాగతి చెందుట యోగమార్గము. దానివలన సకల బంధ విమోచనము కలుగును.

**50.** బుద్ధితో కర్మను యోగము చేసినవాడు మంచిపనులు, చెడ్డపనులు అను నిర్వచనములను మార్చుకొనును. మంచి ఫలితములను చెడ్డ ఫలితములను కూడ విడచిపెట్టును. కనుక వానికి పనులలో మంచివి చెడ్డవి లేవు. హత్య చేయువానికి దోష మంటును గాని ఉరితీయువాని కంటదు. ప్రభుత్వ శిక్షలో ఉరిశిక్ష విధింపబడిన వారిని వందలమందిని అతడు ఉరి తీసినను తన కర్తవ్యమును నెరవేర్చు చున్నాడేగాని, చంపుటయను ఫలముపై వానికి మనస్సు లేదుగదా! అట్లే యుద్ధమున చంపువానికి నీవిధముగా పనులలో మంచివి, చెడ్డవి అని యుండవు. ఏవి మనస్సును ఫలితముపైకి లాగునో అవి చెడ్డ పనులు. వానితో ఫలితమును గూర్చిన దీనత్వము, నీచత్వము, కర్తకు సంక్రమించును. శోకము పర్యవసాన మగును. ఏవి ఫలితము నుండి మనస్సును విడుదల చేయునో అవి మంచి పనులు. ఇట్లు నేర్పరితనముతో పనులను బుద్ధితో యోగము చేయవలెను. కార్యాచరణమున గల ఈ నేర్పే యోగము.

**51.** ఇట్లు కర్మయోగము చేసినవాని ప్రజ్ఞ బుద్ధియందు నివసించును.

దానివలన కర్మఫలములను విడిచిపెట్టును. వానికి జన్మ బంధమునుండి విమోచనము కలుగును. జన్మబంధ మెట్టిది? ఉద్యోగము కొరకు చదువుకొనుట, ధనము కొరకు ఉద్యోగము చేయుట, దారపుత్రాదుల కొరకు ధన మార్జించుట, ఇండ్లు, తోటలు, దొడ్లు మున్నగువానికొరకు కొంత ధనము నిలువచేయుటకై పాటుపడుట అనునది యొకవిధమైన యుదాహరణము. ఇట్టి క్రమమున నాచరించు వాని పనులును, ఫలితములును, వాని ననుసరించిన పనులును "మేకతోకకు మేక" యన్నట్లు గొలుసుగా గ్రుచ్చబడి యుండును. దృష్టి యంతయు ఆశలతో భవిష్యత్తున నిలుచును. ప్రస్తుత జీవితమునం దెపుడును నీచత్వమే నడచుచుండును. అట్టివానికి ఆకస్మికముగా జబ్బుచేసి మరణము సంభవింపబోవునపుడు భవిష్యత్తున కట్టుకున్న కొంపలు కూలిపోవును. వాని సారాంశమేమి? అప్రయత్న సిద్ధమైన జీవితము ఎప్పటికప్పుడు వడ్డించిన విస్తరియై యుండగా, దాని వంక జూడక భవిష్యత్తునకై శుష్కించును. ఈ క్రమము జన్మ మొదలు చచ్చువరకును సడలని బిగింపుగా నడచుట జన్మ బంధము లనబడును. వానికి మొత్తము జీవితపు టనుభవము నందు రుచి యున్నదా? ఒకడు వారమున కొకమారు అంగడికి పోయి కూరలు కొని తెచ్చును. కొనునప్పుడు మంచి కూరగాయలనే ఎంచుకొనును. కొనితెచ్చిన వెనుక నేమి చేయుచున్నాడు? అంతకుముందు మిగిలిపోయిన ఎండు కూర గాయలు వ్యర్థముగాకుండా రెండు దినము లుపయోగించును. ఇంతలో తెచ్చిన వానిలో కొన్ని యెండును. దండుగ లేకుండా వానినే ముందుగా నుపయో గించును. ఇంతలో మిగిలినవి యెండును. యెంచుకొని మంచివి తెచ్చు కొనుటలో నెంత కష్టపడినను వాని బ్రతుకంతయు నెండు కూరలు తినుటయే గదా! జన్మబంధము గలవారిట్లుందురు. ఫలితములపై దృష్టియున్నచో ఫలిత మింతే! అట్లుకాక ఒకనాడు అంతవరకు వడిలిపోయిన కూరలను సన్యసింప గలిగినచో నిక నిత్యము మంచికూరలు తినవచ్చును. ఇట్లు బుద్ధియోగము చెందిన సూక్ష్మబుద్ధులు జన్మబంధ విమోచనము నంది ఆపదలు, దుఃఖము లేని చక్కని యనుభవము పొందుచున్నారు.

**52.** బుద్ధియనగా నెట్టిది? చెరువులో నీటి వంటిది. కదలకున్నప్పుడు నీరు స్వచ్ఛముగా నుండను. పశువులు దిగి కలత పెట్టినపుడు నీటికి బురద

రంగెక్కును. అట్లే ఇంద్రియములు, మనస్సు కర్మ ఫలితములతో సంచలనములు చెందినపుడు బుద్ధి మనయం దెచ్చటను లభింపదు.

తేటనీటిలో నున్న వస్తువులు కనిపించును. బురద నీటిలో పురుగు లున్నను మసకచే కనిపించవు. అట్లే బుద్ధి మనస్సులో, ఇంద్రియములలో నశించినప్పుడు, విన్న విషయములను గాని, వినదగిన విషయములను గాని గమనింపలేరు. మనస్సు, ఇంద్రియములు కలత పెట్టని బుద్ధివలన విన్న మంచివిషయములు వినియోగపడును. వినదగిన వానియం దాసక్తి కలుగును. అనగా మిగిలిన వివిధాంశములందు వైరాగ్య మప్రయత్నముగా కలుగును. తేటనీరు నీటికి స్వరూపము. అట్లే కలతపడని బుద్ధి మానవుని స్వరూపము.

**53.** విన్నదానికెల్ల సంచలనము చెందుట మనస్సు లక్షణము. విన్న దానిని వేరుగా చూడగలుగుట బుద్ధి లక్షణము. విన్న దానికి సంచలనము కలుగక మానినప్పుడే బుద్ధియందు ప్రజ్ఞ స్థిరపడును. అట్టి స్థితినే సమాధి యందురు.

**54. అర్జునుడు :** నీవు చెప్పిన స్థితి నిర్మలమైనది. దానిని పొందిన వారిని తెలిసికొనుట యెట్లు? వారి సమాధి లక్షణ మెట్లుండును? వారు మాట్లాడుదురా? మాటలాడినచో వారి సంభాషణ యెట్లుండును? వారి ప్రవర్తన మెట్లుండును?

**55. శ్రీకృష్ణుడు :** నేను పైని చెప్పిన విధముగా జీవించుట యారంభించి నపుడు మనస్సున తిరుగుచున్న కోరికలు క్రమముగా మాయ మగును. ఇది పరిపూర్ణమైనపుడు సాధకుడు నిరంతరము సంతోష మనుభవించు చుండును. వాని సంతోషమునకు కారణములేదు. సంతోషము వాని స్వభావ మగును. ఒక కారణమునకు సంతోషపడువాడు మరియొక కారణమునకు దుఃఖింపవలసి యుండును. కారణమునకు బానిస యైనప్పుడు సంతోషము నిలువదు. బానిస లక్షణము సంతోషమునకు సహజము కాదు. కనుక నదియొక కారణమునకు కట్టుపడదు. "సంతోషముగా నుండుటకు మార్గమేమి?" యని వానిని ప్రశ్నించినచో, "సంతోషముగా నుండుటయే!" యని అతడు బదులు పలుకును. అట్టివాని ప్రజ్ఞ స్థిరముగా నున్నట్లు గుర్తింపుము.

**56.** దుఃఖములు కలిగినప్పుడు వాని సంతోష మేమగును? అను సందేహము కలుగవచ్చును. ఇతరులు దుఃఖములను గమనించిన సన్నివేశములను అతడు సహజములని గమనించును. ఆ సన్నివేశములచే వాని మనస్సు సంచలన మందదు. అట్లే సుఖములయందు వానికి కోరికలేదు. అతడు సుఖపడునే గాని, దానిని గూర్చి యెట్టి అభిప్రాయము వాని మనమున కలుగదు. క్రొత్తగా మోటారుకారు కొనినవాడు కారు సుఖమునకై ప్రయాణము కల్పించుకొనును. దానిలో నెక్కినపుడు మెత్తగా, సదుపాయముగా నుండుట మున్నగు వానిని తలచి తలచి యానందించును. ఇట్లే సుఖాభిలాష గలవాడు క్రొత్త సన్నివేశములలో నిమగ్ను డగుచుండును. కారు మోజు తగ్గిన వెనుక అతడే ఆవశ్యకములైన పనులకోసము కారెక్కిపోవును. వానికి కారునందభిలాష జారిపోవును. అప్పుడు మాత్రము మెత్తగా నుండుట, సదుపాయము లేవన గలమా? అతడు వాని ననుభవించు చున్నను మనస్సు మాత్రము తలచిన కార్యముపై నున్నదిగాని కారుపై లేదు. అట్లే నిశ్చలప్రజ్ఞ చెందినవాడు సుఖించును గాని, సుఖేచ్ఛ యుండదు. అనురాగము, భయము, క్రోధము వాని మనస్సు నుండి జారిపోవును. అనురాగము స్థానమున విశ్వప్రేమ, భయము స్థానమున అభ్యాససిద్ధము, అప్రయత్నమగు జాగరూకత, క్రోధము స్థానమున కార్యాచరణ క్రీడ నిలచును. అట్టివాడు మనస్సునందు, నింద్రియముల యందు మౌనము వహించును. అనగా కోరికల యెడల మౌనము వహించును.

**57.** వానికి దేనియందు నాపేక్ష కలుగదు గనుక, శుభములు కలిగినప్పుడు ప్రత్యేకముగా సంబరపడుట గాని, ఇష్టములేని సన్నివేశములు కలిగినప్పుడు ప్రత్యేకముగా ద్వేషము పొందుటగాని యుండదు. వాడే స్థితప్రజ్ఞుడు.

**58.** అతడు సుఖకారణములైన వస్తువులను గాని, దుఃఖ కారణములైన వస్తువులనుగాని, వ్యక్తులనుగాని నెట్టివేయడు. వారినుండి దూరముగా వైదొలగుటకూడ చేయడు. వానినడుమ ప్రవర్తించుచునే తన ప్రజ్ఞను మాత్రము సందర్భము ననుసరించి తనలోనికి లాగికొనును. తాబేలును చూచితివా? ప్రతికూల పరిస్థితులలో నది యవయవములను డిప్పలోనికి నుపసంహరించుకొనును. అట్లే, స్థితప్రజ్ఞుడు వాతావరణము నుండి ఇంద్రియ ప్రవృత్తుల నుపసంహరించు కొనును.

**59.** ఇట్లుపసంహరించు కొనుటకు చక్కని సౌకుమార్య మల వడవలెను. మోటుతనము పనికిరాదు. వాతావరణము నుండి తప్పించుకొని తలదాచుకొనుట పనికిరాదు. రుచికరమైన ఆహారము తినకుండ మానినచో అది వైరాగ్యము కాదు. పస్తులున్న వానికి ఇంద్రియములు రుచికరములైన పదార్థములనుండి విముఖత వహింపవచ్చును. కాని రుచియన్నది మనస్సునకు సంబంధించినది. ఉపవసించినచో వ్యామోహము చావదు. వాతావరణము దూరమై దాని విత్తనములు కోరికలుగా మిగిలిపోవును. మరల నవకాశము కలిగినపుడు రెట్టింపుగా నవి విజృంభించును. స్థితప్రజ్ఞునకు తన స్థితియందు ఎక్కువరుచి లభ్యమగును కనుక, వాతావరణమునుండి సహజ వైరాగ్య మలవడును. విముఖతలేని నిర్లక్ష్య మేర్పడును. ఇదియే నిజమైన వైరాగ్యము, అది కలవాడే స్థితప్రజ్ఞుడు.

**60.** ఇంద్రియముల ప్రవర్తనను గూర్చిన మరియొక రహస్యమును వినుము. బుద్ధియందు రుచి నభ్యసింపవలెనుగాని వైరాగ్యమునకై ఇంద్రియముల యెడల ప్రయత్నము పనికిరాదు. ప్రయత్నమనగా మన మచ్చట నుండుటయే. కోపమును జయింపవలె ననుకొనుట యనగా కోపమును స్మరించుటయే! కంటిని జయించుటకై దారిన బోవువారిని చూడరాదని యొకడు తలచును. అనగా నతడు అప్రయత్నముగా దారిన బోవువారిని స్మరించుచున్నాడు. వానికి కన్నులు బిగించినను మనస్సు అట్లే చూచును. ఇట్టి ప్రయత్నమున సామర్థ్యముగాని, పాండిత్యము గాని అక్కరకు రావు. ఎన్ని శాస్త్ర రహస్యములు తెలిసినను ఇంద్రియములను జయించుటకు పనికిరావు. మనస్సునకు బుద్ధి ప్రజ్ఞయందు గలిగిన యభిరుచి వలన వాతావరణమునుండి సహజ వైరాగ్య మలవడును. ఇంద్రియములతో పోరాట మారంభించినచో ప్రజ్ఞ ఇంద్రియముల లోనే యుండి పరాజయము చెందుచుండును.

**61.** బుద్ధితో ప్రజ్ఞ యోగము చెందుటవలన ఇంద్రియములన్నియు లీనమగును. నిద్రించుచున్నవాని కింద్రియము లెట్లు పనిచేయవో స్థితప్రజ్ఞునకు నట్లు పోరాటము లేకుండ లొంగును.

**62, 63.** అభిలాషపడిగాని, దమించుట కనిగాని ఇంద్రియములతో వ్యవహరించినచో పురుషుడు ఇంద్రియములయందు వసించును. ఇంద్రియముల

లక్ష్యములను ద్వేషించినను, అభిలషించినను వానితో సంబంధ మేర్పడును. సంబంధమువలన కోరిక యేర్పడును. తొలుత నిష్టము లేని వస్తువుపై నభిరుచి యేర్పడును. ఒక చిన్న యుదాహరణము: పోకచెక్క, పొగాకు, గంజాయి, నల్లమందు, కల్లు, సారాయి మున్నగు వస్తువులలో నేదియు రుచికరముగా నుండదు. వానియందభిలాష మొదట నెవ్వరికి నుండదు. మొదటి స్పర్శలో వైముఖ్యము కూడ నుండును. కాని నిరంతరాభ్యాసమున వానితో యోగాభ్యాసము వంటి పట్టుకుదురుట గమనించుచున్నాము గదా! కనుక నభ్యాసమున సంబంధము వలన కోరిక కలుగును. కోరిక యున్నచోట దాని వ్యతిరేక కారణములపై క్రోధము కలుగును. కామము, క్రోధము అనునవి యొకే శక్తి యొక్క భిన్న ధ్రువములు. క్రోధము వలన తెలివికి పొరక్రమ్మును. పొరవలన తెలిసిన మంచి యంశములు కూడ జ్ఞప్తికి రావు. దానివలన బుద్ధి నశించును. దానివలన సర్వమునకు నాశము సంభవించును.

**64.** బుద్ధి యోగమున రాగద్వేషములు తొలగి సామ్య మేర్పడును. అప్పుడింద్రియార్థములు ఇంద్రియముల యందు వర్తించుచున్నను అవి తన వశములై యుండును. మంచి యజమానికడ సేవకులు వారి యభిరుచులను బట్టి అన్నపానీయములు, వేషభాషలు కలిగియున్నను యజమాని కధీనులై వర్తించుచున్నారు గదా! అట్లే తనకు కావలసిన రూపమునందు కన్ను, శబ్దమునందు చెవి, వాసన యందు ముక్కు, రుచియందు నాలుక, స్పర్శయందు శరీరము వర్తించుచునే యుండును. ఐనను తన యధీనమున నుండును. అభిముఖ్యము, వైముఖ్యము తన చేతిలో నుండునుగాని ఇంద్రియముల కాకర్షణ యుండదు. అప్పుడు జీవి ప్రసన్నత చెందుచున్నాడు.

**65.** ప్రసన్నతవలన సర్వ దుఃఖకారణములు నిలిచిపోవును. కనుక దుఃఖ మంతరించును. ఇక మిగిలినది బుద్ధి, యదియే తానుగా నుండును.

**66.** ఇట్టి యోగస్థితి లేనివానికి బుద్ధి యుండదు. అది మనస్సుగా ఇంద్రియములుగా చిందిపోవు చుండును. బాహ్యప్రపంచము యొక్క ప్రతి బింబము వంటిది భావన. కదలుచున్న చెరువునీటిపై ప్రతిబింబించు సూర్యుడు ముక్కలైపోయినట్లు, వణకుచున్నట్లు కనిపించును. అట్లే భగవంతుని మయమైన వాతావరణము కలతచెందిన మనస్సుపై ప్రతిబింబించినప్పుడు వస్తువులుగా,

కోరికలుగా, చుట్టరికములుగా, అభిలాషలుగా, తత్ప్రయత్నములుగా, సుఖ దుఃఖములుగా అనుభూత మగును. కనుక యోగము లేనివానికి దైవభావన లేదు. అనగా సరియైన ప్రతిబింబము లేదు. భావన లేనివానికి శాంతి లేదు. శాంతి లేనివానికి సుఖమెక్కడ?

**67.** ఇంద్రియముల కదలికలో మనస్సు కదలుచున్నప్పుడు ప్రజ్ఞను తనతోబాటు కదలించును. ఉప్పెనగాలి సముద్రజలములపై కలిగించిన వేగ మెటున్నదో అటువైపునకు కెరటములు నావను దింపును. కాని నావయొక్క ప్రయోజన మేమి? అందున్నవా రుద్దేశించిన వైపునకు ప్రయాణము చేయుట, అది మాని యుప్పెనలో ప్రయాణము తరంగముల యధీనమగును. అట్లే జీవితము ఇంద్రియముల యధీన మగును. ఈ యాపద కలుగకుండ ప్రజ్ఞను బుద్ధితో యోగము చేయవలెను.

**68.** ఇట్టి నేర్పరితనముచే నింద్రియములను బాహ్య విషయముల నుండి విముఖతలేని నిర్లక్ష్యమునకు మరలించవలెను. అట్టి వాని ప్రజ్ఞ సమాధి యందుండును.

**69.** మన భూగోళమున నెపుడును సగము రాత్రి, సగము పగలు. కొందరు మేల్కొంచి యుండగా, కొందరు నిద్రించుచున్నారు. అట్లే మానవుని తత్త్వముకూడ రెండు భాగములు. మనస్సు, ఇంద్రియములు, వాని లక్ష్యములు నొక భాగము. బుద్ధి యొక భాగము. బుద్ధియందు మేల్కొంచినవాడు మనస్సు మున్నగు వానియందు నిద్రించుచుండును. మనస్సు మున్నగునవి వానియందు మేల్కొంచి జీవించువాడు బుద్ధియెడల నిద్రించుచున్నాడు. కొందరు పిచ్చి వాండ్రును, వారి వైద్యుడును ఒకే భవనమున నుండగా పిచ్చివాండ్రు నిద్రించునపుడు వైద్యుడు మేల్కొంచి యున్నచో ఎల్లరకును క్షేమము. పిచ్చివాండ్రు మేల్కొంచి యుండగా వైద్యుడు నిద్రించినచో నెవరి కెట్టి విపత్తు కలుగునో ఎవరును చెప్పలేరు. అట్లే బుద్ధియందు తాను మేల్కొంచియుండి ఇంద్రియములు, మనస్సు తనయందు ఒదిగి యుండుట భద్రమైన విధానము. అదియే యోగస్థితి.

**70.** యోగికి కోరికలుండవా? ఉండవు. ఆకలిదప్పు లుండవా? ఉండును. ఆవశ్యకతలు కలుగవా? వానికి కలుగవు. కాని దేహమునకు,

నింద్రియములకు, మనస్సునకు కలుగును. అతడు వానిని తీర్చుకొనవలసిన ప్రయత్న మక్కరలేదా? అక్కరలేదు. వానికవి సహజముగా తీరుచుండును. కోరికలు తీర్చుకొన యత్నించువాడు నదినుండి బిందెతో నీళ్లు మోసుకొనువాడు. యోగి సముద్రునివలె నుండగా నదులు ప్రవహించి వచ్చి తమ జలములను సముద్రునిలో నర్పణ చేసినట్లు, యోగికి జరుగవలసిన దేహేంద్రియ మనో ధర్మములు పరిపూర్తి నొందుచుండును. ఇతరులు పనులు చేసికొనుచుందురు. యోగకి పనులు జరుగుచుండును. ఎన్ని నదులు వచ్చిపడినను సముద్రము పొంగదు. వేసవిలో నదు లెండినను సముద్రమెండదు. యోగి సన్నివేశముల యెడల సముద్రునివలె ప్రవర్తించును. ఎన్ని నదుల జలములైనను సాగర సంగమము చెందిన క్షణమున తమ రుచిని, స్వభావమును కోల్పోయి సముద్రత్వము నొందును. అట్లే ఏ సన్నివేశమైనను, వ్యక్తులైనను, ఆహార విహారములైనను యోగియందు సంగమము చెందునేగాని తమ స్వభావమును నిలుపుకొనజాలవు. ప్రభావమును జరుపుకొనజాలవు. వాని యనుభవమునే శాంతి యందురు.

**71.** ఈ క్రమముననే కోరికలను తొలగింపవలెను. ఇక మిగిలిన భాగమును పురుషు డందురు. వానియందు స్పృహ యుండదు. మమకారము, అహంకారము నిలువవు. వాని స్థానము నంతయు పురుషు డాక్రమించును.

**72.** ఓ అర్జునా! దీనినే బ్రాహ్మీస్థితి యందురు. (బ్రాహ్మీస్థితి యనగా బ్రహ్మమునకు సంబంధించిన ప్రజ్ఞ.) దీనిని పొందినవానికి మోహము కలుగదు. (మోహమనగా పొరబ్రమ్మట, ఉన్న పరిస్థితికన్న వేరుగా నుద్దేశము లేర్పడుట.) ఈ స్థితియందు ఎల్లప్పుడు, నెట్టి పరిస్థితులలోను నుండునట్లభ్యసింప వలెను. ఇక పరిస్థితులుండుట మాని, తానుండుట జరుగును. అంత్యకాలమున గూడ అంతముండక పరబ్రహ్మ ముండును. మృత్యుకాలమున మృత్యువు దేహమునకు, మనస్సునకే కాన తనకు మృత్యువుండక పరమాత్మ యుండును. దీనినే నిర్వాణము లేక మోక్షము అందురు. అదియే జనన మరణాతీత స్థితి.

తృతీయోఽధ్యాయః

# కర్మయోగః ।

*అర్జున ఉవాచ :*

జ్యాయసీ చే త్కర్మణస్తే మతా బుద్ధి ర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహ మాప్నుయామ్ ॥ 2

*శ్రీభగవా నువాచ :*

లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

న కర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।
కార్య తే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ 5

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ 6

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।
కర్మేంద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ 7

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥ 8

యజ్ఞార్థా త్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః ।
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగ స్సమాచర ॥ 9

సహ యజ్ఞాః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽస్త్విష్టకామధుక్ ॥ 10

దేవా న్భావయతానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12

యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మ కారణాత్ ॥ 13

అన్నా ద్భవంతి భూతాని పర్జన్యా దన్న సంభవః ।
యజ్ఞా ద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః ॥ 14

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్ ।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥ 15

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।
అఘాయు రింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

య స్త్వాత్మరతిరేవ స్యా దాత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్ట స్తస్య కార్యం న విద్యతే ॥ 17

నైవ తస్య కృతేనార్థో నాకృతే నేహ కశ్చన ।
న చాస్య సర్వభూతేషు కశ్చి దర్థవ్యపాశ్రయః ॥ 18

తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19

కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥ 20

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ 21

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ 24

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాఽసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥ 25

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్తః సమాచరన్ ॥ 26

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే ॥ 27

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః ।
గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥ 28

ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।
తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవి న్నవిచాలయేత్ ॥ 29

మయి సర్వాణి కర్మాణి సన్న్య స్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః ।
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥ 31

యే త్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాం స్తాన్ విద్ధి నష్టా న చేతసః ॥ 32

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవా నపి ।
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33

ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్న వశ మాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ ॥ 34

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35

*అర్జున ఉవాచ :*

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః ।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ 36

*శ్రీభగవా నువాచ :*

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణమ్ ॥ 37

ధూమే నావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ ।
యథో ల్బేనావృతో గర్భస్తథా తేనేద మావృతమ్ ॥ 38

ఆవృతం జ్ఞాన మేతేన జ్ఞానినో నిత్య వైరిణా ।
కామరూపేణ కౌంతేయ దుష్పూరే ణానలేన చ ॥ 39

ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే ।
ఏతై ర్విమోహయ త్యేష జ్ఞాన మావృత్య దేహినమ్ ॥ 40

తస్మా త్త్వమింద్రియా ణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్ ॥ 41

ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః ॥ 42

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా ।
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥ 43

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*కర్మయోగో నామ తృతీయోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 3

# చక్ర భ్రమణము

**1. అర్జునుడు :** నీ మతము ప్రకారము బుద్ధియోగము సకల కర్మ విమోచనమునకు కారణమని తెలియుచున్నది. కర్మకన్న గూడ బుద్ధి ప్రాధాన్యము వహించుచున్నది. ప్రజ్ఞ బుద్ధియందుండుట కన్న నుత్తమస్థితి వేరొకటి లేదని తేల్చి చెప్పితివి. నన్ను మరల కర్మాచరణమునకు పురికొల్పుచున్నావు. అందును యుద్ధము ఘోరకర్మ.

**2.** నీ వాక్యములు కలగలుపుగా నున్నవి. నీ వాక్యముల వలన బుద్ధి యోగము కలుగవలసినది బదులు నా బుద్ధి తికమక పడుచున్నది. నేను నిన్నడిగినదేమి? కర్మాచరణము, బుద్ధియోగము అను వానిలో నాకు శ్రేయస్సు కలిగించునదేదియో నీవే నిర్ణయించి నిశ్చయము చేసి తెలుపుమంటిని.

**3. శ్రీకృష్ణుడు :** లోకమున పురాతన కాలము నుండియు రెండు వర్గముల వారు కనుపించుచున్నారు. ఆదియందు నేనే రెండు విధములైన నిష్ఠల నేర్పరిచితిని. అందు మొదటిది జ్ఞానయోగము. దాని నవలంబించిన వారు 'సాంఖ్యు' లనబడిరి. రెండవది కర్మయోగము. దాని నవలంబించిన వారు 'యోగు' లనబడిరి.

ఏమి చేయవలయునో తెలిసిన తరువాత గదా కర్మాచరణము? కనుక తెలియుట లేక జ్ఞానము ప్రాధాన్యము వహించును. ఇది జ్ఞానయోగుల వాదము. తెలియక కర్మలాచరించినచో దుష్కర్మ లాచరింప వచ్చును. దోషములు మెడకు చుట్టుకొనును. కనుక తొలుత జ్ఞానార్జనకై సాధనచేయుట ముఖ్యమని వీరి వాదము. సృష్టిని జ్ఞాన మార్గమున దర్శనముచేసి ప్రకృతి పురుషుల వివేచనము పురుషుడు సిద్ధి పొందవలెనని వీరి యుపదేశము.

జ్ఞాన మార్జించుటకు అర్హత కలుగవలెను. పాత్రములగు శరీర మనో బుద్ధ్యహంకారము లుండవలెను. అనగా జ్ఞాన మార్జించుకొను సాధనము మొదట పవిత్రముగా నుండవలెను. అప్పుడే సరియైన జ్ఞానము దర్శన మిచ్చును. దేహాదులు కల్మష దూరములు కావలెను. వాసనలు నశింపవలెను.

దానికి సత్కర్మాచరణమే ప్రాధాన్యము వహించును. తొలుత సాధకు డవలంబింప వలసినది వేదోక్త కర్మాచరణ మార్గము. ఇది కర్మయోగుల వాదము. ఈ రెంటి యందును సత్యమున్నది. సత్యమనగా నేను. కనుక నీ రెండు మార్గములును నా నుండియే రెండు నిష్ఠలుగా మానవులలోనికి దిగివచ్చినవి.

**4.** కర్మబంధముల నుండి విమోచనము వలన జ్ఞానము కలుగునని చెప్పితిని. కర్మాచరణము జ్ఞానమును కలిగించుననియు చెప్పితిని. దీనిని బట్టి తెలియునదేమి? కర్మాచరణము, జ్ఞానార్జనము రెండును తప్పవు. ఇల్లు కట్టుటకు కావలసినది శాస్త్రమా, ఆచరణమా? రెండును కూడినప్పుడే నిర్మాణము జరుగును. ఎట్లు నిర్మింపవలెనో తెలియక నిర్మించుచు బోయినచో గృహసిద్ధి కలుగదు. నిర్మించు విధానము సమగ్రముగా తెలిసినంత మాత్రమున కూడ గృహసిద్ధి కలుగదు.

ఇంతకును కర్మాచరణమును గూర్చి విచికిత్స యేల కలుగవలసి వచ్చినది? ఆచరించినచో తత్సంబంధములైన దోషాది సంసర్గము అంటుననియే కదా భయము? కర్మబంధ విమోచనము కనుపించునంత తేలిక కాదు. పనులు చేయుట మానినంత మాత్రమున నెవడును చేయనివాడగుట లేదు. పనులు చేయుట యనునది మనస్సున మొదలగునుగాని శరీరమున కాదు. దేహమును చేయనీయకున్నచో, మనస్సు చేయక మానుట సత్యదూరము. కర్మలను సన్యసించుట వలన సన్న్యాసము సిద్ధింపదు. కోపముతో కొట్టబోవు చున్న వానికి చేతులు బంధించినచో కోపము పోయినట్లుకాదు.

**5.** పనులు చేయుట మానినచో సమస్య తేలిక పడునని భావించితివా? ప్రయత్నించి చూడుము. క్షణము కూడ కర్మాచరణము లేక నిలువలేవు.

నీవు చేయుచున్న పనులన్నియు నీ స్వభావమునుంచి వచ్చుచున్నవి గాని కాలుచేతులనుండి కాదు. నీ స్వభావమనగా ప్రకృతి. దాని నుండి యెప్పుడును సత్వ రజస్తమస్సులను గుణములు పుట్టుచుండును. వానినుండి నీకు గల గుణములు వివిధములుగా నుత్పన్నము లగుచుండును. నీలోని గుణముల ప్రేరేపణచే జరుగుచున్నవే నీవు చేయు పనులు. అనగా నీ తర్కమునకు, తెలివికి సంబంధించినవి కావు. నీవు చేయు పనులు నీచే

చేయబడుచున్నవి గాని నీవు చేయుటలేదు. ప్రకృతి నీచే చేయించుచున్నది గాని నీ యిచ్ఛతో వానికి సంబంధము లేదు. నీ గుణముల ననుసరించి యిచ్ఛ యలవడును గాని యిచ్ఛ ననుసరించి పనులు జరుగవు. ఈ విషయ మున నెంత తెలివిగల వాడైనను అస్వతంత్రుడే!

**6.** స్వభావము ప్రేరేపించు చుండగా, తెలివి, తర్కము దాని వెంట వచ్చుచుండగా నీవు పనుల వెంట ప్రేరేపింపబడు చున్నావు. ఇక చేయుట, మానుట నీకెట్లు లొంగును? నీవు ఆపగలిగినది భౌతిక శరీరమును మాత్రమే. కర్మేంద్రియములైన కాళ్ళు, చేతులు, మాట, స్త్రీ పురుష వాంఛ, మల మూత్రాది విసర్జనము నీకు లోకువయై యున్నవి. వాని ప్రవృత్తులను బంధించితి వనుకొనుము. మనస్సు నీ స్వభావముచే ప్రేరేపింపబడి స్మరించు చుండును. ఇట్లు కర్మేంద్రియములను బంధించి ఇంద్రియార్థముల నందనీక వానినే మనస్సుతో స్మరించుచుండుట డంబాచార మగును గాని సంయమము కాదు, కనుక సంయమము వలన కలుగవలసిన శాంతి కలుగదు.

**7.** మనస్సుచే నియమింపదగినవి జ్ఞానేంద్రియములు గాని కర్మేంద్రియ ములు కావు. శబ్ద స్పర్శ రూప రస గంధముల నుండి చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు విముఖత చెందునట్లు మనస్సుతో జయింపవచ్చును. అదికూడ మనస్సింకొక పవిత్ర విషయమున మాధుర్యము చెందినపుడే సాధ్య మగును. ఇక కర్మేంద్రియముల జోలికి పోకుము. బుద్ధి ననుసరించి అవి మంచిపనులలో ప్రేరేపింపబడు చుండవలెను. ఇది కర్మయోగము. దానివలన మనస్సు, జ్ఞానేంద్రియములు కర్మలయందు చిక్కుకొనవు. అపుడే నీ స్వరూపము నీకు చిక్కగలదు.

**8.** పనులు మానుట కన్న కర్మేంద్రియములను చేయనిచ్చుటయే మంచిది. ఆవశ్యకతను బట్టి ఆ పనులకు నియమము లేర్పరుచుకొనుము. ఆ నియమములను బుద్ధియోగమున నిర్ణయింపుము. కర్మేంద్రియములను పనుల నుండి విరమింపజేసినచో జీవయాత్ర యెక్కడిది? మాటలాడనిదే శరీరమున కావశ్యకమగు వస్తుసంపద సమకూరునా? కనుక చేయవలసిన పనులను నిర్ణయించుకొని, కర్మేంద్రియములను పనులయందు నియమింపుము. నియ మింపబడిన కర్మేంద్రియములు కూడని పనుల జోలికి పోవు.

**9.** ఇక చేయదగిన పనులేవి, చేయదగని వేవి యను దానిని గూర్చి వివరించెదను. ఫలితముల వైపునకు మనస్సును లాగునవి చేయదగని పనులు. అనగా జీవుడు తానొక్కని నుద్దేశించి ఆచరించు పనులు. వానివలన మనస్సు ప్రభావితమై బంధింపబడును. ఇది యొక్కటే కర్మబంధము.

ప్రతి మానవుడు తన యన్నమును తాను పచనము చేసుకొని తినుటకు యత్నించినచో ఆహారపదార్థములను పండించి యిచ్చువాడు కావలెను. వాడు పండించి నీకేల ఈయవలెను? తానే తినవచ్చును గదా? పండించుట కతడు కృషి చేయవలెను. కృషి చేయవలెనన్నచో అతడు అన్నము తినవలెను. కనుక నింకొకరు వండిపెట్టుట తప్పదు. అప్పుడే యితడు పండించగలడు. చూచితివా? పండించువాడు వండించలేడు, వండించువాడు పండించలేడు. ఇరువురును కూడినచో పంట పండుట, వంట వండుట రెండును జరుగును. అందును ఒకరు ఇంకొకరి పనిని చేసిపెట్టవలెను. స్వార్థమును సన్యసించినపుడుగాని తనకు కావలసినవి సమకూరవు. ప్రకృతి ఆ విధముగా నిబంధించి పెట్టినది. ఇష్టము లేకున్నను ఉన్నను పరార్థమై పనిచేయక తప్పదు. ఇష్టము లేనప్పుడు బంధమగును. ఇష్టమున్నప్పుడు సంబంధమగును. దీనిని తెలిసియే మనువు తొలుత దాంపత్యము, కుటుంబము మానవ ధర్మములుగా శాసించెను. సహకరించి స్వార్థమును సన్యసించి పని చేయుటను అతడు యజ్ఞార్థమని వ్యవహరించెను. తనకొరకు పాటుపడుట స్వార్థము, ఏ పనియైనను యజ్ఞార్థ ముగా నాచరించునపుడు మాత్రమే కర్మబంధ విమోచనము కలుగును. తక్కిన కర్మలన్నియు బంధించును. దీనిని బట్టి యుక్తాయుక్త కర్మలను నిర్ణయించుకొనుము. ఫలాసక్తి యను భ్రాంతిని విడచి యజ్ఞార్థ కర్మ నాచరింపుము.

**10.** యజ్ఞార్థ కర్మయొక్క నిజస్వరూపమును వివరించుచున్నాను. నీవు పుట్టింప బడితివా, పుట్టితివా? స్పష్టముగా పుట్టింపబడితివి. నిన్ను పుట్టించుట వలన నేమి లాభమని నీ తల్లిదండ్రులుగాని, సృష్టికర్తగాని తొలుత యోచించుట జరిగెనా! ఇట్టిదే యజ్ఞార్థ కర్మ. గాలివీచుట, సూర్యచంద్రులు ప్రకాశించుట, భూమి పరిభ్రమించుట, ఆహోరాత్రములు ఋతుధర్మములు నేర్పడుట, సంవత్సరములు రూపొందుట దీనివలననే సృష్టింపబడినవి. వానివలన

సృష్టికర్త కేమి లాభము? ఇదియే యజ్ఞార్థమను పథకము. సృష్టికర్త సంవత్సరములు మొదలగు కొలతల పొరలలో దాగియుండి, యజ్ఞార్థము అను ప్రణాళికను నిర్మించి, దానితోబాటు నీబోటి జీవులను సృష్టించెను. “మీరు నిట్లే నన్ననుసరించి వర్ధిల్లుదురు గాక!” అని ఆశీర్వదించు చున్నాడు. వర్ధిల్లుట యనగా నెట్టిది? భూమి దున్ని గింజలు జల్లినచో నొక గింజకు కొన్ని వందల గింజలు పుట్టును. ఇందు ప్రతిఫలాపేక్ష లేదు. ఈ ప్రణాళిక కోరికల నుండి జీవులను విముఖులను చేయుచునే వెనుక నుండి కోరికలను తీర్చుచుండును.

**11.** గాలి, నీరు, నిప్పు మున్నగు ద్రవ్యములలోని ధర్మముల రూపమున దేవతలు యజ్ఞార్థమున ప్రవర్తించుచున్నారు. నీవు వారి మార్గమును, వారిని గౌరవించి యనుకరించినచో వారు నిన్ను గౌరవించి యాదరింతురు. పరస్పర పూజ్యభావమున తరుగని శ్రేయస్సు సిద్ధించును. మానవులలో కూడ నొకరి నొకరు గౌరవించి యాదరించినపుడే శ్రేయస్సు కలుగును. తన్ను తానే యాదరించుకొనుట వలన హాస్యమున కాస్పద మగుటయే గాక నాశముకూడ సంభవించును. ఈ పరస్పరత్వమే యజ్ఞము. యజ్ఞమను పదమునకు పూజ్య భావముతో, సమర్పణబుద్ధితో జేసిపెట్టు పనియని యర్థము.

**12.** యజ్ఞముచే పూజింపబడిన దేవతలు నీ కిష్ట భోగములను కలుగచేయుచున్నారు. గోవునకు ఘాసము మున్నగునవిచ్చి గౌరవించినప్పుడే గోవు శరీరములోని దేవతలు నిత్యము క్షీరము నేర్పరచుదురు. నీవిచ్చు ఘాసము ముఖ్యముగా గోవులోని దేవతలకు గాని గోవునకు మాత్రము కాదని స్మరింపుము. ఇట్లేపని యాచరించినను, యజ్ఞార్థము కావలెనన్నచో యజ్ఞార్థబుద్ధి యుండవలెను. దక్షిణలేని యజ్ఞము లేదని వేదము ఘోషించు చున్నది. సృష్టిలో నే వస్తువు లైనను సృష్టి దేవతలచే నీకు సాధింపబడినవి. వారి కర్పింపకుండ ననుభవించు బుద్ధి దొంగబుద్ధి యగును.

**13.** ఇతరుల శ్రేయస్సునకు సమర్పణ చేయుట వలన నీకు లభించున దేదియైనను యజ్ఞశేష మనబడును. దాని ననుభవించుట వలన సకల కల్మష విమోచనము జరుగును. అనగా దుర్బుద్ధి నశించును. తనకు లాభము గోరి ఏపని చేయజూచినను తన యన్నమును తాను వండుకొని భుజించుటయే

యగును. అదియే పాపమును భుజించుట. దాని వలన కర్త క్షీణించును. చక్రము జగద్రహస్యముల వృత్తాంతములకు చిహ్నము.

**14, 15.** చక్రము తిరుగుట గమనించితివా? కేంద్రము ధ్రువమై పరిధి తిరుగుచుండును. 'నేను' ధ్రువమై సర్వ జీవులలో నుండగా జీవుల వృత్తాంతములు తిరుగుచున్నవి. మానవుడు చక్రము నెట్లు కనిపెట్టెను? వానిలోను, సృష్టిలోను అదృశ్యముగా నొక చక్రము తిరుగుచున్నది. దానిని దర్శించియే మానవుడు చక్రమును నిర్మాణము చేసెను. దాని సదుపాయము లను గ్రహించెను. సకల చరాచర జగత్తున పరిభ్రమించుచున్న నా చక్రమును వివరించెదను. అన్నము వలన జీవుల శరీరములు పెరుగుచున్నవి. అన్నము జలముల పరిభ్రమణము వలన కలుగుచున్నది. భూమిపై జలములు పైకిబోయి మేఘములగుట, వర్షింప దిగివచ్చుట జలముల పరిభ్రమణము. ఈ దిగి వచ్చుటతో విత్తనములు మొలకెత్తి అన్నము సిద్ధమగుచున్నది. కనుక ఈ జల పరిభ్రమణమే 'పర్జన్యము' లేక పరిసరములను పుట్టించునది. ఈ పరిభ్రమణము అదృశ్య చక్రశక్తి వలన కలుగుచున్నది. ఈ యదృశ్య చక్రమే ప్రణాళిక లేక యజ్ఞము. ఇది తిరుగుట యను కర్మవలన. అనగా నా క్రియాశక్తి వలన పనిచేయు చున్నది. ఈ దివ్యకర్మ ఆ బ్రహ్మమూర్తి వలన పుట్టుచున్నది. అనేక ద్రవ్యములను శాస్త్రోక్త క్రమమున నమర్చినచో శక్తి పుట్టును. పదార్థముల కూర్పువలన విద్యుచ్ఛక్తి వ్యక్త మగుచున్నదిగదా! ఇట్లు కూర్చు నా మూర్తియే బ్రహ్మము. ఈ బ్రహ్మము అక్షరమువలన పుట్టుచున్నది. అనగా తననుండి తాను పుట్టుచున్నది. మన ముచ్చరించు నక్షరములు మన నుండి తాము పుట్టుచున్నవి గదా! వాని పుట్టుక స్థానము అక్షరములకు పైనున్న శాశ్వతమైన అక్షరము. దానినే 'ఓం' అని యుచ్చరింతురు. ఎన్ని శాస్త్రములకై వాక్యములు, అర్థనిర్మాణము, రచన జరుగుచున్నను జరిగిన తరువాత కూడ అక్షరములు మరల వాడకమునకు సిద్ధముగనే యుండును. కనుకనే వానికి అ + క్షరములు (నశింపనివి) అని పేరు వచ్చినది. నా చక్రమున కేంద్రము నుండి పరిధికీ విధముగా అన్నము, దేహములు, పర్జన్యుడు మొదలుగా గల సృష్టి దిగివచ్చు చుండును. కనుకనే ఈ చక్రము 'అక్ష + ర' (అక్షముల నుండి గొని రాబడినది) అని నేను నియమించితిని.

ఈ విధముగా సర్వాంతర్యామి యగు నా బ్రహ్మజ్ఞానమూర్తి నిత్య మూర్తిగా యజ్ఞ స్వరూపమున పొదగబడి యున్నది. కనుకనే నేను చక్రధారిని.

**16.** ఆది, యంతము లేక పరిభ్రమించుచున్న ఈ చక్రము ప్రజాపతి మహిమ వలన వర్తించుచున్నది. (ప్రజాపతి యనగా మండలాత్మకముగ సృష్టి సమస్తము మరల మరల నుత్పాదింప జేయుచుండు ప్రజ్ఞ. ఇది కాల స్వరూపము.) ఈ చక్రమునందు జీవులైనను, దేవతలైనను వర్తింపక తప్పదు. (దేహములు ధరించిన సృష్టిశక్తులు జీవులు. దేహముల యందుగాని, వెలుపలగాని వర్తించు సృష్టిశక్తులు దేవతలు.) జీవులన్నియు నీ చక్రమున వర్తించుచుండును. అందు మానవు డనువర్తించుట కూడ చేయవలెను. అనగా దాని కనుకూలమైన బుద్ధితో సదుపాయము కలిగి ప్రవర్తింపవలెను. ఇతడు బుద్ధిజీవి గనుక నీ యనువర్తన మితని ప్రత్యేక కర్తవ్యము. ఇదియే యజ్ఞార్థ కర్మ. దేహాదులయందు ప్రత్యేక మమకారము కలవాడు అనువర్తింప కుండుట జరుగును. అత డింద్రియములయందు రమించుచు వ్యర్థముగా జీవితము గడిపి చనిపోవును. అట్టివాడు పాపి యనబడును. సముద్రమున నౌక పురోగమించు చుండగా నందలి ప్రయాణీకుడు నౌకలో తిరోగమించినను చేయగల్గిన దేమి? పురోగమనము నాపలేడు. అట్లే పాపజీవియును సృష్టిక్రమము పురోగతి నాపలేడు. కాని సుఖమును కోల్పోవును.

**17.** ఈ యజ్ఞ స్వరూపమగు చక్రము తనయందును సకలము నందును స్వయంవాహకముగా ప్రవర్తించుచున్నదని గుర్తించిన వాడే బ్రహ్మవేత్త. అతడు తన యునికి యందు తా నానంద స్వరూపుడుగా జీవించును. కారణములేని తృప్తి కలిగి యుండును. వానికి ప్రత్యేక కార్యము, కర్మము అని లేదు. చేయ బడునది, జరుగునదియు యజ్ఞకర్మమేగాని తనకు సంబంధించినది కాదు.

**18.** అతడు పనులు చేసినను, చేయకున్నను తన కొకటియే! సర్వ జీవరాసులలో దేని యెడల తానెట్టి ప్రయోజనము నాశింపడు.

**19.** ఈ దృష్టితో ఆచరించు యజ్ఞార్థకర్మయే చేయదగిన పని. నీ స్వభావమును బట్టి నీవు చేయదగిన పని ఏర్పడును. కలవరపాటు లేక యాచరించి మాత్రమే యుత్తమ ఆనంద మనుభవించెదవు.

**20.** నీవు దాని ననుసరించుట కర్తవ్యము. దాని నాచరించినచో జ్ఞానసిద్ధి, బంధ విమోచనము కలుగును. లోక శ్రేయస్సుకోరి నీకు నలవైన పనుల నాచరింపుము. జనకాదు లిట్లు కర్మాచరణము చేసియే పరిపూర్ణ సిద్ధిని పొందిరి.

**21.** ప్రాధాన్యము పొందినవా డేది మేలని యాచరించునో దానినే యితరు లనుకరింతురు. పెద్ద లాచరించినది లోకమునకు ప్రమాణమై నిలచును గనుక నీవు నాచరింపుము.

**22.** నా ప్రవృత్తిని గమనించితివా? ఈ మూడు లోకముల యందును నేను చేసియే తీరవలెనను పని ఏదియు లేదు. దేని నాచరించి గాని నేను పొందగోరినది యని లేదు. నేను పొందనిది లేదు. అయినను నేను కర్మల యందు నిరంతము వర్తించు చున్నాను.

**23.** నే నప్రమత్తుడనై యిందు వర్తింపనిచో మీరు నా మార్గమునే యనుసరింతురు.

**24.** మీలో నంతర్యామిగా నున్న నేను కర్మాచరణము మానినచో లోకములు క్షీణించును. దాని వలన సంకరత్వము కలిగించి జీవులను నశింపచేసినవా డగుదును. నీవును నావలెనే నీకు ఫలసిద్ధితో నిమిత్తము లేక యజ్ఞార్థముగా సత్కర్మ నాచరింపుము. అదియు మిక్కిలి శ్రద్ధతో నాచరింపుము.

**25.** తెలియని వారు ఫలితముల కోసమెంత పట్టుదలతో పని చేయు చున్నారో చూడుము. అంత పట్టుదలతో నాసక్తి లేకయే నీవు నాచరింపుము. దాని వలన లోకశ్రేయస్సు నడచును.

**26.** ఇతరులు కూడ నీవలె ఫలాపేక్ష మాని యాచరింపవలెనని మాత్ర మాశింపకుము. వారి ఫలాపేక్షలు నిషేధించినచో వారు కలవరపాటు చెందుదురు. దానితో పనులు కుంటుపడును. నీవు మాత్రము ముక్తసంగుడవై యోగస్థితిలో నాచరించుచు, మిగిలినవారిని తమతమ యాసక్తులను బట్టి ఫలాపేక్ష చూపియైనను సత్కర్మాచరణమునకు ప్రేరేపించుము. (తెలియుట యందు విలంబనము కలిగినను నష్టము లేదు. ఆచరించుటలో విలంబనము కలుగరాదు.)

**27.** పనులన్నియు ప్రకృతి నుండి పుట్టిన గుణముల ప్రేరేపణచే జరుగుచున్నవి. ఈ గుణములే కర్మాచరణమునకు కర్తలుగాని, ఈ గుణములు గల వ్యక్తులు గారు. కర్తృత్వము తనపై నారోపించుకొనుట యహంకార మనబడును.

**28.** గుణములు గుణములయందు వర్తించుటచే పనులు జరుగుచున్నవి. దీని నెరిగినవాడే తత్త్వవేత్త. ఈ తత్త్వదర్శనము వలన నాసక్తియందు చిక్కుకొనడు.

**29.** తన ప్రకృతియొక్క గుణములు తనయందారోపణ చెందరాదు. చెందినచో ప్రజ్ఞ వ్యామోహము చెందును. ఇట్టి వ్యామోహము దృఢముగా నున్నవారుందురు. వారిని చూచి తెలిసినవాడు కలవరపాటు కలిగించరాదు. సత్కర్మల యందు ప్రేరేపించుట మాత్రము చేయవలెను.

**30.** జీవులలో గల పరమ ప్రజ్ఞయే నేను. అట్టి నన్ను దర్శించి నాయందు సర్వకర్మలను సమర్పణగా నాచరింపుము. కర్తృత్వము, కర్మఫలమును మాత్రము నీ వారోపించు కొనకుము. ఈ దృష్టితో మోహము విడిచి యుద్ధము చేయుము.

**31.** అంతర్యామియైన నే ననుష్ఠించు ఈ మార్గమును శ్రద్ధతో ననుస రింపవలెను. ఇతరుల యందు నన్ను చూచుట వలన అసూయ నుండి విముక్తుడవు కావలెను. ఇక సర్వకర్మ విమోచనము కలుగును.

**32.** ఒకరినొకరు చూచుకొనుటలో ఈ నన్ను చూడక వర్తించువా రసూయ చెందుచున్నారు. వారు నా మార్గము నవలంబించుటకు మానాభి మానము లడ్డువచ్చును. ఇతరులలో నన్ను దర్శించుటకు బదులు వేరు వేరు వ్యక్తులను చూచుట వలన నిట్టి మానసిక విఘ్నములు కలుగును. వారిని మూఢత్వ మావరించును. చేతస్సు యనబడు తమ తత్త్వము వారికందక మనస్సు పై పొరలయందు వర్తింతురు. జీవితమొక పోరాటముగా పొరపడి నష్టపోవు చుందురు. ఎవ్వరేపని చేయవలెను అను విషయమున నహంకార పడుచుందురు.

**33.** మానవుని ప్రవర్తనలోని చైతన్యము రెండు భాగములు : 1) జ్ఞానము, 2) ప్రకృతి. జ్ఞానమనగా వానికి తెలిసినది. ప్రకృతి యనగా

వాని స్వభావము. ఇది వాని చేష్టలతో నిండి యుండును. ఎంతటి జ్ఞానవంతునికైనను వాని ప్రకృతియే చేష్టలుగా వర్తించును. ఐనను వాని ప్రకృతి నా ప్రకృతి నుండి వ్యక్తమైనదే. అతడు చేయు పనులు నా ప్రకృతి నియమించినవియే. కనుక ప్రకృతిచే నియమింప బడుచున్న జీవులకు తెలివిచేత నిగ్రహము చెందుట యసాధ్యము.

**34.** జీవుని ప్రకృతి వలన ఇంద్రియములు ఇంద్రియార్థముల యందు వర్తించుచున్నవి. నిప్పు కట్టెయందు వర్తించగా పొగ, భస్మము మున్నగునవి పుట్టుచు నిప్పు యొక్క వికాసమును తగ్గించు చుండును. బుద్ధిమంతుడు వానిని తొలగించుకొని నిప్పును వినియోగించు కొనవలెను. ఇట్లు తొలగించుకొనుటకు ఒక యవధి యుండదు. ఎంత జ్ఞానము పొందిన వాడైనను నిత్యమును తొలగించు కొనుచునే యుండవలెను. ఈ తొలగింపునే సంస్కార మందురు. ఇట్లే మానవునిలో ఇంద్రియములు ఇంద్రియార్థములయందు ప్రవర్తించునపుడు కూడ పొగ, భస్మము వంటివి పుట్టుచుండును. అవియే రాగద్వేషములు. నరుడు జ్ఞానమును స్వచ్ఛముగా ననుభవింపవలె నన్నచో వీనిని తొలగించు సంస్కారమును నిరంతరము అవలబింపవలెను. ఈ సంస్కారములే వేదోక్త కర్మలు. వాని నాచరించుటలో ఫలిత మాశించువాడు పిచ్చివాడు. నిద్దుర లేచిన వెనుక మలక్షాళనమునకై స్నానము చేసినవాడు ఆశింపవలసిన ఫలితమేమి? చేయనిచో భ్రష్టుడగును గాని, చేసినచో ఫలిత మేమియును లేదు. ఇట్లు యజ్ఞ, దాన, తపస్సు లనబడు సంస్కారములను నిష్కామియై నిత్య మాచరించుచు, నింద్రియములకు మనస్సునకును వశుడు కాక రక్షించు కొనవలెను. అగ్ని కట్టెయందు వర్తించుట వలన పుట్టిన పొగ, భస్మము అగ్ని వికాసమునకు శత్రువులు. అట్లే ఇంద్రియ ప్రవర్తనమువలన పుట్టిన రాగ ద్వేషములు జ్ఞానమునకు శత్రువులు. దీనిని తెలిసి తన ప్రకృతి ననుసరించి తనకేది సత్కర్మయో దాని నాచరింపవలెను.

**35.** స్వధర్మము అనుదాని సూక్ష్మము తెలియవలెను. లోకమున మంచిపను లేవి యున్నవి? యని తడవుకొనువాడు మూర్ఖుడు. నేనేమి యాచరించిన మంచి కలుగునని ప్రశ్నించుకొనవలెను. నచ్చినను నచ్చక పోయినను, గుణవంతమైనను గుణహీనమైనను స్వధర్మము తనకు శ్రేయస్సు. ఎంత గుణవంతమైనను పరధర్మము శ్రేయస్సును కూర్చదు. వేదాధ్యయనము

కన్న బోధనవిద్య కన్న వాణిజ్య మెక్కువ సుఖసంపదల నిచ్చును. అట్లని బోధన ధర్మశీలుడు తన వృత్తి మాని వాణిజ్యము ఆరంభించినచో నుభయ భ్రష్టుడగును. అన్నము తినుట, మానుటకన్న మంచిది. అట్లని జ్వరపీడితుడు భోజనము చేసినచో శ్రేయస్సు కాదు. బుద్ధిబలము గలిగి శరీర దృఢత్వము లేనివాడు దేహకర్మ చేయుట శ్రేయస్సు కాదు. ఇట్లే తన ప్రకృతి ననుసరించి గుణవంతము కాక పోయినను స్వధర్మమునే యాచరింపవలెను.

ఒక్కొక్కప్పుడు స్వధర్మమున చచ్చుట మేలు. యుద్ధభటుడు యుద్ధము చేయవలసిన సమయమున వేదములు చదువుకొన్నచో శ్రేయస్సగునా? పాఠ్య గ్రంథముల పరీక్షకు సిద్ధమగు విద్యార్థి మంచి పని యని గీతాపారాయణము చేసినచో నేమగును? కనుక స్వధర్మ మెప్పుడును శ్రేయస్సు నిచ్చును. పరధర్మ మెప్పుడును భయమును కలిగించును.

**36. అర్జునుడు :** ప్రకృతి మానవులచే పని చేయించుచుండునని చెప్పితివి. ఇక మానవుడు పాపకార్యము లాచరించుట యెట్లు జరుగుచున్నది? ఇష్టము లేకపోయినను బలీయముగా నాకర్షింపబడి ఎవరిచేతనో నియోగింపబడినట్లు మానవులు పాపము చేయుచున్నారు. దానికి కారణ మెవరు ?

**37. శ్రీకృష్ణుడు :** సృష్టికర్మ యొక చిత్రమైన యంత్రాగారము. అందు ప్రకృతి నుండి సత్వరజస్తమస్సులు పుట్టుచున్నవి. అందు రజోగుణము పనిచేయుట వలన పచనమునకు నిప్పంటించినట్లు జరుగుచున్నది. నిప్పు కావలసినపుడు కట్టెలను మండించవలెను. అందు పొగ, భస్మము పుట్టుట తప్పదు. అట్లు మానవుని ప్రకృతిలో కామము, క్రోధము పుట్టుచున్నవి. ఇవి ఆకలి వంటివి. ద్రవ్యమును హరించి భస్మము చేయు స్వభావము కలవి. అవి వికాసమునకు శత్రువులు గనుక పాపకారణము లనబడును. వాని వలన పాపము పుట్టుచున్నది.

**38.** నిప్పు కావలెనన్నచో పొగ తప్పదు. జీవిత మున్నచోట నెల్ల రాగద్వేషములు తప్పవు. అద్దాల బీరువా కావలెనన్నచో దానిపై దుమ్ము పడకతప్పదు. దుమ్ముపడి వికాసము మసక యగును. జీవి గర్భమున పడి పెరుగవలెనన్నచో మావి తప్పదు. ఆ మావియే జన్మ కాలమున పొరయై చీల్చుకొనవలసిన దగును. నిప్పునకు భస్మమువలె, అద్దమునకు దుమ్మువలె,

గర్భమునకు మావివలె, జీవికి కామక్రోధము లావరించి యుండును. వానిని నిత్యము తొలగించుకొనుచుండు కర్తవ్యము తప్పదు.

**39.** ఈ విధముగా జ్ఞానియొక్క జ్ఞానమునకు పొరలుగా నజ్ఞాన మావరించి యున్నది. కోడిపిల్లకు తన చుట్టునున్న గ్రుడ్డుతో నెట్టి సంబంధ మున్నది? తొలుత తనకు రక్షణము (అస్తిత్వమునకు ఆధారము). పిదప తాను దానిని బ్రద్దలుకొట్టుకొనవలసిన సంబంధము. దాని నెప్పుడును పోగొట్టుకొనుచుండవలెను.

పుట్టుచున్న అజ్ఞానము కామక్రోధముల రూపమున వ్యక్తమగును. వాని నివారణోపాయ మేమి? వానిని పూరించినచో తృప్తియై నివారణ మగునని భావింపరాదు. నిప్పుపై నేయి జల్లినచో నేమగునో కామపూరణ ప్రయత్నమున నదియే జరుగును. కోరినది, ఆవశ్యక మగునది వేరువేరుగా బుద్ధితో నిర్ణయింపవలెను. కోరినది పూరింపక ఆవశ్యకమగు దానిని పూరించవలెను. దానితో పాపకారణమగు కామక్రోధ తృష్ణ చల్లారును. ఉదాహరణమునకు జిహ్వయందు వర్తించు మనస్సు రుచులను గోరును. జీర్ణకోశము ఆహారమును కోరును. ఆకలి, రుచులు, కోరిక సమ్మిశ్రముగా నుండును. ఆకలినిబట్టి ఆహారమును నిర్ణయించినచో రుచికరమైన యాహారముతో ఆకలి తీరును. రుచినిబట్టి నిర్ణయించినచో ఆకలిని మించి స్వీకరించిన ఆహారము రోగ కారణమై రుచులింకను చెలరేగును. ఆకలి యావశ్యకము, రుచి కోరిక. వీని వివేచనము ఉచిత ప్రవర్తనము, బుద్ధియొక్క ప్రయోగమగును. అదియే యోగము.

**40.** పాప కారణమగు కామము పుట్టునట్టి స్థానములు ఇంద్రియములు, మనస్సు, వాటితో చిక్కుకొనిన బుద్ధి. బురద చెరువులోని నీటికి రంగు, రుచి మార్పును కలుగజేయును. అట్లే ఈ యజ్ఞానము మోహమును కలుగజేసి, పాపమునకు ప్రేరేపించును.

**41.** కనుక తొలుత నీ వింద్రియములు కోరిన వానిని కోరినట్లు సదుపాయము చేయదలప లేదని మనస్సునకు తెలియవలెను. అపు డింద్రియ

ములు, మనస్సు నీచే నియమింపబడును. దానితో జ్ఞాన శత్రువగు పాపమును తొలగించుకొని జీవింపగలవు.

**42.** నీ శరీరమునందుగల భౌతిక పదార్థముకన్న ఇంద్రియ ప్రవృత్తులు ఎక్కువ చైతన్యము గలవి. వానికన్న మనస్సెక్కువ, వానికన్న బుద్ధి యెక్కువ, దానికన్న నీవెక్కువ. నీకు మిగిలినవి యుపకరణములు. నీకన్న, నీలోనున్న వాడెక్కువ. ఈ విధముగా బుద్ధికన్న పైనున్న వాడు సర్వసామర్థ్యము కలవాడని గ్రహించి వానియందు నిలబడుము. వానికి దిగువనున్న పొరలు దేహము, ఇంద్రియములు, మనస్సు. ఇవియతని కుపకరణములని గ్రహింపుము. వాడే నీవని జ్ఞప్తి యుంచుకొనుట నభ్యసింపుము. అప్పుడు నీవు తానగుదువు. ఈ స్థితియే ఆత్మ. ఇట్లు జ్ఞప్తియం దుండుటయే తన్ను తా నుద్ధరించుకొనుట. ఈ తీరున తన్ను తాను నిలబెట్టుకొని కామరూపుడైన బలిష్ఠ శత్రువును మానవుడు జయించు చున్నాడు.

చతుర్థోఽధ్యాయః ।

# జ్ఞానయోగః ।

*శ్రీభగవా నువాచ :*

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాక వేఽబ్రవీత్ ॥ 1

ఏవం పరంపరాప్రాప్త మిమం రాజర్ష యో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥ 2

స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।
భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ 3

*అర్జున ఉవాచ :*

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।
కథ మేత ద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవా నితి ॥ 4

*శ్రీభగవా నువాచ :*

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।
తా న్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥ 5

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మామాయయా ॥ 6

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహమ్ ॥ 7

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8

జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥ 9

వీతరాగభయక్రోధా మన్మయా మా ముపాశ్రితాః ।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావ మాగతాః ॥ 10

యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్ ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 11

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా ॥ 12

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।
తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥ 13

న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభి ర్న స బధ్యతే ॥ 14

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వై రపి ముముక్షుభిః ।
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥ 15

కిం కర్మ కి మకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః ।
తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వా మోక్ష్యసే ఽశుభాత్ ॥ 16

కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17

కర్మ ణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ ॥ 18

యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥ 19

త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించి త్కరోతి సః ॥ 20

నిరాశీ ర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥ 21

యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ 22

గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః ।
యజ్ఞా యాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23

బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ 24

దైవ మేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।
బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞే నైవోపజుహ్వతి ॥ 25

శ్రోత్రాదీ నింద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।
శబ్దాదీ న్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥ 26

సర్వా ణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।
ఆత్మసంయమ యోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥ 27

ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాఽపరే ।
స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥ 28

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాఽపరే ।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః ॥ 29

అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపిత కల్మషాః ॥ 30

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥ 31

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।
కర్మజాన్ విద్ధితాన్ సర్వా నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32

శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాద్ జ్ఞానయజ్ఞః పరంతప ।
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే ॥ 33

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥ 34

యజ్జ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యసి పాండవ ।
యేన భూతా న్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథోమయి ॥ 35

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥ 36

యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్ కురుతేఽర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా ॥ 37

న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే ।
తత్స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విందతి ॥ 38

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరే ణాధిగచ్ఛతి ॥ 39

అజ్ఞశ్చా శ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥ 40

యోగసన్యస్త కర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్ ।
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ ॥ 41

తస్మా దజ్ఞానసంభూతం హృత్ స్థం జ్ఞానాసి నాత్మనః ।
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత ॥ 42

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
జ్ఞానయోగో నామ చతుర్థోఽధ్యాయః ।
ఓమ్ తత్ సత్ ।

అధ్యాయము - 4

# జ్ఞాన యోగము

**1. శ్రీకృష్ణుడు :** దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి మనలోని భాగములుగా, మన నుండి వేరుగా వర్తించునవిగా గుర్తింపబడు చున్నవి. వానిని గూర్చి వ్యవహరించినపుడు అది, అవి యను పదములు వాడబడు చున్నవి. ఇవికాక మిగిలిన భాగము 'నేను' యని వ్యవహరింపబడుచున్నాను. ఈ మొత్తమే మానవుడు. ప్రతి జీవియందు నీ మొత్తముండును. ప్రతి అణువు నందుండును కనుక మొత్తము భూగోళము నందుండును. ఇట్టి గోళము లెవని చుట్టును తిరుగుచున్నవో అట్టి సూర్యుని యందు నుండును. ఈ మొత్తమునకు సూర్యుడాధారము. గనుక సూర్యగోళమున మేల్కొనిన 'నేను' సర్వమున కాధారము. గ్రహ గోళాదులు, అందలి జీవులు పుట్టకముందు సూర్యునిలోని 'నేను' మేల్కొనుట జరిగినది. ఈ మేల్కాంచుటయే మొట్ట మొదటి యోగవిద్య. సూర్యునిలో 'నేను' మేల్కాంచక ముందు ఆకాశముగా నావరించి యున్నాను. నీవు మేల్కొనక ముందు నిద్రలో లీనమైయున్నట్లు సూర్యుడు మేల్కాంచక ముందు నే నాకాశమున లీనమై మేల్కొనియున్నాను.

తొలుత సూర్యుని కుపదేశముగా మేల్కొన జేసినది 'నేను'. అప్పటి నుండి ఈ నేను వ్యయముకాక సూర్యుని వికాసముగా వ్యాపింపజేసితిని. దానిలో నేనుగా నున్న సూర్యుడు వివస్వంతుడను స్థితిని ఉపదేశముగా పొందును. (వివస్వంతుడనగా వివిధములుగా వసించుట కొరకు వెలుగులనే దారములుగా తీసి తన అస్తిత్వమునే తన చుట్టును వస్త్రముగా అల్లుకొనినవాడు. ఈ అల్లిక వలన సూర్యునకు గోళాకార మేర్పడినది.)

యోగమును మొదట వివస్వంతునకు చెప్పితిని. వివస్వంతుడు మనువు నకు చెప్పెను. (మను వనగా సూర్యుని సౌరకుటుంబ ధర్మములను నిర్వర్తించు టకు దిగివచ్చిన మానవమూర్తి. అనగా సూర్యుని మనస్సు. ఇతని వలన మన్వంతరములు పుట్టి కాలవిభాగములై సృష్టి యందలి వివిధ స్థితులు నడచు చున్నవి.)

ఈ యోగమును మనువు ఇక్ష్వాకుని కిచ్చెను. (ఇక్ష్వాకువు అనగా భూమిపై జీవుల నిర్మాణము, నిర్వహణము చేయుటకై భూమికి దిగివచ్చిన మూర్తి. అతడు సూర్యుని నుండి దిగివచ్చెను గనుక సూర్యవంశ ప్రభువు.)

**2.** ఇట్లు పరంపరగా నా యోగవిద్య భూమికి దిగివచ్చి అణువణువు నందును మేల్కాంచినది. ఇందే యణువున కా యణువే 'నేను' అని మేల్కొనుట వలన దేనికది వేరుగా అస్తిత్వము పొందినవి. దానితో కాల క్రమమున యోగము వివిధత్వము లోనికి నష్టమైనది.

**3.** అయినను ఇన్నిటియందు నే నుండుటవలన నొక్కొక్క మానవునికే మరల నీ యోగమును సమకూర్చగలను. నేడు నీకా యోగమునే యుపదేశించితిని. ఇది పురాతనమైన యోగము. ఇది నాచే నుచ్చరింప బడినది. నా యుచ్చారణయే ఈ జగత్తులైనది.

దీనిని పొందుటకు కావలసినది పరస్పరము అనుకూల ప్రవృత్తి, సఖ్యము. దీని వలన ఏకత్వమును కలిగించు భక్తి యనునది వ్యక్తమగును. నీకు నాయందు భక్తి కలిగినది గనుక, నీవు నాకు సఖుడవు గనుక, ఈ రహస్య విద్యను నీకుపదేశించితిని. భక్తి లేనివానికి ఇది రహస్యముగా దాచబడి యుండును. అనగా వానికి తట్టదని యర్థము గాని నేను దాచ యత్నింతునని గాదు. సర్వ ప్రకాశమునకు కారణమయ్యు నీ విద్య పరమ రహస్యముగ సర్వజీవులయందును దాగి యున్నది.

**4. అర్జునుడు :** నీవు జన్మించినది ఈ నడుమనే! వివస్వంతుడు ఎప్పుడో జన్మించెను. నీవు వానికి ఉపదేశించితి వనుమాట ఎట్లు అర్థము చేసుకొనవలెను?

**5. శ్రీకృష్ణుడు :** నీకును నాకును గూడ అనేక జన్మలు గడచినవి. నీవు, నేను అను మనలోని ప్రజ్ఞలు ఇప్పటివి కావు. నాజన్మ లన్నిటిని నే నెరుగుదును. నీ జన్మలను నీ వెరుగవు. (నేను అను ప్రజ్ఞ అన్ని జన్మలలో నొక్కటిగ నుండును. నీవు మున్నగు ఆరోపిత ప్రజ్ఞలు ఏ జన్మ కా జన్మగ మాయమగు చుండును.)

**6.** ఈ 'నేను' పుట్టుక లేనివాడను. నాశమును లేనివాడను. పుట్టుచు నశించుచున్న జీవులకు ఈశ్వరుడను. ఈ 'నా' నుండియే నా జన్మలు, మీ జన్మలు సంభవించుచుండును. నా నుండి నా ప్రకృతి వెలువడును. దాని యాధారమున నేను పుట్టుకలలోనికి దిగివత్తును. ఇట్లు దిగివచ్చుటయే నా మాయ యనబడును. (ఊహించుచున్న వానిలో ఊహలు తనకన్న వేరుగ తనకు గోచరించు చుండును. అట్లే ఈశ్వరుని యందు జీవులు గోచరించుట ఆత్మమాయ యనబడును.)

**7.** ఈ సృష్టి సమస్తమును నిర్వహించు నా ప్రకృతి యొక్క కార్యక్రమమే ధర్మ మనబడును. అందుపుట్టిన జీవులు చిందరవందరగా ప్రవర్తించుటలో ధర్మమునకు భంగము కలుగును. నిశ్శబ్దము సాధింపగోరి కొన్ని వందలమంది జేరి ఒకరి నొకరు నిశ్శబ్దమని హెచ్చరించుటతో మహాధ్వని పుట్టి కలకలమై నిశ్శబ్దమునకే భంగము కలుగుట చూచు చున్నారు. అట్లే జీవరాసుల నడుమ అధర్మము పుట్టును. ఇది పెచ్చు పెరిగినపుడెల్ల నన్ను నేను సృష్టించుకొందును. దేశ కాల పాత్రముల ఆవశ్యకతబట్టి దిగివత్తును.

**8.** నా ధర్మము ననుసరించువారు సాధువులు. ధర్మమునకును వారికిని భంగము కలుగజేయువారు దుష్కృతులు. సాధువులను రక్షించి, దుష్టులను అంతము చేసి, ధర్మమును మరల చక్కగ స్థాపించుటకై నేను యుగయుగములలో దిగివచ్చు చుందును.

**9.** ఇట్టి నా జన్మము, నే నాచరించు కర్మము దివ్యము. మీ జన్మలు కర్మలు కూడ నావియే. ఇట్లు దిగినపుడు దివ్యములు. మీవి యనుకొనినపుడు ప్రాకృతములు లేక సామాన్యములు. నన్నిట్లెవడు తెలియునో వాడు తత్త్వవేత్త. వాడు దేహము విడిచి పునర్జన్మము పొందడు. నన్నే పొందును. (అనగా పుట్టడని యర్థముకాదు. దివ్యములగు నా జన్మ కర్మలయందు వర్తించునని యర్థము.)

**10.** సామాన్య స్థితి నుండి నా భావము పొందుటకు నన్నాశ్రయించి నిరంతరము నా జ్ఞానము, నాకై తపస్సు పొందవలెను. అప్పుడు రాగము, భయము, క్రోధము అనబడు మద్వ్యతిరేక లక్షణము లంతమై వారు నాచే నిండినవారై నాయం దుందురు.

**11.** నన్ను ఎవ్వడెట్లు శరణు పొందుచున్నాడో వానినట్లే నేను సేవించుచున్నాను. ఏ మనుష్యుడు ఎవ్వరి నెట్లు ఊహించినను వాడు వారిలో నున్న నన్నే యట్లూహించు చున్నాడు. ఎవడెటు పోయినను నా మార్గములలోనే నడచుచున్నాడు.

**12.** నన్నుపాసించు మార్గము లనేకములున్నవి. కొందరు కార్యములు సిద్ధించుటకై యొక్కొక్క దేవత నుపాసించుచు కార్యసిద్ధిని చేకూర్చమని ప్రార్థించుచున్నారు, వారెల్లరు ఆ దేవతల రూపమున నన్నే ప్రార్థించుచున్నారు. కొందరు చుట్టరికములలో శత్రుమిత్రత్వములలో నితరుల యెడల ప్రవర్తించు చున్నారు. ఎవరి శరీరమైనను నా దేవతలచే నిండియున్నది. కనుక కార్య సిద్ధికై ఎవరి నాశ్రయించినను వారిలోనున్న దేవతలను, అందున్న నన్ను కొలుచు చున్నారు. భౌతిక లోకమున వ్యక్తుల నాశ్రయించినపుడు వేరు వేరు పనులకు వేరు వేరుగ కార్యసిద్ధి త్వరలో కలుగుచున్నది. గనుక వారట్లు మనుష్యుల లోకమున వేరు వేరు వ్యక్తులను, వారిలోని శక్తులను ఆశ్రయించు చున్నారు.

**13.** నా ప్రకృతి లోని త్రిగుణములు జీవులలో పరస్పర సమ్మిశ్రములుగా స్వభావములు పుట్టుచున్నవి. ఈ కలయికలు కోటానుకోట్లుగా రూపొంది వ్యక్తిగత స్వభావములు అగుచున్నవి. అందు సకల మానవులు, స్వభావముల సమీకరణముచే నాలుగు వర్గములుగ ఏర్పడుచున్నారు. వారే జ్ఞానార్జనచేయు బ్రాహ్మణులు; రక్షణ స్వభావముగల క్షత్రియులు, వినియోగ వినిమయ స్వభావములుగల వైశ్యులు, కర్మాచరణ స్వభావముగల శూద్రులు అగుచున్నారు. ఈ నాలుగు ధర్మములలో వారిని వారే విభజించుకొనుచున్నారు. అనగా నేనే వారి ప్రకృతిగా ఇట్లు విభజించు చున్నాను. వారిలో ప్రకృతి కతీతుడనుగా ఆత్మ స్వరూపుడనై యుండి ఈ విభజన కతీతుడనుగా నున్నాను. అనగా ఈ విభజనము చేయని వాడుగ కూడ నున్నాను.

**14.** కర్మలు నన్నంటవు. కర్మఫలములయందు నాకు దృష్టి లేదు. ఇట్లు నన్ను తమయందు తెలిసికొనినవాడు కర్మలచే బంధింపబడుట లేదు.

**15.** పూర్వము మోక్షము కోరినవా రందరును ఇట్లు తెలిసికొనియే

కర్మల నాచరించిరి. పూర్వుల చేతను, వారి పూర్వులచేతను ఆచరింపబడిన ఈ మార్గము ననుసరించుచు నీవును కర్మాచరణము చేయుము. మానుటకు యత్నింపకుము.

**16.** కర్మ, అకర్మ (ఆచరించుట, ఆచరించక విడచుట) అనువాని స్వరూప మెట్టిదో తెలియక గొప్ప జ్ఞానులు గూడ భ్రమ పడుచున్నారు. వీని నిజస్వరూపము తెలిసిననే కర్మవిమోచనము కలుగును. కనుక నీకు బోధించెదను.

**17.** ఆచరించుట, ఆచరింపక మానుట, ఈ రెండును గాక మూడవ విధానము అనునది స్పష్టముగా తెలియవలెను. ఈ కర్మమార్గము మిక్కిలి దుర్గ్రాహము.

**18.** ఆచరించుటలో ఆచరింప కుండుటను చూడవలెను. ఎట్లనగా మిత్రునితో సంభాషించుచు బాటవెంట నడచు చున్నవాడు, సంభాషించుట యందు నిమగ్నుడై యున్నాడు. కనుక నడచుట నత డాచరించుట లేదు. కాని అతనిచే నడవబడు చున్నది గనుక కర్మ జరుగుచునే యున్నది. ఇట్లు ఆచరించుటలో ఆచరింపకపోవుట ననుభవింప వలెను.

ఆచరింపక మానుటలో ఆచరించుట యున్నదని గ్రహింపవలెను. ఒకడు మరియొకనిపై కోపించుచు, "నీ మొగము చూడను, నీతో మాట్లాడను," అని చెప్పుచున్నప్పుడు మొగమును చూచుటయు, మాట్లాడుటయు చేయుచునే యున్నాడు. త్రాగుబోతునకు మద్యము లభింపని పూట అతడు త్రాగుట లేదుగాని త్రాగుటనే స్మరించుచున్నాడు. ఇట్లు అకర్మలో కర్మ యున్నదని గ్రహించి బుద్ధియందు జాగరూకుడు కావలెను. వాడే బుద్ధిమంతుడు; వాడే యోగి; వాడే సర్వ కర్మలను సమగ్రముగ నాచరించువాడు.

**19.** జ్ఞానము నిప్పువంటి వెలుగు. కట్టె లేనిది నిప్పు వ్యక్తము గాదు. దేహము లేనిది జ్ఞానము కలుగదు. కట్టెలను రగుల్కొల్పుట లేకున్నను నిప్పు వ్యక్తము కాదు. అట్లే కర్మలు ఆచరింపకున్నను జ్ఞానము కలుగదు. రగుల్కొల్పిన నిప్పు కట్టెకొరకు గాదు. అట్లే జ్ఞానము దేహేంద్రియ మనసుల కొరకు కాదు. రగుల్కొల్పబడిన అగ్ని వంటకు ఉపయోగపడి ఆకలి తీర్చును. ఇంతలో కట్టెలు కాలిపోవును. అట్లే జ్ఞానము ఆనందానుభూతిని పచనము చేయు

చుందును. కోరికలు, ఇంద్రియ ప్రవృత్తులు జ్ఞానాగ్నిలో భస్మమగు చుందును. ఇట్లు జీవించు వానిని పండితు డనవలెను.

**20.** కర్మఫలములయందు ఆసక్తి లేక మానవుడు నిత్యతృప్తుడగును. అతని కాశ్రయము ఆవశ్యకము కాదు. అనగా ఆశ్రయమునకై ఇతరము అగు వస్తుసంపద యందును, వ్యక్తియందును భ్రమపడడు. అతడు ఆశ్రయించునది యొక్కటియే! తనలోనున్న నేను అను ప్రజ్ఞ. అట్టివాడు కర్మలయందు ప్రవర్తించు చున్నను ఏమియు చేయనివాడే అగుచున్నాడు.

**21.** ఏమియు భుజింపకుండ శరీరకర్మ చేయవలెను. దారపుత్రాదులను, గృహ క్షేత్ర ధనాదులను పరిత్యజించవలెను. దీనితో కల్మష హరమగును.

ఈ శ్లోకము పొడుపుకథ వంటిది. భారతమున నిట్టి శ్లోకములను వ్యాస ఘట్టములు అందురు.

ఏమియు భుజింపకుండ శారీరకర్మ యెట్లు చేయగలడు? చేసిన పని నుండి ఏమియు ఆశింపకుండుటయే భుజింపకుండుట. మంచి రుచికరమైన భోజనము చేయుటలో నొకడు రుచికొరకు భుజించి రోగి యగుచున్నాడు. మరియొకడు ఆకలి తీరుటకు అనగా దేహమును పోషించుటకు రుచికరముగ భుజించుచున్నాడు. అతనికి భోజనము కొరకు రుచియేగాని, రుచికొరకు భోజనము కాదు. ఆ రుచిగూడ జిహ్వ ద్వారమున మనస్సున కిచ్చుచున్నాడు కాని తాను రుచి చూచుటలేదు. కార్యభారములలో పూర్తిగ నిమగ్నుడైనవాడు రుచికరమైన భోజనము చేయుచున్నప్పుడు వాని జిహ్వకు రుచిగా నుండునే కాని అతడు దానియందు రుచి పడడు. సక్తుడగుటకు తీరిక లేదు. ఇట్లు ఆకలి తీరుటకు శ్రమించుచున్న జిహ్వకు రుచిని బహుమానముగ దానము చేయుచున్నాడు. అన్నము శరీరమునకు, రుచి జిహ్వకు, ఇక తనకు మిగులున దేమి? ఏమియు భుజింపకుండ పనిచేయుట యనగా ఇది. దార పుత్రాదులను విడచుట యనగా దారయందు దారాసక్తిని, పుత్రుల యందు పుత్రాసక్తిని సన్యసించుట పోగా మిగిలినది జీవులు. వారిలో నున్నది సర్వాంతర్యామి. ఇట్లు భార్యను, పిల్లలను, ధన ధాన్యాదులను సన్యసింపవలెను. వారు మనయందు మమకారము గలిగి వ్యామోహ పడుచుందురు గదా!

దాని నివారించుట ఎట్లను ప్రశ్న కలుగును. నీవు వారిని కలవర పెట్టరాదు. వైరాగ్య మనుపేర త్రెంచుకొని పోవుట యనవసరము. మన వైరాగ్యము వారికి దుఃఖము కలిగింపరాదు. వారు వ్యామోహ పడినచో ఆ వ్యామోహము నాధారముగ చేసుకొని వారిని సత్కర్మలలోనికి ప్రేరేపింపవలెను. తాను వారిని బంధువులుగ సన్యసించి అంతర్యామిగ దర్శించుటయే ముఖ్యము కాని వారు తన్ను విడువలేదను భావము తగదు. ఈ భావమే బంధమై సన్యాసము భంగమగును. ఈ విధముగ సర్వకర్మలు నాచరింపవలెను.

**22.** అట్టివాని ప్రవర్తన మెట్లుండునో వివరింతును. అతడు లభించిన దానితో తుష్టిగా నుండును. కలిమిలేములు, మంచిచెడ్డలు, సుఖ దుఃఖములు వానికి లేవు. ఇతరుల లాభమును గూర్చి మాత్సర్యము లేదు. కార్యసిద్ధి, కార్యభంగము అను తక్కెడ సిబ్బులను సామ్యము నావహించును. సిబ్బులలో ఒతూనిక బరువులు, తూకము చేయబడు వస్తువులును నిలిచి యుండును. అతడు త్రాసు ముల్లుకడ పట్టుకొనును గాని వస్తు సామాగ్రిని పట్టుకొనుట లేదు. కాని యవి వాని చేతియందే యున్నవి. ఇట్లు యోగి కర్మలను గ్రహించియు, గ్రహింపనివా డగుచున్నాడు.

**23.** ఆసక్తి, అభిమానము తొలగిన వెనుక మిగిలిన భాగము మానవుడే యోగి. అత డాచరించు కర్మ యజ్ఞార్థముగ జరుగును.

**24.** ఎవరికైన నొక వస్తువు నర్పణ చేయుచున్నప్పుడు వానిలోని దేవతలకు, వానిలోని సర్వాంతర్యామికి అర్పణము చేయుచుంటినని స్మరింప వలెను. అట్లే అన్నము ప్రాణముగ శక్తిత్వము నొందుచున్నప్పుడు పరబ్రహ్మము నకు చెందుచున్నదని స్మరింపవలెను. ఆకలి బ్రహ్మము యొక్క అగ్నిస్వరూపము. దానము చేయువానిలోని సంకల్పము సంకల్పరూప బ్రహ్మము. కనుక మొత్తము బ్రహ్మము నుండి అర్పణముగ, హవిస్సుగ, అగ్నిగ, యజమానిగ, సృష్టియజ్ఞము బయలుదేరి వాని తృప్తి యందే అస్తిత్వ మొందుచున్నది.

దున్నిన భూమిలోని సారమన నేమో తెలియదు. వర్షము విత్తనములను మొలిపించుట యననేమో తెలియదు. విత్తనమున పొటమ రించున దేమో తెలియదు. పంట యనుపేర నొక విత్తనము నుండి వందల విత్తనములు

వచ్చుట ఎట్లో తెలియదు. అన్న మగుట, ఆకలి తీరుట, ప్రాణము నిలచుట, దేహములు పెరిగి పోషింపబడుట యననేమో తెలియదు. పండించు సంకల్పము మానవున కెట్లు కలుగుచున్నదో తెలియదు. గమనించితివా? ఎవరికిని తెలియనిదై, అందరిచే సమగ్రముగ నిర్వహింపబడుచు, అందెవ్వరిని విడువక అంతర్యామిగ వ్యవహరించుచున్న ఈ సృష్టి యజ్ఞము ఎవ్వరికిని తెలియకున్నను తనకు తాను తెలిసి ప్రవర్తించుచున్నది గనుక ఈ మొత్తము బ్రహ్మయజ్ఞ మనబడును. మనము చేయు పనులు కూడ దానికి అనుకూలముగ నున్నచో మనస్సు తెలియకయే బ్రహ్మమునందు అనుభవము పొందును. ఇదియే తెలియుట.

**25.** బ్రహ్మ యజ్ఞమును చూచి మానవులు సాధనగా ననుకరించిన యజ్ఞములు అనేకము లున్నవి. నిప్పు, నీరు, గాలి, మనస్సు, బుద్ధి, చిత్తము మున్నగు రూపములుగ పనిచేయుచున్న శక్తులే దేవతలు. వారి నుద్దేశించి మనము చేయునది యజ్ఞమని కొందరు దేవయజ్ఞము చేయుచున్నారు. పరిసరములలో గాలి, నీరు మున్నగునవి తన వలన మలినము కాకుండుట, తాను వానిని పరిశుభ్ర పరచుట, సుగంధము మున్నగు ప్రశస్తములయిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములచే ఇతరుల కొరకై వాతావరణము నారాధించుట ఉత్తమ దేవయజ్ఞము. మరికొందరు యజ్ఞముతో యజ్ఞము నారాధించుచున్నారు. అనగా జ్ఞానము అను యగ్ని యందు తమకు జ్ఞానములో వెలుగొందిన జ్ఞాన సంపదలను సోదర ప్రజలలోనున్న జ్ఞానమునకు కానుక పెట్టుచున్నారు. పవిత్ర గ్రంథముల నధ్యయనము చేయుట, బోధనోపదేశములను చేయుట, నిర్మమముగ ఉత్తమ గ్రంథరచనము చేసి పాఠకులలోని యజ్ఞమూర్తికి యజ్ఞముగ సమర్పించుట మున్నగునవి జ్ఞాన యజ్ఞమునకు వైఖరులు.

**26.** కొందరు తమ జ్ఞానమున శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను ఆహుతులుగ ఇంద్రియములు అనబడు అగ్ని జిహ్వల యందు యజ్ఞము చేయుచున్నారు. పరిసరములను అవగతము చేసికొనుట, ఇతరులు చెప్పిన వాక్యములను భక్తితో వినుట, ఇతరులయెడ భగవద్భావనతో సంభాషణ చేయుట ఈ యజ్ఞములోని భాగములు. మరి కొందరు ధ్యానమున పంచేంద్రియ ప్రవృత్తులను నియమమును అగ్నియందు హోమము చేయుచున్నారు. అనగా

తమలోని 'నా' యందు ధ్యానమార్గమున ఇంద్రియాదులను లీనము చేయు చున్నారు.

**27.** మరికొందరు తమ ఇంద్రియ ప్రవృత్తులను, ప్రాణ ప్రవృత్తులను తమయందు ధ్యానము చేసి జ్ఞానాగ్నిని విస్తారముచేసి తామంతయు అగ్నిగనే మారిపోయి జీవించుచున్నారు.

**28.** కొందరు వస్తు సంపదను యజ్ఞము చేయుచున్నారు. పొలము పండించుట, గొడ్లను పోషించి పాలుతీయుట జరిగిన చోట్ల, సిద్ధము చేయబడిన వస్తువులను కర్త మ్రింగుట లేదు గదా! కనుక యజ్ఞార్థము వారిచే ద్రవ్యము లేక సంపద అర్పింపబడు చున్నది. అట్లే కొందరు తపో యజ్ఞములు ఆచరింతురు. అనగా, యోగాభ్యాసమును యజ్ఞార్థమై యాచ రింతురు. కొందరు స్వాధ్యాయమును అనగా గ్రంథముల పరిశ్రమ, శాస్త్రము లభ్యసించుట మున్నగునవి చేయుదురు. వీరందరును యజ్ఞార్థముగనే అనగా తమకు గాక లోకశ్రేయస్సునకే యాచరించు చున్నారు గనుక తెలిసి యాచరించు వారందరు యతులు లేక సన్యాసులు. వీరి జీవితమునే దీక్షగా సమర్పించి అందే జీవించుచున్నారు.

**29.** కొందరు ప్రాణాయామమును యజ్ఞార్థము ఆచరించుచున్నారు. ప్రాణాయామము అనగా నేమి? ప్రాణమునందు అపానము, అపానము నందు ప్రాణము హోమము చేయవలెను. అపుడు ప్రాణాపాన గతులు నిలిచి పోవును. ఇదియు వ్యాసుని పొడుపు కథయే! ఉచ్ఛ్వాస నిశ్వాసలకు కారణము ఊపిరితిత్తుల సంకోచ వ్యాకోచములు. దానికి కారణము ప్రాణము యొక్క సంకోచ వ్యాకోచాత్మక ధర్మము. ఈ ధర్మము కారణముగ ప్రాణులలో రెండు విధములైన ప్రవృత్తు లేర్పడుచున్నవి. పరిధి నుండి కేంద్రమునకు ఒక యాకర్షణము. కేంద్రము నుండి పరిధికి మరియొక యాకర్షణము ఇందలి ప్రవృత్తులు. ఈ రెండును కలిసి యొక ప్రాణస్పందన మగును. అందు మొదటిది ప్రాణ మనబడును. రెండవది అపాన మనబడును. మనలో మొదటి దానివలన అన్నము, నీరు, గాలి స్వీకరింపబడుటయు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు మనస్సుచే గ్రహింపబడుటయు, వినుట, అర్థము

చేసికొనుట, ఆర్జనము, దానాదులు స్వీకరించుట మున్నగు ప్రవృత్తు లేర్పడు చున్నవి. రెండవ దానివలన  అనగా అపానము వలన మలమూత్ర స్వేదాది విసర్జనము, పనులు చేయుట, పరిసరముల కనుకూలముగ ప్రవర్తించుట, వివరించి చెప్పుట, దానాదులు ఆచరించుట మున్నగు ప్రవృత్తు లేర్పడుచున్నవి. ప్రాణము వలన గాలి పీల్చుట, అపానము వలన శ్వాస విడచుట జరుగు చున్నవి. ప్రాణమువలన దేహముయొక్క జననము, అపానము వలన మరణము జరుగుచున్నవి. ప్రాణాయామ మనగా ఈ రెండు ప్రవృత్తులను చక్కగా సమీకరణము చేసి సామ్యమును సాధించుట. దీనిని సాధించునపుడు, దేహేంద్రియ మనః ప్రవృత్తులు సామ్యమున వర్తించుచు జీవిని లక్షణమగు స్వస్వరూపానుభూతికి ఆటంకము కలిగింపకుండును.

నిదానముగా గాలి పీల్చి ప్రశాంతముగా విడచుటలో అభ్యాస మారంభమగును. పూర్తిగ గాలినంతను బహిష్కరించినచో వెంటనే గాలి పీల్చు ప్రయత్నము నదియే యగును. గట్టిగా పీల్చినచో విడువ వలసిన ప్రయత్నము కూడ నదియే యగును. పరిగెత్తుట, ఆయాసపడుట, దుఃఖాది ఆవేశములకు గురియగుట వలన నిట్టి తప్పనిసరి శ్వాస ఏర్పడును. దానినే ఎగశ్వాస, రొప్పు అని అందురు. పై కారణము తొలగించినచో శ్వాస ప్రసన్న మగును. సామ్యము నందు నిలబడును. ఉచ్ఛ్వాసలో నిశ్వాసము, నిశ్వాసలో ఉచ్ఛ్వాసము లీనమై, పీల్చి విడుచు ప్రయత్నము ఆగిపోయి కావలసిన గాలి సహజముగ నాసారంధ్రముల గుండ పీల్చబడకుండ వ్యాపించి వచ్చుచుండును. అట్టి స్థితిలో మనస్సు శ్వాస ప్రయత్న స్థానమున దరిచేరి ప్రయత్న త్యాగము చేసి సామ్యస్థితి ఏర్పడును. మనస్సు, శ్వాసయు నొకటియై నిలిచిపోవును. దీనిని ప్రాణాయామ మందురు. లోకశ్రేయస్సు కొరకై దీని నభ్యసించువారు ఈ సాధనను ఒక యజ్ఞముగా నారాధించు చున్నారు.

**30.** కొందరు ఆహార నియమము నభ్యసించి ప్రాణములను ప్రాణముల యందు హోమము చేయుచున్నారు. అనగా నియతాహారము వలన అన్నమయ కోశమును శుద్ధిచేసి ప్రాణప్రవృత్తిని హెచ్చుచేయు చున్నారు. ఇన్ని విధముల సాధనల వారును యజ్ఞార్థమను వినియోగమును జ్ఞప్తియం దుంచుకొనినచో

యజ్ఞవిదులే! అంతేగాక యజ్ఞముచే పాపములను క్షాళనము చేసికొని పవిత్రు లగుదురు. యజ్ఞార్థబుద్ధి వలన మాత్రమే పాపక్షాళన జరుగును.

**31.** యజ్ఞ శేషము 'అమృత' మనబడును. అనగా తాను లోకమునకు ఆచరించిన ఆరాధనమునకు తరువాత స్వీకరించు భోజనాదులు మున్నగునవి. భార్య భర్తకు వండి పెట్టినచో భర్త ఆర్జనచేసి అనుదినము బియ్యము భార్యకు తేగలడు. ఇట్లు తరుగకుండు సంపద– లోకశ్రేయస్సు, ఇతరులకు సేవయను ప్రయత్నమున క్షాళనమగు వానికే లభ్యమగును. ఉన్న బియ్యము తానే వండుకొని తిన్నచో భర్త ఆర్జనకు పోవుటయు, బియ్యము తెచ్చిపెట్టుటయు సాధ్యము కాదు. ఇంకొకరికి చేసిన సేవతో తనకు అమృతత్వ సాధన సృష్టిలో ముడిపెట్టబడి యున్నది. గనుక యజ్ఞశేషమును భజించువాడు అమృతము భుజించుచు శాశ్వత బ్రహ్మను అనుభవించును. యజ్ఞార్థము చేయనివానికి తొలుత యిహలోకమే కుంటుపడును. పండించువాడు ధాన్య మితరుల కొరకు అని తెలిసి పండించుట మానిన నేమగును? ఇష్టమున్నను, లేకున్నను ఐహిక జీవిత సౌఖ్యమంతయు కూడ యజ్ఞార్థమునకు ముడిపెట్టుకొని యున్నది. యజ్ఞార్థము అవలంబించు వానికి ఇహపరములు అప్రయత్నముగా సిద్ధించును. లేనివానికి ఇహలోక సౌఖ్యమే సిద్ధింపనపుడు పరలోక మెట్లు సిద్ధించును?

**32.** ఈ బహువిధములైన యజ్ఞములును సృష్టికర్త ముఖము నుండియే వ్యక్తమై విస్తరించినవి. ఆ ముఖమే వేదము. అనగా సృష్టి యందు తన యందు నంతర్లీనమైయున్న జ్ఞానానుభూతి. ఈ యజ్ఞము లన్నియు బ్రహ్మకర్మ యనబడు దివ్యకర్మ నుండి పుట్టినవి. తెలిసికొని యాచించువాడు విమోచనము పొందును.

**33.** ద్రవ్యమయమైన భౌతిక పదార్థ యజ్ఞమువలన శ్రేయస్సు కలుగును. దానివలన జ్ఞానము కలుగును. పనులను యజ్ఞార్థము ఆచరింపగా గల్గిన సంస్కారమే జ్ఞానము. సర్వకర్మలును జ్ఞానము నందే పరిసమాప్తి చెందుచున్నవి. ఫలితములను వదలి ఏపని యాచరించినను కలుగునది జ్ఞానమే.

**34.** ఏ పని చేసినను సమర్పణ బుద్ధితో శరణాగతి చేయుము. ఎవరిని చూచినను, మాట్లాడినను, వారి చేష్టలు, సంభాషణాదికముల యందు, జ్ఞాన స్వరూపుడనైన నన్ను గూర్చియే ప్రశ్నించుకొనుము. నన్ను తెలుసు కొనుటకు చేయు ప్రశ్నయే పరిప్రశ్నము. ఎవరికి ఏ పని చేసి పెట్టినను నాకు సేవ చేయుము. పెద్దలకు శరణాగతి చేసి సేవచేసి ప్రశ్నించి నాకు చేసినవిగా భావించి జ్ఞానము పొందుము. తత్త్వమును దర్శించిన జ్ఞానులు నీకడకు వెదకికొని వచ్చి ఉపదేశింతురు. వారెల్లరు నేనే గదా?

**35.** ఇట్లు తెలుసుకొనుట వలన ఇతరుల యందు మోహబుద్ధి, ఈర్ష్యాసూయాదులు కలుగవు. ఈ జ్ఞానము వలన సర్వజీవులను నీవుగా దర్శింపగలవు. వారిని, నిన్ను నాయందు దర్శింపగలవు.

**36.** పాపములు చేయుచుంటి మేమోయను శంక వలదు. ఈ దృష్టితో నీ పని నీవు చేయుము. కర్మయను సముద్రమున జ్ఞానము నీకు తెప్పయగును. సముద్రముకన్న తెప్ప చిన్నదియైనను సముద్రమును దాటించు చున్నది. నీ జ్ఞానము చిన్నదియైనను ఇట్లు ప్రవర్తించినచో సముద్రమంత పాపమైనను దాటి నన్ను చేరగలవు.

**37.** మంటకన్న కట్టె పెద్దది గదా! అయినను ఎన్ని కట్టెలయిన మంటలో కాలిపోవును. జ్ఞానము నందు సర్వకర్మల పాపములు భస్మమగును.

**38.** నిప్పుకన్న కాల్చగల వస్తువేది? అట్లే జ్ఞానముకన్న పవిత్రము చేయగల శక్తిలేదు. ఈ మార్గమున యోగ సంసిద్ధి పొంది జ్ఞానమను వెలుగును చూచి అందు ప్రవేశించి నీవే ఆ వెలుగై జీవింతువు. అట్టి స్థితినే ఆత్మను పొందుట అందురు.

**39.** దీనికి ఆచరణలో నిరంతరత్వము ఆవశ్యకము. ఇది తప్ప వేరు భావము లేకుండునట్లు మరల మరల ఈ భావములోనికి నీవు సర్వ కర్మలతో ప్రవేశించు చుండవలెను. ఇట్లు విడువకుండటను శ్రద్ధ యందురు. దానితో నీవు జ్ఞానమై నీ యింద్రియములు నీ వగుదువు, అప్పటి యనుభూతియే ఉత్తమ శాంతి. ఇది ఈ మార్గమున స్వల్ప కాలముననే సిద్ధించును.

**40.** ఈ మార్గము పట్టక, వ్యక్తులను, పనులను, పదార్థములను వేరుగ చూచుట అశ్రద్ధ యనబడును, దాని వలన అజ్ఞానము కలుగును. దాని వలన సంశయములు కలుగును. సంశయ స్థితిలో నీవు ఆత్మగ నుండక దేహేంద్రియ మనస్సుల లోనికి ముక్కలై పోవుదువు. దీనినే ఆత్మ నాశనము అందురు. సంశయాత్మునకు ఇహలోకమే సిద్ధింపదు. పరలోక మెక్కడ? సుఖమెక్కడ?

**41.** ఈ యోగస్థితిలో కర్మలను సన్యసింపుము. కలిగిన జ్ఞానముతో సంశయములను తొలగించుకొనుము. ఆత్మవంతుడ వగుదువు. కర్మలు బంధింపవు.

**42.** అజ్ఞానము వలన సంశయము కలుగును. హృదయము నందు జ్ఞానము బుద్ధి రూపమున వాడిగ కత్తివలె నుద్భవించును. దానితో సంశయమును ఛేదింపుము. నీవు కానిది అంతయు అజ్ఞానమున సంశయముగ నుండును. అది యంతయు 'నా' అస్తిత్వముతో నిండి యోగస్థితి పరిపూర్ణమగును.

*పంచమోఽధ్యాయః ।*

# కర్మసన్న్యాస యోగః ।

*అర్జున ఉవాచ :*

సన్న్యాసం కర్మణాం కృష్ణ పున ర్యోగం చ శంససి ।
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥ 1

*శ్రీభగవా నువాచ :*

సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ ।
తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే ॥ 2

జ్ఞేయస్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధా త్ప్రముచ్యతే ॥ 3

సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।
ఏక మప్యాస్థితః సమ్య గుభయో ర్విందతే ఫలమ్ ॥ 4

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5

సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తు మయోగతః ।
యోగయుక్తో ముని ర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥ 6

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7

నైవ కించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ జిఘ్ర న్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8

ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిష న్నపి ।
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ 9

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా ॥ 10

కాయేన మనసా బుద్ధ్యా కేవలై రింద్రియై రపి ।
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాఽఽత్మ శుద్ధయే ॥ 11

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ 12

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥ 13

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14

నాదత్తే కస్యచి త్పాపం నచైవ సుకృతం విభుః ।
అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥ 15

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః ।
తేషా మాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 16

దద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణా ।
గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూత కల్మషాః ॥ 17

విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ 18

ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః ॥ 19

న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజే త్ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధి రసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః ॥ 20

బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మ యోగయుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే ॥ 21

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥ 22

శక్నో తీహైవ యస్సోఢుం ప్రాక్ శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥　　23

యోఽంతఃసుఖో ఽంతరారామ స్తథాంతర్జ్యోతి రేవ యః ।
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥　　24

లభంతే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః ।
ఛిన్న ద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥　　25

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥　　26

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాం శ్చక్షుశ్చై వాంతరే భ్రువో ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥　　27

యతేంద్రియ మనోబుద్ధి ర్మని ర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥　　28

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి ॥　　29

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*కర్మసన్న్యాస యోగోనామ పంచమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 5

# సన్న్యాసము - యోగము

**1. అర్జునుడు :** నీవు కర్మలను సన్న్యసించుటను గూర్చి తెలిపితివి. బుద్ధితో కర్మను యోగముచేసి ఆచరించుటయు తెలిపితివి. ఈ రెండింటిలో నాకేది శ్రేయస్సో నిర్ణయించి, యొకే మార్గమును నియమింపుము.

**2. శ్రీకృష్ణుడు :** సన్న్యాసము, కర్మయోగము రెండును శ్రేయస్సును గూర్చునవియే. కర్మలను సన్న్యసించుటకన్న కర్మయోగమే యెక్కువ శ్రేష్ఠమైనది.

**3.** సన్న్యాసమునకు రాగద్వేషములు లేకుండుట చాలును. ఆచరణము విడచిపెట్టకయే సన్న్యాసమబ్బును, బంధమోచనమును కలుగును.

**4.** నేను బోధించినది కర్మ ఫలములను, ఆసక్తిని సన్యసించుటయు కర్మల నాచరించుటయు తప్ప రెండు విషయములు బోధింపలేదు. సాంఖ్యమున, అనగా జ్ఞాన మార్గమున, ఫలాసక్తిని సన్యసించుట యొకటియు, బుద్ధితో కర్మల నాచరించుటయు రెండు భిన్నాంశములుగా నవగతము జేసికొనుట కుఱ్ఱతనమును తెలియజేయును. ఫలములను విడచుట, పనులను చేయుట ఒకటియేగాని రెండు కావు. ముఖ్యమైనది స్వీకరించుట, అముఖ్యమైనది విడచుట రెండంశము లెట్లగును? తెలియనివారు జ్ఞానయోగ మనియు, కర్మయోగ మనియు రెండు మతములుగా పెనగులాడు చున్నారు. ఒకదానిని ప్రారంభించుట యనగా రెండవది యాచరించుటయే యగును. బియ్యము బెడ్డలు కలిసియుండగా బెడ్డలను తొలగించుటయు, బియ్యము స్వీకరించుటయు రెండు పనులగునా? బెడ్డల నేరి పారవేయవలెనా, బియ్యము నేరి స్వీకరింప వలెనా యని సిద్ధాంతము చేయుట కాలమును వ్యర్థము చేసుకొనుటయే. ఒకటి యారంభింపుము – రెండవది జరుగును.

**5.** జ్ఞాన మార్జించుటకు ప్రారంభించినవా రే స్థితిని పొందుచున్నారో కర్మయోగ మారంభించిన వారును ఆ స్థితినే పొందుచున్నారు. సాంఖ్య మనబడు జ్ఞానమును, కర్మయోగ మార్గమును ఒకటిగా చూచినవాడే దర్శించినవాడు.

**6.** కర్మయోగము లేని ఫల సన్న్యాసము, జ్ఞాన సముపార్జన ప్రయత్నము దుఃఖమునే కలిగించును. వంటచేయు విధానము నేర్పుటలో వంట చేసుకొనుటకు తీరికలేనివా డాకలితో చనిపోవును. చాలమంది సుఖముకోరి చేయు ధనార్జన ప్రయత్నమున తీరుబడిలేక సుఖమును గోల్పోవుచు చివరను సుఖించుటకు కాలము చాలక చచ్చుచున్నారు. అట్లుకాక కర్మయోగ మారంభించినవాడు ఫలముల యెడల, బాంధవ్యాది వ్యామోహముల యెడల మౌనము వహించి ముక్తుడై బ్రహ్మానందము ననుభవించు చున్నాడు. సిద్ధాంతములు చేయువారు జ్ఞాను లెట్లగుదురు?

**7.** కర్మయోగము నారంభించుట వలన నింద్రియములు, మనస్సు సంస్కరింపబడి పరిశుద్ధమగును. సత్కర్మాచరణము తప్ప పరిశుద్ధికి వేరు మార్గములేదు. స్త్రీ వాంఛ పశుత్వ స్థితిలో నున్నవాడు వైరాగ్యమును గూర్చి జపించి తప్పించుకొనలేడు. రోగులైన స్త్రీలకు నుపచారము చేయుటలో నిమగ్నుడైనచో ఘోరదృశ్యముల వలన మనస్సు పరిశుద్ధియై అతడే కామమున కతీతుడు కాగలడు. ఇట్టి సత్కర్మ ప్రయోగమునందు సోమరితనము వహించినచో వేదాంతము చెప్పి లోకమును మోసము చేయుట కలవాటు పడును. కనుక సత్కర్మాచరణమున మనస్సు శుద్ధి చేసుకొనవలెను. శుద్ధియైన మనస్సు తానగును. మనస్సుగా నుండుట మాని బుద్ధిగా తాను మారును. తాను నేనుగా మారును. 'నేను' సర్వాంతర్యామిత్వము నందును. అట్టివాడే సర్వజీవులలో నున్న నేనుగా, అనగా పరబ్రహ్మముగా నిలుచును. అతడు చేయు పనులేవియు అతని నంటవు. రోగార్తయైన స్త్రీ శరీరమును నగ్నముగా చూచినను సాధకు నకు కలుగునది వైరాగ్యమేగాని కామము కాదు.

**8.** ఇట్లు కర్మయోగ మభ్యసించినవాడు యజ్ఞార్థకర్మ అనగా పరోపకారము నాచరించుచున్నాడు. చూచుట, వినుట, తినుట, వచ్చుట, పోవుట మున్నగు వ్యాపారములు అతడు చేయుట వేరు, మరియొకడు చేయుట వేరు. కామి కూడ కంటితోనే స్త్రీని చూచుచున్నాడు. రోగియైన స్త్రీని వైద్యసాధకుడు కూడ కంటితోనే చూచుచున్నాడు. భర్తగా భార్యను స్పృశించిన చేతులతోనే తండ్రిగా పుత్రికను స్పృశించుచున్నాడు. రెండు స్పర్శలు నొక్కటి యగునా? తండ్రి పుత్రికను స్పృశించినట్లు కర్మయోగి కర్మల నాచరించును. అందు కామము

లేదు. కనుక స్పర్శలేదు. అట్లే కర్మయోగికి కర్మ లేదు. ఆచరించుటకు ధర్మ మున్నది. కాని యంటు కొనుటకు కర్మ లేదు.

**9.** అతడు మాటలాడినను, యిచ్చినను, స్వీకరించినను నేమని తలచు చున్నాడు? ఇంద్రియములు వాని లక్ష్యముల యెడ ప్రవర్తించు చున్నవని చూచుచు తాను ప్రవర్తింపకున్నాడు.

**10.** అట్లే సర్వకర్మలను సర్వాంతర్యామి యందు చూచుచుండును. కాలు, సేతులు, కన్ను, చెవి, మనస్సు పనులు చేయుచుండును. తనకే పాప పుణ్యము లంటవు. నీటిబొట్టు తామరాకుపై నున్నను దాని నంటుట లేదు. అట్లే యోగి కర్మ లాచరించుచున్నను అంటుట లేదు.

**11.** ఈ విధముగానే దేహముతో, నింద్రియములతో, మనస్సుతో, బుద్ధితో యోగులు సర్వకర్మల నాచరించుచున్నారు. పలుగుతో రాళ్ళు కొట్టువాని చేతికి రాయి యేల తగులవలెను? అట్లే కంటితో చూచుట జరుపువానికి చూచిన వస్తువేల యంటవలెను?

**12.** ఈ క్రమమున యోగి కర్మఫలమును విడిచి తనయందు తా నుండుట వలన శాంతి పొందుచున్నాడు. వాహనమున ప్రయాణము చేయువాని పాదములకును, చేసిన ప్రయాణములోని మైళ్ళ దూరమునకును సంబంధమేమి? అట్లుకాక వాహన మాగినపుడెల్ల ఆత్రముతో ప్రయాణమును త్వరగా పూర్తిచేయ నెంచి దిగి పరుగెత్తుచున్న వానికి పాదములకును, మైళ్ళకును సంబంధ మేర్పడును. అట్లే యోగి కానివాడు చేయు పనులతో పనులకు సంబంధించిన ఆతురత, కార్యభంగము నంటుకొనును.

**13.** సర్వకర్మలను మనస్సుతో సన్న్యసించి బుద్ధితో యోగము చేయ వలెను. అట్టివాడు తన అవయవములు పనిచేయు చుండగా తొమ్మిది ద్వారముల పట్టణమునందువలె దేహమున గూర్చుండి చూచుచుండును. అతడు పనులు చేయడు సరికదా ఇంద్రియములచే చేయించుటయు లేదు. ఇంద్రియములు అను కూలీలచే చేయించుటకు మనస్సను మేస్త్రి యున్నాడుగదా! తాను కల్పించుకొని వారి నవస్థ పెట్టి రొష్టుపడుట యెందులకు? (తొమ్మిది ద్వారముల పట్టణమనగా నవరంధ్రములుగల శరీరము.)

**14.** నేను చూడు! జీవులలో నుండియే నా అస్తిత్వముచే ప్రభావితముచేసి మనోబుద్ధీంద్రియములచే పనులు చేయించుచున్నాను. ఆజ్ఞాపించుట లేదు గనుక నేను చేయించుటయు లేదు. లాభనష్టములును నావికావు. దేహమున అవయవములు, ఇంద్రియములు, మనస్సునం దెవని స్వభావముతో వాడు ప్రవర్తించు చున్నాడు. పుట్టినవాడు గాలి పీల్చక మానునా? ఆకలి గలిగినవాడు తినక మానునా? లోపలనున్న నాకేమి?

**15, 16.** లోపలనున్న నేను ఒకరికి పాపము నంటగట్టను, ఒకనికి పుణ్యము కట్టి పెట్టను. పదార్థములకు తమ తమ లక్షణము లుండును. వానితో దేహము చేయబడినది. వాని లక్షణములు మనస్సున కంటు చుండుటచే జ్ఞాన మజ్ఞానముచే నావరింపబడును. దాని వలన తెలివి మసక బారును. చెరువులోని నీటికి చెరువు లక్షణ మంటును. నిశ్చలత్వము వలన బురద దిగిపోయి స్వచ్ఛమైన నీరు పైకి తేరును. అట్లే మనస్సు, బుద్ధి, ఆత్మయందు నిశ్చలత్వ మందుట వలన స్వస్వరూప ముదయమగును. సూర్యోదయము కదలని చెరువులో యథాతథముగా ప్రతిబింబించునట్లు యోగిలో 'నేను' స్వరూపమున ప్రకాశింతును.

**17.** 'అది' యని నీవు పిలుచు పదార్థము లన్నియు నా అస్తిత్వముచే నిండి యున్నవి. అట్లే దేహేంద్రియ మనోబుద్ధులును. ఈ స్మరణచే దేహేంద్రియ మనోబుద్ధులతో యోగి పూర్ణముగా నాయందు ప్రవేశించుచున్నాడు. ఈ ప్రవేశమే జ్ఞానము. దానితో అన్యము అనబడు కల్మషము హరించును. అభ్యాసవశమున మరల అన్యములోనికి పుట్టని ఉత్తమగతిని యోగి పొందు చున్నాడు.

**18.** అతడు విద్యావినయ సంపన్నుల యందును, బ్రహ్మ వేత్తలయందు నెట్లు నన్ను చూడవలెనో, అట్లే గోవులయందు, ఏనుగుల యందును, కుక్కల యందును, కుక్క మాంసము తినువారి యందును కూడ నన్నే చూచును. ఇదియే సమదర్శనము. ఇది కలవాడు మాత్రమే పండితుడు. చదువులలోని ఈ మర్మము తెలిసినప్పుడే అవి చదువులు.

**19.** ఈ సమదృష్టియందు ఎవరి మనస్సు నిలుచునో వారికి ఈ సమస్తము స్వర్గమే! దృష్టిదోషము లేని సామ్యమే బ్రహ్మము. నే నన్నిటి

యందును ఇట్లు అంతర్యామిత్వము వహించితిని గనుకనే బ్రహ్మతత్త్వముగా నున్నాను. దీని నభ్యసించిన వారు నాయందుందురు.

**20.** వారికి ప్రియమని లేదు. అది కలిగెనని లేదు. అప్రియమని లేదు. అది కలిగెనని యుద్వేగము లేదు. ఈ ప్రవృత్తి కలిగినప్పుడే స్థిరబుద్ధి యున్నట్లు! అతడా స్థితిలో బ్రహ్మము నెరిగి దాని యందుండును.

**21.** వానికి బాహ్యము, అంతరము అని లేదు గనుక బాహ్యస్పర్శలు లేవు. దానియందు చిక్కుకొనుటలేదు. ఇందలి సుఖానుభూతికి తరిగిపోవుట యుండదు.

**22.** సుఖములు అనునవి లేవు. సుఖ మొక్కటే యున్నది. ఒక్కొక్క ఇంద్రియమను ద్వారము నుండి సుఖమను ఆకాశమును చూచినచో నొక్కొక్క సుఖము వేరుగా కనుపించును. అనేక సుఖము లున్నట్లు భ్రాంతి కలుగును. గవాక్షము నుండి ఆకాశమును చూచుట యనగా గవాక్షము యొక్క ఆకారము చూచుటయే! అట్లే ఇంద్రియ సుఖము లనుభవించుట యనగా ఇంద్రియ ప్రవృత్తి ననుభవించుచు, దూరమున కనుపించు సుఖమును చూచుచుండుటయే. ఇంతలో నింద్రియములకు, దేహమునకు కరగుట, తరగుట, అలసట చెందుట, రుగ్మత చెందుట యుండును. కనుక వానియందు చిక్కుకొనిన తన కవి సంక్రమించును. సుఖము ననుభవించుచు దుఃఖము పొందుట జరుగును. అద్దములో చక్కెర ప్రతిబింబమును చూచి, అద్దమును నాకినచో, బ్రద్దలై యుండిన అది గ్రుచ్చుకొనును. సుఖములకై యింద్రియముల నాశ్రయించి వానిలో కాపురము పెట్టినచో వాని రోగము, నొప్పి, ముసలితనము తనకు సంక్రమించును. గవాక్షము నుండి కనుపించు నాకాశమువలె ఇంద్రియ ముల నుండి ఆనందించు సుఖములు, ఆది, యంతము, పరిమితి కలవి. ఇంటికి వెలుపల ఆకాశమున్నది. అది ఇల్లు కట్టకముందు నుండి యున్నది. దీనిని జ్ఞప్తి గొనినవాడు రాత్రి నక్షత్ర పరిశీలనము చేయదలచినచో గవాక్షము నుండి చూడక వెలుపలకు వచ్చి చూచును. అట్లే బుద్ధిమంతుడైన యోగి సుఖము ననుభవించుటకై ఇంద్రియములను వదలి తనయందు తాను సుఖించును.

**23.** ఈ సాధన శరీరమును విడిచిన వెనుక జరుగదు. ఇంద్రియములను దాటి వర్తించు సాధన ఇంద్రియములతోనే చేయవలెను. వెలుగును గూర్చిన గ్రంథమును చదువవలె నన్నచో వెలుగులోనే చదువవలెను. కర్మయోగము కర్మాచరణముతోనే అబ్బవలెను. దేహేంద్రియ మనోబుద్ధుల నిలయమే విద్యా లయము. కామక్రోధముల వేగము దాటగోరినవాడు కామక్రోధములు పుట్టుచోటనే యభ్యసింపవలెను. దేహమును విడిచి యుత్తమలోకములు పొందుదురనుట భ్రాంతి. నావలో సముద్రయానము చేయుచున్నవాడు తన మనస్సు నావకన్న ముందు పరుగిడుచుండగా, నావను ముంచి యానమును పూర్తిచేయుదునని అనుకొనుట వినాశ హేతువు.

**24.** కనుక సుఖమనగా తానే, విశ్రాంతి యనగా తానే! విశ్రాంతి లేనివాడు విలాస ప్రదేశములలో విశ్రాంతి లభించు ననుకొనుట భ్రాంతి. అచ్చటికి బోయినను విశ్రాంతి చెందవలసినవాడు తానేగదా! నిద్రను గూర్చి శాస్త్రపరిశీలన చేసినచో నిద్రా భంగమగును. అట్లే శాంతిని గూర్చి ప్రయత్నింపక శాంతిగ నుండవలెను. ఈ సుళువు తెలిసినవాడే యోగి. అతని ఆత్మ విస్మృతియే నిర్వాణము లేక మోక్షము. నిర్యాణము నిర్వాణము గానేరదు. ఋణదాతల నుండి తప్పించుకొనచూచుట ఋణవిమోచన మార్గము కాదు.

**25.** తన వెలుగునందు తనకన్న రెండవ వస్తువున్నదను చీకటిని తొలగించుకొనిన వారు సర్వకల్మషములు తొలగినవారు. వారు సర్వజీవుల హితము నందును సంకల్పమును లీనము చేసి యుందురు. వారికే బ్రహ్మము నందు నిర్వాణము అను స్థితి అందును.

**26.** 'తాను' అనగా 'నేను' అని యెరిగినవారు బ్రహ్మ నిర్వాణము చెందిన వారు. వారియందు ఇంద్రియములు, మనస్సు మున్నగునవి 'నా' లోని దళములుగా నమరియుండును గనుక కామక్రోధములకు తావుండదు.

**27.** దీనిని సాధించు మార్గమును అనగా నభ్యాసమును తెలిపెదను. నీలోనున్న నన్ను గూర్చి యాలోచించుము. మనస్సు నావైపునకు మ్రొగ్గును. అప్పుడు బాహ్యస్పర్శలు మాయమగును. మనస్సుతో కనుబొమల నడిమి లోపలి భాగమును చూడుము. 'నేను' అని ధ్యానింపుము. మనస్సు 'నా'

యందు లగ్నమగును. అట్లుకాక చాంచల్య మున్నచో ఉచ్ఛ్వాస నిశ్వాసములపైకి మనస్సును మరల్చుము. గాలిని లోపలి కాకర్షించుట, బయటకు వికర్షించుట యను శక్తులు ఉచ్ఛ్వాస నిశ్వాసములకు కారణములు. ఆ శక్తులే ప్రాణాపానములు. గాలిని పీల్చుచు నాసాగ్రమును స్మరింపుము. పీల్చబడుచున్న గాలివెంట మనస్సు రూపమున గుండెలలోనికి రమ్ము. గాలిని నిశ్వసించుచు హృదయమున నున్న నన్ను ధ్యానింపుము. గాలివెంట హృదయము నుండి మనస్సుతో నాసాగ్రమునకు రమ్ము, ఇంతలో మనస్సు, ప్రాణాపాన శక్తులు నేకమగును. శ్వాస యాగిపోవును. గాలి మాత్రము నాసారంధ్రముల నుండి కావలసినది లోనికిబోవుచు అక్కరలేనిది వెలికి వచ్చుచుండును. ఇది ప్రాణాయామము.

**28.** దీనితో సామ్యమేర్పడును. ఈ సామ్యము ప్రాణాపానములకు, మనః ప్రాణములకు నడుమ నేర్పడును. మనోబుద్ధులకు, బుధ్యాత్మలకు నడుమ కూడ నేర్పడును. ఈ సమత్వమే యోగము. లీనమైన మనస్సుతో నింద్రియ ప్రవృత్తులు కూడ కరిగిపోవును. క్రమముగా బుద్ధికూడ 'నా' లో లీనమగును. ఇదియే ప్రవృత్తుల మౌనము. అది కలవాడే ముని. భయము, ఇచ్ఛ, క్రోధము నిలుచుటకు మనస్సు లేదు గదా! తానుండును. అతడే ముక్తుడు. అభ్యాస స్థితిలో దీని నొకచోట కూర్చుండి సాధన చేయవలెను.

**29.** అటుపైన తిరుగుచున్నను ఈ స్థితి నిలుచును. మనస్సుండక తానుండును. పనులు జరుగుచుండును. తాను చేయదు. చేసిన పనియెల్ల యజ్ఞమై, తాను యజ్ఞభోక్త యగును. ప్రవృత్తి యెల్ల 'తపస్సై' 'తాను' తపస్సునకు గమ్యమగును. ఈ 'తానే' సర్వలోక మహేశ్వరుడు. సర్వజీవులకు హృదయము నందున్న మిత్రుడు. ఈ స్థితియే శాంతి. అతడే 'నేను'.

షష్ఠోఽ ధ్యాయః ।

# ధ్యాన యోగః ।

*శ్రీభగవా నువాచ :*

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।
స సన్న్యాసీ చ యోగీచ న నిరగ్ని ర్న చాక్రియః ॥ 1

యం సన్న్యాస మితి ప్రాహు ర్యోగం తం విద్ధి పాండవ ।
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ॥ 2

ఆరురుక్షో ర్మునే ర్యోగం కర్మకారణ ముచ్యతే ।
యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే ॥ 3

యదా హి చేంద్రియార్థేషు న కర్మ స్వనుషజ్జతే ।
సర్వసంకల్ప సన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే ॥ 4

ఉద్ధ రేదాత్మనఽ ఽ త్మానాం నాత్మాన మవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపు రాత్మనః ॥ 5

బంధు రాత్మాఽ ఽ త్మన స్తస్య యేనాత్మైవాత్మనా జితః ।
అనాత్మనస్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్ ॥ 6

జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥ 7

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః ॥ 8

సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్యబంధుషు ।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే ॥ 9

యోగీ యుంజీత సతత మాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥ 10

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః ।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్ ॥ 11

తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।
ఉపవిశ్యాసనే యుంజ్యా ద్యోగ మాత్మవిశుద్ధయే ॥ 12

సమం కాయ శిరో గ్రీవం ధారయ న్న చలం స్థిరః ।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చా నవలోకయన్ ॥ 13

ప్రశాంతాత్మా విగతభీ ర్బ్రహ్మచారివ్రతే స్థితః ।
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥ 14

యుంజన్నేవం సదాऽఽత్మానం యోగీ నియతమానసః ।
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి ॥ 15

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చై కాంత మనశ్నతః ।
న చాతిస్వప్న శీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ 16

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నా వబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 17

యదా వినియతం చిత్తమాత్మన్యే వావతిష్ఠతే ।
నిస్పృహ స్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥ 18

యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।
యోగినో యతచిత్తస్య యుంజతో యోగ మాత్మనః ॥ 19

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।
యత్రచై వాత్మనాऽఽత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥ 20

సుఖ మత్యంతికం యత్త ద్బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్ ।
వేత్తి యత్ర న చైవాయం స్థిత శ్చలతి తత్త్వతః ॥ 21

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥ 22

తం విద్యా ద్దుఃఖసంయోగ వియోగం  యోగసంజ్ఞితమ్ ।
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణ చేతసా ॥ 23

సంకల్ప ప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వా నశేషతః ।
మనసై వేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥ 24

శనైః శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతి గ్రహీతయా ।
ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥ 25

యతో యతో నిశ్చరతి మన శ్చంచల మస్థిరమ్ ।
తతస్తతో నియమ్యై దాత్మన్యేవ వశం నయేత్ ॥ 26

ప్రశాంత మనసం  హ్యేనం యోగినం సుఖ ముత్తమమ్ ।
ఉపైతి శాంత రజసం బ్రహ్మభూత మకల్మషమ్ ॥ 27

యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ విగతకల్మషః ।
సుఖేన బ్రహ్మసంస్పర్శ మత్యంతం సుఖ మశ్నుతే ॥ 28

సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 30

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 31

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32

అర్జున ఉవాచ :

యోఽయం యోగస్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన ।
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥ 33

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవ ద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయో రివ సుదుష్కరమ్ ॥ **34**

*శ్రీభగవా నువాచ :*

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్య తే ॥ **35**

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తు ముపాయతః ॥ **36**

*అర్జున ఉవాచ :*

అయతి శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః ।
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥ **37**

కచ్చిన్నో భయవిభ్రష్ట శ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥ **38**

ఏతం మే సంశయం కృష్ణ ఛేత్తు మర్హ స్యశేషతః ।
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥ **39**

*శ్రీభగవా నువాచ :*

పార్థ నై వేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే ।
న హి కల్యాణకృ త్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ॥ **40**

ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీః సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥ **41**

అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥ **42**

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికమ్ ।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥ **43**

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।
జిజ్ఞాసు రపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥ **44**

ప్రయత్నా ద్యతమానసు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేకజన్మ సంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్ ॥ **45**

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున ॥ **46**

యోగినా మపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥ **47**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*ధ్యానయోగో నామ షష్ఠోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - *6*

# యోగాభ్యాసము

**1. *శ్రీకృష్ణుడు :*** ఫలముల నాశ్రయింపక చేయవలసిన పనులను చేయువాడే సన్న్యాసియు, యోగియు నగును. అతడు ఫలములను విడుచుటచే సన్న్యాసి, కర్మ నాచరించుటచే యోగి. వేదోక్త కర్మలలోని అగ్నిహోత్రములను విడిచినవాడు సన్న్యాసి యని కొందరు భ్రాంతి పడుదురు. కర్మలను విడిచినవాడు సన్న్యాసియని కొందరు గర్వపడుదురు. ఈ రెండును పతన హేతువు లగును.

**2.** కొందరు దేనిని సన్న్యాస మనిరో, మరికొందరు దానినే యోగమనుచున్నారు. సంకల్పములను సన్న్యసింపనివాడు కర్మల యందు యోగి యెట్లు కాగలడు?

**3.** యోగస్థితికై కర్మాచరణము సాధనము. యోగస్థితిలో కర్మాచరణము అనుభూతి. అందు మొదటి దానికి కర్మ కారణ మగుచున్నది. రెండవ దానికి శమము లేక అనుభూతి కారణ మగుచున్నది. గుఱ్ఱములను తోలుట నభ్యాసము చేయువాడు కళ్లెములను పట్టును. అభ్యాసమైన వెనుక కళ్లెములను సన్న్యసించునా? తొలుత పట్టినది అభ్యాసమునకు; పిదప పట్టినది నడిపించుటకు. వైరాగ్యము కలుగుటకు సత్కర్మాచరణము చేసినవాడు, విరాగియైన వెనుక కర్మలను మానవలెననుట అజ్ఞానము. ఏ సత్కర్మలతో జ్ఞానము కలిగెనో వాని యాచరణమే జ్ఞానిగా నుండుటకు కూడ కారణము. మానినచో మొదటి స్థితిలోనికి పతనము నందును. కండలు పెంచగోరి వ్యాయామము చేసినవాడు కండలు పెరిగిన వెనుక వ్యాయామము మానినచో స్థూలశరీరుడై రోగి యగుచున్నాడు.

**4.** అభ్యాస మగునప్పటికి కర్మాచరణమునందు ఇంద్రియార్థము లంటుట మానును. సంకల్పముల సన్న్యాసము సిద్ధించును. అట్టివాడు యోగపదవి నారోహించెనని చెప్పవలెను.

**5.** ఈ విధముగా ఇంద్రియార్థములు, ఇంద్రియములు, మనస్సు తనకన్న వేరుగా కలవర పెట్టుచున్న స్థితి నుండి వానిని తానుగా తనలోని కుద్ధరించుకొనుట యోగము. ఇంద్రియాదుల లోనికి తాను ముక్కలుగా

దిగివచ్చి వర్తించుట ఆత్మవినాశము. తన్ను తాను తన లోనికి నుద్ధరించు కొనువాడు తనకు బంధువు. తన్ను ఇంద్రియాదులలోనికి కోల్పోవువాడు తనకు శత్రువు.

**6.** ఆత్మ యను పదమునకు 'తాను' అని అర్థము. దేహేంద్రియ మనో బుద్ధులలో నొక్కొక్క దానికే ఆత్మయని పేరున్నది. వాని కతీతుడుగా లోనున్నవాడు స్వచ్ఛమైన లేక నిజస్వరూపమైన ఆత్మ. వానిచే మిగిలిన ఆత్మలు చేయింప బడినప్పుడు వానికతడు బంధువగును. కానప్పుడు వానికీ యాత్మలు శత్రువు లగును. అట్టి వానికి ఇంటిలో శత్రువు లున్నట్లే.

**7.** జయింపబడిన దేహాది భాగము లాత్మగా గలవాడు ప్రశాంతుడు. వానిలో పరమైన ఆత్మ 'నేను'. అట్టి ఆత్మ కతడు సన్నిహితుడగును. అతనికి శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానావ మానములు తనలోని భాగము లగును.

**8.** 'తన' వెలుగు జ్ఞానము. దేహేంద్రియ మనోబుద్ధ్యహంకారములు, పంచభూతాదుల తెలివి విజ్ఞానము. విజ్ఞానము జ్ఞానములోని భాగమైనప్పుడు తృప్తి యనుభూతి యగును. వానిలో నున్న ప్రజ్ఞ నిశ్చలమగును. చేష్టాదులున్నను అవి నిశ్చలత్వమున పర్యవసానము చెందుచుండును. అట్టివానికి మన్ను, రాయి, బంగారము నొక్కటియే. అందున్నది 'తాను' లేక భగవంతుడు.

**9.** మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు, మధ్యస్థులు, బంధువులు అనబడు వారిలోకి అస్తిత్వము తానే కనుక సమదృష్టి యుండును. మంచివారి యందును, చెడ్డవారి యందును, తానే దర్శన మగును. ఇదియే సత్యమైన సమదృష్టి.

**10.** యోగాభ్యాసము చేయువాడు రహస్య స్థానమున నొంటరిగా నుండవలెను. ఏమియు భుజింపకుండవలెను. భార్య మున్నగు బంధము లుండరాదు. ఈ శ్లోకము వ్యాసఘట్టము పొడుపుకథ వంటిది. రహస్య స్థానము అనగా నెవ్వరికిని వింతగా తన చేష్టలలో, ప్రవర్తనలో దొరకకుండునట్లు ఇతరుల నడుమ నెవరి సన్నిధిలో వారితో సహజస్థితిలో లీనమై యుండుట. ఏకాకి యనగా 'నేను' అను ప్రజ్ఞగా నుండుట. 'నేను' అను తత్త్వమునకు

ఏకత్వమేగాని బహుత్వము సాధ్యము కాదు. తినకుండుట అనగా అనుభవముల యందు అంటకుండుట, జిహ్వా ద్వారమున మనస్సునకు రుచినిచ్చి, ఆకలికి జీర్ణకోశమున కన్న మిచ్చి తానేమియు తినకుండవలెను. భార్య మున్నగు బంధము లుండరాదనగా భార్యయందు భార్యా బుద్ధియను ప్రత్యేక మమకారము అంతమై, తాను నిండియుండుట. ఇట్టి యభ్యాసమే యోగాభ్యాసము.

**11.** సాధకుడు శుచియగు దేశమున స్థిరమైన ఆసనమున కూర్చుండ వలెను. ఆసనము మిక్కిలి యెత్తుగాని, మిక్కిలి లోతుగాని యుండరాదు. శుచియగు దేశము అనగా శుచియగు భావము. అదియే తనకు సరియగు ప్రదేశము. అప్పుడే పరిసరముల పరిశుభ్రత కూడ సహాయపడును. ఆత్మకు స్థిరమైన ఆసనము అనగా 'నేను' అను భావమునందు శరీరాదులు స్థిరముగా లీనము కావలెను. అప్పుడే భౌతికమైన ఆసనము స్థిరముగను, సుఖముగను వుండుటకు సహాయ పడును. కన్నులు మూసినను తెరచినను పరిసరములతో నుచ్చ నీచ భావము లుండరాదు. అనగా నితర జీవుల పైనను వస్తువుల పైనను గొప్ప, తక్కువ యను భావములు 'నేను' అను భావమున లీనము కావలెను. అప్పుడు భౌతికాసనము వస్త్రమైనను, చర్మమైనను, దర్భాసనమైనను ఉపకరించును.

**12.** తనలో 'నేను' భావమును పట్టుకొనుటకు మనస్సునకు 'అక్కడ' అను నిర్దేశము చూపవలెను. హృదయమును జూపి, "అక్కడ నే నున్నాను" అని నిర్దేశించుకొనుచు మనస్సు ఆత్మలో లీనమగునట్లు మెలగవలెను.

బాహ్య వస్తువుల నామ రూపాదులను అభినయించు మనస్సే చిత్తము. దానియందు ఇంద్రియ ప్రవృత్తులుండును. గనుక దానిని 'నా' యందు నియమము చేయవలెను. తన యందు తాను కూర్చుండవలెను. ఇదియే ఆసన శుద్ధి. ఇట్టి యోగాభ్యాసము ఆత్మశుద్ధి కలిగించును. అనగా తన నుండి వర్తించుచున్న భాగములను 'తానుగా' మార్చును.

**13.** శిరస్సు, మెడ, వెన్ను సూటిగా నూర్ధ్వముగా నుండునట్లు కూర్చుండవలెను. అట్లు కూర్చుండుటలో నే భాగమును బిగించరాదు. శరీర భాగముల బిగింపు అనగా మనస్సు బిగింపే. అట్లు కూర్చుండి, "నే

నూర్ధ్వముగా నుంటిని" అని స్మరింపవలెను. మానవుని వెన్నెముక యూర్ధ్వము. అందు మూలాధారమున పృథివీతత్త్వ ప్రజ్ఞ యున్నది. క్రమముగా నూర్ధ్వమునకు జలము, అగ్ని, వాయువు, ఆకాశము అను తత్త్వముల ప్రజ్ఞలు వెన్నెముకలో నుండి పనిచేయుచున్నవి. వానికి పైన భ్రూమధ్యమున మనస్సు అను తత్త్వ ప్రజ్ఞ పనిచేయును. శీర్షముపైన సూర్యుని వెలుగులోనున్న తత్త్వ ప్రజ్ఞ పని చేయును. కనుక వెన్నెముక మానవునకు భూమి నుండి సూర్యుని వరకు నిలువైన నిచ్చెన. దానిలో నుండి ఇన్ని తత్త్వముల ప్రజ్ఞలుగా 'నేను' పని చేయు చుండును. ఈ యూర్ధ్వ సాధనమున, అనగా ఊర్ధ్వత్వ సంస్మరణమున, 'నేను' నందు ఇన్ని ప్రజ్ఞలు అఖండత్వమంది యోగ మేర్పడును.

సాధనలో దిక్కులు చూడరాదు. మనస్సుతో కూడ చూడరాదు. శ్వాసను స్మరించునపుడు నాసికాగ్రమును స్మరింపవలెను. అచ్చటినుండి శ్వాసతో లోనికి పోవుట, వచ్చుటలతో ప్రాణాయామ మేర్పడును. మనస్సు శ్వాస యందు నిలుచుటలో ప్రత్యాహార మేర్పడును. మనశ్శ్వాస లేక మగుటతో ధారణ మేర్పడును. బాహ్యము, అంతరము అను ప్రజ్ఞలు కరగి కలిసిపోవుటతో అంతర్యామిత్వ మేర్పడును. ఇదియే ధ్యానస్థితి. ఆ స్థితిలో సర్వకార్యము లాచరింపబడుటలో సమాధిస్థితి యేర్పడును.

**14.** ఈ స్థితిలో ప్రశాంతమైన ఆత్మస్థితి యుండును. తానుతప్ప వేరు లేకుండుట భయకారణము లేదు. ఇదియే అభయస్థితి. అందలి 'నేను' సర్వము నందలి 'నేను' లో చరించును. ఇదియే బ్రహ్మ యందు చరించుట లేక బ్రహ్మచర్యము. కొందరు బ్రహ్మచర్య మనగా స్త్రీ సాంగత్యము లేకుండుట యని చెప్పుదురు. పురుషునిలో స్త్రీని గూర్చిన అభిప్రాయముగా స్త్రీ యెప్పుడును నివసించి యుండును. ఈ భేదము లేనిచో స్త్రీ సాంగత్యము కూడదను నియమ మేల పుట్టును? హృదయములోని స్త్రీభావ భేదము 'నాయందు' కరగిపోవుటయే స్త్రీ సాంగత్యము లేకుండుట. అదియే బ్రహ్మచర్యము. ఇట్లు చిత్తము నేనయిపోయి మనస్సు మున్నగునవి లయమందును. అట్టి వాడే మత్పరుడగు యోగి.

**15.** ఇట్టి సాధనలో అన్ని యంశములను తనలోనికి యోగము చేసి, యోగి నిర్వాణ మనబడు 'నా' సాన్నిధ్య మనుభవించును.

**16.** అన్నపానీయములను గ్రోలకుండుట యోగము కాదు. రుచికొరకు ఎక్కువ స్వీకరించుట యోగము కాదు. ఆకలి ననుసరించి రుచిగా భుజించుట యోగము. ఎక్కువగా నిద్రింపరాదు. ఎక్కువగా మేల్కొనరాదు. దేహ ధర్మమును బట్టి, ప్రయోజనమును అనుభూతిని అనుసరించి నిద్రను సామ్యము చేయవలెను.

కర్మల నాచరింపకుండుట యోగము కాదు. ఫలములకై యాచరించుట యోగము కాదు. జిహ్వాదులను అనుభవింప నీయకుండుట యోగము కాదు. వానిలో దూరి తాను అనుభవించుటయు యోగము కాదు.

**17.** యోగమునకు అనువగు ఆహారము, విహారము, చేష్టలు, కర్మలు యుక్తము లనబడును. అట్లే నిద్ర, మెలకువ యుక్తములు కావలెను. యోగికి దేహేంద్రియ మనస్సులందు మెలకువ, వానికి తనయందు నిద్ర, 'నా' యందు నిద్ర మెలకువలు కలుగవలెను. ఇది దుఃఖహరమైన యోగము.

**18.** ఇట్లు విశేషముగా నియమింపబడిన చిత్తము యోగిలోని 'నా' యందు నిలబడును. సర్వకామముల యందును స్మరణ లేకుండుట యేర్పడును.

**19.** దీపజ్యోతికి వీచుచున్న గాలివైపునకు ఆకారము వంగును. యోగి కాని వానికి ఇంద్రియాది కర్మల వైపునకు ప్రజ్ఞ వంగును. గాలి వీచునప్పుడు దీపమునకు ఊర్ధ్వ జ్యోతియగు స్వరూప మేర్పడును. ఇది స్వస్వరూపము. అట్లే యోగికి తనయందు సమస్త ప్రజ్ఞలకు స్వస్వరూప మేర్పడును.

**20.** ఇట్టి యోగ సేవచే చిత్తము ఎచ్చట పరిపూర్ణముగా, సాన్నిధ్యముగా రమించు చున్నది? రమించుట మానుటయే 'నా' యందు రమించుట. తన యందు తన్ను తా నెచ్చట చూచుకొను చున్నాడు? చూచుట మాని చూపు అగుటయే అచ్చటి స్థితి. యోగి అందు తుష్టి గొనును.

**21.** సుఖము లన్నియు సుఖమునందు ఎచ్చట లీనమైనవి? సుఖములు అను జ్ఞప్తిలేని స్థితియే ఆ సుఖము. ఇది బుద్ధికే తెలియును. ఇంద్రియముల కందదు. ఇంద్రియముల ద్వారమున సుఖపడుటయనగా ఇంద్రియములలో నుండి సుఖము అగు స్మరణతో దిక్కులు చూచుట. సుఖస్మరణము సుఖమునకు శవము వంటిది.

అట్టి స్థితిలో సాధకుడు దేనిని తెలిసికొనుచున్నాడు? తెలిసికొనుట యను భావము కరగిపోయిన స్థితియే అప్పటి తెలిసికొనుట. కనుక చలన ముండని 'తాను' అను తత్త్వమే అప్పటి యనుభూతి.

**22.** మనస్సునకు తెలిసినకొనవలెనను కుతూహలము సహజము. కనుకనే ఒక యంశమును తెలిసికొంటినను నభిప్రాయమును పొందిన వెనుక మరియెక అంశమును తెలిసికొనవలెనను చాంచల్యమున్నది. యోగస్థితిలో మనస్సు బుద్ధిలోనికి కరిగిపోయినది కనుక, మరి తెలియవలసిన జ్ఞానము మిగులదు. పొందవలసిన భావము మిగులదు. "ఇంతకన్న గొప్పది" యను నభిప్రాయము నశించును. కనుక నిట్టి యనుభూతికన్న గొప్పదేదియు లేదు. అందున్న వానిని బలీయములైన దుఃఖకారణములు కూడ కదలించలేవు.

**23.** అట్టి యోగమే దుఃఖసంయోగము, వియోగము అను వాని కతీతము. అనగా సన్నివేశములు జరుగుచున్నను వాని ప్రభావము లేదు గనుక అవియు వానియందు లేవు. అదివరకు సన్నివేశములయందు వర్తించు చున్న చిత్తము బుద్ధియందు నిశ్చేష్టమగును.

**24.** సాధనలో ప్రాథమిక స్థితి యందు ఊరక కూర్చున్నను సంకల్ప ములు కలుగుచుండును. వానివెంట కామక్రోధములు కలుగుచుండును. కలిగినపుడెల్ల 'నన్ను' స్మరించుటవలన మనస్సు నా యందు లీనమగుటతో సంకల్పాదులును మాయమగు చుండును. ఇట్లు నియమము చేయవలెను.

**25.** నన్ను తప్ప నితరమును గూర్చి చింతింపకుండుట నభ్యాసము చేయవలెను. సంకల్పములు కలుగుచున్నవని అధైర్యపడరాదు. కలిగినన్ని మారులు మరల మరల నన్నే స్మరింపవలెను. స్మరించుటలో పట్టుదల పనికిరాదు. నిదానముగా స్మరింపవలెను. త్వర పడరాదు. త్వరపడుట యనగా తాను మనస్సుగా దిగివచ్చి సంకల్పముగా ముందు పరువెత్తుట. సాధనయందు సిద్ధి విలంబన మగుచున్నదని భావింపరాదు. విలంబన మనగా రావలసిన కాలమునకు సిద్ధి రాకపోవుట. రావలసిన కాలము అంతకుముందు తాను నిర్ణయించుకొన్నదే గనుక అజ్ఞానము, విలంబనము

రజోగుణము వలన కలిగిన స్వయం కల్పిత భ్రాంతి. ఇట్టి భావములు కలిగినపుడెల్ల నన్ను స్మరించినచో నాయం దుండగలరు.

**26.** దొంగ పారిపోవుచుండగా పట్టుకొని రావలెనన్నచో వానివెంట బరువెత్తవలెను. సాధనలో మనస్సు వివిధ భావములుగా తప్పించుకొని పోవుచున్నప్పుడు క్రీడగా "అదియే నేను" అను భావము మనస్సు వెంట బరువెత్తవలెను. మనస్సు 'నాలో' లీనమగును. ఇక 'నేను' పరువెత్తుట లేదు. మనస్సు చంచలము గనుక పరుగెత్తును. 'నేను' స్థిరము గనుక నాచే వెన్నాడబడి స్పృశింపబడిన మనస్సు 'నేను'గా మారిపోవును.

**27.** ఇట్లు మనస్సు ప్రశాంతము కాగా అనగా మనస్సుగా నుండుట మానగా రజోగుణము శాంతమగును. రజస్సగుట మాని శుద్ధ సత్త్వ మగును. అందలి 'నేను' సర్వాంతర్యామి గనుక కల్మషములేని పరబ్రహ్మము సిద్ధించును.

**28.** ఇట్టి యోగమున తనయందు తాను ఏకత్వము పొందుటలో కల్మషములు మాయమై, బ్రహ్మతత్త్వము స్పృశింపబడి సర్వవ్యాప్త మగును.

**29.** అప్పటి స్థితియే ఆత్మ. సర్వజీవరాసులను అత డాత్మగా దర్శించును. సర్వజీవులలోను ఆత్మను దర్శించును. తనయందు సర్వజీవులను దర్శించును.

**30.** ఈ విధముగా నన్ను సర్వము నందును చూచును. సర్వమును నాయందు చూచును. ఈ 'నేను' వానియం దెన్నడు తరుగను. వాడు నానుండి నశింపడు. నావెంట వచ్చువా డెన్నడు నాశము పొందడు.

**31.** సర్వ జీవులలో నన్ను ఇట్లారాధించుచునే ఏకత్వము నందును. సర్వ విధములుగా ప్రవర్తించుచునే నాయందు యోగిగా నుండును.

**32.** సుఖ దుఃఖముల విషయమున ఇతరులను తనతో సాటిగ చూచును. తన కేది దుఃఖమో అదియే నితరులకు దుఃఖమని ఎరిగి అట్లు ప్రవర్తింపకుండును. తనకేది సుఖమో ఇతరుల కదియే సుఖమని ఎరిగి దానిని సమకూర్చును. ఈ ప్రయత్నమున అప్రయత్నముగ మంచి పనులేవో, చెడ్డపనులేవో తెలియును.

**33. అర్జునుడు :** నీవు చెప్పిన యోగము బాగుగనే యున్నది కానీ ఇది స్థిరముగ నుండునని నా కనిపించుట లేదు. మనస్సు స్థిరముగ నుండదు కదా!

**34.** చంచల స్వభావము గల మనస్సు కవ్వమువలె తిరుగు చుండును. దాని శక్తి బలవత్తరము. అది చేతికందు వస్తువు కాదు కనుక మనస్సును నిగ్రహించుట యని మధురముగ నీవు వర్ణించిన విద్య గాలిని మూట కట్టుట వలె దుర్లభమని తలచుచున్నాను.

**35. శ్రీకృష్ణుడు :** సందేహము లేదు. నీకు బాహుబల మెంత యున్నను మనస్సు నిగ్రహింప రానిదే! కానీ అభ్యాసము వలన అది సాధ్యమగును. ఏ భావము మనస్సున కలిగినను దానిని నిగ్రహించుటకు యత్నింపకుము. అది నేనని భావింపుము, ఆ భావము మాయమగును. కలిగిన భావము నందెల్ల నిట్లే నన్ను స్మరింపుము. కొంతకాలమునకు నన్ను చేరుటయు మనస్సు నే నగుటయు జరుగును. మనస్సును నిగ్రహించుట సాధ్యపడదు. కాని నేనగుట సాధ్యపడును. అట్లే వైరాగ్యము నభ్యసింపుము. అనగా ఫలితములపై వ్యామోహము కలిగినపుడెల్ల నన్ను స్మరించుట వైరాగ్యము. దానితో ఫలితములు సన్యసించి నన్ను చేరుదువు.

**36.** మనస్సు 'నేను' గా మారకున్నప్పుడు మనస్సునది వేరుగ నుండను. దాని నెవ్వడును సంయమింప లేడు. నీటి యావిరిని స్థిరముగ నుంచలేవు. కానీ వేడి తగ్గించి నీరుగా మార్చినచో పాత్రలో స్థిరముగ నుండును. అట్లే మనస్సు లొంగదు. అది నేనుగ మారినచో అప్పుడు స్థిరముగ నుండును. 'నేను' అను భావముచే స్పృశింపబడిన మనస్సు కూడ 'నేను' గా మారును. అయస్కాంతముచే స్పృశింపబడిన ఇనుము అయస్కాంత ముగ వర్తించుచున్నది కదా!

**37. అర్జునుడు :** ఈ సాధనలో శ్రద్ధగా నున్నను తుదకు సిద్ధి కలుగనిచో వా డేమగును?

**38.** అంతకు ముందున్న ఇంద్రియములు, మనస్సుపై విలువ తగ్గును. 'నేను' అనబడు యోగస్థితి లభింపదు. అట్టివాడు ఉభయము

నందును స్థిరత్వము వీడి ఏమగును? ఎట్లు జీవింపగలడు? చెట్టుపై నుండగ చేతికి పైకొమ్మ చిక్కకయే కాలిక్రింది కొమ్మ జారినచో ఏమగును?

**39.** నాకీ సందేహము తీర్చుము. నీకన్న సందేహములు తీర్చగలవాడు వేరుగ లభింపడని నాకు నమ్మకము కలిగినది.

**40. *శ్రీకృష్ణుడు :*** నీవు చెప్పిన స్థితిలో నున్నవాడు కోల్పోవున దేదియు లేదు. భౌతిక జీవితమున గాని, ఆధ్యాత్మికమున గాని వానికి నష్టమెన్నడును కలుగదు. శ్రేయస్సును గూర్చు పనిచేసిన వాడెప్పుడును దుర్గతిని పొందదు.

**41.** బుద్ధి మున్నగు లోకములయందు చేయబడిన ప్రతి యత్నము సాగినంతవరకు దేహేంద్రియ మనస్సులపై ప్రభావము కలిగించి తీరును. భోజనము అసమగ్రముగ జేసినను అంతవరకు ఆకలి తీరుచున్నదికదా! చేసిన ప్రయత్నమెల్ల లాభమే గాని నష్టము లేదు. మరియు నొక రహస్యమున్నది. చాంచల్యము తగ్గిన కొలదిని వేగము తగ్గును. వేగము తగ్గినకొలది ప్రయత్నము చిన్నదైనను బాహ్య ప్రజ్ఞలతో నెక్కువ కాలము పనిచేయును. గడియారమున క్షణముల ముల్లుకన్న నిముషముల ముల్లు తక్కువ వేగముతో పోవును. ఎక్కువకాలము సూచించును. దానికన్న గంటల ముల్లు, దానికన్న తేదీల ముల్లు; జీవి యను గడియారమున సంవత్సరముల ముల్లు, వయస్సుల ముల్లు, జన్మల ముల్లుకూడ నున్నవి. జన్మల ముల్లే బుద్ధి. దానికన్న పైనున్న యుగాంతరముల ముళ్లు దేవతలు. వాని కతీతమగు ముల్లు 'నేను'. నా దగ్గర నొక్క భాగము ముందరకు సాగిన సాధనము, దేహ మనో బుద్ధులపై శాశ్వత కాలములు పనిచేయును. కనుక చేసిన పుణ్యకర్మకు సంబంధించిన అనుభూతిని అసంపూర్ణ సాధకుడు కూడ చిరకాల మనుభవించును. ప్రజ్ఞ ఈ కొద్ది యనుభవములో నుండగనే చనిపోవును.

***మరియొక రహస్యము :*** నీవు నిద్రపోవుటకు ముందు ఏ తీవ్ర ప్రయత్నమున నుంటివో ఆ ప్రయత్నమునే పూనుకొనుచు మేల్కొందువు. నన్ను సాధించు ప్రయత్నమున నడుమ దేహము విడిచిన వాడు నా ప్రయత్నమునకు అనుకూలముగనే జన్మించును. అపరిశుద్ధ మయిన కుటుంబమున పుట్టి యోగసాధన మారంభించి చనిపోయిన వాడు అనుకూలమయిన పరిశుద్ధాత్ములగు

తల్లితండ్రులకు పుత్రుడై పుట్టును. దారిద్ర్యమున యోగసాధనము విఘ్నమై చనిపోయిన వాడు శ్రీమంతుని ఇంట పుట్టును.

**42.** లేదా యోగుల సాంగత్యముపై గౌరవము గలవాడు యోగుల ఇంట బుట్టును. అట్టి జన్మ ఇతరుల కతి దుర్లభము.

**43.** ఇట్లనుకూలము అయిన దేహమును సాధించుకొని పూర్వజన్మ నుండి తెచ్చుకొన్న బుద్ధితో కర్మయోగము చేయును. అట్లు పై స్థితికై ప్రయత్నము చేయుటకు వాని పూర్వ వాసనలు తోడ్పడును.

**44.** అట్టివానికి వయస్సు, వాతావరణము కారణములుగ, మనస్సు నింద్రియములు దుస్సాంగత్యము చెందినను నష్టము కలుగదు. బుద్ధికి పూర్వాభ్యాస బలమున్నది గనుక వాని కిష్టము లేకున్నను అది ఆకర్షించును. అతడు తనకు తెలియకయే మారిపోయి సాధన సాగించును. లోకమున కొంతకాలము పతితులై తరువాత బాగుపడిన వారందరు నిట్టివారే! యోగాభ్యాసముపై నభిలాష యుండుటయే పూర్వజన్మ సంస్కారము. శాస్త్రపఠన ప్రవచనములకన్న దానికే బలమెక్కువ. పూర్వజన్మ నుండి యోగ జిజ్ఞాస లేనివారికి శాస్త్రాది గ్రంథముల వలన పాండిత్య భారము మాత్రమే మిగులును. బాగుగ చదివిన వారిలో ఈర్ష్య అసూయలకు, దుర్బుద్ధికిలోనై జీవించి చనిపోయిన వారెందరు లేరు? కనుక గ్రంథాదులకన్న సాధన ప్రయత్న మెప్పుడును బలవత్తరము. గ్రంథాదుల యందలి శబ్ద బ్రహ్మము కూడ వేదము గనుక సాధన జిజ్ఞాస గలవానికి గ్రంథములలో వానికి కావలసిన మార్గము లభించును. వేదములు మున్నగునవి సాధకుని కిచ్చు అర్థము వేరు. పాండిత్యము గోరువారి కిచ్చు అర్థము వేరు. సామాన్యార్థముల నిచ్చు పదములే కవిచేతిలో రసానుభూతి సామర్థ్యమును పొందుచుండుట చూచుచున్నాము గదా! అట్లే అవే వేదములు పాండిత్యము గోరిన వారికి తమ యాధిక్యమును స్థాపించుకొను రజోగుణమును ప్రేరేపించును. సాధకునకు అందలి ప్రతిపదము తనకు కావలసిన మార్గము సూచించుచు మలచుకొనును.

**45.** ఇట్టి సాధన ప్రయత్నమున గర్వహంకారాది పాపముల నుండి పరిశుద్ధు డగుచుండును. ఇంతలో నెన్ని జన్మలు ఎత్తినను సిద్ధిపొంది యోగ పరిపూర్ణత చేజిక్కించుకొనును.

**46.** కనుక తపస్సు చేయువాని కన్న, జ్ఞానము కోరువాని కన్న, వేదోక్తకర్మ లాచరించు వానికన్న, యోగాభ్యాసాభిలాష కలవా డధికుడు కనుక యోగివి కమ్ము.

**47.** యోగాభ్యాసమునను అనేక మార్గములు చెప్పుచున్నారు. అందు శరీరమును శిక్షణ చేయునది హఠయోగ మార్గము. ఇంద్రియములను శిక్షణ పెట్టునది యమము. మనస్సును శిక్షణ పెట్టునది నియమము. మూలికలు మున్నగు వానిచే తంత్రయోగము, మంత్ర జపాదులచే మంత్రయోగము, ప్రాణాయామాదులచే షట్చక్రభేద కుండలినీ యోగము, సంగీతముచే లయయోగము మున్నగు ననేక మార్గము లున్నవి. ఇన్నిటియందును సాధకుడు పతనము కాకుండ కాపాడు కొలికిపూస యొకటే! అది నన్ను స్మరించుట. సాధకుడు తనలోని 'నేను' అను భావము నందు మేల్కొని యుండవలెను. అతడు నా యందుండును. అప్పుడు పై యోగసాధన మార్గము లన్నిటిలో దేహేంద్రియ మనోబుద్ధులు నాచుట్టును తిరుగుచు నాలో లీనమగుటచే పతనము కాడు. కనుక యోగులందరిలో శ్రద్ధతో నా భక్తి నభ్యసించువాడు అధికుడు.

*సప్తమోఽధ్యాయః ।*

# విజ్ఞానయోగః ।

*శ్రీభగవా నువాచ :*

మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజ న్మదాశ్రయం ।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥ **1**

జ్ఞానం తేఽహం సవిజ్ఞాన మిదం వక్ష్యా మ్యశేషతః ।
యజ్జ్ఞాత్వా నేహ భూయోఽన్య జ్జ్ఞాతవ్య మవశిష్యతే ॥ **2**

మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః ॥ **3**

భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥ **4**

అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।
జీవభూతాం మహాబాహో య యేదం ధార్యతే జగత్ ॥ **5**

ఏత ద్యోనీని భూతాని సర్వాణీ త్యుపధారయ ।
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయ స్తథా ॥ **6**

మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ **7**

రసోఽహ మప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।
ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ **8**

పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥ **9**

బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।
బుద్ధి ర్బుద్ధిమతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ॥ **10**

బలం బలవతాం చాహం కామరాగ వివర్జితమ్ ।
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥ 11

యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చ యే ।
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥ 12

త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వ మిదం జగత్ ।
మోహితం నాభిజానాతి మా మేభ్యః పర మవ్యయమ్ ॥ 13

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే ॥ 14

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।
మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావ మాశ్రితాః ॥ 15

చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥ 16

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే ।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ॥ 17

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।
ఆస్థితః స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్ ॥ 18

బహూనాం జన్మనా మంతే జ్ఞానవా న్మాం ప్రపద్యతే ।
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥ 19

కామై స్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతే ఽన్యదేవతాః ।
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా ॥ 20

యోయో యాంయాం తనుం భక్తః శ్రద్ధయాఽర్చితు మిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ నిదధ్యా మ్యహమ్ ॥ 21

స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే ।
లభతే  చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥ 22

అంతవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్ప మేధసామ్ ।
దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మా మపి ॥ 23

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మా మబుద్ధయః ।
పరం భావ మజానంతో మమావ్యయ మనుత్తమమ్ ॥ 24

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః ।
మూఢో౽యం నాభిజానతి లోకో మా మజ మవ్యయమ్ ॥ 25

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥ 26

ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వ మోహేన భారత ।
సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప ॥ 27

యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।
తే ద్వంద్వ మోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥ 28

జరామరణ మోక్షాయ మా మాశ్రిత్య యతంతి యే ।
తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥ 29

సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।
ప్రయాణకాలే౽పి చ మాం తే విదు ర్యుక్త చేతసః ॥ 30

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*విజ్ఞానయోగో నామ సప్తమో౽ధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 7

# శాస్త్ర విజ్ఞానము

**1. శ్రీకృష్ణుడు :** నా యందు మనస్సును స్మరణ మార్గమున నిలుపు వారు నా కాశ్రితులు. వారికి నా యనుభూతియే గాక అఖండ సృష్టి విజ్ఞానము దర్శన మిచ్చును. సృష్టి యనగా నా వ్యక్తస్వరూపమే గదా! గనుక శాస్త్రము లన్నియు వానికి ప్రసన్నము లగును.

**2.** ఈ శాస్త్రములు తెలియక నా యనుభూతి చెందువానికి మనస్సున రజోగుణ ప్రకృతి మిగిలియున్నచో నింకను తెలిసికొనవలసినవి మిగిలియున్నట్లు అనిపించు చుండును. కనుక నీకు వానిని గూడ వివరించి, తెలియకున్నది ఇక మిగుల లేదనిపింతును. దీనినే పెద్దలు విజ్ఞాన మందురు.

**3.** మనుష్యులలో వేయిమందిలో నొకడు విజ్ఞాన సిద్ధికై యత్నించును. అట్టి వారికి కూలంకషమైన అనేక శాస్త్ర పాండిత్యము లభించును. అట్టివారు వేయిమందిలో నొకడు తన విజ్ఞానము నందు నన్ను దర్శించును. నన్ను తెలిసిన శాస్త్రములు శాఖోపశాఖలచే దిగ్భ్రాంతి కలిగించును. నన్ను తెలియని శాస్త్రములు శాఖోపశాఖల పుష్ప ఫలాదులతో నొక్కొక్క వృక్షమువలె నాయందు ఏకత్వము వహించును. శాస్త్రము తెలియుట వేరు, నన్ను శాస్త్ర తత్వమందు తెలియుట వేరు.

**4.** ఈ సృష్టి యంతయు నా ప్రకృతి. అనగా నా స్వభావము. నీ స్వభావము నుండి నీ తెలివి పుట్టినట్లు నా స్వభావము నుండి ఎనిమిది చిల్లర ప్రకృతులు పుట్టుచున్నవి. 1. పృథివీ తత్త్వము లేక ఘనపదార్థ స్వభావము, 2. జల స్వభావము, 3. అగ్ని, 4. వాయువు, 5. ఆకాశము, 6. మనస్సు, 7. బుద్ధి, 8. అహంకారము. ఇవి నా అష్ట ప్రకృతులు. అందు మొదటి యారును బాహ్య ప్రపంచమునను, శరీరముల యందును సమానమగు వస్తు సామగ్రి. పెరుగు చిలుకగా వెన్న పుట్టినట్లు మొదటి యారు వస్తువు లతో తయారయిన శరీరమున యోగ మను మథనము జరుగగా బుద్ధియను ఉత్తమ ప్రకృతి వ్యక్త మగుచున్నది. దీనివలన మంచి చెడ్డలను తెలిసి,

మంచిని స్వీకరించు నర్హత యేర్పడవలెను. ఎనిమిదివది యగు అహంకారము ఏడు ప్రకృతులకును కట్టుగుంజ. అది నా యొక్క ప్రాంతీయ పరిమిత విగ్రహము. అణువు మొదలు బుద్ధివరకు నొక్కొక్క దానిలో నది వర్తించును. దాని మహిమ వలన పెద్దగోళములో చిన్న గోళములవలె నేను నన్ను వ్యవకలనము చేసుకొనుచున్నాను. నా నుండి నేను వేరుకాగా నేను శాశ్వతుడనై యున్నాను. నా యీ అహంకార మహిమ వలననే సున్న నుండి సున్న వ్యవకలనము చేసినచో శేషము శాశ్వతముగ సున్న యగుచున్నది. అణువులు వేరగుటయు, దేహములు, మనస్సులు భిన్న ప్రకృతులుగ వర్తించుటయు నహంకారము వలననే! ఇది పక్షిపిల్ల చుట్టు నున్న గ్రుడ్డు వంటిది. ఒక స్థితి దాటిన వెనుక బ్రద్దలు కావలసిన డిప్ప.

**5.** ఈ ఎనిమిది ప్రకృతులు నా ప్రకృతి యనబడు తొమ్మిదవ దానియందు పలకపై సున్నలు చుట్టినట్లు వర్తించుచున్నవి. ఈ తొమ్మిదవది పరాప్రకృతి లేక ఉత్తమ ప్రకృతి. మిగిలిన యెనిమిదియు దీని నుండి వేరై వర్తించి దీనిలోనికి ప్రవేశించు చున్నవి. ఈ తొమ్మిదవ ప్రకృతి యందు, దానికన్న మొదటి వాడుగ నే నుందును. నేనే దానియందు జీవుడుగ దిగివచ్చు చున్నాను. కనుక దీనికి నేను మొదటివాడను. సృష్టిగా పదవ వాడను. ఈ విధముగ నేను దిగివచ్చుట పది యంకెలలో జరుగుచున్నది.

తొమ్మిదవ ప్రకృతి జీవము అనబడును. దానిచే ధరించి పోషింపబడి మిగిలిన నెనిమిదియు జీవులు అగుచున్నవి.

**6.** ఈ తొమ్మిదియు నా యుత్పత్తి ద్వారములు అని ఎరుగుము. అవియే అంకెలు. వానియందు నే నుందును, వాని యుత్పత్తి, లీనము నేనే!

**7.** నా కన్న పై నింకేమియు లేదు. నాయందీ తొమ్మిదియు దారము నందు పూసలవలె కూర్చబడియున్నవి. కన్ను, ముక్కు, చెవి, మనస్సు, బుద్ధి నావి యనబడును. మానవుడు నా మనస్సు అని వ్యవహరించుటలో 'నా' యను దారమునకు ఇవి యన్నియు గ్రుచ్చబడి యున్నవని తత్త్వము.

**8.** ఇన్నిటి యందు నేను ప్రకృతిగ నెట్లుంటినో వివరించెదను. ప్రకృతి యనగా నానుండి నేను వర్తించుట. నీటికి రుచిలేదు, నాలుకకు రుచిలేదు.

నీటి యందును, నాలుక యందును నేనున్నాను. నాలుకపై నీరు పడినపుడు రుచి, తృప్తి పుట్టును. ఇది నా ప్రకృతి సృష్టి. అట్లే సూర్యుడు తనకు తాను వెలుగు కాదు. చంద్రుడును కాదు. కన్ను తనకు తాను చూపుకాదు. కిరణము చూపు కాదు. కిరణము కంటిని స్పృశించినపుడు నేను చూపగుదును. గ్రంథములలో అక్షరములు పదములు గావు, పదములు వాక్యముగావు. వాక్యమందు అర్థముండదు. మనస్సు నందర్థ ముండదు. వాక్యము మనస్సునకు సోకినపుడు నేను అర్థముగ పుట్టుచున్నాను. ఇట్లు వేదములయం దర్థమగు తత్త్వము నేను. దానిని 'ఓం' అని వ్యవహరింతురు. ఆకాశమునందు శబ్ద తరంగములు వినిపింపవు. చెవి వినదు. తరంగములు చెవికి సోకినపుడు నేను వినబడుచున్నాను. పురుషునిలో పురుషత్వమువలె నేనీ సర్వమునం దిమిడి యున్నాను.

**9.** ఇట్లే సుగంధము నేను, సుగంధ దుర్గంధములను విడమరచు ప్రజ్ఞ నేను. అగ్ని యందు తేజస్సు నేను. జీవులయందు జీవము నేను. తపస్సు చేయువాని యందు తపస్సెక్కడ నున్నది? కాని యున్నదని తెలియును. తపస్సు నేను. తెలియుట నేను.

**10.** మొలకెత్తుట, గర్భధారణము అను శక్తి నేను. దీని వలన శాశ్వతుడనైనను నిత్య నూతనుడుగ భాసించుచున్నాను. బుద్ధిమంతులలో బుద్ధి, చురుకయిన వారిలో చురుకుతనము నేను.

**11.** బలవంతులలో బలము పట్టుదలతో కలుషితమై యుండును. తీవ్ర రాగ ద్వేషములతో యుండును. ఈ దోషములను దమింపగల బలము నేను. సృష్టి సంకల్పము కామముగ వ్యక్తమగుచున్నది. అందు పశు ప్రయత్నము, అపరిశుద్ధి కలుషములుగ నుండును. వానిని దమించి మానవుడు దాంపత్య కామమును సాధించుకొన గలుగుట ప్రత్యక్షమే గదా! అట్టి ధర్మబద్ధ కామము నేను. కనుకనే కలుషములు జయింపబడు చున్నవి.

**12.** ఎవరెవరిలో సత్వ రజస్తమస్సుల భావములు పొటమరించు చున్నవో వారియం దవి నా నుండియే కాని వానిలో నేను లేను. అవి నా యందున్నవి. కనుకనే అవి నన్నంటవు. కుండలో మట్టి యున్నట్లు భ్రమ

కలుగును. అచ్చుట మట్టితప్ప కుండ యను పదార్థమేమియు లేదు. ఆకారమును కుండ యందురు, మట్టియం దాకార మున్నదిగాని ఆకారమునందు మట్టి నిలబడలేదు గదా! అట్లే నాయందీ ప్రకృతులున్నవి గాని వానియందు నేను లేను.

**13.** మూడు గుణముల నూలుపోగుల యల్లికవలె సృష్టియున్నది. దారముతో నల్లిన రుమాలుపై బొమ్మలున్నచో బొమ్మలు జ్ఞప్తి యుండి దారము మరపునకు వచ్చును. ఈ మరపును మోహ మందురు. జీవులు త్రిగుణమయమయిన సృష్టియందు మోహితులై దాని కతీతుడనగు నన్ను మరచు చున్నారు.

**14.** ఈ దారముల యల్లిక కూడ నాదే గనుక దివ్యతత్త్వము, జీవుల మోహము కూడ దివ్యమే! అందు ఏ భాగము నెవ్వడును శరణాగతి మాత్రము చెందరాదు. అనగా పరమార్థమని యనుకొనరాదు. అతడు మోహము నుండి మోహమునకు ప్రయాణము చేయుచుండును. ఈ మోహమును దాటుట సాధ్యము కాదు. మనస్సు మోహమయము. నా యందు స్మరణ నిలిపి శరణుజొచ్చినవాడు నేనుగ నాతో నుండును గనుక నీ మోహమును దాటును.

**15.** మోహముచే కప్పబడిన వారు ఒకరి కొకరు గాక యుందురు. ఒకరు చేయు పనులు ఇంకొకరికి బాధ కలిగించును. అవియే దుష్కర్మలు. దాని నాచరించువారు నరులలో నధమస్థితిలో నున్నవారు. అప్పటి వారి స్వభావమును అసుర మందురు. నిద్రించువాని తెలివివలె వారి జ్ఞానము మోహమున మాటుపడును. దాని వలన జీవులకు ఆర్తి కలుగుచున్నది.

**16.** ఆర్తి నుండి తప్పించుకొనుటకు ధనమునో, వ్యక్తినో, అన్న పానీయములనో వెదకును. ఇట్లు వెదకుచు ఆర్తి నుండి యార్తికి నడయాడుచు వెదకి వెదకి తటాలున నన్ను వెదకును. ఏ వ్యక్తిలో నన్ను వెదకినను నా పూజన మారంభమగును. ఈ అన్వేషణలో ఆర్తిహరములైన మార్గములకై జిజ్ఞాస పుట్టును. దానితో ననేక శాస్త్రములను కనుగొనును. అందును ఒకడు నన్ను కనుగొనును. మరియొకడు ప్రయోజనములను తీర్చుకొనుటకై ఇతరుల నాశ్రయించుచు ప్రయోజన రూపమున నా వెంట వచ్చును. అతడును నన్ను

కనుగొనును. తుదకిది యంతయు నేనని ఎరిగి నన్ను తెలిసికొని జ్ఞాని యగును.

**17.** ఇట్లు నన్ను చేరుటకు మార్గములు నాలుగు :

1. ఆర్తి లేక బాధ, 2. జిజ్ఞాస లేక కుతూహలము, 3. అర్థము లేక ప్రయోజనాపేక్ష, 4. జ్ఞానము లేక స్వస్వరూపము. వారిలో జ్ఞాని యనగా నిత్యము నాయందు యోగస్థితి చెందువాడు. స్మరింపబడు నేను ఒక్కడినే గనుక వాని కేకాంత భక్తి యలవడి ఉత్తమునిగ చేయును. జ్ఞానికి నాకన్న ప్రియమయిన వస్తువులేదు. నాకు జ్ఞాని కన్న ప్రియము లేదు.

**18.** నాలుగు విధములుగ నన్ను చేరువారును మంచివారే! కాని జ్ఞాని యనగా నేనే! ఇది నా మతము. అతడు ఆత్మయోగము కలవాడై నన్ను గతిగా చేరుచున్నాడు.

**19.** దీని కనేక జన్మలు పట్టవచ్చును. జన్మల యంతమున జీవి జ్ఞానవంతుడై నన్ను చేరక తప్పదు. సమస్త జీవుల చర్యలను వాసుదేవుడని అతడు దర్శించును. వాసుదేవు డనగా జీవులలో వసించు దేవుడు. దీనిని దర్శించినవాడు మహాత్ముడు. అనగా నందరిలోని పెద్దయాత్మ లేక నేను.

**20.** జ్ఞానము నందు స్థిరత్వము చెందక మునుపు కలుగు జన్మలలో ఆయా కోరికలుగ జ్ఞానము హరింపబడుచుండును. అట్టివారు అన్య దేవత లను శరణు పొందుదురు. అనగా తనకన్న అన్యునిగా దేవుని తెలుసుకొన గోరుటలో అనేక ఆకార నామ రూప భేదములను, ప్రయోజన భేదములను పొందుచున్నారు. ఒక్కొక్కని స్వభావమును బట్టి, అనగా త్రిగుణాత్మక ప్రకృతిని బట్టి అత డారాధించు దేవత ఏర్పడును. శివుడు, విష్ణువు మొదలు గంగానమ్మ, పోలేరమ్మ వరకు గల దేవత లిట్టివారే! దేవత యనగా దేవుని యందు ప్రతిబింబించు సాధకుని విగ్రహము లేక మొగము. కొందరికి వ్యక్తులే ప్రయోజనములు సమకూర్చు దేవతలు, కొందరికి ధనము దేవత. వాని ప్రకృతిని బట్టి వాని దృష్టి నాకర్షించు కేంద్రమే దేవత. ఒక్కొక్కడు తన దేవతను, స్వభావము ననుసరించి నీతులను, నియమములను, నిబంధనల

నేర్పరచుకొని అందు వర్తించును. రజోగుణ మెక్కువయినచో తన నిబంధనలతో నితరులను గూడ దమింపచూచును.

**21.** ఎవడెవడు ఏయే దేవతయందు శ్రద్ధ కలిగి వర్తించునో వానికి ఆ శ్రద్ధకు తగిన ఫలము, నేనే ఆ దేవతల రూపమున నిచ్చుచున్నాను.

**22.** ఆ సాధకుడు తన ప్రకృతి నుండి పుట్టు శ్రద్ధచే ఆయా ఆరాధన చేయును. తగిన కోరికలకు మాత్రము సిద్ధిని నేను నిర్ణయించి తద్రూపమున నిచ్చుచున్నాను.

**23.** ఇట్లే దేవతను ఆరాధించు వాడయినను పరిమిత బుద్ధియే! వానికి కలుగు ఫలముగూడ పరిమితము. కారణ మేమనగా వాడు కోరగలిగినదియు పరిమితమే! దేవతల యజ్ఞము చేయువారు దేవతలనే పొందుదురు. నా యజ్ఞార్థము పనిచేయువారు నన్ను చేరుదురు.

**24.** నేను వ్యక్తము కాకుండియు వ్యక్త మగుచున్నాను. నా అవ్యక్తతత్త్వము వ్యక్తులు గ్రహింపలేరు. కనుక సృష్టిగ వ్యక్తమగుచున్నాను. అప్పుడు సృష్టియని తెలియుచున్నారు గాని నేనని తెలియుట లేదు. మనుష్య దేహమున వర్తించు నన్ను మనుష్యు డనుకొనుచున్నారు. వ్యక్తమైన నన్ను జూచి కూడ అవ్యక్తమూర్తిగ గుర్తించుకొని దైవభావన నిలుప లేకున్నారు. వ్యక్తత్త్వము నెరిగిన జ్ఞానము వ్యక్తజ్ఞాన మగును గాని నా జ్ఞానము కాదు. తెలిసికొనుట యగును కాని తెలివియగుట కాదు.

**25.** కొన్ని భోజన ద్రవ్యములను కలిపి పాకము చేసినచో పిండివంట యగును. అందు మూల ద్రవ్యములున్నవి గాని నామము రూపము అనుభవము మారినవి. ఇది కలయికవలన కలిగిన మాయ. దీనివలన కొన్ని వస్తువులు మరియొక క్రొత్త వస్తువుగ భాసించుచున్నవి. ఇట్లే మనుష్యులు మున్నగు సకల చరాచర జగత్తు జీవుల దృష్టికి భాసించు చున్నది. ఇది నా ప్రకృతుల కలయిక యొక్క మాయ. ఇదియే యోగమాయ. దీనివలన నేను సర్వము నందుండియు ప్రకాశింపకున్నాను. జీవులయందు పరస్పర సంబంధ బుద్ధి కలవానికి మోహము కలుగును. ఈ యోగమాయ నుండి తప్పించునది యోగవిద్య. అదియే నా స్మరణము.

**26.** నాలో భూతకాలములు నడచిపోయినవి. వర్తమానము వర్తించు చున్నది. భవిష్యత్తు నాలో రాబోవుచున్నది. ఈ మూడు కాలములలో వర్తించి దర్శించువా రెవ్వరును నన్నెరుగ లేరు.

**27.** ఇచ్ఛ, ద్వేషము అను సంచలనములచే, చెరువు నీటికి బురదరంగు పట్టినట్లు, జ్ఞానమునకు మోహము పట్టును. సర్వజీవులు వానియందు మోహము చెంది జన్మాంతరములలో నాయందు యోగము చెందుచున్నారు.

**28.** పుణ్యకర్మల ఆచరణవలన మోహ కారణములైన రాగ ద్వేషములు శమించును. ఫలితము నుండి మనస్సు సన్యసించును. ఈ క్రమము నంతమున ముక్తులై జీవులు నాయందు వసింతురు. అంతమనగా సంచలనమునకు అంతమని భావము. అదికాక సృష్టి ప్రకృతికి గాని, నాకుగాని యంతము లేదు.

**29.** ముసలితనము, మరణము, జననము, వ్యాధి మున్నగు మార్పులను గమనించి, తదతీతుడ నగు నన్నాశ్రయించుట నెరిగి ఆత్మమూర్తులై మహాత్ములు బ్రహ్మానంద మనుభవించు చున్నారు.

**30.** జీవుల నధిష్ఠించినది 'నేను'. పంచభూతముల నధిష్ఠించినది 'నేను'. సృష్టియజ్ఞము నధిష్ఠించినది 'నేను'. ఒక్కొక్కడు చేయుపనుల నధిష్ఠించి యున్నది 'నేను'. ఇట్లు నన్ను స్మరించుచూ ప్రయాణ కాలమున నాయందుండు వారు నాయందే నిలుతురు.

ప్రయాణ కాలమనగా నొక ప్రజ్ఞ నుండి మరియొక ప్రజ్ఞకు జీవుడు మారు కాలము. మనస్సు నిద్రగా మారుట ఒక యుదాహరణము. దేహము విడుచుట ఒక యుదాహరణము. దేహము ధరించుట యొక ఉదాహరణము. ప్రజ్ఞ యొక స్థితిలో నంతమై మరియొక స్థితిలో మేల్కొను సమయములలో దేనియందయినను జీవుడు చిక్కుకొని చనిపోవచ్చును. ఆ సమయములలో నన్ను స్మరించు చున్నవాడు చిక్కుకొనడు. గనుక నాయందే లీనమై మరియొక ప్రజ్ఞగా కాక నాయందే మేల్కొనును. యోగస్థితి యనగా నిట్టిది.

అష్టమోఽధ్యాయః ।

# అక్షర పరబ్రహ్మ యోగః ।

అర్జున ఉవాచ :

కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కిముచ్యతే ॥ 1

అధియజ్ఞం కథం కోఽత్ర దేహేఽస్మి న్మధుసూదన ।
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥ 2

శ్రీభగవా నువాచ :

అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మ ముచ్యతే ।
భూతభావోద్భవకరో విసర్గః కర్మ సంజ్ఞితః ॥ 3

అధిభూతం క్షరోభావః పురుషశ్చాధి దైవతమ్ ।
అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాం వర ॥ 4

అంతకాలే చ మా మేవ స్మర న్ముక్త్వా కలేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ 5

యం యం వాపి స్మరన్ భావం త్యజ త్యంతే కలేబరమ్ ।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ 6

తస్మా త్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్య చ ।
మయ్యర్పిత మనోబుద్ధి ర్మా మేవైష్య స్యసంశయః ॥ 7

అభ్యాస యోగయుక్తేన చేతసా నాన్యగామినా ।
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ ॥ 8

కవిం పురాణ మనుశాసితార మణోరణీయాంస మనుస్మరేద్యః ।
సర్వస్య ధాతార మచింత్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥ 9

ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।

భ్రువోర్మధ్యే ప్రాణ మావేశ్య సమ్యక్
స తం పరం పురుష ముపైతి దివ్యమ్ ॥ 10

యదక్షరం వేదవిదో వదంతి
విశంతి యద్యతయో వీతరాగాః ।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి
తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥ 11

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధా యాత్మనః ప్రాణమాస్థితో యోగధారణమ్ ॥ 12

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజ న్దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 13

అనన్యచేతా స్సతతం యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ 14

మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్ ।
నాప్నువంతి మహాత్మాన స్సంసిద్ధిం పరమాం గతాః ॥ 15

ఆబ్రహ్మభువనా ల్లోకాః పునరావర్తినోఽర్జున ।
మా ముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ 16

సహస్రయుగపర్యంత మహ ర్యద్బ్రహ్మణో విదుః ।
రాత్రిం యుగసహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః ॥ 17

అవ్యక్తా ద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్త సంజ్ఞకే ॥ 18

భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవ త్యహరాగమే ॥ 19

పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తా త్సనాతనః ।
యస్ససర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥ 20

అవ్యక్తోఽక్షర ఇత్యుక్త స్తమాహుః పరమాం గతిమ్ ।
యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 21

పురుషః స పరః పార్థ భక్త్యా లభ్య స్త్వనన్యయా ।
యస్యాన్తః స్థాని భూతాని యేన సర్వ మిదం తతమ్ ॥ **22**

యత్ర కాలే త్వనావృత్తి మావృత్తించైవ యోగినః ।
ప్రయతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥ **23**

అగ్ని ర్జ్యోతి రహ శ్శుక్ల ష్షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్రప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ **24**

ధూమో రాత్రి స్తథా కృష్ణ ష్షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాంద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ **25**

శుక్ల కృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।
ఏకయా యా త్యనావృత్తి మన్యయాఽఽవర్తతే పునః ॥ **26**

నైతే సృతీ పార్థ జాన న్యోగీ ముహ్యతి కశ్చన ।
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥ **27**

వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్ ॥ **28**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*అక్షర పరబ్రహ్మయోగో నామ అష్టమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - *8*

# దారులు - మెట్లు

**1. అర్జునుడు :** నీవిప్పుడు బ్రహ్మము, అధ్యాత్మము, కర్మము, అధిభూతము, అధిదైవము అను పదములను ఉపయోగించితివి. వానిని వివరించి తెలుపుము.

**2.** అట్లే అధియజ్ఞము అంటివి. అది ఎట్టిది? ఈ శరీరమున దాని నెట్లు తెలియవలెను? ప్రయాణ కాలమున జ్ఞప్తి యుంచుకొనుట ఎట్లు?

**3. శ్రీకృష్ణుడు :** బ్రహ్మమును వివరించు చున్నాను. సృష్టిలో నే వస్తువునకైనను నొక పరిమాణ మున్నది. భూమియందు కొంత మట్టి యున్నది. కొన్ని నీళ్లున్నవి. అంతకన్న నెక్కువ యుండుటకు వీలు లేదు. పుట్టుట, కొంత కాలముండుట మరల కరగియో, తరిగియో పోవుట యను లక్షణములు వీని కున్నవి. అట్లే జీవుల శరీరములోని పదార్థములకును. ఇక భూమిచుట్టును వాయువున్నది. దాని పరిమాణము మారుచుండును. అయినను నెప్పటికప్పుడు పరిమాణముండును. కనుక నదియు పరిమితమే! సూర్యుని నుండి కిరణములు భూమికి వచ్చుచున్నవి. వానికి పరిమాణము లేదు. పోయినంత మేర వ్యాపించు చుండును. బరువు మున్నగునవి లేవు. కాని స్పర్శయు, కనుపించుటయు గలవు, ఉండుటయు, లేకుండుటయు గలవు. కనుక మనము చూచు వెలుగుకూడ పరిమితమే! ఇన్నిటిని ఆవరించి ఆకాశ మున్నది. మనలో మనస్సు మున్నగునవి పనిచేయుచున్నవి. వీనికిని పరిమాణాదులు లేవుగాని ఉండుట, లేకుండుట గలదు. అందాకాశమునకు అదియును లేదు. ఉండుటయు, లేకుండుటయు ఏక కాలమున ఆకాశ మగుచున్నది. ఈ ఆకాశము గూడ దేనిపై నాధారపడి యున్నదో ఊహింపుము. అది పరిమితము కాదు. అరుగదు, కరుగదు, తరుగదు, రాదు, పోదు. క్షరము అనబడు మార్పుల సముదాయము దానికి వర్తింపదు. దాని నక్షర మందురు. అదియే బ్రహ్మము. అదియే మొదటి 'నేను'. ఈ నాకు మొదలు చివరలు లేవు గాని మిగిలిన వాని కన్నిటికిని మాత్రము అది మొదలు

చివర. ఇదియే బ్రహ్మము (వ్యాపించి యున్నది). తనలో తాను వ్యాపించు చున్నది. సృష్టిగ వ్యాపించునది యని బ్రహ్మమను పదమునకు అర్థము. ఇక నధ్యాత్మమనగా నేమో వివరించెదను. పై చెప్పిన బ్రహ్మము ఆత్మయగుట కలుగుచున్నది. అనగా సృష్టిగా దిగివచ్చుటకు తానగుట జరుగును. తనయందు తాను పుట్టుట జరుగును. దీనిని స్వ + భావము అని కూడ నందురు. బ్రహ్మము యొక్క ఈ లక్షణము 'అధ్యాత్మము.'

ఇట్లు తన్ను తాను పుట్టించుకొనుటకు నొక క్రమము లేక ప్రణాళిక యుండవలెను. ఈ ప్రణాళిక ననుసరించి యొకే విధమున నిరంతరము జీవులు, దేహములు, పంచభూతములు, మనో బుద్ధి అహంకారాదులు, స్త్రీ పురుష విభేదము, భార్యాభర్తలు, సంతానోత్పత్తి క్రమాదులు కలుగుచున్నవి. ఈ క్రమమంతయు మారక యొకేవిధమున జరుగును. ఇట్లు జరుగుటయే 'కర్మము' యనబడును. కనుక జీవు లుద్భవించు మారిన ప్రయత్నమే కర్మము.

**4.** 'అధిభూత' మనగా పదార్థములలో నున్న మార్పు లక్షణము. నిరంతరము నొకద్రవ్య మింకొకటిగ మారుచుండును. ఈ మార్పుతోనే శరీరాదులు తయారై పెరిగి మరల నశించు చున్నవి.

ఇట్లు నశించు స్థితులలో నిమిడియున్న నశింపని బ్రహ్మమే పురుష డనబడును. అదియే 'అధి దైవతము.' ప్రతి దేహము నందును 'నేను' అను ప్రజ్ఞ యుండును. అదియే 'అధియజ్ఞము.'

**5.** ఈ దేహమున ఏ స్థితి అంతమగుచున్న కాలముననుు ఈ నన్ను స్మరించుచునే యుండవచ్చును. అట్లు దేహములను విడువ వచ్చును. అప్పు డతడు మార్పును దాటి నేను అను స్థితిని పొందుచున్నాడు.

**6.** శరీరమును విడచునపుడు దేనిని స్మరించునో జీవుడు దానినే పొందును. ఆహారాదుల అభిలాషతో దేహము విడిచినచో మరల ఆహారాపేక్ష ప్రధానముగ కలిగి పుట్టును. ధనము స్మరించినచో ధనకాంక్ష యగును. నిద్రకు ముందు దేనిని స్మరించునో మరల మేల్కొంచి దానియందే ప్రవర్తించును. పనులు చేయుచు నిదురించిన వాడు మరల ఆ పనినే పూర్తిచేయును.

**7.** నన్ను స్మరించుచు శరీరము విడచినవాడు శరీరేంద్రియ మనో బుద్ధి అహంకారాది స్థితులలో దేనియందు కట్టుబడక 'నా' యందుండును. అనగా జనన మరణాతీతుడు. ఇదియే శాశ్వతస్థితి. నీవు నీ మనో బుద్ధి తత్త్వములను నాయం దర్పించి సర్వకాలముల యందును నన్నే స్మరింపుము. యుద్ధము చేయుచు కూడ నన్నే స్మరింపుము.

**8.** అనుక్షణము కలిగిన భావములందెల్ల నన్నే స్మరించుట అభ్యాసము. దానితో ప్రజ్ఞకు మరియొకటి లేని స్థితి నిచ్చును. అదియే యోగము. అట్టి యోగి దివ్యుడగు పరమపురుషుని పొందును. నీలోనున్న ఏ తత్త్వము, నాకన్న పై నేమియు నెరుగదు. అట్టి నన్ను, పరమపురుషుని ధ్యానించుటకు ధ్యాన మార్గము నుపదేశించెదను వినుము.

**9.** నీవు దేనిని తెలిసికొన దలచినపుడైన తెలిసికొనువాడు 'నేను', చూడదలచినపుడు చూచువాడు 'నేను'. తెలిసికొనదలచిన విషయములు వచ్చుచు పోవుచుండును. అందు తెలుసుకొనుచున్న నేను వచ్చుట, పోవుట లేదు. గనుక పురాణమూర్తి యగు కవిని. వచ్చుట, పోవుట నీ అధీనమున నుండవు. నీ యందున్న నా యధీనమున నుండును. కనుక నేను శాసించు వాడను. నీలో మాత్రమే గాక నీలోని అణువునందును ఇట్లే వర్తింతును. ఒక్కొక్క యణువున వేరువేరుగ శాసించుచు, నీ మొత్తము శరీరము నొకే నేనుగ శాసించు చున్నాను. సమస్త సృష్టియందు నిట్లే!

**10.** ఈ దేహములను, అణువులను పుట్టించుట, చేర్చి కూర్చుట చేయుచున్నాను. కనుక సృష్టికర్తను. నీ మనస్సు కూడ నా నుండి సృష్టింపబడినది గనుక నన్ను నీ మనస్సు చింతనచేసి అంతు తెలియలేదు. సూర్యునికాంతి చీకటిని పోగొట్టినట్లు తెలిసికొనుటకు ముందున్న స్థితిని పోగొట్టుచున్నాను. అదియే అజ్ఞానమను చీకటి. దానిని తెలిసికొనుటగా పోగొట్టుచున్నాను. నన్నీ విధముగ ధ్యానము చేయవలెను. దేహాదులు విడుచు కాలమున మనస్సు నా స్మరణలో నున్నచో అచంచల మగును. భక్తి కలుగును. అదివరకు అభ్యాసము చేసిన ఈ చలనముచే కనుబొమల నడుమ ప్రాణమును ప్రవేశింప జేయగలరు. అనగా చనిపోవు సమయమున భ్రూమధ్యమున నన్ను స్మరించుట యందు దివ్యుడగు పరమపురుషుని చేరుదురు.

**11.** నన్ను వేదముగ తెలిసినవారు వేదమునగూడ నన్నే అధ్యయనము చేసి క్షరములని బ్రహ్మమును అభ్యాసము చేయుదురు. కోరికలను తొలగించు కొని సంయమము చెందినవారు నన్ను ప్రవేశించుచున్నారు. నన్ను కోరి పెద్దలు బ్రహ్మచర్యము చరించు చున్నారు. దానిని గూర్చి మరికొంత వివరింతును.

**12.** శరీరము విడుచు సమయమున సర్వ ద్వారములను సంయమము చేయుము. భ్రూమధ్యమునందు నిలిపిన మనస్సును హృదయమున నిరోధింపుము. గుండె కొట్టుకొనుటను లెక్కించినచో మనస్సు హృదయమున నిలుప బడును. అచ్చటి నుండి శరీర స్పందనలకు ఆ భావము కల్పింపుము. హృదయము నుండి మెల్లగా మూర్ధమునకు ఊర్ధ్వముగ ధ్యానము చేసినచో శ్వాస, గుండె కొట్టుకొనుట మొదలగు ప్రాణ స్పందనములు తనయందు శమించును. ఇట్లు యోగధారణ చేయుము.

**13.** ఆ స్థితిలో నన్ను స్మరించుచు 'ఓం' అని ఉచ్చరింపుము. ఇది నోటితో గాక, శ్వాసతో కాక, మనస్సుతో గాక, మొత్తముతో నుచ్చరింపుము. నేను అను ప్రజ్ఞతో హృదయము నుండి శిరస్సుపైకి ఊర్ధ్వముగ నుచ్చరింపుము. ఆ యుచ్చారణగా బయటకువచ్చి శరీరమును విడచిపెట్టుదువు. అప్పుడు తిరిగిరాని యుత్తమమైన స్థితిని పొందుదువు. (ఇట్లు ఉచ్చరించి శరీరమును విడచుట చనిపోవునపుడే చేయనక్కరలేదు. అభ్యాసమున నిరంతరము చేయు చుండ వచ్చును. అట్టివారికి శరీర మున్నను దానితో సంబంధ ముండదు. శరీరమునకు మాత్రము తనతో సంబంధమున్నంత వరకు పనిచేయు చుండును.)

**14.** అట్టి స్థితిలో మరియొకటి యను ప్రజ్ఞ యుండదు. ఇట్టి వానికి నేను సులభ సాధ్యుడను. అట్టివాడు నిత్యయోగి.

**15.** ఇట్లు నన్ను పొంది అశాశ్వతము, దుఃఖములకు నిలయము అగు పునర్జన్మ నెవడును పొందడు. అనగా శరీరములు తనయందు పుట్టుచు పోవుచుండ వచ్చును. తాను మాత్రము పుట్టడు, పోడు. ఈ పరమపదమును పొందినవారు మహాత్ములు.

**16.** ఒక్క స్థితిని పొందినవాడు తిరిగి క్రింది స్థితుల లోనికి జారుట కవకాశమున్నదా యను ప్రశ్న వచ్చును. సాధనలో పృథ్వి, ఆపస్తేజో

వాయురాకాశములు, పంచేంద్రియములు దాటి మనస్సును చేరినను మరల ప్రజ్ఞ దిగివచ్చు చుండును. మనస్సు నుండి పంచేంద్రియములు, పంచ భూతములు పుట్టుచున్నవి గనుక మనస్సే సృష్టికర్త. వానిలోకము వరకు సాధన చేసినవాడు మరల దిగివచ్చు చుండును. వానిని దాటి నన్ను చేరినవాడు ఇక దిగిరాడు. ఉదాహరణకు ఒక సంగీత కార్యక్రమమునకు పోయి గూర్చున్నవాడు దిక్కులు చూచుచుండ వచ్చును. సంగీతము వినుచున్నను ఇతరుల సంభాషణలు వినిపింపవచ్చును. మనస్సులో నితర భావములు పుట్టుచుండ వచ్చును. కాని యొకమారు గాయకుని నాద మాధురిచే మనస్సు హరింప బడినచో కన్ను తెరచియున్నను వస్తువులు కనుపింపవు. మాటలు వినిపింపవు. ఆలోచనలు రావు. అట్లే నన్ను పొందిన వానికి జన్మలు కలుగవు.

**17.** నీలో నీ మనస్సు నీ దినచర్యను, సన్నివేశములను, ఊహలను సృష్టించు చుండును. అవి వచ్చుచు పోవుచుండును. నిద్ర వచ్చినపుడు అవి యన్నియు నిద్రలోనికి కరగిపోవును. అట్లే ఈ సృష్టి యంతయు దాని మనస్సు నుండి పుట్టుచుండును. మరల ఆ మనస్సుతో దాని నిద్రలోనికి పోవుచుండును. ఈ మనస్సే సృష్టి కర్తయగు బ్రహ్మ. అతని యందు సృష్టి మేల్కాంచియున్న కాలము బ్రహ్మపగలు అందురు. ప్రళయమును బ్రహ్మరాత్రి యందురు. మానవుల మనస్సులకు వేల రేట్లు బ్రహ్మ మనస్సు పనిచేయును. అట్లే నిద్రించును. మానవునకు వేయి యుగముల కాలము బ్రహ్మపగలు. మరి వేయి యుగముల కాలము బ్రహ్మరాత్రి. మన భూమిపై నున్నవారికి సూర్యోదయము నుండి సూర్యోదయమునకు ఒక దినము. 365 దినములు ఒక సంవత్సరము. అట్టి సంవత్సరములు 43,20,000 ఒక యుగము లేక మహాయుగము. అట్టి యుగములు వేయి బ్రహ్మపగలు, మరియొక వేయి రాత్రి.

**18.** అందు పగటియందు సమస్తము లేని స్థితి నుండి ఉన్న స్థితికి వచ్చి వర్తించును. ఇదియే సృష్టి. రాత్రియందు లేని స్థితి లోనికి పోవును. ఇదియే ప్రళయము.

**19.** సమస్త జీవరాసులు ఈ విధముగ పగలు వర్తించి రాత్రి లీనమగు చుండును. ఇందు దేనిని స్మరించినను దాని వెంట ఈ స్థితులను పొందుచు జీవుడు తుదకు ప్రళయము పొందును.

**20.** నన్ను స్మరించినపుడు ఈ రెండు స్థితులను పొందదు. జీవులకు వ్యక్త స్థితి ఎట్లు తెలియునో అట్లే నన్ను స్మరించు వానికి అవ్యక్తస్థితి కూడ తెలియును. అనగా వ్యక్తా వ్యక్తములకు అతీతమయిన స్థితి తెలియును. ఈ స్థితియే సనాతనము, ఉత్తమము. ఇందున్నవాడే పరమ పురుషుడు. అతని యందు జీవులు పుట్టుచు నశించుచుండగా జీవులయం దతడు నశింపక వసించియున్నాడు. ఉదాహరణమునకు ఒక చిత్రకారుడు రాత్రియందు దృశ్య మొకటియు, పగటియందు దృశ్యమొకటియు చిత్ర పటములను చిత్రించెను. ఈ రెండును ఎట్లున్నవో పరిశీలించుటకు ఆ గదిలో వెలుగుండవలెను. సృష్టి ప్రళయములకు పైన ఇట్టి వెలుగే పరమ పురుషుడుగా ప్రకాశించు చున్నది.

**21.** ప్రళయమున జీవులు అవ్యక్తము లోనికిపోయి అందుండి పుట్టు చున్నవి. వ్యక్తము క్షరతత్త్వము గలది. అనగా మార్పుల సముదాయము. నాశము దాని ధర్మము. అవ్యక్తమునకు నాశము లేదు. అదియే అక్షరము. సృష్టి, ప్రళయము రెండు భాగము లనుకొనరాదు. ప్రళయ మనబడు తత్త్వము మారని ప్రధాన తత్త్వము. దాని నుండి వచ్చిపోవు సృష్టి యొక భాగమే! ఇందు వ్యక్తతత్త్వము చరము అనియు, అవ్యక్త తత్త్వము ధ్రువమనియు తెలియుచున్నది. రెండింటి యందున్న భగవంతుడు అవ్యక్తము నందు శాశ్వతుడుగను, సృష్టియందు అశాశ్వతుడుగను వర్తించు చున్నాడు. ఉన్నవి రెండే తత్త్వములు, మూడుగా పనిచేయుచున్నవి. జీవులు వ్యక్తమున మేల్కొని అవ్యక్తమున నిదురించు చున్నారు. ముక్తుడు అనగా యోగి. అవ్యక్తమున మేల్కాంచి యుండుటచే రెండు తత్త్వముల యందును మేల్కాంచి యున్నాడు.

**22.** వ్యక్తా వ్యక్తములు ఎవనియందు వర్తించుచున్నవో వాడే సర్వాంతర్యామి. జీవుడు వ్యక్తస్థితి యందుగాని, అవ్యక్తస్థితి యందుగాని యుండక అంతర్యామి యందు మేల్కాంచి యుండవలెను. ఇది నన్ను స్మరించుటచే లభ్యము.

**23.** వ్యక్తా వ్యక్తములలో నొకదాని యందుండుట వలన రెండింటి యందును తిరిగి తిరిగి వర్తించు చుండును. ఇదియే పునరావృత్తి చక్రము. నాయందు వర్తించుట వలన ఈ ఆవృత్తి కలుగదు. కాల మానములో

జీవుల ప్రజ్ఞకు ఆవృత్తి కలిగించు కాలములు కొన్నియు, ఆవృత్తి దాటించు కాలములు కొన్నియు గలవు. అట్లే సృష్టిలో నున్న పదార్థములలో గూడ ఈ రెండింటిని కలిగించునవి ఉన్నవి. వానిని వివరించెదను.

**24.** ఈ సృష్టి మొత్తము సూక్ష్మతత్త్వము నుండి స్థూలమునకు దిగివచ్చు చున్నది. అందలి స్థితులు దిగివచ్చు నిచ్చెనమెట్లు. మరల స్థూలము నుండి సూక్ష్మమునకు పోవుచున్నది. అందలి స్థితులు ఎక్కిపోవు నిచ్చెనమెట్లు. కొన్ని పదార్థములకు, కాలములకు దిగివచ్చు మెట్లుండును. కొన్నిటికి ఎక్కిపోవు మెట్లుండును. దిగివచ్చు మెట్లు ప్రజ్ఞను బంధించును. ఎక్కిపోవు మెట్లు బంధ విమోచనము కలిగించును. రెండు నిచ్చెనల యందును అవియే మెట్లు. ఒకదాని కొకటి వ్యతిక్రమమున పేర్చి యుండును. ఈ రెండు నిచ్చెనలును ఆద్యంతములలో కలసికొని మొత్తమొక చక్రాకారమగు నిచ్చెనగ నమర్చబడి యున్నది. ఆరోహణము నిచ్చు మెట్లు చక్రప్రవృత్తి నుండి విమోచనము కలిగించును. అవరోహణ క్రమము నందలి మెట్లు ప్రజ్ఞను చక్రములోనికి దింపి త్రిప్పును.

నిప్పు స్థూల పదార్థమును సూక్ష్మతత్త్వము లోనికి దహించును. వెలుగు, పగటికాలము కూడ నిట్లే ఆరోహణ క్రమము నిచ్చును. మాసమున శుక్లపక్షము, సంవత్సరమున ఉత్తరాయణము నిట్లే ఊర్ధ్వగతి కనుకూలములు. అందు శరీరము విడచినవాడు, ధ్యానము చేసినవాడు ఊర్ధ్వగతిని పొందును. బ్రహ్మలోక ప్రజ్ఞను పొందును.

**25.** పొగ, రాత్రి, చీకటి, కృష్ణపక్షము, దక్షిణాయనము అవరోహణ క్రమమును సూచించును. అందు దేహము విడచుట, ధ్యానించుట కలిగినచో ఈ చక్రమునందు తిరుగుట అబ్బును.

**26.** అందు మొదటి దానిని శుక్లగతి యందురు. అది సూర్య తత్త్వము గలది. సూర్యుడు అణువులను జీవ ప్రజ్ఞలుగ నుద్ధరించు చున్నాడు. అట్లే శుక్లగతి చక్రభ్రమణము నుండి విమోచనము కల్గించును. రెండవది కృష్ణగతి యనబడును. అది చంద్ర తత్త్వము గలది. చంద్రుడు తన కిరణముల వలన జీవప్రజ్ఞలను దేహములందు అంకురింప చేయుచున్నాడు. అట్లే ఈ మార్గము దిగివచ్చుటను

కల్గించును. ఈ శుక్ల కృష్ణగతులు జగత్తున శాశ్వతములుగా వర్తించుచున్నవి. ఒక దానిచే విమోచనము, ఒక దానిచే బంధనము జీవులకు నిరంతరము కలుగు చున్నవి. ఈ చక్రప్రవృత్తిలో జీవులు జ్ఞానులగుచు, మరల నజ్ఞానములోనికి దిగుచు తమ వశములేక వర్తించుచున్నారు. జ్ఞానము పొందినవారు కూడ మరల నజ్ఞానమున బడకుండుట ఎట్లో తెలియకున్నారు. ఈ మార్గమున ఎట్టి జ్ఞానము కల్గినను బ్రహ్మలోకము వరకే! అనగా మరల బ్రహ్మకు రాత్రియగుటతో దిగిపోవును. దీని వలన నొక జన్మలో నార్జించుకొన్న జ్ఞానమంతయు నొక మృత్యువుతో చెల్లిపోవును.

**27.** ఈ దారులను చూచి యోగి భయపడడు. అతడు ఈ దారులను చూచువాడు గాక తెలిసిన వాడగును. నన్ను స్మరించుట నిరంతరము చేయు చుండుట వలన అతనిపై ఈ దారులు పనిచేయవు. స్థూల సూక్ష్మములు, వ్యక్తా వ్యక్తములు, అహోరాత్రములు, నిద్ర మెలకువలు, జనన మరణములు, సృష్టి ప్రళయములు అను తెల్లని నల్లని పూసలు. 'నేను' అను దారమునకు గ్రుచ్చబడి యున్నవి. నన్ను స్మరించుచు యోగి నాయందుండుటచే వానియం దవి వర్తించినను అతడు వానియందు తిరుగడు. దారము ననుసరించి పూసలుండ వలసినదే! అట్లే ఈ గతులను నాశ్రయించిన యోగి నన్నాశ్రయించి నట్లుండును. కనుక యోగివి కమ్ము.

**28.** వేదములయందు, యజ్ఞముల యందు, తపస్సులయందు, దానములయందు మానవుడు అపారముగ పుణ్య ఫలమును పొందు చున్నాడు. అవి యాచరించిన వారు ఆ పుణ్య ఫలముల యందుందురు. అవియే పుణ్య ఫలములు, యోగియందు ఆశ్రయించి యుండును. కనుక వారి స్థితి కన్న యోగి స్థితి ఉత్తమము. అతడు సర్వము నందును మొదటిది, ఉత్తమమగు స్థానము పొందుచున్నాడు.

నవమోఽధ్యాయః ।

# రాజవిద్యా రాజగుహ్య యోగః ।

శ్రీభగవానువాచ :

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే ।
జ్ఞానం విజ్ఞానసహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥ 1

రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్ ।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్ ॥ 2

అశ్రద్ధధానాః పురుషా ధర్మ స్యాస్య పరంతప ।
అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥ 3

మయాతత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥ 4

న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగ మైశ్వరమ్ ।
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5

యథాఽఽకాశస్థితో నిత్యం వాయు స్సర్వత్రగో మహాన్ ।
తథా సర్వాణి భూతాని మత్స్థానీ త్యుపధారయ ॥ 6

సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ ।
కల్పక్షయే పున స్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్ ॥ 7

ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।
భూతగ్రామ మిమం కృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్ ॥ 8

న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।
ఉదాసీనవ దాసీన మసక్తం తేషు కర్మసు ॥ 9

మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।
హేతునానేన కౌంతేయ జగ ద్విపరివర్తతే ॥ 10

అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।
పరం భావ మజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥ 11

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।
రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12

మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితాః ।
భజం త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ ॥ 13

సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥ 14

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే ।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతో ముఖమ్ ॥ 15

అహం క్రతు రహం యజ్ఞః స్వధాహ మహ మౌషధమ్ ।
మంత్రోఽహ మహమే వాజ్య మహమగ్ని రహం హుతమ్ ॥ 16

పితాఽహమస్య జగతో మాతా ధాతా పితామహః ।
వేద్యః పవిత్ర మోంకార ఋక్సామ యజురేవ చ ॥ 17

గతి ర్భర్తా ప్రభు స్సాక్షీ నివాస శ్శరణం సుహృత్ ।
ప్రభవః ప్రలయః స్థానం నిదానం బీజ మవ్యయమ్ ॥ 18

తపామ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ ।
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహ మర్జున ॥ 19

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపాః యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।
తే పుణ్యమాసాద్య సురేంద్రలోక మశ్నంతి దివ్యాన్దివి దేవభోగాన్ ॥ 20

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే ॥ 21

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥ 22

యోఽప్యన్య దేవతాభక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।
తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ ॥ 23

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మామభిజానంతి తత్త్వేనాత శ్చ్యవంతి తే ॥ 24

యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।
భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్ ॥ 25

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥ 26

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27

శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబంధనైః ।
సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి ॥ 28

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥ 29

అపి చే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః ॥ 30

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 31

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాంతి పరాం గతిమ్ ॥ 32

కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయ స్తథా ।
అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్ ॥ 33

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మా మేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥ 34

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*రాజవిద్యా రాజగుహ్యయోగో నామ నవమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 9

# రాజవిద్య - రాజగుహ్యము

**1. శ్రీకృష్ణుడు :** జ్ఞానము, విజ్ఞానము నీకు వివరించితిని. ఇక జ్ఞాన విజ్ఞానముల జ్ఞానమును వివరింతును. ఇది అసూయలేని మనస్సులకే గోచర మగునట్లు అతిరహస్యముగ నమర్చబడి యున్నది. దీనిని తెలిసి అన్ని అశుభముల నుండి జీవుడు విమోచన పొందును.

**2.** ఈ చెప్పబోవు రహస్యము రాజవిద్య రాజగుహ్య మనబడును. ఇది మిక్కిలి పవిత్రమైనది. ప్రత్యక్ష నిదర్శనములతో అవగతమై ననుభూతమగును. ధర్మాచరణముతో గూడిన మార్గము ఆచరించుటకు కూడ మిక్కిలి సుఖముగ నుండును. తరుగని యనుభూతి నిచ్చును.

**3.** ఈ చెప్పబోవు ధర్మసాధనయందు గురి కుదురని వారు నాయందు మనస్సు నిలుపనివారు. యోగమనగా నాయందు మనస్సు నిలుచుట. అట్లు నిలువని మనస్సు నాకన్న భిన్నమయిన యూహలుగా పరుగెత్తును. అట్టి మనస్సు కలవారిని శ్రద్ధలేని వారందురు. వారు తమలోనున్న నన్ను పొందక మిగిలిన దేహాదిప్రజ్ఞలను పొందుచున్నారు. ఆ ప్రజ్ఞలు దేహాదుల నామము, రూపము, వయస్సు, పరిణామము అను వానిని బట్టి మారుచున్నవి. ఇట్లు మారుటయే పరిణామము లేక మృత్యువు అనబడును. శ్రద్ధలేనివారు ఈ మృత్యు మార్గమునబడి సుఖ దుఃఖాదులను వెదకుటలో కొట్టుకొని పోవుచున్నారు.

**4.** ఈ జగత్తు సర్వము నాయందు వ్యాపించి యున్నది. నేను దానియందు అవ్యక్తముగా నున్నాను. ఈ సంబంధము విచిత్రము. నాయందు సర్వజీవులున్నవి. నేనా జీవులయందు లేను. అనగా వాని స్థితులలో నే స్థితియందును లేను.

**5.** ఇంకొక సంబంధము కూడ నున్నది. నాయందా జీవులు లేవు. ఆ జీవుల స్థితులు నాయందు అంటవు. మట్టియందు కుండ ఆకారముగా నున్నది. మట్టికి ఈ ఆకారములేదు. కుండ యనునది ఆకారము మాత్రమే గనుగ దానికి మట్టియందు అస్తిత్వము లేదు. కుండయందు మట్టియున్నది కాని కుండకు వేరుగా నస్తిత్వము లేదు గనుక దానియం దేమియు లేదు.

ఇదే జీవులకును నాకునుగల సంబంధము. ఈ సంబంధమే వారికి నాయందు గల యోగము. దీని యనుభూతియే యోగవిద్య. దానికి వలసిన యభ్యాసమే యోగాభ్యాసము. సృష్టి నా ఐశ్వర్యము. అనగా ఈశ్వరభావము. అనగా నేను దాని కధిపతిగా నుండుట, ప్రభువుగా నుండుట. ఇట్టి సంబంధము రాజునకును రాజ్యమునకును నడుమ తెలియబడుచున్నది గనుక ఇది రాజవిద్య యనబడును. ఈ సంబంధము ఉన్నను వ్యక్తము కాదు గనుక, కేవల మనుభూత విషయమే గనుక, చేష్టాదికములలో చిక్కదు గనుక ఇది గుహ్యము. జీవులను నేను భరించి ధరించు చున్నాను. ఐనను వానియందు లేను. నాయందే అవి యున్నవి. అవి నా శరీరము. నేను వానిచే భావింప బడుదును. శరీరమున మనస్సు ఉద్భవించి తోచుచున్నట్లు నేను వారి భావనలో నుద్భవింతును. తనయందు నేనున్నట్లు ప్రతిజీవికి భావన కలదు. నాయందు జీవులును, వారి భావనలును గలవు. కనుక నాయందే యీ భావనలున్నవి. నేను వానిని భావింపను. నాకు భావనలు కలుగును; జీవులు భావనలను భావింతురు.

**6.** ఆకాశమునందు వాయు వెట్లున్నదో గమనింపుము. కదలు నప్పుడు వాయువు, కదలనప్పుడు ఆకాశము. ఆకాశమే వాయువులోని అణువులుగా దిగివచ్చు చున్నది. అణువులు ఆకాశమందు ఉండుటచే అణువులందు ఆకాశ మేకకాలమున నున్నది. అదే కాలమున లేదు. కనుకనే ఆకాశము ఉన్నది, లేదు అను నూహలకు కూడ సత్యము. ఆకాశము దిగివచ్చుటయే వాయువు. కాని దిగివచ్చిన వాయువులో దిగిరాని ఆకాశమే మాతృకగా వర్తించు చున్నది. కనుకనే వాయువు పుట్టిన వెనుక కూడ మొదటి యాకాశముననే యుండక తప్పినది కాదు. అట్లే నాయందు జీవులును.

**7.** వాయు వున్నప్పుడు అందాకాశ ముండును. వాయువు లేనప్పుడు ఆకాశమే యుండును. అట్లే జీవుల కల్పన యున్నప్పుడు వారియందు నేను భావింపబడుదును. వారి కల్పన అంతమైనపుడు నేనే యుందును. ఇట్లే నాది అను భావము నాయందు వర్తించుటయు, అది నాయందు లీనమై నేనే వర్తించుటయు గలవు. నాది యను భావము ప్రకృతి. అనగా నా ప్రకృతి, నా భావము, నా స్వభావము. దాని యందు నేనుందును. దానికి పైనకూడ

నేనుందును. స్వభావమనగా 'తన' పుట్టుక. దీని నుండి సృష్టి పుట్టుచున్నది. జీవులు ప్రళయమున నేనగు చున్నవి. కల్పాదిలో నా ప్రకృతి వలన వానిని సృష్టించు చున్నాను.

**8.** ఇట్లు సృష్టించుట 'నా' ప్రకృతి. దాని ననుసరించి మరల మరల ఈ సృష్టిని కల్పనగా కల్పించు చున్నాను. జీవులు సృష్టింపబడు నప్పుడును, మరల లీనమగునప్పుడును నా వశమే గాని తమ వశముగాక వర్తించు చున్నారు. జీవించి భావించునప్పుడు తమ వశమేమియు లేదు. వారు నాలో భావించుచున్నారు గనుక నాయందే వారి భావన పుట్టుచున్నది.

**9.** జీవులు నాయందే తమ కర్మ లాచరించు చున్నారు. కనుక కర్మలు, ఆచరణము నాయందే పుట్టి, వర్తించు చున్నవి. అవి నేను చేయునవి గాక వారు చేయునవి గనుక నాయందే వర్తించియు నన్ను బంధింపవు. కవి పాత్రలను సృష్టించి ప్రవర్తింప జేయును. అందు ఏ పాత్రల ప్రవర్తనము కవి కల్పితమైనను కవి ప్రవర్తనము కాదు. కనుక కవి నంటదు. అట్లే జీవుల కర్మలును. సంబంధము లేనివాని వలె వారి యందుండి వారి కర్మలయందు నుండి సంబంధము లేకయే చూచు చుందును.

**10.** నా యాధిపత్యము క్రింద నా స్వభావమగు ప్రకృతి చరాచర జగత్తులను ప్రసవించు చున్నది. ఈ హేతువుచే జగచ్చక్రము తిరుగు చున్నది. అట్లు తిరుగుట నా స్వభావమే కాని నేను కాదు.

**11.** జీవులలోనున్న నన్ను కర్తగా, జీవునిగా చూచువారు మూఢులు. అనగా మోహము చెందినవారు. మనుష్య శరీరమున నున్న నన్ను మనుష్యు డనియే తలతురు. దీని కతీతముగా నిందుంటినని యెరుగరు.

**12.** ఇట్లెరుగక పోవుటవలన నొకరి నొకరు వేరు వేరు నరులుగా చూచుచున్నారు. ఒకరొకరికి కోరికలు తీర్తురని పెంచుకొనుచున్నారు. ఒకరికొకరు ఆశలతో పనులు చేసిపెట్టుచున్నారు. ఆశలు వ్యర్థముకాగా నా ప్రకృతివలన పనులు చేయుచున్నారని మరచి, అజ్ఞానమును కోపతాపాదులుగా వెదజల్లుకొను చున్నారు. దాని వలన రాక్షసము, ఆసురము, వ్యామోహితము అగు స్వంత

ప్రకృతులను సృష్టించుకొను చున్నారు. అనగా ప్రకృతియను పిండితో తమ యిష్టము వచ్చిన వంటకములను చేసుకొనుచున్నారు.

**13.** మహాత్ములు మాత్రము నా దివ్యప్రకృతి యందు వర్తించు చున్నారు. నన్నే స్మరించుట వలన నిది సాధ్యమగు చున్నది. జీవులలో నన్ను చూచుచు, అన్యభావన లేని మనసుతో వర్తించుచున్నారు. జీవులుగా దిగుటకు ముందున్న నన్నే జీవులలో చూచుచున్నారు.

**14.** ఎవరి గుణములను గ్రహించినను ఈ నన్నే కీర్తించు చున్నారు. ఎవరికి నమస్కరించినను, భక్తి చూపినను, ఎవరికొరకై యెట్టి ప్రయత్నము చేసినను నన్నే యుద్దేశించు చున్నారు.

**15.** దేనిని తెలిసికొనినను నన్నే తెలిసికొని జ్ఞాన యజ్ఞముచే విశ్వ శ్రేయస్సు అను మార్గమున నన్నే సేవించుచున్నారు. ఒక్కొక్కరిని వేరుగా గౌరవించుచు నొక్కనిగా గౌరవించు చున్నారు.

**16.** పాపములు, అజ్ఞానము హరించుటకు చేయు సంస్కార కర్మలు, క్రతువులు, యజ్ఞములు నన్నే యుద్దేశించి నాయందే ఆచరించు చున్నారు. గాలి, నీరు, ఇల్లు, వాకిలి పరిశుభ్రము చేసుకొనుట కూడ ఆయా దేవతలకు సేవయే. వారు నేనని యెరిగి చేయుచున్నారు. పితృ దేవతల కిచ్చు పిండోత్పత్తి సమర్పణము 'స్వధ' అనబడును. తాను ధరించిన తన వీర్యమని ఈ పదమున కర్థము. పిండోత్పత్తికి స్వధా సమర్పణము కూడ కామము లేక నన్నుగా భావించి సమర్పణము చేయుచున్నారు. ఓషధులనగా ధాన్యములు. వానితో చేయబడిన అన్నము ఆకలిని, నాశమును నివారించు నౌషధము. అట్లే మందులును వ్యాధులను నివారించును. ఈ నాశ నివారణము నా భావమని గుర్తించి వారు ఆహారాదులు స్వీకరించుచున్నారు. యజ్ఞమునందు ప్రయోగింపబడు మంత్రములు ఋషులచే దర్శింపబడినవి. వారి మనస్సులలో అవి దర్శన మగుటకు నేనే కారణము కనుక మంత్రము నేనుగా నుచ్చరించు చున్నారు. నా నుండి యుద్భవించిన అంగదేవతల ప్రభావముచే గోవు శరీరము నుండి పాలును, అందుండి నేయియు వచ్చుచున్నవి. వారు నేయిని, హోమము చేయువానిని కూడ నన్నుగనే గుర్తించుచున్నారు.

**17.** జగత్తు నావలన కలుగుచున్నది కనుక నేను తండ్రిని, నాయందు కలుగుచున్నది కనుక నేను తల్లిని, నానుండి సృష్టి క్రమ మందుచున్నది గనుక నేను సృష్టికర్తను. జీవునకు తండ్రి వాని తండ్రినుండి పుట్టును గనుక నేను పితామహుడను. ఏ వస్తువును గూర్చి తెలిసికొనినను అందు నేనుందును గనుక నేను వేద్యము. ఈ స్థితులేవియు నన్నంటవు గనుక నేను పవిత్రుడను. నానుండి సృష్టి యుచ్చారణ పొందుచున్నది గనుక నేను 'ఓం' కారము. కంఠధ్వని కలుగు కారణము నేను. కనుక నేను ఋగ్వేదము. దానికి ముందున్న శ్వాస నా ప్రభావమున కలుగుచున్నది గనుక నేను శ్వాస మూల మగు లయబద్ధ గానము, అనగా సామవేదము. జ్ఞానము నుండి ఆచరణలోనికి జీవులను ప్రేరేపించు ప్రకృతిని గనుక యజుర్వేదము.

**18.** దేశకాలములు, అన్నపానీయములు, జీవనోపాధి నిచ్చువాడు నాయందే గనుక నేనే గతి, భరించువాడను, ప్రభువును. నేను కల్పించుకొనను గనుక వారి కర్మలకు నేనే సాక్షి. నివాసము ఏ భావము నందును భయము దీర్చు మిత్రాదుల రూపము నందుంటిని గనుక నేనే శరణము. వారి యుత్పత్తి స్థానము, లీనమగు స్థానము నాయందే, ఉన్నది నాయందే. విత్తనమున అంకురశక్తి తాను పెరుగకుండ దేహముగా పంచభూతములను పెంచుచున్నది. అట్టి బీజశక్తి నేను.

**19.** సూర్యునిలో వేడిగా, ఎండగా నన్ను నేను కల్పన చేసుకొని భూమిపై జలములుగా కల్పించుకొని, ఎండ వేడిమిచే నీటిని మేఘములుగా నాకర్షించి వర్షములుగా విడుచుచున్నాను. ఇది తరుగ కుండునట్లు కల్పించితిని గనుక పంచభూతములకును ఆహార రూపమున అమృతత్త్వమును కల్పించితిని. ఎప్పటికప్పుడు మారుచుండుట యను మృత్యువును కూడ కల్పించితిని. తిరుగుట యున్నప్పుడు మారుట యుండును. అన్నము కావలసినచో మేఘములు కావలెను. కనుక మృత్యువను మార్పు అమృతత్త్వమునకు తప్పనిసరి. ఇట్లు మంచి చెడ్డలుగా కనుపించు కల్పన నేను.

**20.** నన్ను కొందరు జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను మూడంచుల విద్యగా చూచి, సత్కర్మల యాచరణముచే సంస్కారము పొంది జ్ఞానమను

సోమపానము చేసి పాపములను క్షాళన చేసుకొనుచున్నారు. తమ యజ్ఞకర్మలను ఉత్తమముగా భావించి స్వర్గ సౌఖ్యములను ఫలితములను ప్రార్థించుచున్నారు. వారా పుణ్యములను పొంది దేవేంద్రలోకము లనుభవించి దేవభోగము లనుభవించుచున్నారు.

**21.** సత్కర్మల ఫలితముగా చిరకాలము ఉత్తమ సుఖము లనుభవించు చున్నారు. ఈ యనుభవమును వారి పుణ్యములు కలిగించుచున్నవి. కనుక అవి మరల తరిగిపోవుచు వారి జ్ఞానముకూడ తరిగిపోవు చున్నది. ధనము వలె జ్ఞానము నార్జించి, ఫలితములను అనుభవించుటకు నధికారము సంపా దించుటతో ఫలితములను రూపముగా వినియోగమున ఆర్జించిన జ్ఞానము వ్యయ మగుచున్నది. ఎంత ధనవంతుడైన ఆర్జించు చున్నంతవరకు ధనవంతుడు. ఆర్జించుటకు సుఖము నోరు కట్టవలెను. సుఖింపవలెనన్నచో ధనము వ్యయ మగును. సుఖించిన వెనుక నిక ధనవంతుడు కాక సామాన్యుడే! శాస్త్రములను, పుణ్యకర్మలను ఇట్లే త్రయీధర్మమున అనుభవించు వారున్నారు. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనువానిని వేరు వేరు దేవతలుగా వీరు ఆరాధించుచున్నారు. వీరు కోరికలు తీర్చుకొనుచు వానిలోనే పుట్టుచు చచ్చు చున్నారు. మానవులుగనే యుండిపోవు చున్నారు.

**22.** అట్లు కాక త్రయీ ధర్మమున కూడ నన్నే దర్శించు వారున్నారు. వారి యుపాసనలో అన్యము లేని ధ్యాన ముండును. వారెప్పుడును నాయందు యోగము చెంది యుందురు. వారి యోగము, క్షేమము నేనే వహించు చున్నాను. వారికి తరుగుట, పెరుగుట యుండదు.

**23.** ఇతర దేవతలను వేరువేరుగా శ్రద్ధతో నారాధించువారు కూడ నన్నే ఆరాధించుచున్నారు. భావన మాత్రము వేరుగానున్నది. ఆ దేవతలు నా ప్రకృతి నుండి వచ్చిన రూపములే యని భావించుట లేదు. కనుక వారి యారాధనము జరుగవలసిన విధానము కాదు. చేసిన కర్మలను బట్టి వారి జ్ఞానమునకు, సుఖమునకు వృద్ధి క్షయము లుండును.

**24.** సర్వ యజ్ఞముల యందును ఆయా దేవతల రూపమున నేనే

స్వీకరించుచు ప్రభువుగా నున్నాను. దీనిని స్మరింపని వారు నా తత్త్వము నుండి తమతమ జ్ఞానభావనల లోనికి జారిపోవుదురు.

**25.** ఇట్లు జారిపోయి దేవతల నారాధించిన వారు దేవలోకమును, పితరుల నారాధించిన వారు పితృలోకమును, భూత ప్రేతాదుల యుపాసన చేసినవారు భూత ప్రేతత్వములను పొందుచున్నారు. అట్లుకాక ఇన్నిటిలో నన్నారాధించువారు నన్నే పొందుచున్నారు.

**26.** భక్తితో నెవరికి పత్రముగాని, పండుగాని, పువ్వుగాని, మంచి నీరమైనగాని ఇచ్చుచున్నప్పుడు నాకర్పించుటగా స్మరింపుము. అదే భక్తితో వారియందు నేనే స్వీకరింతును.

**27.** ఎవరి కేమి చేసినను నాకుగా చేయుము. నీవు తిన్నదెల్ల, హోమము చేసినదెల్ల, దానము చేసినదెల్ల నన్నుద్దేశించి చేయుము. తపస్సు నా కొరకు చేయుము. ఇన్నింటి యందు నే నొక్కడనే ప్రసన్నమై నిన్ను స్వీకరింతును.

**28.** ఈ సాధన వలన సన్యాసము కలుగును. యోగము నందుందువు. కర్మబంధము నుండి విమోచనము కలుగును.

**29.** సర్వజీవులయందు నేను సమానముగా నున్నాను. నాకు ద్వేషించు వాడుగాని, ప్రీతిపాత్రుడుగాని లేడు. నీవును అట్లే జీవితము గడిపినచో జీవులలో నున్న నాయందు భక్తి కలుగును.

**30.** అనేక దురాచారములు కలవాడు కూడ తానాచరించుచున్న కర్మ లన్నిటియందు నన్నే స్మరించుట నారంభించినచో అతనికి బాగుపడుటకు నిశ్చయము ఆరంభమైనదని యర్థము. నాకు అతడు సాధువే!

**31.** అతి స్వల్ప కాలమున నతడు ధర్మాత్ముడై శాశ్వత శాంతిని పొంద గలడు. నాయందు భక్తుడు ఏ స్థితిలో నున్నను ఏ మార్గమున నున్నను నాశము చెందడు. ఇది నా ప్రతిజ్ఞగా స్వీకరింపుము.

**32.** తమ సర్వము నందును నన్నాశ్రయించు వ్రత మవలంబించి పాపులకు పుట్టిన వారును మోక్షము పొందుచున్నారు. స్త్రీలు, వినియోగబుద్ధి

గలవారు, భౌతికముగా శ్రమపడి పనిపాటలు చేసికొనువారుకూడ తెలియుట యక్కర లేకయే మోక్షమును పొందుచున్నారు.

**33.** ఇంక యజ్ఞ, దాన, తపః కర్మలు, వేదాధ్యయనము చేయు బ్రాహ్మణ ధర్మమువారు, ధర్మరక్షణ నారాధనముగా గొనిన రాజర్షులును నామార్గ మవలంబించినచో చెప్పవలసినదేమి? అనిత్యము, అసుఖము అను భౌతిక లోకమున పుట్టి నా స్మరణచే నిత్యత్వమును, మోక్షమును పొందుము.

**34.** మనస్సు నేనని జీవింపుము. భక్తి నా యందు మరల్చుము. యజ్ఞము నాకై ఆచరింపుము. సర్వము నందును నాకు నమస్కరింపుము. ఈ యోగసాధనచే నాకంటె అన్యము లేక నాయందుందువు.

దశమోఽధ్యాయః ।

# విభూతి యోగః ।

శ్రీభగవా నువాచ :

భూయ ఏవ మహాబాహో శ్రుణు మే పరమం వచః ।
యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ 1

న మే విదుః సురగణాః ప్రభవం న మహర్ష యః ।
అహ మాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ 2

యో మా మజ మనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।
అసమ్మూఢ స్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 3

బుద్ధిర్జ్ఞా మసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః ।
సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయ మేవ చ ॥ 4

అహింసా సమతా తుష్టి స్తపో దానం యశోఽయశః ।
భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథ గ్విధాః ॥ 5

మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవ స్తథా ।
మద్భావా మానసా జాతా యేషాం లోకా ఇమాః ప్రజాః ॥ 6

ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।
సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥ 7

అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥ 8

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥ 9

తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాంతి తే ॥ 10

తేషామే వానుకమ్పార్థ మహ మజ్ఞానజం తమః ।
నాశయా మాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥ 11

*అర్జున ఉవాచ :*

పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ ॥ 12

ఆహుస్త్వాం ఋషయ స్సర్వే దేవర్షి ర్నారదస్తథా ।
అసితో దేవలో వ్యాస స్స్వయం చైవ బ్రవీషి మే ॥ 13

సర్వమేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥ 14

స్వయమే వాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥ 15

వక్తుమర్హ స్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి ॥ 16

కథం విద్యా మహం యోగిం స్త్వాం సదా పరిచింతయన్ ।
కేషు కేషు చ భావేషు చింత్యోఽసి భగవ న్మయా ॥ 17

విస్త రేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥ 18

*శ్రీభగవా నువాచ :*

హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మ విభూతయః ।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే ॥ 19

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః ।
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవ చ ॥ 20

ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్ ।
మరీచి ర్మరుతా మస్మి నక్షత్రాణా మహం శశీ ॥ 21

వేదానాం సామవేదోఽస్మి దేవానా మస్మి వాసవః ।
ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానా మస్మి చేతనా ॥ 22

రుద్రాణాం శంకర శ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।
వసూనాం పావకశ్చాస్మి మేరు శ్శిఖరిణా మహమ్ ॥ 23

పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।
సేనానీనా మహం స్కంద స్సరసామస్మి సాగరః ॥ 24

మహర్షీణాం భృగు రహం గిరామ స్మ్యేకమక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః ॥ 25

అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।
గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥ 26

ఉచ్చైశ్శ్రవస మశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।
ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥ 27

ఆయుధానా మహం వజ్రం ధేనూనా మస్మి కామధుక్ ।
ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణా మస్మి వాసుకిః ॥ 28

అనంత శ్చాస్మి నాగానాం వరుణో యాదసా మహమ్ ।
పితౄణా మర్యమా చాస్మి యమ స్సంయమతా మహమ్ ॥ 29

ప్రహ్లాద శ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహమ్ ।
మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥ 30

పవనః పవతా మస్మి రామ శ్శస్త్రభృతా మహమ్ ।
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసా మస్మి జాహ్నవీ ॥ 31

సర్గాణా మాది రంతశ్చ మధ్యం చైవాహ మర్జున ।
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతా మహమ్ ॥ 32

అక్షరాణా మకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ ।
అహ మేవాక్షయః కాలో ధాతాఽహం విశ్వతోముఖః ॥ 33

మృత్యు స్సర్వహర శ్చాహ ముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తిశ్శ్రీర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా ॥ 34

బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసా మహమ్ ।
మాసానాం మార్గశీర్షోఽహం ఋతూనాం కుసుమాకరః ॥ 35

ద్యూతం ఛలయతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ।
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతా మహమ్ ॥ 36

వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః ।
మునీనామ ప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః ॥ 37

దండో దమయతా మస్మి నీతి రస్మి జిగీషతామ్ ।
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతా మహమ్ ॥ 38

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున ।
న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చరాచరమ్ ॥ 39

నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా ॥ 40

యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్త దేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥ 41

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్ ॥ 42

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*విభూతియోగో నామ దశమోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - *10*

# దివ్య వైభవము

**1. *శ్రీకృష్ణుడు :*** నీయందు నాకు ప్రీతి కలిగినది. నీ హితము నా సంకల్పమైనది, ఇటు పైమాట చెప్పెదను వినుము.

**2.** మీ మానవులలో నన్నెరుగక జీవించువారున్నారు. తప్పు లేదు. అట్టివారు దేవతలలోను, ఋషులలోను కూడ నున్నారు. నీవు నిద్ర మేల్కొంచు సమయమున నీకు తెలివివచ్చి యుండును. ఆ తెలివి నిద్రనుండి ఎప్పుడు పుట్టుచున్నదో నీ వెరుగుదువా? అట్లే దేవతలు, మహర్షులు పుట్టుసరికి నేనున్నాను. వారికి నా పుట్టుక ఎట్లు తెలియును? నా మొదలేదియో వారికందుట యెట్లు? వారు నన్ను తెలియుటయే నేను వారియందు పుట్టుట. కనుక వారి పుట్టుకయే నా పుట్టుక. సంగీతము పాడుచుండగా నొకడు పుట్టె ననుకొనుము. వాని చెవికి ఆ సంగీతము పుట్టుక యున్నది. అట్లు జీవులకు, దేవతలకు, మహర్షులకు నా అస్తిత్వమున్నది గనుక యొక్కొక్కమారు ఏమరు పాటున వారు నన్నెరుగరు.

**3.** ఇట్లు ఆది లేనివాడనుగా లోకములకు లోపల, వెలుపల ఆధిపత్యము వహించు వాడనుగా నున్నాను. నన్నెరిగి స్మరించువాడు మానవుడైనను మోహము చెందదు.

**4, 5.** మానవునకు ఉన్నట్లుండి బుద్ధి పుట్టును. జ్ఞానము కావలె ననిపించును. మోహము దాటవలె ననిపించును. ఓర్పు, సత్యము, శమదమ ములు మంచి వనిపించును. సుఖదుఃఖములు పొడము చుండును. భయము, నిర్భీతి కలుగుచుండును. అహింస, సమత్వము, తుష్టి, తపస్సు, దానముపై సంకల్పము కలుగుచుండును. అట్లే అతడుండుట లేకుండుట కూడ కలుగు చుండును. అనగా నిద్ర, మెలకువ, మరణము, జననము కలుగుచుండును. ఇవన్నియు వానికి కలుగు భావములు. ఇవి వాడు కలిగించుకొనునవి కావు. వానియం దుద్భవించి పోవుచుండును. వాడు నాయందున్నాడు గనుక, వానిలోని నా ప్రకృతి నుండియే వానికివి కలుగుచుండును. వాని కతడు

బాధ్యుడు కాడు; అధిపతియు కాడు. నేనును బాధ్యుడను కాను, ప్రకృతిది యీ బాధ్యత. అధిపతిని మాత్రము నేనే. ప్రకృతికి కూడ అధిపతిని నేనే. ఈ భావము లన్నియు నీయందు నీకొరకు కలుగుచుండును. నాయందు నీకొరకు కలుగుచుండును.

**6.** నీకు కలిగిన భావము లన్నియు నాకు కలిగినవియే. నీకు కలుగనవి కూడ నాకు కలుగును. వానిని వివరించెదను. నా ప్రకృతి నుండి సృష్టికి మొదట నా మనస్సు కలుగును. అందు ఒక నలుగురు, మరియొక ఏడుగురు, అటుపైన పదునలుగురు భావములుగా కలుగుచుందురు, వీరే నా మానససృష్టి. అందు మొదటి నలుగురు కుమారు లనబడుదురు. వారు నావలెనే అంటక సృష్టిలో మెలగువారు, వారు సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు అనబడువారు.

తరువాత ఏడుగురును, అత్రి, భృగువు, అంగిరసుడు, వసిష్ఠుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనబడు సప్తర్షులు. అటుపైన స్వాయంభువ, స్వారోచిష, ఉతమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సూర్య, అగ్ని, బ్రహ్మ, రుద్ర, దక్ష, రౌచ, భౌచ్య అను పదునలుగురు మనువులు అనబడువారు. అందు మొదటి నలుగురు సృష్టిని నా వాక్కుయొక్క నాలుగు స్థితులుగా నుచ్చారణ రూపమునకు గొనివత్తురు. తరువాత ఈ ఏడుగురు సప్తలోకముల కధిపతులై సృష్టిలోని ఏడు పొరలను కలిగింతురు. ఈ సూర్యుని కిరణము లందు భూమికి దిగివచ్చునవి ఏడురంగులు, ఈ కంఠధ్వని యందు వెలువడునవి ఏడు స్వరములు. ఈ ఏడుగురి వలననే సప్తమరుత్తులు మొదలు శరీరములలోని సప్తధాతువుల వరకు నియమింపబడును. అటుపైన పదునలుగురు మనువులును, మన్వంతరము లనబడు కాల విభాగములను కల్పించి వాని కధిపతులై పరిపాలింతురు. ఈ యాధిపత్యము క్రింద మహా యుగములు, యుగములు మొదలు అహోరాత్రములు, గడియలు, లిప్త విలిప్తల వరకు కాలవిభాగము పెట్టి అందు సృష్టి త్రిప్పబడును.

వీరందరును నాకు భావములుగా నుద్భవింతురు. వీరికి భావములుగా లోకములు, జీవులు నుద్భవింతురు. మీకు నా భావము లుద్భవించినట్లే

వారికి ఈ యతీత భావములు సృష్టిజ్ఞానముగా, నా నుండి భావములుగా నుద్భవించును. ఈ జ్ఞాన మనబడు వేదము వారియందు బ్రహ్మవిద్యగా నావిర్భవించుటకు, వారి దృష్టినుండి ఏమరుపాటు చెందకుండుటకు నా ప్రకృతి బాధ్యత వహించును. నే నాధిపత్యము వహింతును.

**7.** ఈ నా వైభవమును, వీరికి నాతో గల యోగమును గూర్చిన జ్ఞానమును ఆవశ్యకతనుబట్టి కొందరు జీవులకు గూడ కల్పింతును. ఇప్పుడు నీకెట్లు కల్గించితినో వారికి నట్లే కల్పింతును. వారే మంత్ర ద్రష్టలు, శాస్త్ర కర్తలు, ధర్మమూర్తులునై లోకమును కాపాడుటకు నిమిత్తమాత్ర మగుదురు. ఇట్టి నా వైభవమును, వీరితో గల యోగమును తత్త్వముగ తెలిసినవాడు అచంచలమైన యోగస్థితి పొంది నా యందు వసించును.

**8.** ఎవరియందేది ప్రత్యేకత వహింపవలెనో వారియందు వైభవమును నా భావముగ కల్పించి నేనుగ నుందును. ఇట్లు ఈ సమస్తమునకు 'నేనే' ఉత్పత్తి కారణమనియు 'నా' యందే భావములుగ జగత్తులు వర్తించుచున్న వనియు స్మరించి నన్నారాధించు వారు బుధులు అనబడుదురు. వారి కందరికిని నా భావములే యుండును. లోకములందు జ్ఞానము జీవులకు ప్రకాశించుటకు వారే గురువులు.

**9.** వారు 'నేనే' చిత్తముగా జీవించుచు, వారు బోధించు బోధగా నన్నే అనేక కథలరూపమున చెప్పుకొనుచు సంతోషించుచు స్వేచ్ఛా విహారము చేయుచుందురు. ఆ కథలే సర్వమానవ పురాణగాథలు.

**10.** నా కథలయం దిట్లు ప్రీతికల్గి యోగస్థితిలో నారాధించు వారికి బుద్ధిరూపమున ప్రసన్నమై నా జ్ఞానమును వారియందు నిలుపుటకు క్రీడగొని యుందును. దీనినే నా యనుగ్రహ మందురు. అది కలిగిన వానికి తెలియని దేమియు లేదు.

**11.** వానియందు 'నేను' జాలిగొని వారిలోని నేనుగ జ్ఞాన దీపమై యుండి, అజ్ఞాన తిమిరము సమీపించకుండ చూచుకొందును.

**12, 13. అర్జునుడు :** ఎంత పవిత్ర సత్యము! నీవు చెప్పిన పరబ్రహ్మము నీవే! నీవు చూపిన సాటిలేని వెలుగు నీవే! వానికి నీవే

గమ్యము. నీకన్న అవి ఏమియు లేవు. శాశ్వతమూర్తివగు పురాణ పురుషుడు, ఆదిదేవుడన నెవడో ఇప్పుడు తెలిసినది. అది నీవే! ఋషులందరు నీకు జన్మలు లేవనియు, సర్వమునకు ప్రభువనియు చెప్పిరి. చాలలేదు. దేవర్షియగు నారదుడు గానము చేసెను. చాల లేదు. దేవలుడు అను ఋషి చీకటియనగా నీవే యని చెప్పెను. చాలలేదు. వ్యాసుడు వివరించి చెప్పెను. చాలలేదు. నీవే స్వయముగ చెప్పితివి. పరిపూర్ణమయినది.

**14.** అదే సత్యమును నీవు స్వయముగ నుచ్చరింపగా సర్వము సహజ సత్యమని ఇప్పుడు తలచుచున్నాను. నీ వ్యక్తరూపము యొక్క వైభవము దేవ దానవాదులకును తెలియదు.

**15.** తెలియుట యనగా నీ సంకల్పమే! నా 'నేను'లో నీ 'నేను' తెలియునట్లు సంకల్పించుటయే నాకు తెలియుట. జీవులను సృష్టిగ భావించు చున్నావు. నన్ను నీవు భావించినపుడు నేను తెలిసికొనుచున్నట్లు కూడ నీవు భావించి యుండవలెను. కనుకనే నేను తెలిసికొంటిని. మాకు తెలియుట యనగా నిట్టిది. ఇట్లు మా లోపల, వెలుపల ఆధిపత్యము వహించి ప్రభువై యున్నావు.

**16.** పలుకుము, ఇంకను ఈ జ్ఞానమును నుచ్చరించి పలుకుము, నీవు పలుకుట యనగా నేను తెలిసికొనుట. అశేషముగ నీ దివ్య వైభవములను గూర్చి వివరింపుము. వినిన యనుభూతిలో యవి నా వైభవములగును. ఈ లోకములయందు ఎట్లు విస్తరించి లోపల వెలుపలగా నిండి, భావించుచునే భావనకందక మా భావనల కతీతముగ నెట్లుంటివో అట్టి నీ విలాసమును గూర్చి ఇంకను నీవే వివరింపుము.

**17.** నన్ను యోగి అని సంబోధించితివి. యనగా నీలో నన్ను భావించి అందు యోగి వైతివి. నిన్ను ధ్యానించుట, తెలియుట ఎట్లు సాధ్యము? ఏయే భావములయందు నీవు ధ్యానింపబడుదువో, దర్శింపబడుదువో మాకెట్లు తెలియును? నీవే వివరింపవలెను.

**18.** నీకును, జీవులకు నడుమగల యోగమను సంబంధము,

జీవులయందు వర్తించు నీ యోగమాయ మున్నగు నీ వైభవ విస్తృతిని గూర్చి మరల పలుకుము. వినుచున్న నా తృప్తికి ఆద్యంతములుండవు.

**19. శ్రీకృష్ణుడు :** అంతకన్న కావలసినదేమి! దివ్యములైన ఆత్మ వైభవములను తప్పక వర్ణింతును. కాని నాకు కూడ సాధ్యముకాదు. ప్రాధాన్యమునుబట్టి మాత్రము వివరింపగలను.

**20.** 'నేను' వ్యాపించు వైభవమునకు ఆద్యంతములు లేవు గనుక వానిని సంపూర్ణముగ నెట్లు వర్ణింతును? వానికి నేనే మొదలు, నడిమి, అంతము అని మాత్ర మెరుగుదును. అందలి సర్వజీవులలో ఆత్మగ నున్నాను. ఎవరికి వారు నే ననుకొందురు. నే నున్నానని ఎరుగుదురు. ఈ నేను అహంకారము. అది ఎరుగుట ఎట్లు అని ప్రశ్నించినచో నన్ను నే నెరుగుదును అను జ్ఞానము కలుగును, ఈ జ్ఞానమే యాత్మ. ఇది సర్వ జీవుల ఆశయముగ నున్నది. దానికి స్థానము హృదయము.

**21.** ఆదిత్యులలో నేను విష్ణువును. వెలుగొందు వారలలో కిరణములు గల సూర్యమూర్తిని. మరుత్తులలో మరీచిని. నక్షత్రములలో చంద్రుడను.

(సృష్టి నిర్వహణము చేయుచున్న ప్రజ్ఞామయ మూర్తులు దేవతలు. వారు గంధర్వు లనియు, దేవత లనియు, పితురు లనియు మూడు విధములు. అందు గంధర్వులు బ్రహ్మాండ నిర్మాణమునకు ముందునుండి యున్న ప్రజ్ఞలు. వారు సామమయ మూర్తులు, ఆనందమయ కోశము నందుందురు. దేశము, కాలము, కొలతల కతీతులు. కనుక ఛందస్సుల కతీతులు. వారిలో వేనుడు, సోముడు, విశ్వావసువు, చిత్రరథుడు ముఖ్యులు. వీరే బ్రహ్మ మనస్సుగా దిగివచ్చినవారు. పురాణములలో వీరిని నలుగురు కుమారులు అందురు. వీరికి కేంద్ర ప్రజ్ఞగా ఇంద్రుడు అను మనస్సు వెలువడును. వీరి నుండి బ్రహ్మప్రజ్ఞ బ్రహ్మాండముగా వెలువడును. అందు ఆదిత్యులు, రుద్రులు, వసువులు అను దేవతలు పుట్టుదురు. ఆదిత్యులు దివిదేవతలు అనబడుదురు. అనగా వెలుగునందుండు వారు. వీరి వెలుగు బహిఃప్రకాశము కాక, తత్త్వము అనుబడు స్థితిలో 'తెలివి'గా నుండును. వీరు పంద్రెండుగురు. వీరిలో వ్యాపించుట అను గుణము లేక దేవత విష్ణు

వనబడును. ఇతడు గంధర్వులకు ముందునుండి బ్రహ్మాండ దేవతల స్థితిలోను, తరువాత స్థితులలోను కూడ అస్తిత్వము చెందును. బ్రహ్మాండ నిర్మాణమున ఆదిత్యులలో నొకడుగా వ్యక్తమగును. జీవులలో కూడ ప్రజ్ఞగా నున్నది యితడే.

బ్రహ్మాండ దేవతలలో రెండవ తరగతివారు రుద్రులు. వీరు తరంగమయ మూర్తులై ఆకాశమున, 'రోదసి' యనబడు సంఘర్షణ రూపమైన తత్త్వముగా కల్పింతురు. వీరినుండి అణవులు మున్నగు తత్త్వములు పుట్టును. బహిర్వ్యాప్తమై ఇంద్రియ గోచరములగు శబ్ద స్పర్శ రూప రస గంధములు, సంకోచ వ్యాకోచములు, స్థానచలనము, స్పందనము, విద్యుత్తు, వేడి, వెలుగు అను మూర్తులుగా వ్యక్తమగుదురు. వీరి వెలుగు మొదలగునవి బహిర్వ్యాప్తములు. వీరు అంతరిక్ష దేవతలు అనబడుదురు.

పృథివీ దేవతలు ఎనిమిదిమంది. వీరు మనస్సు, పృథి వ్యాపస్తేజో వాయు రాకాశములు. పావకుడు లేక నిప్పు అనబడు అగ్ని, ప్రభాసుడు లేక ఘనపరిమాణము అనువారు. వీరి వలన అణువులు స్థూలతత్త్వము, భౌతిక పదార్థ ధర్మములు వర్తించును. అందు మనస్సు నుండి పంచేంద్రియములు పుట్టును. అవి అటు శబ్ద స్పర్శాదులకును, ఇటు పంచభూతములకును ప్రజ్ఞను జోడించి, అస్తిత్వము అను అనుభూతి నిచ్చును. వీరుగాక 'పితరులు' అను దేవత లుద్భవించి, ప్రతిబింబము, బీజాంకుర ధర్మములు అన్న ధర్మము, పెరుగుట అను ధర్మము కలిగించును. వీరందరును బ్రహ్మాండ దేవతలు. అణువులు, శరీరములు నిర్మాణ మగుచుండగా వీరే వానియందును వసించి పిండాండ దేవతలు అనబడుదురు. వీరుకాక రుద్రులలో వెలుగునుండి జ్యోతిర్దేవతలు పుట్టుదురు. వారు 'చిత్రశిఖండినులు'గా పురాణములలో చెప్ప బడిన ఏడుగురు. వీరి సమాహారమున అంశుమంతుడు అను కిరణమయ సూర్యమూర్తి పుట్టును. వీరికి వసులోకమున ప్రతినిధులుగా వసువులలో ప్రజాపతులు పుట్టుదురు. వీరు మనువులను దేశకాలాంతర్భాగములుగా విభజించి సంవత్సర, మాస, పక్షాది విభాగములను, మండల ప్రవృత్తులను కల్పించి సృష్టియొక్క పునరావృత్తి ధర్మమును కాపాడుచుందురు. ఇంకను రుద్రులలో వేడి నుండి ఊష్మకులు నలుగురు, మరుత్తు లేడుగురు పుట్టుదురు.

ఇది స్థూలముగా దేవతల వంశ వృక్షము. అందు మరుత్తులలో మరీచి, పవనుడు వ్యక్తమూర్తులు. మరీచి యనగా ఏడు కిరణములనుండి ఆకాశమున ఏడు విధములైన స్పందనములను పుట్టించువాడు. వీని ప్రభావముననే ఎండమావులు కనుపించుట. పవనుడనగా వీచునట్టి వాయువు. నక్షత్రములనగా నొక గోళము చుట్టును గల యాకాశమును సమభాగములుగ విభజించుటకు పరివర్తన చేయుచు ఆవృత్తులు చేయువారు. అట్టివారిలో చంద్రుడు భూమి చుట్టును తిరుగుచు, ఇరువది యెనిమిది దినములలో భూమధ్యరేఖ చుట్టును గల ఆకాశమేఖలను ఇరువది యెనిమిది సమభాగములు చేయును. వీని ప్రభావముననే స్త్రీలకు ఋతుకాలము కలుగుట జరుగును. ఈ భాగములలో సూర్యుడు చరించుచు కార్తెలు అను పదమూడు దినముల విభాగములను కల్పించి, భూమికి ఋతుకాలములను, ఋతుధర్మములను, బీజాంకురాదులను కల్పించును.)

**22.** నేను వేదములలో సామవేదమును. దేవతలలో ఇంద్రుడను. ఇంద్రియములలో మనస్సును. జీవులలో కదలికను. (ఉచ్ఛ్వాస నిశ్వాసములు ప్రాణస్పందనము వలన కలుగును. ఈ స్పందన మొక పాట వంటిది. దీని ప్రభావముననే మానవునకు, కోకిలలు మున్నగు జంతు విశేషములకు గానధర్మము దర్శన మిచ్చినది. అన్నము, వాయువు, జలము మున్నగువానిని స్వీకరించుట, అందుండి ప్రాణమయ కోశమును సారముగా పిండుట, మరల పదార్థమును మలాదులుగా విడచుట ఈ గానముయొక్క ప్రాణాపాన ధర్మములు అను లయబద్ధమైన గతివలన కలుగుచున్నవి. దీనిని సామవేద మందురు. దీనివలన నుచ్ఛ్వాస నిశ్వాసములు, కంఠము నుండి వైఖరీ వాక్స్పందనమగు రేఫము పుట్టుచున్నవి. ఈ రేఫమునే ఋషభము, ఋగ్వేదము అందురు. దీనినుండి అక్షర, పద, వాక్యాత్మకము అగు వాక్కు అర్థముతోబాటు పుట్టుచున్నది. దీనియందు సామధర్మము పనిచేయగా ఛందస్సులు పుట్టుచున్నవి. వాని మహిమ వలన దేవతలు గణములుగా విభజింపబడుచున్నారు. మనస్సు ఈ సామధర్మమును ఇంకను ఋగ్వేద ఛందోమయ వాక్కులందు ప్రస్తరింపగా, మరల మానవుడు సాధించినది, మనస్సున కీవలదియగు గానవిద్య సామ వేదముగా నవతరించు చున్నది. దీని మహిమచే గేయములు, కీర్తనలు

మానవునకు దర్శన మిచ్చినవి. దీనివలన శ్రవణేంద్రియ ద్వారమున పిండాండములోని మనస్సు, బుద్ధ్యహంకారాదులకు అతీతముగా లీనమై, సోముని ప్రజ్ఞగా పరిణమించుచున్నది. ఇదియే యోగస్థితి. దీనివలన మానవుడు కూడ బ్రహ్మాండమున కతీతమగు, గంధర్వుల నివాసమగు ఆనందమయ కోశము ననుభవించుచున్నాడు. ఇట్లు ఋగ్వేదమునకు కారణ రూపము, కార్యరూపము సామవేదము. ఇన్నిలోకములలోను గల దేవాదులు గణములుగా నేర్పడినపుడెల్ల నొక్కొక్క గణమునకు కేంద్రప్రజ్ఞ యేర్పడును. అతడే ఇంద్రుడు. ఇతడన్ని లోకముల దేవతలలోను ఏర్పడును. మానవులలో కూడ నాయకులు, ప్రభువులు, గురువులు మున్నగువారు ఇంద్రుని వ్యక్త రూపములే. వ్యక్తము కానపుడు ఈ ప్రజ్ఞ సర్వమునందు నుండును. అపుడు దానిని అగ్ని యందురు. వ్యక్తమగుట అగ్ని ప్రభావముచే జరుగును. వ్యక్త మైన వెనుక నింద్రుడగును. రెండిటి యందును వ్యాపనశీల ముండును. ఇది విష్ణువు. అగ్నికి విష్ణువునకు, ఇంద్రునకు సోమునకు స్థితిభేదమే గాని లోకభేదము లేదు. కనుకనే వీరన్ని లోకముల యందును వర్తింతురు. ఇన్నిటిని తమ తమ స్థానములలో నుండునట్లు నిలుపుశక్తి బృహస్పతి యనబడును. ఇతడు సృష్టి యజ్ఞమునకు పురోహితుడు. జీవులలో నుపదేశము, దర్శన జ్ఞానముగా పనిచేయును.

మానస సృష్టిలో నలుగురు కుమారులుగాక, తెలిసికొనుట యను శక్తి యొకటి పుట్టును. ఇది అన్ని లోకములలో సంచరించు చుండును. పురాణము లలో దీనిని నారదు డందురు. ఇతడు అధోలోకములలో ప్రత్యేక వ్యక్తిత్వమైన జ్ఞానకారణముగా పనిచేయును. ఊర్ధ్వలోకములలో భిన్న జ్ఞాన శాఖలను అనుభూతిలోనికి అంఖడత చేకూర్చు జ్ఞానముగా పనిచేయును. కనుక స్థూల లోకములలో నితడు కలహాశనుడు. వ్యక్తిగతాభిప్రాయముల కితడే కారణము. సూక్ష్మకోశములలో సోముని, విష్ణుని యనుభూతికి కారణమగును. కనుక మోక్షోపదేశమునకు పరమగురువు.

(జీవులలో చేతన యనునది కదలిక. ఈ శక్తినే ప్రాణమయ కోశము అందురు. ఇది ఆకాశము నుండి అంతరిక్షమున విద్యుత్తుగా వ్యక్తమగును. పిండాండములలో ప్రాణము అనబడును.)

**23.** నేను రుద్రులలో శంకరుడను. యక్ష రక్షస్సులలో కుబేరుడను. వసువులలో పావకుడను. శిఖరములు గలవానిలో మేరువును. (రుద్రులు అంతరిక్ష దేవతలు. వారిలో శంకరుడు ఋషభము అనబడు వైఖరీవాక్ తరంగ రూపమున వ్యక్తమగును. కనుక ఋగ్వేదమయమూర్తి, శబ్దబ్రహ్మము డమరుకము రూపమున స్పందించి, శబ్దార్థములుగా వ్యాకరణము చేయబడి, 'శం' అను జ్ఞాన దర్శనము కలిగించును.

యక్షులు సూక్ష్మశరీర నిర్మాణము చేయువారు. రక్షస్సులు స్థూలశరీర నిర్మాణము చేయువారు. వీరు నిర్మించిన దేహము పైకప్పుగా రక్షించును గనుక వీరు రక్షస్సు లనబడిరి. అందు కుబేరుడు కూడ బెట్టుట, బలుపు కలిగించుట అను శక్తుల కధిపతి.

త్రిగుణాత్మకమైన ప్రకృతిలో దివి దేవతలు తత్త్వమూర్తులు, రుద్రులు రజోమూర్తులు, వసువులు తమోమూర్తులు, గంధర్వులు విష్ణువు గుణాతీతులు.

పావకుడు పంచభూతములలో నొకడైన అగ్నిమూర్తి. దహించుట, పంచభూతములను ఒక భూతము నుండి మరియొక భూతమునకు పరివర్తనము చేయుట యితని పని. ఇతడు జలమును వాయువుగను, వాయువును జలము గను, ఘన పదార్థమును ద్రవ వాయు రూపములుగను మార్చుచుండును. ఆకలి, ఆహారము జీర్ణమగుట, దప్పిక, జీవించుటకు కావలసిన వేడి యితని వలన కలుగుచున్నవి. పచనాది క్రియలును జరుగుచున్నవి.

శిఖరి యనగా భౌతిక సృష్టికి ఆకారములను కల్పించు దేవత. ఆకర్షణ వికర్షణలు వీని యాయుధములు. ఈ దేవత మహిమ వలననే అయస్కాంతము నుండి శక్తుల దారు లేర్పడు చున్నవి. ఇతని దారులన్నియు అనేక వ్యూహా కారములుగా నుండును. అందు సుడిగుండము అను వ్యూహము మేరువు. ఇది ప్రాధాన్యము వహించును. దీని వలననే ఆకాశమున గోళాకారము లుద్భవించుట, ధ్రువము లేర్పడుట జరుగును. ఇవే ధర్మములు గ్రహ గోళములకు సంక్రమించును. భూ పరిభ్రమణమున గూడ నుత్తర దక్షిణ ధ్రువములందు ఈ సుడిగుండములు చాల యెత్తువరకు తిరుగుచుండును.

వేగముగా నావ పోవుచుండగా దానికి ముందు, వెనుక జలములందు ఏర్పడు రేఖాకారము లివియే.)

**24.** పురోహితులలో ముఖ్యుడగు బృహస్పతిని నేను. (ఇచ్చట ముఖ్యుడనగా ముఖమునకు సంబంధించినవాడు లేక ఉచ్ఛారమునకు కారణమైనవాడు, వాగ్రూపుడు అని అర్థము.) సేనా నాయకులలో నేను స్కందుడను. జలాశయములలో సాగరమును. (ధైర్యము, సాహసము, రక్షణము అను ధర్మముల కధిపతి స్కందుడు. క్షాత్రధర్మము నితడు కలిగించును. గ్రహములలో కుజు డితని వ్యక్తరూపము. యుద్ధము, ధర్మరక్షణము ఇతని ప్రభావమున జరుగు చున్నవి.)

**25.** మహర్షులలో నేను భృగువును. వాక్కులలో నే నొకే యక్షరమును, యజ్ఞములలో జప యజ్ఞమును, స్థావరములలో హిమాలయమును. (మహర్షులు అనగా చూచువారు లేక జీవులు చూచుట కాధారమగు కిరణములు. వీరు వ్యక్తములైన వెలుగులు. తత్త్వముచే తెలివియొక్క విభాగములు. వీరు కన్నులకు ఏడు రంగులుగను, మనస్సునకు ఏడు ప్రజ్ఞలుగను, బుద్ధికి ఏడు శాస్త్రములుగను దర్శన మిత్తురు. వీరిలో స్వచ్ఛత, స్పష్టత, ప్రసాదగుణము అనునది సర్వశాస్త్ర దర్శనములకును ప్రధానము. అది కన్నులకు తెల్లని కిరణముగా గోచరించును. అతడే భృగువు. శుక్రత్వము ఇతని ధర్మము. సౌర కుటుంబమున శుక్రగ్రహము ఇతని ప్రభావమున కలిగినది. శరీరమున శుక్రధాతువు ఇతని ప్రసాదమున వ్యక్తమై, దేహమును విడచిన జీవులకు దేహములు కల్పించుట యను మృతసంజీవినీ విద్యను ప్రయోగించు చున్నట్లు పురాణములలోని యర్థవాదము. ఆకారములను కల్పించుట, స్పష్టము చేయుట శ్వేత కిరణము ధర్మము. గర్భమునందు పిండముగా ఆకారమును దేహ కల్పనము చేయుట శుక్రధర్మము. కనుక ఆకార వర్ణనమునకు ఆధిపత్యము వహించి యితడు 'కవి' యనబడు చున్నాడు. ఈ ధర్మమును పాటించు ప్రజ్ఞ యందు ఇతని పేరు ఉశనసుడు.

వాక్కులలో నొకే యక్షరమనగా వాక్కులు దిగివచ్చుచున్న శ్వాసకు మూలమగు ఓంకారము. యజ్ఞము లన్నిటికిని మనస్సును సంస్కరించుట ప్రయోజనము. అందు జపము ప్రాముఖ్యము వహించును. ద్రవము నుండి

ఘనపదార్థ మయి కట్టుకొనుటలో మొదటిది నీటి నుండి గడ్డకట్టుట. అదియే హిమాలయము.)

**26.** సర్వ వృక్షములలో అశ్వత్థము నేను. దేవర్షులలో నారదుడను, గంధర్వులలో చిత్రరథుడను. సిద్ధులలో కపిలుడను మునిని.

(వృక్షములలో కొన్ని మానవునకు బ్రహ్మజ్ఞానము కలిగించును. అనగా స్థూలతత్త్వము నుండి ప్రజ్ఞను ఆత్మ కున్ముఖమైన సూక్ష్మ తత్త్వములలోని కుద్ధరించును. అట్టి వానిని బ్రాహ్మీకరణములు అందురు. వానిలో అశ్వత్థము అనగా రావిచెట్టు ముఖ్యము. బృహస్పతి గ్రహము నుండి ఆ పేరుగల దేవత యొక్క జ్ఞానతత్త్వము ఈ వృక్షమునందు హెచ్చుగా నెలకొనును. కనుకనే వేద సంప్రదాయమునుండి హోమ ద్రవ్యములలో 'పిప్పలము' అను పేరుగల యీ వృక్షము ప్రాముఖ్యము వహించును. బ్రహ్మచారులు, యజ్ఞదీక్ష కలవారు దీని దండమును మోదుగ కర్రతోపాటు పవిత్రముగా చూతురు. వేదములలో అశ్వ మనునది జీవులలోని ప్రాణమయ కోశము. జీవప్రజ్ఞ వృక్షత్వము, జంతుత్వము, అందుండి మానవత్వము అను కక్ష్యలలోనికి పరిణామ క్రమమున నుదయించుట ఈ యశ్వమను ప్రాణమయ కోశము నుండియే జరుగుచున్నది. అనుదినము సూర్యోదయమున జీవులు మేల్కాంచు మెలకువ కూడ దీని వలననే. ఈ శక్తి మేధ్యము అనబడును. అనగా ప్రజ్ఞ కున్ముఖముగా నడచు చుండును. "ఉషస్సు అనగా మేధ్యమైన అశ్వము యొక్క శిరస్సు" అను మంత్రముతో బృహదారణ్యకము ఆరంభించును. దీని నుపాసించు క్రమమే వేదములలో అశ్వమేధము అనబడును. ఇదియే తంత్ర శాస్త్రమున హయగ్రీవుడు అను సకల విద్యాధిదేవతగా నుపదేశింపబడినది. ఈ మార్గము నుపాసించు వారు రావిచెట్టును పలు విధములుగా వినియోగింతురు. కనుక దీనికి అశ్వత్థ మని పేరు గలిగినది.

నారదుడు బ్రహ్మ మానస సృష్టిలో ముఖ్యుడు. కుమారు లనబడు నలుగురిని కర్మ సంఘము లేక సృష్టి కతీతులుగా నుండునట్లు చేసినదితడే. ధ్రువప్రహ్లాదాదులకును, వ్యాసుడు, వాల్మీకి మున్నగు మానవ ఋషులకును గురు వీ దేవర్షియే. ప్రతి జీవియు వైరాగ్యము, వినయము, సజ్జన సేవ, కర్మ

వైముఖ్యము లేకుండుట, సంగము లేకుండుట అను మార్గమున సాధన చేసి శరీర త్యాగము చేసిన వెనుక కల్పాంతమగు నారదత్వము నొందవచ్చునని ఈ ఋషి భాగవతమున వ్యాసున కుపదేశించెను.

గంధర్వులు బ్రహ్మాండమున కతీతులగు అంతర్యామి మూర్తులు, గాంధర్వ విద్యకు అధిపతులు. చిత్రరథుడు శ్రావ్యతకు అధిపతి.

సిద్ధులు సృష్టి కర్మలో పిండాండ నిర్మాణ కౌశలముల కధిపతులు. అందు కపిలుడు పిండోత్పత్తికై కావలసిన ప్రకృతి పురుష వివేకము. ప్రకృతిని భూత తన్మాత్రలుగను, త్రిగుణములుగను, ఇంద్రియాదులుగను విభజించుటకు అధిపతి. ఈ విభాగమునే సాంఖ్యమందురు. దీనివలననే ఉత్పన్నమైన పిండము వృద్ధి చెందుచున్నది. మరియు పిండమునందు 'సంఖ్యలు' అనబడు దేవతల నాహ్వానించి, శరీర విభాగముల యందు సంఖ్యా పరిమితిని నెల కొల్పును. రెండు చెవులు, రెండు కన్నులు, ముప్పది రెండు దంతములు మున్నగు సంఖ్యా పరిమితి పిండమునందు గలుగుట యీ సిద్ధుని వలననే.)

**27.** అశ్వములలో నేను ఉచ్చైశ్రవసము. గజేంద్రులలో నేను ఐరావతము, నరులలో నరాధిపుడను.

(అమృత మథనమున పుట్టిన అశ్వ ముచ్చైశ్రవసము. దీని నింద్రుడు స్వీకరించెను. దీనిని చూచి వినతా కద్రువలు పన్నిదము సరచుటతో గరుడుని యుద్భవము సంభవమైనది. ఆకాశమున శబ్ద స్పర్శ రూప రస గంధములను భూత తన్మాత్రలును, భూతములు, జీవుల యింద్రియ శక్తులు అంతర్లీనమై నీటిలో కరిగిన ఉప్పు, చక్కెర మొదలగు వానివలె నుండును. అందుండి వానిని వ్యక్తము చేయుటకు దేవాసురులు చేయు మథనమే అమృత మథనము. ఒక కేంద్రము నేర్పరచుటయే మందరము. కాలమును గొనివచ్చుటయే వాసుకి. ఈ మథనమున ఆకాశము నుండి శబ్దగుణము తద్భిన్నముగ నుద్భవించును. ఇది ప్రాణశక్తులతో నొకటి గనుక అశ్వమని పౌరాణికులచే సంకేతింపబడినది. ఇది శ్రవణేంద్రియమునకు లక్ష్య మగుటవలన ఉచ్చైశ్రవసము అను పేరు సంకేతింపబడినది. నిక్కిన చెవులు గలదియని ఈ పేరున కర్థము. జీవులలో ప్రాణశక్తికి ప్రతిరూపమగు గుఱ్ఱము కూడ

నశ్వమని వ్యవహరింపబడును. మంచి జాతి గుఱ్ఱమునకు చెవు లెప్పుడును నిక్కియుండుటయు, శబ్దగ్రహణ సూక్ష్మతయు లక్షణములని అశ్వశాస్త్రము చెప్పును. మానవులలో శ్రవణేంద్రియమున గల శబ్ద గ్రహణశక్తిని అశ్వ మందురు. శబ్దము తరంగముగా నుద్భవించిన వెనుక పరిమితత్త్వము నంది మరల ఆకాశములోని కంతరించును. దీనినే ఆహత శబ్దము అందురు. ఇదికాక ఆకాశములోని శబ్ద గుణమును అనాహత శబ్దమందురు. ఇది అమృత స్వరూపము. కనుక నుచ్చైశ్రవసము అమృతోద్భవము.

ఐరావతము ఇంద్రుని యేనుగు. జలములలో అగ్ని యున్నదని వేదములు చెప్పును. ద్రవస్వరూపమైన జలము మేఘత్వ మందుటకై ఆవిరి యగుటకు నీ యగ్ని వినియోగపడును. జలముల స్థితిలో నిమిడియున్న అగ్నిని 'బడబ' యను అశ్వమనియు, మేఘ స్థితిలోనున్న జలములలో నిమిడి యున్న వైద్యుతాగ్నిని 'ఐరావత'మనియు పౌరాణికులు వ్యవహరింతురు. ఇది మెఱపులు మెఱిపించుట, పిడుగులు ప్రేలించుట రూపమున అసుర సంహారము చేయునట్లును, మేఘాధిపతియగు నింద్రుని వాహనమైనట్లు పురాణకవి సమయము.

నరులలో నరాధిపుడు అనగా రాజు, నాయకుడు, గురువు, ఇంటికి యజమాని, యజ్ఞమున యజమానుడు మున్నగు లక్షణములు. ఇవి యన్నియు నింద్రత్వమునకు చిహ్నములు.)

**28.** ఆయుధములలో నేను వజ్రము. ధేనువులలో కామధేనువు. పుట్టించువారిలో కందర్పుడు. సర్పములలో వాసుకి.

(విద్యుచ్ఛక్తి యొక్క వ్యక్తవైభవమును వజ్రము అందురు. ఇది ఉఱుము, మెఱపు, పిడుగు అను రూపమున వ్యక్తమగును. ఐరావత మింద్రుని వాహన మైనట్లు వజ్ర మింద్రుని శక్తి. దీనివలన మేఘము లందలి జలములు ప్రాణముతో వీర్యవంతము లగును. ఆకాశమునందలి అంతర్గూఢమైన ప్రాణశక్తి విద్యుత్తుగా వెలువడి మేఘజలముల వర్షధారల వలన భూమిపైనున్న యంకురములను ప్రాణులుగా మేల్కొల్పును. ఈ ప్రాణశక్తికి చుట్టును ఆవరించి యుండు పృథివ్యాకాశాది భూతతత్త్వములు పొరలు పొరలుగా

క్రమ్మియుండును. ఇవియే వృత్రములు లేక వృత్రుని దేహములు. పిడుగు ప్రేలుటయే వృత్రవధ. ఈ వజ్ర ప్రహారముతో మేఘాధిపతియగు నింద్రుడు కాష్ఠలు అనబడు కాల దేశ సూక్ష్మ విభాగములుగా వృత్రుని దేహమును విభజించును. ఈ విభాగములలో నింకొకటి ఇమిడియుండుటకు వీలులేని సూక్ష్మత్వ ముండును. కదలకున్న యాకాశమున నివియే కదలిక లగును. "*అతిష్ఠతీనాం అనివేశినీనాం, కాష్ఠానాం నిహితం శరీరం*" అని ఇంద్రునిచే బ్రద్దలు కొట్టబడిన వృత్రుని శరీరస్థితి వేదములలో చెప్పబడినది. ఈ స్థితిని గలుగచేయునది వజ్రము.

ధేనువు లనగా గోవులు. ఇవి శరీరములోని గ్రంథులకును, అందుండి వర్షించు రసములకును, వానివలన కల్పితములగు తన్మయీకరణ ప్రజ్ఞలకును సూచకములు. సంగీతమునకును వీనికిని సంబంధ మున్నది గనుక గంధర్వులు గోగణముల పరిపాలకులుగా వేదకవి సమయము. ఆకాశమున సూర్యుడు అంతర్గూఢ తత్త్వములను కిరణములుగా వ్యక్తముచేయు గ్రంథి. ఆవు శరీరమున ఆహార పానీయాదులు, రక్తాది ధాతువులుగా మారిన వెనుక అందుండి క్షీర ధాతువును వ్యక్తము చేయు గ్రంథి పేరు గోవు. మానవుని కంఠము నుండి వచ్చు వైఖరీ వాగ్ధ్వనిని గాంధర్వ విద్యగా శ్రుతి లయబద్ధము చేయు శక్తికిని గోవు అని పేరు. లయ విభేదములే గోరూపములైన ఛందస్సులుగా చెప్పబడినవి. వానివలన తన్మయీకరణము కలుగును గనుక, ఈ స్థితిలోని సామ వాక్కు కామధేనువు అనబడినది. లౌకిక సంభాషణాదికము లలో శబ్దార్థములను నిర్వహించి, ప్రయోజనములను ప్రశ్నోత్తర రూపమున సాధించు జ్ఞానము కూడ యీ గాంధర్వశక్తి వలననే ఏర్పడుచున్నది. కనుక వాక్కు కామధేనువని వేదకవి సమయము. ప్రజననము అనగా పుట్టించుట, జీవులకు శరీరములను కల్పించుట. ఇది దేవతల యజ్ఞముగా సృష్టిలో జరుగుచున్నను, జీవుల యుపకరణము వలన జీవులు పుట్టుచున్నారు. ఈ యజ్ఞమును జన్మింపజేయుట దేవతల యజ్ఞము. కనుక జీవులనుండి మాత్రమే జీవుల దేహములను పుట్టించుట వారి ప్రణాళిక. దీని కొరకై జీవులు అప్రమత్తులై యీ ధర్మమును నిర్వహింప జేయుటకొక శక్తి కావలెను. ఆ శక్తియే కామము. కామమును జీవుల మనస్సుల నావేశింపజేయు దేవత

కందర్పుడు. వీనినే మన్మథుడందురు. సృష్టించుటలో మాధుర్యము కల్పించుట వలనను, తరతరములు గణుపులుగా పొటమరించుట వలనను, చెఱకుగడ ఇతని విల్లుగను, పంచేంద్రియములు ఇంద్రియార్థముల యందు పుష్పించునట్టి స్వభావము ఐదు కుసుమా యుధములుగను, మనస్సులనుండి ఇతని యుద్భవము కలుగుచున్నట్లును పురాణ కవి సమయ మేర్పడినది.

సర్పములు కాలమునకు సంకేతములు. అహోరాత్రములు, పక్షములు, అయనములు, ఉచ్ఛ్వాస నిశ్వాసములు అనునవి రెండు నాలుకలుగను, కాలమున వ్యక్తమగు దృశ్యమాన ప్రపంచములోని వివిధత్వము పొలుసులతోడి కుబుసముగను భావింపబడినది. ఇట్టి కాలము రెండు విధములని ఋషుల మతము. 1) సాగిపోవు కాలము, 2) శాశ్వతత్త్వమున దాగియున్న కాలము. అందు మొదటిది వర్తమానము, రెండవది భవిష్యత్తుగా వ్యవహరింపబడును. అందు మొదటిది సర్పము అని సంకేతింపబడినది. ఇది ప్రసర్పణమగు కాలము. జీవుల వాసముగా అనగా ఆయువుగా నిది వ్యక్తమగుచున్నది. గనుక, వాసుకి యని దీనికి పేరు. ఇదియే అమృత మథనమునకు కవ్వపుత్రాడు.)

**29.** నాగములలో నేను అనంతుడను, యాదస్సులలో వరుణుడను, పితరులలో అర్యముడను, యమించువారిలో యముడను.

(ఇక రెండవదియైన భవిష్యత్తున దాగియున్న కాలము కదలియు కదల కుండునది. న + అగము. కాల మనగా కదలిక. కదలకుండునట్లు త్రొక్కిపెట్టబడిన కదలిక. విత్తనములలో అంకుర శక్తిగను, రాబోవు వృక్షముగను ఇమిడియుండును. మొలచుట యారంభింపక ముందు ఇది కదలకుండ అణచిపెట్టబడి యుండును. ఇట్లే సమస్త జీవుల బీజశక్తియు. ఇది జరిగినది, జరుగుచున్నది కాక, శేషించినది కనుక శేషుడనియు, ఆదితత్త్వము గనుక ఆదిశేషు డనియు, ఇంకను పరిణామములోనికి అంతవంతము కాలేదు గనుక అనంతుడనియు వ్యవహరింపబడును.

యాదస్సులు అనగా జలచరములు. ఇవి చేపలు, తిమింగలములు, మకర కుళీరాదులు మున్నగునవి. ఇవి యన్నియు తమ బీజశక్తిచే జలములలో

జీవములై రూపము ధరించును. కదలిక జీవలక్షణము. ఇది జలమునందు అగ్నిగా అనగా మొలకెత్తించు శక్తిగా నుండును. జీవుల దేహములలోనికి రాకముందు ఈ శక్తియే నీటిని ప్రవహింపజేయుటకు మిట్టపల్లము లెరుగుటకు కారణమగును. ఇట్టి ద్రవధర్మముల కధిదేవత వరుణుడు అనబడును.

పితరులు జీవుల గర్భధారణాది శక్తుల కధిపతులు. అందు కర్షణము లేక సంఘర్షణము ఒక యావశ్యకమైన శక్తి. దున్నుట వృక్షముల విషయము నను, ఆకర్షణాలింగన సంభోగాదులు పశుపక్ష్యాదుల, నరుల విషయమునను ప్రజననమునకు ఆవశ్యకములు. ఇట్టి ధర్మముల కధిపతి అర్యముడు. ఈ శక్తివలననే శబ్ద శ్రవణేంద్రియ సంఘర్షణమున వాగర్థములును, నేత్రకిరణ సంఘర్షణమున రూపాదులును, సర్వేంద్రియ ప్రవృత్తులను జ్ఞానము యొక్క ప్రజననమునకు కూడ కారణమగుచున్నవి. అర్యముడు సూక్ష్మలోకములలో జ్ఞానమును, కామ లోకములలో సుఖమును, స్థూలలోకములలో దేహమును ప్రజననము చేయును.

పై జెప్పిన ప్రజననాది ప్రక్రియలలో దేహములు, పంచభూతాదులు మున్నగునవి రక్షింపబడుటకు ప్రవృత్తి నివృత్తుల ఆవృత్తి యావశ్యకము. ఇది లేనిదే దేహాదులు కాలమున నిలబడవు. దీనినే సామాన్యముగా విశ్రాంతి, విరామము, సేదదీరుట యందురు. ఇట్టి ప్రవృత్తి అప్రవృత్తులను నియమించు టకు ఏర్పడిన దేవత యముడు.)

**30.** దైత్యులలో నేను ప్రహ్లాదుడను, లెక్కించువారలలో నేను కాలమును, మృగములలో మృగేంద్రుడను, విహంగములలో వైన తేయుడను; అనగా గరుత్మంతుడను.

(దితి సంతతివారు దైత్యులు. హిరణ్యాక్ష హిరణ్యకశిపులు దితి సుతులు. అందు హిరణ్యకశిపుని సుతుడు ప్రహ్లాదుడు. ఐనను జాతితో సంబంధము లేక దైవానుభూతి యెల్ల జీవులకు గమ్యమని నిరూపించిన గురు వితడు. దితి యనగా సూర్యాస్తమయమునకు అధిదేవత. వెలుగులు చీకటిలోనికి పోవుట, బ్రహ్మతత్త్వము సూక్ష్మము నుండి స్థూలములోనికి ప్రవేశించుట అనువానికి ఈమె యధిదేవత. ఇట్టి ప్రకృతి విభాగము త్రిగుణములలో

తమోగుణ మనబడును. దాని ప్రభావమున జీవుడార్తుడై, ఆనందమయ కోశమును వెదకికొను ఆవశ్యకమగు ప్రజ్ఞ యేర్పడును. ప్రహ్లాద శబ్దమునకు హ్లాదము లేక ఆనందము అని అర్థము.

కలనము అనగా గణనము. సంకలన వ్యవకలనాదులు దీని ధర్మములు. ఈ ప్రజ్ఞయే కాల మనబడును. దీనియందు జగత్తులు వ్యక్తావ్యక్త స్థితులను పొందుచున్నవి.

జంతువులలో సింహము గాంభీర్య ధైర్య శౌర్యాదులకు ఉప లక్షకము. కనుక క్షాత్రము అనబడు దివ్యకళకు జంతువులలో నిది ప్రతినిధి.

వైనతేయుడు అనగా వినత కొడుకు; గరుత్మంతుడు. ఇతడు తల్లి దాస్యమును పోగొట్టుటకు అమృత కుంభమును భూమికి గొనివచ్చి నారాయణు నకు వాహన మయ్యెను. స్థూలపదార్థ తత్త్వమునకు ఉచ్ఛ్వాస నిశ్వాస స్వరూపుడై ప్రాణమగు అమృతమును గొనివచ్చి దాని స్పర్శ నిచ్చి, సర్వాంతర్యామి యగు దేవుని జీవునిగా స్థాపించుటచే తల్లియగు సూక్ష్మప్రకృతి దాస్యమును విడిపించి, పరమాత్మకు జీవాత్మ యను వాహన మగుచున్నాడు.)

**31.** శుభ్రపరచు శక్తులలో నేను పవన స్వరూపుడను. శస్త్రమును ధరించిన వారిలో రాముడను. నీటియందు ఈదు జీవులలో మొసలిని. నీటి వెల్లువలలో జహ్నుని పుత్రికయగు గంగను.

(అగ్ని, జలము, వాయువు శుభ్రపరచు దేవతలు. పృథివీ తత్త్వముచే చేయబడిన వస్తువులను, శరీరాదులను ఈ మూడును శుభ్రపరచును. ఆకాశము శుభ్ర స్వరూపమే గాని అందు శుభ్రపరచు ధర్మము లేదు. జలము పరచినపుడు తడుపుట యను ధర్మమున్నది. అటుపైన వాయు స్వరూపమగు నీటి యావిరిగా మారియే శుభ్రపరచుట జరుగును. అగ్ని శుభ్రపరచినను భౌతిక ద్రవ్యమును నిశ్శేషము చేయును. ద్రవ్యమునే స్వయముగా పృథివీ తత్త్వము నుండి జల, వాయు తత్త్వములుగా మార్చి వేయును. ఇక పృథివీ తత్త్వమునందు కరగెడు వానిని, కరుగని వానిని, అప్పటి స్థితికి భంగము లేకుండ శుభ్రము చేయు ధర్మముగలది వాయు తత్త్వ మొక్కటే. మరియు పవనుడు అనబడు వీవన ధర్మముగల వాయువు

దేహమునందు అనేక వాయుదేవతలు వర్తించుచు ఆవశ్యకతను బట్టి పరస్పరము రసాయనికములైన పరిణామములతో శుభ్రము చేయుదురు. ఉదాహరణకు ప్రాణవాయువు రక్తాదులలోని మృత్యు రూపమగు బొగ్గు పదార్థమును దగ్ధము చేసి శుభ్రము చేయును. కనుక పవిత్రము చేయు దేవతలలో పవనుడు ముఖ్యుడు.

శస్త్రము ధరించిన వారిలో ధర్మరక్షణ చేయువారు దైవాంశులు. అట్టి వారిలో రాముడు సత్యపరాక్రముడు, ధర్మమునకు విగ్రహమూర్తి. కృష్ణావతారమున ధర్మ రక్షణ మున్నను, శస్త్రము ధరించుట ముఖ్యము కాదు గనుక ఇందు పోలిక కలుగలేదు. రాముడనగా పరశురాముడని కొందరు వ్యాఖ్యానించిరి. ఆ యవతారమున అధర్మ నిర్మూలనమే గాని ధర్మ రక్షణమున కవకాశము లేదు. కనుకనే రామావతార దర్శనముతో పరశురామావతార తత్త్వము ఉపసంహరింప బడినది.

జలచరములలో మొసలి అతీతమైన గ్రాహశక్తికి చిహ్నము. కనుకనే గ్రహమనియు పేరు. ఆ శక్తి అతీతముగ నే శరీరమున రూపొందునో అందు ఆ తత్త్వముగా ప్రకృతిమయ మూర్తిగా దేవుడున్నాడని భావము.

జాహ్నవి యనగా గంగ. ఆకాశము నుండి శివుని జడల మీదుగా దిగివచ్చిన ఏడవ పాయ జహ్నునిచే గ్రోలబడి వాని కర్ణమునుండి అంగీకరింపబడిన తర్వాతనే జాహ్నవియైనది. ఆకాశమున నిమిడియున్న పర్జన్య మూర్తియే గంగాప్రపాతము. మేఘములు శివ జటాజూటము. అందుండి భూమికి దిగిన ధారయే జాహ్నవి యని పురాణ సంకేతము. ఈ జలము పవిత్రీకరణము చేయబడి నదులుగా భూమికి దిగివచ్చును. కనుక స్వచ్ఛమైన వర్షజలము భగవానుని నారాయణమని వేదములు కీర్తించుచున్నవి.)

**32.** ఈ సృష్టులకు ఆది, అంతము, మధ్యము నేను. విద్యలలో నధ్యాత్మ విద్య నేను. వాదించువారిలో వాదించు శక్తి నేను. (సృష్టికి ఆది అనాది; అంతము అనంతము; కనుక సృష్టి యంతయు మధ్యము. అది రజోగుణ ప్రకృతివలన సంకల్పింపబడును. దీనినే మహాకామము, మొదటి సంకల్పము అని వేదములు "సోஉకామయత" మున్నగు మంత్రములలో

నిర్వచించినవి. ఈ రజోమూర్తి చతుర్ముఖ బ్రహ్మ. అంతము తమోగుణ ప్రకృతివలన కలుగును. ఇది మహేశ్వర స్వరూపము. మధ్యము లేక స్థితి సత్త్వము. ఇది రజస్తమస్సుల సామ్యము; విష్ణుతత్త్వము. ఈ మూడు విధము లైన ప్రకృతియు నా పరాప్రకృతి యని స్వామిచే రాజవిద్యా రాజగుహ్యమున చెప్పబడినది.

విద్య అనగా తెలియదగినది. తెలిసికొనువాడు 'నేను'గా నుండి, తెలియదగినది 'నేనుకన్న వేరు' (అనాత్మ) అను తత్త్వముగా భాసించును. దీనిని చీకటియనియు, ఐతరేయము అనియు ఋగ్వేదము కీర్తించును. అందుగల అనాత్మ భావము 'మాయ' లేక భ్రాంతి. ఇది తొలగుటయే ఆధ్యాత్మ విద్య. దీనినే ఉపనిషత్తు "సయశ్చాయం పురుషే యశ్చాసా వాదిత్యే స ఏకః" అని యుపదేశించును. "ఈ నా పురుషునిలో నెవరున్నారో ఈ సూర్యుడుగా నెవరున్నారో వాడొక్కడే, నేను" అని యీ మంత్రమున కర్థము. ఈ జ్ఞానము కన్న తెలియదగిన భగవంతుడు లేడు కనుక తాను ఆధ్యాత్మ విద్యయని పలికెను.

వాదించువారు తర్క న్యాయాది మార్గము లవలంబించి వాదించుట యను మార్గమున మానవులు సత్యమును నిరూపింప యత్నింతురు. ఒకని మార్గ మొకనికి సత్యము గాకున్నను, జరుగునది సత్యాన్వేషణము గనుక వాదించి జయింపగల ప్రజ్ఞ భగవంతుని యనుభూతి.)

**33.** అక్షరములలో నేను అకారము. సమాసములలో ద్వంద్వ సమాసము. క్షయము లేని కాలముయొక్క మూలస్వరూపము నేను. సర్వ జీవుల సుఖముగా పనిచేయుచున్న విధాతను నేను.

(అక్షరములు సంస్కృతమున అకారాది క్షకారాంతము. అన్ని భాషల లోను క్షకారాంతము కాకున్నను, అకారాదియే ఈ ధ్వని ముఖద్వారముయొక్క ప్రథమ వివృతిని సూచించును. ఓంకారము శ్వాసలోనిదగు జీవ స్వరూపము గనుక నుచ్చరింపబడు అక్షరములలోనిది కాదు. అది అ + క్షరము. అనగా నాశము లేనిది. మిగిలినవి అక్ష + రములు. అనగా కేంద్రము నుండి పరిధికి ప్రజ్ఞకు అక్షరములుగా వెలికి తీయబడునవి. అందు మొదటిది అకారము.

వాక్య నిర్మాణ వ్యాకరణము కర్త కర్మ క్రియ అను రూపమున జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అను త్రయీమూర్తి, సృష్టిగా వ్యాకరింపబడుటకు వాఙ్మయ ప్రతిబింబము, అందు సమాసములు– ప్రకృతి. భూతతత్త్వములకును రెండింటి సమ్మేళనమునకు ప్రతిబింబములు. ఇన్నిటిలో ద్వంద్వ సమాసము ప్రకృతి పురుషుల యోగమునకు ప్రతీక.

అక్షయమైన కాలము అనగా త్రికాలముల కతీతమగు మహా కాలతత్త్వము. ఇందు త్రైకాలిక సృష్టియంతయు సమకాలికత్వము వహించి యుండును. ఉదాహరణకు ధాన్యము, విత్తనము, మొక్క, కంకె అనునవి వేర్వేరు కాలములలో వ్యక్తమగుటకు సంవత్సర మూర్తియగు ప్రజాపతిలో ఈ మూడు బొమ్మల గ్రంథముగా వర్తించును. దీనినే 'మహాకాలము' (Fourth Dimension) అందురు. ఇది శాశ్వతత్త్వమునకు నిదర్శనము గనుక భగవంతుని విభూతి.

ధాత యనగా సృష్టిగతులను విధానము చేయువాడు. వీనినే విధి, విధాత అనియు నందురు. ఇతడు దివ్యమానుష సకల కర్మలకు, వాని విపాకములకు నధిపతి.)

**34.** సర్వమును హరించు మృత్యువును నేను. పుట్టబోవు వారి పుట్టుకను నేను. కీర్తి, సంపద, వాక్కునందలి సాధుత్వము, స్త్రీల పుణ్యశీలత, మనుష్యుల స్మృతి, జ్ఞానము, మేధ, ధైర్యము, క్షమ అనునవి నా విభూతులు.

(మృత్యువు జీవుల రూపములను హరించి మూలభూతములను యథా స్థానములకు చేర్చుట. దీనివలన నూతన దేహములకు పంచభూత ద్రవ్యము సంసిద్ధపడుట, జీవులకు నిత్యము నూతన శరీరములు లబ్ధి యగుట సాధ్యపడుచున్నది. ఇట్లు సాధ్యపడుటయే పుట్టబోవువారి పుట్టుక.

కీర్తి సత్ప్రవర్తనకు నితరుల యందు గలుగు మెచ్చుదల. అనగా దైవ సంస్మరణమే. సంపద జీవుల సద్వినియోగమునకు అజ్ఞాతముగా సంకల్పము లను ప్రేరేపించును. స్వార్థము రూపమున ఆత్మహితము నేర్పి, దానిని రక్షించుకొనుటకు పరహితమను కామ్యకర్మగా నేర్పును. పర్యవసానము అజ్ఞాతమైన జగద్ధితము గనుక నిది భగవద్విభూతి.

వాక్కు బ్రహ్మ స్వరూపము. అనగా నుచ్చరించువాడు శబ్దార్థముల రూపమున నితరులలోనికి వ్యాప్తమగుట. స్త్రీల పుణ్యశీలము జాతి స్వచ్ఛతకు, అభ్యుదయమునకు, పురుషుని సుఖశాంతికి నిమిత్తకారణము. స్మృతి యనగా వాసనాబలమున అప్రత్యక్షమైన దానిని ప్రమాణముగా స్వీకరించుట. దీని యభ్యాసమున పరమాత్మ స్మరింపబడుట సాధ్యమగును. మేధ యనగా ఇంద్రియ గోచరమగు తత్త్వము నుండి యంతర్లీనమగు తత్త్వమును గ్రహింప గలుగుట. ధృతి యనగా ధైర్యము వహించుట; తన్ను తాను ధరించుకొనుట. ఇది బాహ్య నిమిత్తముల ప్రమాణములతో నారంభమై, క్రమముగా ఆత్మ ప్రమాణమునకు చేర్చును. అభ్యాసాంతమున సాధకుడు తనయందున్న పరమాత్మయందు ధరింపబడును. క్షమ యనగా ఓర్పు. దీనివలన అపరాధులు, పాపము చేసినవారు తమ తప్పును తెలిసికొనుట, లోకములోని సత్ప్రవర్తనమును అంగీకరించుట యలవడును. కనుక నివి యన్నియు వాసుదేవుని సద సద్రూపములైన సత్పరిణామాత్మక లీలావిభూతి స్వరూపములు.)

**35.** సామలలో నేను బృహత్సామ, ఛందస్సులలో నేను గాయత్రి, మాసము లలో మార్గశీర్షము, ఋతువులలో పువ్వులందు తేనేగూర్చు వసంత ఋతువు.

(సామవేదమున మంత్రములు సామ లనబడును. పాడబడునవి యని ఈ పదమున కర్థము. జీవ ప్రజ్ఞకు వేదపురుషుని ప్రజ్ఞతో సామ్యము కూర్చునవి యనియు నర్థము. సమత్వము యోగమని కృష్ణుని నిర్వచనము. సామ లన్నిటిలో బృహత్సామ గవామయన యజ్ఞమును, తన్మూలమున సోమ యాగమునను ప్రాధాన్యము వహించును. ఉచ్ఛ్వాస నిశ్వాసములకు మూలమైన ప్రాణాపాన ప్రజ్ఞ జీవుని స్వరూపమగు సామవేదము. అందు సమాన వాయువు అనబడు సామ్యస్థితి 'సోఽహం' అను మంత్రము నడుమ ఓంకారముగా తెలియబడును. దీని యనుభూతియే సమాన వాయువుగా ప్రాణాపానముల సామ్యమెరిగిన ప్రాణాయామ పరాయణులచే ననుభవింప బడుచున్నది. ఇదియే బృహత్సామ.

ఛందస్సులు దేశ కాలముల కొలతలు. కాలమును శ్రుతిగా, కాలము లను స్వరములుగా, దేశమును లయగా నాధారము చేసికొని ఛందోగణములు

అహోరాత్ర పక్ష మాసాది విభాగములుగను, వృక్ష పశు పక్షి మానవాదులలో ఋతు ధర్మములుగను వ్యక్తమగును. అందు సంవత్సరము ఒక పరిపూర్ణ సృష్టికి ప్రతీక. చాంద్ర సంవత్సరమున పండ్రెండు పూర్ణిమలు, పండ్రెండు అమావాస్యలు, మొత్తమిరువది నాలుగు పర్వము లేర్పడును. ఇవియే 'అహో రాత్రము'న మొదటి చివరి అక్షరములు లోపించుచు 'హోరా' యను శబ్దమున తెలియబడుచున్నవి. ఇదియే ఇరువది నాలుగక్షరముల గాయత్రీ ఛందస్సు. అందు సంవత్సరమూర్తి యగు ప్రజాపతి గానము చేయబడును.

మార్గశీర్షము ధనుర్మాస మనబడు పవిత్ర మాసము. మానవ సంవత్సరము దేవతల కొక అహోరాత్రము కాగా, మాసము రెండు హోరల కాలమగును. సూర్యుడు ఉత్తరాయణమున మకరస్థుడగుటతో దేవతలకు సూర్యోదయమగును, దానికి ముందున్న మాసమే మార్గశీర్షము. ఇది దేవతల బ్రాహ్మీకాలము. అనగా సూర్యోదయమునకు ముందున్న రెండు హోరల కాలము అగుచున్నది. ఇందు పవనరూపులై దేవతలు సూర్యస్థుడైన అగ్నిని ఉత్తరాయణ మూర్తిగా మేల్కొలుపుచు గానము చేయుచుందురని శ్రుతులు కీర్తించుచున్నవి.

సంవత్సరమను యజ్ఞమునకు వసంతము నేయి వంటిది, గ్రీష్మము సమిధ వంటిది, వర్షఋతువు వంటపాత్ర వంటిది. శరదృతువు సంవత్సర పురుషుని జఠరాగ్నిలో హోమము చేయబడు సిద్ధాన్నము వంటిది. ఇన్నిటికిని ఆజ్యము ఉద్దీపకము. ఆవు దేహము నుండి గవ్యము సారమై నేయి యెట్లు వచ్చునో, ఆహారము సప్తధాతువుల సారమై శుక్రముగా నెట్లు పరిణమించునో, భూమియందలి జీవరసము వృక్ష పశు పక్షి మానవాదులలో సార స్వరూపముగా చిగుర్చునది వసంతము. కుసుమముల సృష్టి గర్భధారణమైన మాతృత్వమునకు ప్రతీకలు. అట్టి కుసుమములకు ఆకరము వసంతము. గర్భధారణకు, దాంపత్యమునకు, మాధుర్యానుభూతి సంతతి. దానికై కుసుమములు మాధుర్య చిహ్నముగా మధువును ధరించును. ఇది కుసుమములు ఆకరములుగా గలది. ఇట్టి విభూతులకు ఆకరము వసంతము.)

**36.** జూదరులలో జూదము నేను. తేజోవంతులలో తేజస్సు నేను. జయము, సత్ప్రయత్నము, సత్త్వము నా విభూతులే.

(జూదము, పాచికలు మున్నగు నిమిత్తములతో మన్యువు అనబడు రుద్రతత్త్వమును ఉద్దీపితము చేయును. మన్యువు అనగా పట్టుదల. కార్య సాధనకు ఆవశ్యకమైన విభూతి యిది. ఒక జన్మలో జూదమున నభ్యాసమై సంస్కారముగా నిలిచి మరియొక జన్మలో సద్వినియోగ మగును.

వ్యవసాయ మనగా ప్రయత్నము. దీనివలన పరికరములను అమర్చుట యను సృజనాత్మక శక్తి విభూతిగా వెలువడును. సత్త్వమనగా త్రిగుణాతీతమగు శుద్ధ సత్త్వము. ఇది ఆనందమయ కోశము ననుభూతి యిచ్చును.)

**37.** వృష్ణివంశము వారిలో నేను వాసుదేవుడను. పాండవులలో ధనంజయుడను. మునులలో వ్యాసుడను. కవులలో ఉశనసుడను.

(వసుదేవుడు వృష్ణివంశము వాడు. వాని పుత్రుడు వాసుదేవుడు. అతడు గీతోపదేశము చేయుటకు నిమిత్త విభూతి ధనంజయుడు. ఇట్లే ఆవశ్యక మగునపుడెల్ల సమస్త జీవులలో వసించు వాసుదేవమూర్తినై ఆయా దేశ కాల నామ వ్యవహారములు నిమిత్తములుగా నుపదేశ మిత్తునని ధ్వని. అట్లే ఆవశ్యకతనుబట్టి కృష్ణద్వైపాయన వ్యాసుడు వేదములను విభాగము చేసి, పురాణేతిహాసముల రూపమున సుగమము చేసి, బ్రహ్మసూత్రముల రూపమున ధారణ పాత్రముచేసి, మానవులను పరిణామవశమున కలిదోషము నుండి ఆత్మవిద్యలోనికి నుద్ధరణము చేసిన విభూతి. ఏ కాలము నందైనను నిట్లే వ్యాసవిభూతి వర్తింపగలదని భావము.

ఉశనసుడు ధర్మశాస్త్ర ప్రవర్తకులలో నొకడు. అదికాక జీవుల రూపము లను చిత్రించుచు మృతసంజీవని విద్యాప్రభావమున మరల దేహములను కల్పించు శుక్రమూర్తి.)

**38.** దండనాధికారులలో దండనము నేను. జయించు వారిలో నీతి నేను. రహస్య ప్రవర్తకులలో మౌనము నేను. జ్ఞానవంతులలో జ్ఞానము నేను.

(దండన ధర్మ ప్రవర్తకములైన ఆయుధములలో నొకటి. దీని వలన మానవులకు సత్ప్రవర్తనము అలవడుటయు, పాపబంధ విమోచనము కలుగును. ఈ యాయుధము ప్రభుత్వము ధరించునది. ప్రభుత్వ మనగా భగవంతుని ధర్మవిభూతి యొక్క వ్యాపనశీలము. కనుక విష్ణుత్వ మనబడును. జయించు వారలలో రాజనీతి, దండనీతి, లోకనీతి విశేష గుణములుగా వర్తించును. రహస్యము దాచగల వారిలో మౌనము విశేష గుణము.)

**39.** ఇట్లే సర్వజీవరాసులలోను భౌతిక, మానసిక, వైజ్ఞానిక ప్రాణాది సమస్త విభూతులకు బీజరూపుడను నేను. వారిలో బీజముగా నుండి, చేష్టలుగా విస్తరించు చుందును. ఈ నా విభూతి ప్రవర్తింపని చేష్ట చరాచర ములం దెచ్చటను లేదు.

**40.** నా దివ్య విభూతులు సృష్టివలె తరుగనివి. ఎన్నిటిని పరిగణనము చేయగలను? నీ కవగత మగుటకు నిర్దేశమాత్రముగా చెప్పినంతనే కడు విస్తారమైనది.

**41.** కనుక నా విభూతి నెరుగగల సూత్రమును చెప్పుచున్నాను, వినుము. వైభవోపేతము, సంపత్కరము, ప్రోత్సాహకరమును అగు లక్షణమెందు కనిపించినను అది నా తేజస్సు యొక్క అంశనుండి సంభవించినదని గుర్తింపుము.

**42.** ఒక్కొక్కటిగా, బహువిధములుగా నిట్లు వినుచుండుట వలన పర్యవసానమేమి? 'నా' యను తత్త్వము నందలి యొకే యంశపైన ఈ సమస్త సృష్టిని విభూతిగా స్తంభింపజేసి నడుపుచున్నాను.

ఏకాదశోஉధ్యాయః ।

# విశ్వరూప సందర్శన యోగః ।

*అర్జున ఉవాచ :*

మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్ ।
యత్త్వయోక్తం వచ స్తేన మోహోஉయం విగతో మమ ॥ **1**

భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।
త్వత్తః కమలపత్రాక్ష మహాత్మ్య మపి చావ్యయమ్ ॥ **2**

ఏవ మేతద్యథాஉஉత్థ త్వమాత్మానం పరమేశ్వర ।
ద్రష్టు మిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ ॥ **3**

మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో ।
యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్ ॥ **4**

*శ్రీభగవా నువాచ :*

పశ్య మే పార్థ రూపాణి శతశోஉథ సహస్రశః ।
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥ **5**

పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుత స్తథా ।
బహూ న్యదృష్టపూర్వాణి పశ్యా శ్చర్యాణి భారత ॥ **6**

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।
మమ దేహే గుడాకేశ యచ్చాన్య ద్ద్రష్టు మిచ్ఛసి ॥ **7**

న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుసా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగ మైశ్వరమ్ ॥ **8**

*సంజయ ఉవాచ :*

ఏవ ముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః ।
దర్శయామాస పార్థాయ పరమం రూప మైశ్వరమ్ ॥ **9**

అనేకవక్త్ర నయన మనేకాద్భుత దర్శనమ్ ।
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥ 10

దివ్యమాల్యాంబరధరం దివ్యగంధాను లేపనమ్ ।
సర్వాశ్చర్యమయం దేవ మనంతం విశ్వతోముఖమ్ ॥ 11

దివి సూర్యసహస్రస్య భవే ద్యుగపదుత్థితా ।
యది భా స్సదృశీ సా స్యా ద్భాస స్తస్య మహాత్మనః ॥ 12

తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్త మనేకధా ।
అపశ్య ద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥ 13

తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలి రభాషత ॥ 14

*అర్జున ఉవాచ :*

పశ్యామి దేవాం స్తవ దేవ దేహే సర్వాం స్తథా భూతవిశేషసంఘాన్ ।
బ్రహ్మాణ మీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వా నురగాంశ్చ దివ్యాన్ ॥ 15

అనేక బాహూదరవక్త్ర నేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనంతరూపమ్ ।
నాంతం న మధ్యం న పునస్త వాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥ 16

కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతా
ద్దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్ ॥ 17

త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
త్వమవ్యయ శ్శాశ్వత ధర్మగోప్తా సనాతన స్త్వం పురుషో మతో మే ॥ 18

అనాదిమధ్యాంత మనంత వీర్య మనంతబాహుం శశిసూర్యనేత్రమ్ ।
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపంతమ్ ॥ 19

ద్యావాపృథివ్యో రిద మంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।

దృష్ట్వాద్భుతం రూప ముగ్రం తవేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥ 20

అమీ హి త్వాం సురసంఘా విశంతి కేచి ద్భీతాః ప్రాంజలయో గృణంతి ।
స్వస్తీత్యుక్త్వా మహర్షి సిద్ధసంఘాః స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥ 21

రుద్రాదిత్యా మనవో యే చ సాధ్యా విశ్వేఽశ్వినౌ మరుత శ్చోష్మపాశ్చ ।
గంధర్వ యక్షాసురసిద్ధసంఘా వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥ 22

రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో బహుబాహూరుపాదమ్ ।
బహూదరం బహుదంష్ట్రాకరాలం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాఽహమ్ ॥ 23

నభః స్పృశం దీప్త మనేకవర్ణం
వ్యాత్తాననం దీప్త విశాలనేత్రమ్ ।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా
ధృతిం న విందామి శమం చ విష్ణో ॥ 24

దంష్ట్రాకరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానల సన్నిభాని ।
దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 25

అమీచ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహైవావనిపాలసంఘైః ।
భీష్మో ద్రోణ స్సూతపుత్ర స్తథాఽసౌ
సహాస్మదీయై రపి యోధముఖ్యైః ॥ 26

వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రా కరాలాని భయానకాని ।
కేచి ద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితై రుత్తమాంగైః ॥ 27

యథా నదీనాం బహవోఽంబువేగాః సముద్ర మేవాభిముఖా ద్రవంతి ।
తథా తవామీ నరలోకవీరా విశంతి వక్త్రాణ్యభి విజ్వలంతి ॥ 28

యథా ప్రదీప్తం జ్వలనం పతంగా విశంతి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశంతి లోకా స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥ 29

లేలిహ్యసే గ్రసమాన స్సమంతా ల్లోకాన్ సమగ్రాన్ వదనై ర్జ్వలద్భిః ।
తేజోభి రాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥ 30

ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో నమోఽస్తుతే దేవవర ప్రసీద ।
విజ్ఞాతు మిచ్ఛామి భవంతమాద్యం నహి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥ 31

*శ్రీభగవా నువాచ :*

కాలోఽస్మి లోకక్షయకృ త్ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః ।
ఋతేఽపి త్వా న భవిష్యంతి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥ 32

తస్మా త్త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥ 33

ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్ ।
మయా హతాం స్త్వం జహి మా వ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥ 34

*సంజయ ఉవాచ :*

ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలి ర్వేపమానః కిరీటీ ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥ 35

*అర్జున ఉవాచ :*

స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్య త్యనురజ్యతే చ ।
రక్షాంసి భీతాని దిశో ద్రవంతి సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥ 36

కస్మాచ్చ తే న నమేర న్మహాత్మన్ గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే ।
అనంత దేవేశ జగన్నివాస త్వమక్షరం సదస త్తత్పరం యత్ ॥ 37

త్వమాదిదేవః పురుషః పురాణ స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాఽసి వేద్యం చ పరం చ ధామ త్వయాతతం విశ్వ మనంతరూప ॥ 38

వాయు ర్యమోఽగ్ని ర్వరుణ శ్శశాంకః ప్రజాపతి స్త్వం ప్రపితామహశ్చ।
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపినమో నమస్తే॥ 39

నమః పురస్తా దథ పృష్ఠతస్తే నమోఽస్తుతే సర్వత ఏవ సర్వ।
అనంతవీర్యామిత విక్రమ స్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః॥ 40

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ హే యాదవ హే సఖేతి।
అజానతా మహిమానం తవేదం మయా ప్రమాదా త్ప్రణయేన వాపి॥ 41

యచ్చాపహాసార్థ మసత్కృతోఽసి
విహార శయ్యాసన భోజనేషు।
ఏకోఽథవా ప్యచ్యుత తత్సమక్షం
తత్క్షామయే త్వామహ మప్రమేయమ్॥ 42

పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్।
న త్వత్సమోఽ స్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽ ప్యప్రతిమప్రభావ॥ 43

తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహ మీశ మీడ్యం।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్॥ 44

అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే।
తదేవ మే దర్శయ దేవ రూపం ప్రసీద దేవేశ జగన్నివాస॥ 45

కిరీటినం గదినం చక్రహస్త మిచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ।
తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో భవ విశ్వమూర్తే॥ 46

*శ్రీభగవా నువాచ :*

మయా ప్రసన్నే తవార్జునేదం రూపం పరం దర్శిత మాత్మయోగాత్।
తేజోమయం విశ్వమనంత మాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్॥ 47

న వేదయజ్ఞాధ్యయనై ర్న దానై ర్న చ క్రియాభి ర్న తపోభి రుగ్రైః॥
ఏవం రూప శ్శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర॥ 48

మా తే వ్యథా మాచ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృ జ్మమేదమ్ ।
వ్యపేతభీః ప్రతీమనాః పునస్త్వం తదేవ మే రూప మిదం ప్రపశ్య ॥ 49

*సంజయ ఉవాచ :*

ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా స్వకంరూపం దర్శయామాస భూయః ।
ఆశ్వాసయామాస చ భీత మేనం భూత్వా పున స్సౌమ్యవపు ర్మహాత్మా ॥ 50

*అర్జున ఉవాచ :*

దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।
ఇదానీ మస్మి సంవృత్త స్సచేతాః ప్రకృతిం గతః ॥ 51

*శ్రీభగవా నువాచ :*

సుదుర్దర్శ మిదం రూపం దృష్టవా నసి యన్మమ ।
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శన కాంక్షిణః ॥ 52

నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవా నసి మాం యథా ॥ 53

భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥ 54

మత్కర్మకృ న్మత్పరమో మద్భక్త స్సంగవర్జితః ।
నిర్వైర స్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥ 55

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*విశ్వరూప సందర్శనయోగో నామ ఏకాదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - *11*

# విశ్వరూప దర్శనము

**1. అర్జునుడు :** ఆత్మకు సంబంధించిన విద్య నుపదేశించి నన్ననుగ్రహించితివి. ఇది అనుభవమునకు వచ్చియు మిక్కిలి గుహ్యముగా నున్నది. నీ వాక్కుల మహిమచే నా మోహము మాత్రము తొలగినది.

**2.** జీవుల యుద్భవము, లయము అననేమో శ్రుతి రూపమున అనుభూతమైనది. నీ మహావైభవ మననేమో విస్తారముగా దర్శన మిచ్చినది. ఇది శ్రుతిరూపమైన దర్శనము. ఈ యనుభూతికి తరుగులేదు. ఆద్యంతములు లేవు.

**3.** నీ వుచ్చరించిన ఆత్మ యొక్క సమగ్ర స్వరూపమును, నీ దివ్య విభూతిని దర్శింపవలెనని యున్నది. ఇన్నిటి యందును వర్తించుచు వర్తింప కున్న నీ పురుషోత్తమ మూర్తిని దర్శనము చేయవలెనని కుతూహలము కలిగినది.

**4.** ఇట్లు దర్శించుట నాకు శక్యమని నీవు సంకల్పించినచో దర్శన మొసగుము. నీవు యోగమున కీశ్వరుడవు గనుక నీకు శక్యము కానిది లేదు.

**5. శ్రీకృష్ణుడు :** చూడుము. నా రూపములను చూడుము. వందలుగా, వేలుగా దర్శింపుము. నానావిధములుగా బహు వర్ణములలో, ఆకారములలో నా దివ్యత్వము నీకు దర్శన మిచ్చును.

**6.** నేనే ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినులు, మరుత్తులు. నీవు విన్న సమస్తము, చూచిన సమస్తము నాయందున్నవి. ఇదివరకు నీవు విని, చూచి, యెరుగనివి, అనుపదాశ్చర్య మూర్తులు కూడ కన్పించును.

**7.** సృష్టి యనబడుటకు అవకాశము గల చరాచరము సర్వము ఈ నా దేహమునందే దర్శింపుము. ఇంకను చూడవలెనని ఇచ్ఛ కలిగిన దెల్ల నాయందు బయలుదేరిన ఇచ్ఛగా నీకు దర్శన మిచ్చును.

**8.** ఈ నీ కన్నులు నన్ను చూడలేవు. కన్నుల ద్వారమున, మనస్సు ద్వారమున, బుద్ధి చిత్తాదుల ద్వారమున చూచు చున్నది నీవే యని గోచరించును గనుక నన్ను చూచుట యీ కన్నులతో కాదు. ఇంద్రియాదుల ద్వారమున దర్శించుచున్నది దివ్యమగు వస్తువు. దానిని నీకనుగ్రహింతును. ఆ దివ్యదృష్టితో నా ఈశ్వరత్వమునం దిమిడిన దాని నెల్లను దర్శింపగలవు.

**9. *సంజయుడు :*** ఇట్లనుగ్రహించి యోగేశ్వరుడగు హరి యర్జునునకు తన దివ్య రూపమును దర్శన మొసగెను. (యోగేశ్వరు డనగా యోగమున కీశ్వరుడు. ఇచ్చుట కృష్ణుడు మహా యోగేశ్వరుడుగా సంజయుడు కీర్తించెను. యోగము అనగా యోగవిద్య. మహా యోగము అనగా సృష్టిలోని స్థూల సూక్ష్మ కారణాది లోకములన్నిటికిని, మరియు జీవులకును తనయం దేకత్వము అని యర్థము.)

**10.** అనేక ముఖములు అర్జునున కభిముఖము లైనవి. అనేక నేత్రములు నేత్ర లక్ష్యములైనవి. దేనికదే పూర్వ మెరుగని అనుభూతితో ఆశ్చర్యము గొలిపెను. అనేక దివ్యాభరణములు ధరించిన యా రూపమునందు దివ్యాయుధము లనేకములు ప్రయోగమునకు సిద్ధముగా నుద్యమింపబడి పురోగమించు చున్నవి.

**11.** దివ్య మాల్యములు, దివ్యాంబరములు ధరించిన రూప పరంపరలు దివ్య గంధముల, అనులేపనముల వైభవములు వెదజల్లు చున్నది. సర్వ మాశ్చర్యమయమై ఎటు చూసినను ముఖములతో అనంతముగా విప్పారుచున్నది.

**12.** అప్పటి తేజఃపుంజము నేమని చెప్పవలెను? వేయిమంది సూర్యులు ఒక్కమారు ఉదయించు వైభవము స్మరింప గలిగినచో ఆ దివ్యరూప తేజస్సు నకు సాదృశ్యము నూహింప వచ్చును.

**13.** సమస్త సృష్టిలోని జగత్తులును ఆ మూర్తియం దేకత్వము జెంది యున్నవి. మరల దేనికదియే విభాగము జెంది కనుపించుచున్నది. దృష్టి వేరైనపుడు అన్నియు వేర్వేరుగను, మొత్తమును చూడదలచినపుడు ఏకమూర్తి యందును కనిపించుచున్నవి.

**14.** అపు డర్జునుడు విశ్మయావేశములు చెందెను. రోమములు నిక్కబొడిచెను. శిరస్సు అప్రయత్నముగా భక్తి నమ్రమయ్యెను. చేతులు జోడించుకొనినవి.

**15. అర్జునుడు :** ఓ మహాదేవా! నీ యీ దేహమునందు సమస్త జీవరాసులను గుంపులు మొత్తములుగా చూచు చున్నాను. కమలాస నస్థుడగు బ్రహ్మ, మహేశ్వరుడు, సర్వఋషీంద్రులు, దివ్య సర్పములు నీ యందు మూర్తిగొని ప్రకాశించు చున్నవి.

**16.** ఎన్ని బాహువులు, ఉదరములు, ముఖములు, నేత్రములు, ఎటు చూచినను దర్శించు కుతూహలమును బట్టి యనంతములుగా రూపములు దిగివచ్చు చున్నవి. వీరికి మొదలేది? అంతమెక్కడ? మధ్యమనగా నెట్టిది? చూచు చుండుటయే గాని చూచుటయని లేదు.

**17.** కిరీటము, గద, చక్రము ఒక్కొక్కటి మహా తేజఃపుంజముల విస్తృతియై నీ మూర్తి ఎటుచూచినను దీప్తిమంతమై యున్నది. రగుల్కొనిన అగ్నులే సూర్యమండల గుచ్ఛములుగా తోచుచున్న నీ మూర్తిని తేరిపార జూడలేకున్నాను. దీనికి పరిమాణమెక్కడ? చూచుచున్న వానిని బట్టియే పరిమాణము.

**18.** తెలిసికొనుట నీయం దనుక్షణము లీనమై యుండుటచే తెలియదగిన లక్ష్యమునకు పర్యవసానము నీవే. కనుక తెలియుట నీయందెప్పటికిని తరుగనిది. విశ్వము నీయందు భాసించు చున్నది గనుక, నీవు విశ్వమునకు శాశ్వత నివాసస్థానము. సర్వ సృష్టి ధర్మములు నీయందు వర్తించు చున్నవి కనుక నీమూర్తి శాశ్వత ధర్మ రక్షణకు ఆధారము. కాలము నీయందు వర్తించుటచే నీవు సనాతనుడవు. కాలముకన్న పూర్వమే యున్నవాడవు.

**19.** ఆది, మధ్యము, అంతము అనునవి నీయందు లేవు. నీ యనంత బాహువులు నీ పరాక్రమమును సృష్టిలోని శౌర్యమూర్తులుగా వ్యక్తము చేయు చున్నవి. మా కన్నులు చూడగలుగుటకు సూర్యచంద్రు లాధారము కనుక వారే నీ కన్నులు. తెరచియున్న నీ నోరే దీప్తాగ్ని. ఆహార రూపమున లోనికి

స్వీకరించు మా ముఖముల శక్తి నీ మహాగ్ని స్వరూపము. నీవు సమస్తము గ్రహించు రూపమున తేజోమూర్తివై ఈ సృష్టిని తపింప జేయుచున్నావు.

**20.** ఆకాశము రూపమున, భూమి రూపమున దర్శనమిచ్చు నీ మూర్తి భూమ్యాకాశముల నడుమ నిండిపోయినది. ఇన్ని వస్తువులుగా కనుపించునది నీ యొక్కని రూపమే. దిక్కులు వేరువేరుగా నెక్కడ నున్నవి? నీవే దిక్కులుగా నున్నావు. ఇది నీ యుగ్రరూపము. దీనిని జూచి లోకత్రయము దుర్భర మగుచున్నది.

**21.** ఈ దేవత లందరు నీయందే ప్రవేశించు చున్నారు. కొందరు నీ మూర్తికి భయమంది చేతులు జోడించుచున్నారు. మహర్షులును, సిద్ధులును నిరంతరములైన స్తోత్రములతో నీకు స్వస్తి వాచనము చేయుచున్నారు.

**22.** రుద్రులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినులు, మరుత్తులు, ఊష్మపులు, గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధులు నీయం దుద్భవించి లీనమగుచు విస్మయముచెంది నిన్నే చూచుచున్నారు.

(దేవత లందరు సృష్టియందు సిద్ధులుగను, లయమందు సాధ్యులుగను నివసింతురు. సిద్ధు లనగా నామరూపాది సిద్ధి చెందిన వారు. సాధ్యులనగా సాధింపవలసిన నామ రూపాదికములు కలవారు.

అశ్వినులు ఆదికి, అంతమునకు అధిపతులు. నాసత్యులని వీరికి సంకేతము. న + అసత్యులు అనగా సత్యమునకు లేక అస్తిత్వమునకు అభావము లేనివారు. ప్రళయమునందు ద్రష్టలేని మూర్తులుగను, సృష్టియందు ద్రష్టకు దర్శనీయులుగను వుండువారని యర్థము. విశ్వే దేవతలు అనగా తమ తమ స్థానము లలంకరించిన దేవతలు. వీరు బ్రహ్మాండ పిండాండ శరీరములలో తమ తమ కర్తవ్యములను నిర్వహింతురు.

ఊష్మపులు అనగా ఉష్ణతను పరిపాలించువారు. సూర్యాదుల నుండి జీవుల దేహములలోను, అణువులలోను, వీరు ఉష్ణత యను జీవ రస ధర్మమును కాపాడు చుందురు.)

**23.** నీరూప మింత పెద్దదియని చెప్పుట సామాన్య విషయము. ఇన్ని

ముఖములు, నేత్రములు, బాహువులు, ఊరువులు, పాదములు, ఉదరములు కనిపించు చున్నవని చెప్పుటకు సంఖ్యలు కావలెను. అవి నీయందే ఉద్భవించు చున్నవి గనుక నీ రూపములకు సంఖ్యలు చాలవు. వంపులు తిరిగి కొసలు దేలిన కోరల ముఖములు చూచి జీవు లందరు వ్యథబొంది కనుపించుచున్నారు. వారితో పాటే నేనును.

**24.** సమస్త వర్ణవైభవములతో నిండిన ఈ నిరామయ ప్రదేశము విప్పారిన నీ వదన గహ్వారముగా గుర్తించితిని. వెలుగులు ఉద్దీప్తము లగుట నీ నేత్ర లక్షణమని గమనించితిని. ఈ దర్శనము నా దర్శనశక్తిని మించి పోవుచున్నది. నేను నీ వ్యాప్తిలో నాయం దిముడుట సాధ్యపడక ధైర్యమును కోల్పోవు చున్నాను. నా శమమును నా యనుభూతి మించిపోవు చున్నది.

**25.** ప్రళయ కాలాగ్ని తీగలై సాగివచ్చుచు వంపులు దిరిగిన నీ కోరలుగా నీ ముఖ గహ్వారము భాసించుచున్నది. దిక్కు తెలియుట లేదు. జగత్తులకు నివాసమైన యీ రూపమునందు నే నిమిడియుండి దీనిని దర్శించుటకు చాలకున్నాను.

**26.** ఇదిగో ధృతరాష్ట్రుని పుత్రులు. వారితో పాటు నెట్టుకొని వచ్చు చున్న రాజ సంఘములు. ఇదుగో భీష్ముడు, అదుగో ద్రోణుడు, అల్లదే కర్ణుడు, వారే మన యోధులు. నే నెరిగిన వారందరు నీలోనే కనుపించుచున్నారు.

**27.** యుద్ధ సన్నాహమని యుత్సాహము చెంది, తెరచిన నీ ముఖ గహ్వారమున ప్రవేశించుచున్నారు. వారి సమరోత్సాహమే నీ సంకల్పమై వారిని తరుముకొని వచ్చుచున్నది. భయంకరములైన నీ కోరలు వారి కార్యక్రమ విధి విధానములు, వారందు చిక్కుకొని నీ వదనమున నాశము చెందుచున్నారు. నీ పలువరుసల సందు సందులలో చిక్కి తునియలై తమ శిరస్సులు తుత్తుమురులై నశించుచున్నారు.

**28.** నదీజలముల ప్రవాహమువలన పుట్టినట్లు భ్రమకొల్పు వేగము జలముల వశమున నుండదు. ఆ జలములే వేగమునకు లొంగి తమ వశము లేక పరువెత్తును. ఆ వేగముతోనే సముద్రమునకు అనుకూలములై ప్రవహించి లయ మందును. అట్లే ఈ జీవరాసుల సంకల్పములవలె

బయలుదేరిన నీ వేగమున జీవరాసులు తమ వశమును కోల్పోయినవారై కాలస్వరూపమగు నీ సంకల్పమున కభిముఖముగా పరుగులెత్తి నీలో లయ మందుచున్నారు. ఈ రాజులందరు యుద్ధ రూపమైన నీ ముఖ గహ్వరమున ప్రవేశించి శస్త్రాస్త్రజ్వాలల రూపమగు నీ ముఖ గహ్వర జ్వాలలో మండిపోవు చున్నారు.

**29.** మండుచున్న అగ్నికి మిడుతలు ఆకర్షింపబడును. అవి యందు ప్రవేశించి భస్మమైపోవును. అట్లే వీరందరు యుద్ధకాంక్ష యను నీ సంకల్పముచే నాకర్షింపబడి నీయందే పడి భస్మమగుచున్నారు.

**30.** నిప్పు మంటలు సోకిన తావున సృష్టియెల్ల నాకివైచినట్లు మాయ మగుచున్నది. నీ ముఖములనుండి ఈ యగ్నిజ్వాలలు వెలువడి, తమ కాంతి సోకినమేర జీవులను కాంతిగా ఐక్యము చేసుకొనుచున్నది.

**31.** ఇంత భయంకర రూప మెందులకు? ఈనీ ప్రవర్తన కర్థమేమి? ఈ నీ ప్రళయోన్ముఖమైన వృత్తాంతమునకు ఆది కారణము తెలుప వేడు చున్నాను.

**32. *శ్రీకృష్ణుడు :*** ఇది నా కాల స్వరూపము. ప్రస్తుతము లోకములను క్షీణింపజేయుటకై ఈ రూపమున వర్ధిల్లు చున్నాను. నేను జీవులలోనికి ప్రవర్తించుట యనగా, జీవులు నాలోనికి నాశ మొందుట. ఈ యోధు లందరు తమ నిర్ణయ మను నా సంకల్పమున చనిపోయినట్లే, నీ యస్తిత్వముతో సంబంధము లేకయే వీరు లేకపోవుచున్నారు.

**33.** నిర్ణయము జరిగిపోయిన కార్యక్రమమున నీవు ప్రవర్తించుట నిమిత్తమాత్రము. ఇందెవడైనను ప్రవర్తింప వచ్చును. నీవే నా సంకల్ప రూపమునంది నీవు జేసిన పనిగా శత్రువులను జయింపుము. రాజ్యము ననుభవింపుము, కీర్తిని కూర్చుకొనుము. వీరందరును యుద్ధనిర్ణయ ద్వారమున ఇదివరకే నా వదనమున ప్రవేశించి చనిపోవుట జరిగినది.

**34.** భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, జయద్రథుడు మున్నగు వీరులు నా నిర్ణయమున జయింపబడినారు. కార్యరూపమున నీవు జయింపుము. యుద్ధమున

శత్రువులను చంపితి ననిపించుకొనుము. బాధపడకుము, ఇందు బాధ పడుటకు నీ కర్తృత్వ మేమియు లేదు.

**35.** ***సంజయుడు :*** కాలాగ్ని స్వరూపుని యీ వచనములను విని యర్జునుడు వడవడ వణకుచు మరల మరల నమస్కరించెను. భీతభీతుడై, వణకు కంఠమున మరల నిట్లనెను.

**36. *అర్జునుడు :*** స్వామీ! నిజము, నిజము! నీ ప్రసక్తి యందు, నిన్ను కీర్తించు అస్తిత్వమునందు జీవులు వివిధములుగా హర్షమును, అను రంజనమును పొందుచున్నవి. రాక్షసరూపులు తమ రాక్షసత్వము అనబడు నీ ఘోర రూపమునకు భయపడి దిక్కుల వెంట పరువెత్తు చున్నారు. ఈ దృశ్యమును చూచి సిద్ధులు నీకు మోకరిల్లి నమస్కరించు చున్నారు.

**37.** బ్రహ్మ నీయందు తన ప్రవృత్తిని పొంది గురుస్థానమున నిలిపి నిన్ను కొలుచుచున్నాడు. ఈ జగత్తులు వుండుట, లేకుండుట నీవే. అంతకు పరమైన శాశ్వత స్థితియే నీవు. ఇక నేను నమస్కరించుట యనగా నెంత?

**38.** మాకు ఆది అనబడు పురుషుడు నీవు. రూపములు వచ్చుచు పోవుచుండు పురాణరూపుడవు నీవు. జగత్తుల సృష్టిని వెలువరించు నిధివి నీవు. మాలో తెలియుట యను లక్షణముగా నిలిచిన తెలిసిన వాడవు. తెలియదగినది అనుబడు జ్ఞానము నీవు. ఈ రెండింటితో నిండిన అనంత రూపము నీవు.

**39.** ఈ గాలి నీవు. ఇందలి ధర్మములను యమించు మూర్తివి నీవు. జలస్వరూపుడవు నీవు. అందుద్భవించిన చంద్రుడవు నీవు. వానిచే కొలతలు వేయబడుచున్న ప్రజాపతివి నీవు. ఆ కొలతలను సృష్టించిన పితామహుడవు నీవు. ఇందొక్కొక్కనికే చేసిన నమస్కారములు వేనవేలు. మహిమ కొక్కొక్కటి చొప్పున యొక్కొక్క రూపమునకు మరల వేలు నమస్కారములు.

**40.** అభిముఖ రూపము నీవు, నీ కభిముఖముగా నమస్కారము! మా వెనుక నీవు, వెనుకగా నమస్కారము! అన్ని దిక్కులు నీవు, అన్ని దిక్కులకు నమస్కారము! ఎందు నమస్కరించినను అందే అందుకొనుము.

**41.** సఖుడవని తలచితిని. మానవరూపమున మాతో తిరుగుచున్న నిన్ను 'కృష్ణా! యాదవా! సఖా!' యని నిర్లక్ష్యముగా పలుమారులు వ్యవహరించితిని. నీ యందు చేసిన పొరపాటు లనేకములు, చనవుచే యాచరించినవి పెక్కులు.

**42.** మనము కలిసి విహరించునపుడు, శయనించునపుడు, విశ్రమించునపుడు, భోజనాది సమయము లందును చేసిన యపహాస్యము లున్నవి. ఒంటరిగను, పదిమందిలోను చేసిన యవమానము లున్నవి. తెలియక ఆచరించిన నా యపరాధము లన్నిటిని క్షమింపగోరి నమస్కరించెదను.

**43.** నీవు చరాచరము లన్నిటికిని తండ్రివి, పూజ్యుడవు, గురువులలో గురుమూర్తివి, నీయందు సర్వ ముండుటచే అందెవ్వరును నీతో సము లెట్లగుదురు. ఇక నిన్ను మించువాడుండడు. తలపరాని విషయము.

**44.** ఇదే నా యీ శరీరమును భూమిపై నుంచి సాష్టాంగ దండప్రణామ మాచరించు చున్నాను. స్తుతి స్వరూపమగు నీవు నా స్తుతుల కన్నిటికిని గమ్యము. నీ ప్రసన్నత గోరి వేడుకొనుచున్నాను. అపరాధము లొనరించిన పుత్రుని తండ్రియు, మిత్రుని మిత్రుడును క్షమించును. ప్రేయసిని ప్రియుడు సహించి క్షమించును. నేనును అట్లే నీకు క్షమార్హుడను.

**45.** ఎన్నడును కని విని యెరుగని రూపమును చూచితిని. సంతోష భరితుడనైతిని. కాని ఈ దర్శనమును భరింపలేక భయభీతుడ నైతిని. నాకు ప్రియమైన నీ ప్రసన్న రూపమునే దర్శనమిచ్చి యనుగ్రహింపుము.

**46.** చతుర్భుజములతో చక్ర గదాధరుడవై కిరీటధారివై కన్నుల కిముడునట్లు ప్రసన్నమైన దర్శన మనుగ్రహింపుము. సహస్ర బాహువులతోడి యీ నీ మూర్తిని ధారణయందు భరింపలేను.

**47.** ***శ్రీకృష్ణుడు :*** ఈ నీ దర్శన మనగా నా యనుగ్రహమే గాని వేరు కాదు. ఈ రెండు నొకటిగా తెలియుటయే ఆత్మయోగము. దీనివలన దృశ్యమానమగు జగమంతయు తేజోమయమై అనాద్యంతమై భాసించును. అన్యుడగు వానికిది దర్శనము కాదు.

**48.** వేదాధ్యయనము, యజ్ఞాచరణము, దానములు, సత్కర్మలు, ఉగ్రతపస్సులు మున్నగువానిలో దేనిని అన్యముగా నభ్యసించినను నా యీ రూపము అనుభూతము కాదు. ఇది నరలోక దృష్టికి లభ్యముకాదు. నాయందున్న నీకు తప్ప అన్యుడగు వానికి దర్శనము కాదు.

**49.** బాధపడకుము. రూపానుభూతి నిముడ్చుకొనలేక మోహము చెందకుము. ప్రళయోన్ముఖమైన యీ నా ఘోర రూపమునకు కంపము చెందకుము. నీ మనస్సున కేది ప్రియమో ఆ రూపమునే మరల దర్శింపుము.

**50. *సంజయుడు :*** ఇట్లు పలికి వాసుదేవుడు అర్జునునకు స్వకీయమైన రూపమును మరల దర్శన మొసగెను. సౌమ్యమూర్తియై భయపడిన అర్జును నోదార్చెను.

**51. *అర్జునుడు :*** సౌమ్యమగు ఈ నీ మానవరూపము చూచిన వెనుక నేను మరల మానవ చైతన్యము నందితిని. స్వస్థత జెందితిని.

**52. *శ్రీకృష్ణుడు :*** నీవేకాదు. దేవతలు కూడ ఈ రూపమును నిత్యము దర్శింప గోరుదురు. కాని దర్శింపజాలక వ్యథ చెందుదురు. నా రూపము దర్శనీయమే గాని ఘోర దర్శనము.

**53.** నేను వేదములని స్మరింపనివాడు వేదములచే నన్ను దర్శింపలేడు. అట్లే తపో దాన యజ్ఞ క్రియాదులచే కూడ దర్శింపలేడు.

**54.** దేని నధ్యయనము చేసినను నేను దాని కన్న అన్యము కానని స్మరింపవలెను. ఇదియే అనన్యభక్తి. ఈ భక్తి సహాయమున తెలిసికొనుట, చూచుట, నా తత్త్వముగా మారి నన్ను ప్రవేశించి నా యందుండుట యను సాధనమే ఈ దివ్య దర్శనము.

**55.** నీ పని నా పనిగా నాయం దాచరింపుము. నీ వుండుట, నే నుండుట యని దర్శింపుము. అప్పుడే నా భక్తుడ వగుదువు. కర్మ సంగమంటదు. సర్వజీవులయందు నా యందుగా మైత్రి నిలుచును. ఇట్లు ఉపాసించినవాడే నన్ను పొందును.

*ద్వాదశోఽధ్యాయః ।*

# భక్తియోగః ।

*అర్జున ఉవాచ :*

ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।
యే చాప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ 1

*శ్రీభగవా నువాచ :*

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్త తమా మతాః ॥ 2

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగ మచింత్యం చ కూటస్థ మచలం ధ్రువమ్ ॥ 3

సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్రా సమబుద్ధయః ।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥ 4

క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్ ।
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥ 5

యేతు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥ 6

తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ ।
భవమి న చిరాత్పార్థ మయ్యావేశిత చేతసామ్ ॥ 7

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥ 8

అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥ 9

అభ్యాస్తేఽ ప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।
మదర్థ మప్తి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి ॥ 10

అథైతద ప్యశక్తోఽసి కర్తుం మద్యోగ మాశ్రితః ।
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥ 11

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాంతి రనంతరమ్ ॥ 12

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 13

సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్తస్స మే ప్రియః ॥ 14

యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః ।
హర్షామర్ష భయోద్వేగై ర్ముక్తో యస్స చ మే ప్రియః ॥ 15

అనపేక్ష శ్శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥ 16

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ య స్స మే ప్రియః ॥ 17

సమ శ్శత్రౌచ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు సమ స్సంగవివర్జితః ॥ 18

తుల్యనిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతి ర్భక్తిమా న్మే ప్రియో నరః ॥ 19

యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽ తీవ మే ప్రియాః ॥ 20

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః ।
ఓమ్ తత్ సత్ ।

అధ్యాయము - *12*

# భక్తియోగము

**1. అర్జునుడు :** నీవు చెప్పిన విధమున సర్వకర్మలయందును, చరాచర జగత్తు నందును తమకు గల సంబంధమును నీవుగా నుపాసించి యోగము చెందువారు కొందరు. అట్లు కాక జగత్తున కతీతముగా నున్న అవ్యక్తమగు పరబ్రహ్మ నుపాసించువారు కొందరు. ఇందెవరు స్థిరమైన యోగము చెందు చున్నారో తెలుపుము.

**2. శ్రీకృష్ణుడు :** తమ నిత్య జీవితమున నాయందు మనస్సు నిలిపి యుపాసించు వారికి చక్కని శ్రద్ధ అప్రయత్నముగా నలవడును. వారు యోగులలో నుత్తములని నా మతము.

**3.** ఆ మరియొక మార్గమువారు అవ్యక్త పరమాత్మ నుపాసించుదురు. దేశ కాలాదుల యందును, నామ రూపాదుల యందును, నిర్దేశము కాక, సర్వాంతర్యామియైన తత్త్వము వారికి ధ్యేయము. అది ఈ చలనముగల జగత్తున కవ్వల నున్న నిశ్చల తత్త్వము.

**4.** దానికై వారింద్రియములను నియమనము చేసికొని సర్వకాల పరిస్థితుల యందును సమబుద్ధి కలిగి యుండవలెను. వారును సర్వజీవుల హితమును కోరవలెను. వారును నన్నే పొందుచున్నారు.

**5.** గమ్యము, అనుభూతి యొకటియే యైనను, అవ్యక్తము నందు చిత్తము నిలుపువారికి పరిశ్రమ హెచ్చు. వారును దేహము, మనస్సు, ఇంద్రియములు అను వ్యక్త తత్త్వములు కలవారే కదా! అట్టిచో వానిని విడిచి అవ్యక్తమగు మార్గము పట్టుట వలన దుఃఖము కలుగుచున్నది. అవ్యక్తమునం దాసక్తి కలుగుట యనగా నొకే ఫలితమునకు సుగమమైన మార్గము వుండగా విడిచి క్లేశతరమైన మార్గమును అవలంబించుటయే.

**6.** తమ కర్మలు సర్వమును నా యందు సన్యసించి, అన్నిటి యందు

నన్ను గమ్యముగా నమ్మి ధ్యానము చేయుట వలన అనన్యమగు యోగము సిద్ధించును.

**7.** నన్ను వారు నమ్మిరి గనుక నేనే వారి నుద్ధరించుటకు అనుగ్రహింతును. నాకన్న భిన్న మేదియైనను మృత్యువు, సంసారము, సాగరము అగుచున్నది. నా యందు ప్రజ్ఞ నిలిపినపుడు పై సర్వము నేనే గనుక అచిర కాలమున మృత్యువు నుండి వారి నుద్ధరించు చున్నాను. (మృత్యు వనగా మార్పు. దేహము నందలి సర్వము కాలమునకు గురియగు చున్నది. అందు అణువు నుండి మొత్తము వరకు 'నే' నను తత్త్వ మంతర్యామి గనుక, శాశ్వత స్వరూపుడు. దానియందు మనస్సు లీనమైనపుడు మృత్యుమయము సమస్తము అమృతమయ మగుచున్నది.

సంసారము అనగా మార్పులకు గురియగుచున్నది, ఎప్పుడును ప్రసారము చెందుచున్నది అని అర్థము. చుట్టరికములు, మిత్ర శత్రుత్వములు, ధనాదులపై గల సంబంధములు ఒక్క మనస్సునకే సంబంధించినవి. మనస్సు నదీ ప్రవాహమువలె అనిత్యము యొక్క అస్తిత్వము. దేహములు కూడ పంచభూతాది పరిణామముల వేగము నందు నదులవలెనే అస్తిత్వము కలవి. పరస్పరము సంబంధము లేని వేగములు గల మనస్సు శరీరాదులను ఒకదాని కొకటి భాసించుట, సముద్రమునకు అలలకుగల సంబంధము వలె నిత్యప్రవృత్తి కలిగియుండియు, నిత్యము అభావములోనికి కోల్పోవుచుండును. సముద్రమునకు అల లెప్పుడును ఉన్నవి, కాని ఏ తరంగము వున్నంతసేపు నిలువదు. ఇట్లున్న సంబంధము ఒక్కొక్కటే మనస్సునకు సంయోగ వియోగముల వలన సుఖదుఃఖములను హెచ్చించుకొనుచు పోవును. జనన మరణాదుల అంకెలవలె లెక్కకు మీరిన హెచ్చింపులు. వీని మొత్తమునే మృత్యు రూపమైన సంసార సాగర మందురు. ఇవి యన్నియు నా యందు నిలిపిన మనస్సు నిలిచిపోయి నే నుందును. ఇట్లు ఈ సాగరమునుండి యుద్ధరింప వలసినది. 'నే' నను తత్త్వమే. ఏ స్థితిలో నున్నవారు ఆ స్థితి నుండియే నన్ను దలపవచ్చును. కనుక జాగు అగుట అను మనోధర్మమునుండి రక్షింపబడుదురు. అచిర కాలమున సిద్ధి కలుగుట యీ మార్గము నందున్నది.)

**8.** నా యందే మనస్సును నిలుపుము. నా యందే బుద్ధిని ప్రవేశింప జేయుము. ఆ క్షణము నుండి నాయందే నివసించు చున్నావు, దీనికి సంశయము లేదు.

(మనస్సుతో 'నన్ను' దలచుటను 'నా' యందు మనస్సు నిలుపుట యందురు. బుద్ధితో తలచుటను 'నా' యందు ప్రవేశించుట యందురు. దాని తరువాత స్థితిని 'నా' యందు నివసించుట యందురు. ఈ మూడిటి క్రమమే ఊర్ధ్వస్థితి, అనగా స్థూలమునుండి సూక్ష్మము మార్గముపట్టి అంతర్యామిగా నిలబడుట. ఈ సాధకునకు సంశయములు తమంతట తామే తీరిపోవును. క్రమముగా సంశయమునకు తావుండని స్థితి కలుగును. స్థూలతత్త్వమున అంతర్బహిర్భేద ముండును. సూక్ష్మతత్త్వమున అది కరగిపోవును. ఏకత్వమున మాత్రమే ఈ కరగిపోవుట సిద్ధించును. ఉదాహరణమునకు ఒక పాత్రలో మంచుగడ్డ లనేకములను నిలిపినచో నొకదాని కొకటి బాహ్యముగా నుండును. అవి కరగినప్పుడు బాహ్యాంతర భేదము నశించి, యొకే జల పరిమాణ మగును. అట్లే శరీరము, ప్రాణము, ఇంద్రియములు, మనస్సు దాక వ్యక్తు లకు వ్యక్తులతోను, ద్రవ్యాదులతోను, కాల దేశములతోను బాహ్యాంతర భేద ముండును. బుద్ధియందు ఈ భేదము కరగును. అపుడు ప్రజ్ఞ యొకే తత్త్వమున ప్రవేశించును. ఆత్మ స్థితియందు అన్నిటిలో నొక్కడే యుండును. సంశయ మన్నది బాహ్య వస్తువులకు మనస్సుతో గల సంబంధము. ఆత్మ తత్త్వమునందు దానికి స్థానము లేదు. ఇట్లు స్థూలము నుండి సూక్ష్మమునకు ద్రవీకరణము చెందు సాధనయే భక్తి. భక్తియను పదమునకు భజింప బడునది, ఆశ్రయింపబడినది, భుజింపబడినది, అనుభవమైపోయినది అను నర్థములు గలవు. ఇది పొందకముందున్న భావమే విభక్తి లేక విభాగము. వేదాంగ వ్యాకరణమున పురుషుడు కర్త కర్మ క్రియలుగా వాక్య స్వరూపమునుండి విభజింపబడును. క్రియ ప్రాణాది శక్తులుగా భూత భవిష్య ద్వర్తమాన కాలములను సృష్టించును. కర్తయు, కర్మయు వేరై యేడు విభక్తులలో వసించు చున్నారు. అందును ఒకరి విభక్తిలో నొక రుండరు. వాక్యము విరాట్ స్వరూపము. అందలి యర్థము అఖండ పురుష స్వరూపము. అది

యుచ్చరింపబడుటకు మూలము అక్షరము లేక ప్రణవము. కర్త కర్మ క్రియలు ప్రణవమున కరగి వసించు సాధనమే భక్తి.)

**9.** సర్వ జీవుల యందును, సర్వ కర్మల యందును, క్రియల యందును నన్ను స్మరించి, నాయందు చిత్తము స్మరణలో నిలుపుము. దీనిని స్థిరరూపమున నిలుపుటకు తొలుత శక్యము కాకపోవచ్చును. మరల మరల నిలుపుచుండుటలో తప్పులేదు. దీనినే అభ్యాసమందురు. అభ్యాసము వలన మాత్రమే నన్ను పొందగలవు. తొలుత కోరిక లడ్డువచ్చు చుండును. అప్పుడు నీ కోరికల రూపమున నన్నే పొందుటకు కోరుచుండుము.

**10.** తొలుత అభ్యాసమున కూడ సామర్థ్యము చాలకుండును. అప్పుడు నన్ను స్మరించుట జ్ఞప్తి యుండక మనస్సు తదితరములను స్మరించి, దానికి తగిన సుఖదుఃఖాదులను, భయ భ్రమా ప్రమాదాది వికారములను పొందు చుండును. దానిని పరిహరించుటకై నాకు సంబంధించిన పను లాచరించుటలో నిమగ్నుడ వగుము. పనులు చేయు చున్నప్పుడు మనస్సు, ఇంద్రియములు, ఇంద్రియార్థముల యందు వర్తించును. ఆ పనులు నన్ను ఉద్దేశించినవి యైనప్పుడు పై మూడింటి యందును నా స్మరణ నిలుచును. కార్యాచరణము నందు ప్రయత్నము తప్పక యుండును గనుక, ఆ ప్రయత్నము నా యందు లక్ష్యమగును. ఇట్లు నా కొరకు పనులు చేయుటలోనే సిద్ధి కలుగును.

(తమ కోరికలకు సంబంధించిన పనులు కాకున్నను దేవాలయ నిర్మాణాదులు, పూజా ద్రవ్యాదులను సేకరించుట, జపధ్యానాదులు ఆచరింప బడుట వలన ఈ విధమైన ప్రయోజనమే సిద్ధించుచున్నది.)

**11.** ఆరంభ దశలో నాకొరకు పనులు చేయుటయందు కూడ శక్తి చాలకపోవచ్చును. అనగా జప ధ్యాన పూజాదికములకు సమయము మిగులకపోవుట, జీవనోపాధి ప్రయత్నాదుల యందు దైవకార్యములు నిర్వర్తింప లేకపోవుట సంభవించును. అట్టి స్థితిలో నీ వాచరించుచున్న సామాన్య కార్యములనే నావిగా స్మరించి యాచరింపుము. వాని ఫలితములను నాకు సమర్పింపుము. అప్పుడు నీ మనస్సు మున్నగునవి నీ పనుల మూలముననే నా యందు నిలబడును.

(వాణిజ్యము చేయువాడు ధనమును దైవరూపముగా స్మరించుచు కూడబెట్టవలెను. దానిని వినియోగించు లక్ష్యములను, సమర్పించు వ్యక్తులను, పోషింపబడువారిని దైవరూపముగా స్మరింపవలెను. దానివలన ఈర్ష్యాసూయాదులు క్రమముగా కరగిపోవుటయు, ఫలితములు ఎవరికి దక్కినను ఒకే దృష్టి అలవడుటయు జరుగును. దానివలన ఫలత్యాగబుద్ధి సిద్ధించును. నష్టము కలిగినప్పుడు తొలుత దుఃఖపడినను దైవము దానిని కలుగజేసెనను భావన తప్పనిసరియై సాధన లోనికి లాగును.)

**12.** శరీరము, మనస్సు, ఇంద్రియములు, వాక్కు మున్నగు వానిలో దేనితోనైనను అభ్యాసము నారంభింపవలెను. అనగా నేపని చేయుచున్నను మరల మరల నాయందు దానినే నిహితము చేయవలెను. అభ్యాసమువలన సమస్తము జ్ఞానముగా పరిణమించును. జ్ఞాన స్పర్శవలన ధ్యానము ప్రత్యేకత నిచ్చును. ధ్యానము వలన కర్మఫల త్యాగము కలుగును. త్యాగము వలన అంతరము లేని శాంతి నిలుచును.

(కర్మల నాచరించుచు వానియందు నన్ను స్మరించినచో కర చరణాదులు, వాక్కు, ఇంద్రియ మనః ప్రవృత్తులు మున్నగునవి 'నేను' చే స్పృశింపబడి 'నా' కాంతియందు వెలుగును. ఇదియే జ్ఞానము. అనగా జ్ఞేయము అను స్థితి తొలగిపోవుట. తెలిసికొనువాడు, తెలిసికొనబడునది కరగి తెలివి యగును. దీనివలన ధ్యానము అనబడు విశేష స్థితి కలుగును. దేహేంద్రియాదులు ఉండియు లేని స్థితి యిది. ఉపకరణములుగా నవి యుండును. ప్రజ్ఞయందు వాని కస్తిత్వముండదు. అవి తానేయై పనిచేయును. పనులు కూడ జరిగి పోవుచునే యుండును. కాని వానియందతని కస్తిత్వ ముండదు. ఇక ఫలితములకును కర్మలతో పాటు అస్తిత్వము నశించును గనుక కర్మఫల త్యాగము జరుగును. కర్మలను త్యాగము చేయుట యసాధ్యము. ఫలితములు అస్తిత్వము నుండి జారిపోయి త్యాగము జరుగుట సాధ్యము. ఇట్టి త్యాగము జరిగినపుడున్న స్థితినే పెద్దలు శాంతి యందురు. శాంతి కొరకు యత్నించినచో యత్నము అంతరాయ మగును. యత్నాదులు, కర్మలు, ఫలితములు 'నా' యందు అస్తిత్వమును కోల్పోయినపుడు మిగిలిన యనుభూతి శాంతి.)

**13, 14.** ఈ భక్తి సాధనలో సిద్ధుడైనవాడు నిరంతరము మనస్సును, బుద్ధిని నా కర్పించియుండును. ఈ సాధనములు నా యందుండును గాని వానియం దుండవు. ప్రియుడు ప్రియురాలి కెట్లు మనస్సు నర్పించి తాను కోల్పోవునో, అట్లు భక్తుడు మనోబుద్ధ్యహంకారాదుల విషయమున నాకు ప్రియుడు. అతడు సర్వజీవుల యందును ద్వేషస్పర్శ లేనివా డగును. మైత్రియే అతని సంబంధము. కరుణ అతని జీవ ధర్మము. మమకారము, అహంకారము కలుగవు. దుఃఖము, సుఖము అని యితరులకు తోచునవి అతనియందు అనుభూతిలో సామ్యము పొందును. కనుక ఇతరుల యందు క్షమ యొక్కటియే వ్యక్తమగును. సంతుష్టియే అతని స్వభావము. నా యందు తదితరము లన్నియు అఖండత్వ మందును కనుక నిశ్చయము నిశ్చల మగును.

(పై లక్షణము లన్నియు భక్తియోగమున సిద్ధుడైన వానికి అలవడును. సాధించువాడు వానియందు ఒక్కొక్క దానినే కోరి యలవరచుకొనవలెను. అప్పుడు వేర్వేరుగా నలవడునవి సెలయేళ్ళవలె వేర్వేరుగా బయలుదేరి కలసిపోయి నదియైనట్లు భక్తి పరిపూర్ణ మగును.)

**15.** ఈ మార్గమున సిద్ధుడైన వానికి తాను, బహిర్లోకము కూడ నేనే గనుక వాని వలన లోకమునందెవ్వరికి నే యుద్వేగము కలుగదు. ఎవరి వలనను అతని కే యుద్వేగము కలుగదు. హర్షము, రోషము, భయము అను నుద్వేగము లతనికి లేవు. అతడు నా ప్రియుడని తెలియవలెను.

**16.** అపేక్షించుట యుండదు. శుచిత్వ మలవడును. సామర్థ్యము నిత్య లక్షణము. సన్నివేశములతో జోక్య ముండదు. కష్ట పెట్టుకొనుట యుండదు. ప్రయత్నములు పరిత్యజింపబడును. ఇట్టి భక్తుడు నాకు ప్రియుడు.

(అపేక్షించుట యనగా నిది కావలెనని గాని, వలదనికాని యనిపించుట. సర్వము 'నేను' గనుక వానికి శుచిత్వము అఖండానుభూతిగా నుండును. వాడే 'నేను' గనుక సర్వ సమర్థత యుండును. శౌర్య ధైర్య స్థైర్యాదులు, సత్యకామ సత్యసంకల్పత్వాదులు, కృతజ్ఞత మున్నగు లక్షణములు అతని దక్షత్వమున గల లక్షణములు. ఉదాసీనత యనగా జరుగుచున్న సన్నివేశములతో సంబంధము లేకుండుట, ఇతరులకు సన్నివేశములు అనుభూతములగు

తావున భక్తునకు 'నేను' అనుభూతి యగుదును. వ్యధ యనగా కష్టపెట్టు కొనుట. నచ్చనిది లేనప్పుడు వ్యధ యుండదు. ఇట్లు జరుగవలెనని కోరునట్టి స్థితి నుండి జరుగుచున్నది తన కోరికగా పరిణమించును. ఇదియే 'నా' సంకల్పము అనబడును.

(ఆరంభ పరిత్యాగి యనగా సంకల్పించుట మానినవాడు. దేనినైనను ఆచరించునే గాని ఆచరింపవలె ననుకొనడు.)

**17.** అతనికి సంతోష ముండును గనుక సంతోష కారణము నశించును. దానితో ద్వేష కారణము నశించును. అట్లే కోరడు గనుక కోరిక నశించును. దానితో శోకమునకు అభావ మేర్పడును. శుభా శుభములకు అభావము అనబడు పరిత్యాగ మేర్పడును. అతడు నా ప్రియుడు.

**18, 19.** లోకమున శత్రువులు, మిత్రులు అనుకొను వారి యందు నన్నే చూచును. మానావమానముల యందు నన్నే చూచును. చలియందు, వేడియందును నన్నే యనుభవించును. సుఖముగా దుఃఖముగా నన్నే యనుభవించును. కనుక సుఖ దుఃఖము లుండవు. కర్మఫలము లంటవలసిన చోట అంటిన దానిని నన్నుగా చూచును. కనుక అంటుట మానును. నిందాస్తుతులను, వాని నాచరించు వారిని నన్నుగా చూచును. దేనికైనను సంతోషమే పొందును. అతనికి నివాస ముండదు. అనగా నివసించుచున్న స్థానము నేనే గనుక తన నివాసమని, కానిది యని యుండదు. ఇట్టి నరుడు నాకు ప్రియుడు.

**20.** జీవుల ధర్మములకు అమృతస్థితి యిది. కనుక పరమ ధర్మము. ఇందు చెప్పబడిన విధానమున నా యందు సాధన చేయువారు, నా భావనలో శ్రద్ధ నిలుప నారంభించినవారు, నాకు ప్రియతములు.

త్రయోదశోఽధ్యాయః ।

# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగః ।

అర్జున ఉవాచ :

ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ ।
ఏత ద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥ 1

శ్రీభగవా నువాచ :

ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమి త్యభిధీయతే ।
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ 2

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।
క్షేత్ర క్షేత్రజ్ఞయో ర్జ్ఞానం యత్తజ్జ్ఞానం మతం మమ ॥ 3

తత్క్షేత్రం యచ్చ యాదృశ్చ యద్వికారి యతశ్చయత్ ।
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥ 4

ఋషి భిర్బహుధా గీతం ఛందోభి ర్వివిధైః పృథక్ ।
బ్రహ్మ సూత్రపదైశ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః ॥ 5

మహాభూతా న్యహంకారో బుద్ధి రవ్యక్తమేవ చ ।
ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః ॥ 6

ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః ।
ఏతత్క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్ ॥ 7

అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాంతి రార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మ వినిగ్రహః ॥ 8

ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ ।
జన్మ మృత్యు జరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్ ॥ 9

అసక్తి రనభిష్వంగః పుత్ర దార గృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వ  మిష్టానిష్టోపపత్తిషు ॥ 10

మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।
వివిక్త దేశసేవిత్వ మరతి ర్జనసంసది ॥ 11

అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వజ్ఞానార్థ దర్శనమ్ ।
ఏతజ్జ్ఞాన మితి ప్రోక్త  మజ్ఞానం యదతోఽన్యథా ॥ 12

జ్ఞేయం యత్త త్ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వాఽమృతమశ్నుతే ।
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥ 13

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షి శిరో ముఖమ్ ।
సర్వతః శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥ 14

సర్వేంద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥ 15

బహిరంతశ్చ భూతానా మచరం చరమేవ చ ।
సూక్ష్మత్వా త్త దవిజ్ఞేయం దూరస్థం చాంతి కే చ తత్ ॥ 16

అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।
భూతభర్తృ చ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥ 17

జ్యోతిషామపి తజ్జ్యోతి స్తమసః పర ముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య నిష్ఠితమ్ ॥ 18

ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏత ద్విజ్ఞాయ మద్భావా యోపపద్యతే ॥ 19

ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్ ॥ 20

కార్యకారణకర్తృ త్వే హేతుః ప్రకృతి రుచ్యతే ।
పురుష స్సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్యతే ॥ 21

పురుషః ప్రకృతిస్థో  హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।
కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు ॥ 22

ఉపద్రష్టానుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః ।
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥ 23

య ఏవం వేత్తి పురుషః ప్రకృతిం చ గుణైః సహ ।
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే ॥ 24

ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మాన మాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥ 25

అన్యే త్వేవమజానంతః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాతితరం తేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥ 26

యావత్సంజాయతే కించి త్సత్త్వం స్థావరజంగమమ్ ।
క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగా త్తద్విద్ధి భరతర్షభ ॥ 27

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినశ్య త్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥ 28

సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।
నహినస్త్యాత్మనాఽఽత్మానం తతో యాతి పరాంగతిమ్ ॥ 29

ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।
యః పశ్యతి తథాఽఽత్మాన మకర్తారం స పశ్యతి ॥ 30

యదా భూత పృథగ్భావ మేకస్థ మనుపశ్యతి ।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥ 31

అనాదిత్వా న్నిర్గుణత్వా త్పరమాత్మాఽయ మవ్యయః ।
శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి  న లిప్యతేః ॥ 32

యథా సర్వగతం సౌక్ష్మ్యా దాకాశం నోపలిప్యతే ।
సర్వత్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే ॥ 33

యథా ప్రకాశయ త్యేకః కృత్స్నం లోక మిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥ 34

క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవ మంతరం జ్ఞానచక్షుషా ।
భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥ 35

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగో నామ త్రయోదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 13

# క్షేత్రము - క్షేత్రజ్ఞుడు

**1. అర్జునుడు :** ప్రకృతి – పురుషుడు, క్షేత్రము – క్షేత్రజ్ఞుడు, జ్ఞానము – జ్ఞేయము అనువానిని గూర్చి తెలియగోరు చున్నాను.

**2. శ్రీకృష్ణుడు :** ఈ శరీరము క్షేత్రమని వ్యవహరింపబడును. దీని నెరిగినవాడు క్షేత్రజ్ఞు డనబడును. ( శరీరము పంచభూతములు, సప్తధాతువులుగా పదను చేయబడినది. అయస్కాంతము నందలి ఆకర్షణశక్తి కూడ అయస్కాంత మనబడినట్లు, దేహమునందు వ్యక్తమగు ఇంద్రియ మనో బుద్ధి చిత్తాహంకార ప్రాణ ప్రవృత్తు లన్నియు క్షేత్రమే. పొల మనగా అందలి మట్టియే గాక, ఎరువులు, అందలి ఖనిజములు, భూసారము, విత్తనములను మొలిపించు సామర్థ్యము కూడనని యెరుగవలెను. విత్తనములు కూడ నిందలి భాగమే. విత్తనములలోని యంకురము మాత్రము పొలమును దున్ని పండించు రైతుతో సమానమైన పురుషుడు. అట్లే శరీరమందు బుద్ధివరకు గల సమస్తము క్షేత్రమే. అందు 'నేను' మాత్రము జీవరూపమున నున్న క్షేత్రజ్ఞుడు. జీవులచే క్షేత్రము కృషి చేయబడుచున్నది.)

**3.** సర్వ క్షేత్రముల యందు నన్ను క్షేత్రజ్ఞుడని తెలిసికొనుము. ఈ యిరువురి నెరుగుటయే జ్ఞానమని నా మతము. (క్షేత్ర మందలి సమస్తమును క్షేత్రజ్ఞుడైన పురుషుడు తెలిసికొను చున్నాడు. పురుషుని గూర్చి కూడ పురుషుడు తెలిసికొను చున్నాడు. ఒక శరీరము నందలి క్షేత్రమెట్లో, అతనికి ఇతర శరీరము లందలి క్షేత్రమునట్లే. పురుషుని గూర్చి కూడ పురుషుడు తెలిసికొను చున్నాడు. గనుక క్షేత్రము, పురుషుడు కలిసి క్షేత్రము. పురుషుడు క్షేత్రజ్ఞుడు. అనగా తనకన్న భిన్నమగు సృష్టి సమస్తము క్షేత్రము. తాను క్షేత్రజ్ఞుడు కనుక సర్వ జీవులలోను 'నేను' క్షేత్రజ్ఞుడు. ఒక్కొక్క శరీరమున 'తాను' క్షేత్రజ్ఞుడు. తానే జీవుడు. ఇందరిలో నున్న 'నేను' ఒకే క్షేత్రజ్ఞుడను. నాకు ఇందరిలో నున్న 'తాను' క్షేత్రము.

'తాను' క్షేత్రము, క్షేత్రజ్ఞుడుగా నుండగా, నేను ఆ రెండిటి యందు క్షేత్రజ్ఞుడుగా నున్నాను. 'అది' అను శబ్దమునకు గురియగున దంతయు క్షేత్రము. అది, తాను కలిసి జ్ఞానము.)

**4.** 'అది' అను క్షేత్రము అననేమో, యేవిధమైనదో, దేనితో నిండి యున్నదో, దేనివలన కలుగుచున్నదో, క్షేత్రజ్ఞుడెవడో, వాని ప్రభావ మెట్టిదో – యీ మొత్తమును సంగ్రహముగా వివరింతును; వినుము.

**5.** ఋషులు దీనిని గూర్చి అనేక విధములుగా ప్రశంసించిరి. వివిధములైన ఛందస్సులలో కీర్తించిరి. బ్రహ్మసూత్ర పదములలో నీ యంశము కీర్తింపబడినది. హేతువులు చూపి పలువురు నిజస్వరూపమును నిరూపించిరి. (ఋషులు దేనిని గూర్చి ప్రశంసించినను అది యంతయు క్షేత్ర క్షేత్రజ్ఞులే యగుచున్నదని భావము. ఎవడు దేనిని గూర్చి చెప్పినను ఈ రెండిటికే చెందుచున్నది.

ఛందస్సు లనగా వేదములు. అవి కీర్తించిన దెల్ల ఈ రెండిటికే చెందుచున్నది. వారి శాస్త్రార్థములలో వివిధత్వ మున్నను అన్నియు క్షేత్ర క్షేత్రజ్ఞులయం దంతర్భూతము లగును. భగవద్గీతను రచించిన వ్యాసుడే బ్రహ్మ సూత్రములను రచించెను. అందలి పదములు కూడ దీనిని గూర్చినవియే. హేతువాదమున నిశ్చయింపబడిన, నిరూపింపబడిన యంశమెల్ల నీ రెండింటిలోనిదే.

బ్రహ్మసూత్రములనగా బ్రహ్మమునుండి వచ్చిన దారములు. అవి త్రిగుణములను మూడు విధములైన నూలుపోగుల వంటివి. జీవునిలో 'నే' నను ప్రజ్ఞ నుండి పరబ్రహ్మము వరకు దారులుగా ఈ నూలు పోగులు అల్లుకొని యున్నవి. వానితోనే సృష్టియంతయు నిర్మాణము చెందియున్నది. ఈ మొత్తము క్షేత్రము. అందు తెలియదగిన యంశముల రూపమున పరబ్రహ్మ మున్నది. తెలిసికొనువాని రూపమున జీవుడు క్షేత్రజ్ఞుడుగా నున్నాడు. ఈ మొత్తమును తెలిసినవాని రూపమున పరబ్రహ్మము క్షేత్రజ్ఞుడుగా నున్నాడు.

వివిధ ఛందస్సులనగా దేశ కాల ద్రవ్యాదుల పరిమాణమున కేర్పడిన కొలతలు. అహోరాత్ర, పక్ష, మాస, సంవత్సరాదులు, దూరము, కొలతలు,

అంకెలు, ఆకారములు, రంగులు, శబ్దార్థాదులు, ఛందస్సు లనబడు కొలతలు. ఇవి కూడ దానియందు ఉద్భవించినవే గనుక, క్షేత్రమునందలి యంశములు. వీనిచే కీర్తింపబడునది కూడ క్షేత్ర, క్షేత్రజ్ఞులే.)

**6,7.** పొలమునందు మట్టి సుక్షేత్ర మగుటకు అనేక రసాయనిక పదార్థముల సమ్మిశ్ర ముండును. అట్లే క్షేత్రమునందును గలదు. అవి యీ దిగువ యంశములుగా నుండును.

| | | | | |
|---|---|---|---|---|
| 1. | మహా భూతములు (పంచభూతములు) | – | 5 | |
| 2. | అహంకారము | – | 1 | |
| 3. | బుద్ధి | – | 1 | |
| 4. | అవ్యక్తము | – | 1 | |
| 5. | ఏకాదశేంద్రియములు (5+5+1) | – | 11 | |
| 6. | ఇంద్రియార్థములు | – | 5 | |
| | | | 24 | 24 |
| 7. | ఇచ్ఛా ద్వేషములు | – | 2 | |
| 8. | సుఖదుఃఖములు | – | 2 | |
| 9. | సంఘాతము (శాల్తీ (Unit) | – | 1 | |
| 10. | చేతన | – | 1 | |
| 11. | ధృతి (Unit) | – | 1 | |
| | | | 7 | 7 |
| | | | | 31 |

ఇందు మొదటి యిరువది నాలుగు క్షేత్రమునందలి యంశములు. సాంఖ్యులు వీనిని తత్త్వము లందురు. మిగిలిన యేడును తత్త్వముల సమ్మేళనలో పుట్టిన శక్తులు. వీనిని వికారములు (Combinations) అందురు.

[**మహా భూతము** లనగా పంచభూతములు. అవి 1) పృథివి లేక ఘనపదార్థము, 2) జలము లేక ద్రవము, 3) అగ్ని (వేడి వెలుగు), 4) వాయువు, 5) ఆకాశము. ఇందు ఆకాశము నుండి పృథి వ్యాపో వాయువు లుద్భవించి లయ మగుచుండును. వీని యుద్భవమునకు స్థితి మార్పుల నిచ్చెన తేజస్సు లేక అగ్ని.

**అహంకారము** అనగా ప్రాంతీయమైన 'నేను'. ఇది పంచ భూతములలో నొక్కొక్క దానియందును వేర్వేరుగా వర్తించును. అణువులలోను, వాని సమాహారమైన జీవకణములలోను, వాని సమాహారమైన జీవులలోను వేర్వేరుగా వర్తించుచు, నొక్కొక్క దానియందు ఏకత్వ సంఖ్యకు బోధకమై, మొత్తములోని యేకత్వమునకు ప్రతీకగా పనిచేయును.

**బుద్ధి** యనునది పైవానిని వివేచనము చేసి అనుభవింపగల శక్తి. వానినుండి క్రింద వానిని విడదీసుకొనగల శక్తియు – దీనివలన కార్యా కార్యములు గోచరమగును.

**అవ్యక్త** మనగా ఇన్నిటిలో నున్నది యేదో అంతుపట్టక అస్తిత్వము నొందుచున్నది. దానినే వేదము 'అదితి' అనియు, సాంఖ్యులు 'మూలప్రకృతి' అనియు, వేదాంతులు 'ప్రకృతి' అనియు వ్యవహరింతురు. ఇదియే భగవద్గీతలో 'నా మాయ' అని వ్యవహరింపబడెను.

**ఏకాదశేంద్రియములు :** కర్మేంద్రియము లైదు : 1) వాక్కు, 2) చేతులు, 3) కాళ్ళు, 4) గుహ్యము, 5) మలద్వారము. జ్ఞానేంద్రియము లైదు : 1) చూచుట, 2) వినుట, 3) వాసన చూచుట, 4) రుచి చూచుట, 5) స్పర్శజ్ఞానము. ఈ పదియు మనసుతో పదునొకండు. వీనినే పిండాండమున రుద్రులు అందురు. బ్రహ్మాండమున అంతరిక్ష దేవతలైన రుద్రులకు వీరు ప్రతీకలు.

**ఇంద్రియ గోచరము** లనగా నింద్రియార్థములు; ఐదు : 1) శబ్దము 2) స్పర్శము 3) రూపము 4) రుచి 5) వాసన.

**ఇచ్ఛా ద్వేషములు** ఒక శక్తియొక్క రెండు ధ్రువములు. సుఖ దుఃఖములు మరియొక శక్తియొక్క రెండు ధ్రువములు. సంఘాతము అనగా

మొత్తము క్షేత్రములో నొక ప్రత్యేకమైన అస్తిత్వము. ఇది గ్రామ మందలి పొలమున మన పొలము వేరుగా నున్నట్లుండును. దీనివలన క్షేత్రమునుండి వేర్వేరు దేహములు క్షేత్రములుగా వర్తించు చున్నవి.

**చేతన** అనగా కదలిక. ఇది ప్రాణమయ కోశమున శక్తుల కదలికగను, అన్నమయ కోశమున ద్రవ్యముల కదలికగను ఉండును. మనోమయ కోశమున భావముల కదలిక, బుద్ధియందు సంకల్పముల, యుక్తా యుక్తముల కదలిక, ఆత్మయందు అనుభూతి రూపమున నుండును. అనగా నిశ్చలత్వ మందును. వేగమునందు వస్తువులు కదల కుండునట్లు భాసించుట యెట్లో కదలిక యొక్క నిశ్చలత్వము కూడ నట్లే.

ధృతి యనగా ధరించుట. ఒక్కొక్క క్షేత్రమునకు ఒక్కొక్క కేంద్రముగా నిది యేర్పడి అహంకారమునకు నిలయ మగుచున్నది. సౌర కుటుంబమునకు సూర్యగోళము ధృతి. అందు సూర్యప్రజ్ఞ అహంకారము. అందు 'నేను' పరమాత్మ. మానవ శరీరమున గుండెకాయ ధృతి; జీవప్రజ్ఞ అహంకారము; నేను పరమాత్మ. ఇట్లే ప్రతి అణువునను. వికారములు అనగా నింపబడినవి, తత్త్వములచే చేయబడినవి అని యర్థము. ఉదాహరణమునకు మట్టియొక్క వికారము కుండ. బియ్యము, నీరు, అగ్ని యొక్క వికారము అన్నము.]

**8-12.** క్షేత్రమునందు సర్వమును గ్రహింపదగిన సక్రమ ప్రవర్తనము అను వెలుగు జ్ఞానము. తద్భిన్నమగు ప్రవర్తనము అజ్ఞానము. అందు జ్ఞానము యొక్క క్రమము ఈ దిగువ విధముగా క్షేత్రజ్ఞుడగు జీవుని నుండి క్షేత్రమునందు వ్యక్తమగును. 1) దేని యందైనను అభిమానము నశించుట, 2) తాను గొప్పయను భావము కరగిపోవుట, 3) హింసాబుద్ధి నశించుట, 4) ఓర్పు అలవడుట, 5) మొగమాటము లేని సూటియైన ప్రవర్తనము, 6) గురువు నంగీకరించి పూజించుట, 7) శారీరక మానసిక శుచిత్వము, 8) అచంచలత్వము, 9) ఆత్మనిగ్రహము, 10) శబ్ద స్పర్శ రూప రస గంధముల యందు వైరాగ్యము, 11) అహంకారము నశించుట, 12) జననము, మరణము, ముసలితనము, వ్యాధి, దుఃఖము, దోషములు కలుగు విధము తెలియుట, 13) దేనియందైనను విడువలేని ఆసక్తి తొలగుట, 14) ఇది

కావలెనని లేకుండుట, భార్యాబిడ్డలు, గృహము తనకు సంబంధించిన వను బుద్ధి నశించుట, 15) పరిస్థితులతో చిత్తము మారకుండుట, 16) అన్నిటి నడుమ నొంటరితనమును సేవింపగలుగుట, 17) పదిమంది జేరినచోట కారణము తెలిసికొను కుతూహలము నశించుట, 18) ఆత్మను గూర్చిన జ్ఞానమునం దభిలాష, 19) దేనియందైనను యథాస్థితిని దర్శింప గలుగుట, 20) నాయందు వ్యభిచార మెరుగని భక్తి.

వీని క్రమోన్మీలనము జరుగుచున్నపుడు జ్ఞాన మనబడును. అట్లు కాకున్నను, వీని సంకులత్వము సంభవించినను అజ్ఞాన మనబడును.

**13.** క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, జ్ఞానము వివరింపబడినవి. జ్ఞేయము లేక తెలియదగినది యను దానిని వివరింతును. దానిని జ్ఞానముగా పొందినవాడు అమృత స్వరూపుడగును. ఇచ్చట దానికది జ్ఞాన స్వరూపమై జీవికి జ్ఞేయముగా నుండును. జీవి దానిని సమీపించిన కొలది అది జ్ఞానమగును. అప్పటికి జీవి కూడ జ్ఞానమగును.

ఆది యనగా నెట్టిది? నిద్రనుండి మేల్కాంచుట వంటిది. మెలకువతో సర్వము దృశ్యమాన మగును. దీనినే ఆది యందురు. ఇది చూచువానికి ఆదిగాని, దర్శింపబడు తత్త్వమునకు కాదు. కనుక జ్ఞేయ మాది లేనిది. దాని పరిమితి కూడ జ్ఞాతయొక్క పరిమితియే. కనుక, జ్ఞేయము పరము లేక పరిమితి లేనిది. ఇది కొలతల కతీతము గనుకను, ద్రష్ట కొలతలు గలవాడు గనుకను వానికది జ్ఞేయముగా భాసించును. సృష్టి యంతయు ద్రష్టకు జ్ఞేయము. దానికది బ్రహ్మము. బ్రహ్మ మనగా వ్యాపనశీలము. అదియే జ్ఞాతగా కూడ వ్యాపించినది గనుక బ్రహ్మ మనబడును.

ద్రష్ట దృష్టిలో దాని కస్తిత్వ మున్నది. సొంతముగా దాని కస్తిత్వము లేదు. ద్రష్టకు దృశ్య మంతయు ఉండుట, లేకుండుట యను వాని నడుమ నుండును. నిద్రనుండి మేల్కాంచినప్పటి నుండి మనకు సృష్టి యున్నది. మరల నిద్రించిన వెనుక మనకది లేదు. కనుక మేల్కాంచుట ఆది, నిద్రించుట అసత్, అనగా లేకుండుట. ఈ స్థితులు జ్ఞాతకు గనుక జ్ఞేయమున కుండవు.

మనము నిద్రించునపుడు మన చుట్టు నున్న ప్రపంచము న + అసత్ = నాసత్ (లేకుండుట లేదు) అను స్థితిలో నున్నది. ఈ సృష్టి మొత్తమునకు జ్ఞేయమగు పరబ్రహ్మము, అట్లే సత్ (అస్తిత్వము), అసత్ (అభావము), నాసత్ అను స్థితులకు అతీతముగా నున్నది, దీనిని జ్ఞేయ మందురు.

**14.** శుక్రము నుండి పిండోత్పత్తిలో కొంత భాగము పాదములు, చేతులు, కన్నులు, చెవులు, నోరు మున్నగునవి యేర్పడును. విభాగములు పొందిన వెనుక చేతులు చెవులు కాలేవు. చెవులు కన్నులు కాలేవు. ఏ భాగమును మరియొకటి కాజాలదు. కాని విభాగము చెందకముందు శుక్ర స్థితిలో నేభాగ మేదియైనను కాగలదు. నదిలోని నీరు ఎవరు త్రాగగల మంచి నీరైనను కాగలదు. ఎవని దాహమైనను తీర్చును. ఒకరు త్రాగిన నీరు ఇంకొకరికి మాత్రము దప్పిక తీర్చలేదు. అట్లే జ్ఞేయమగు ఈ పరబ్రహ్మము నందు ఎప్పుడెందుండియైనను ప్రకృతి పురుషులు, సూర్యచంద్రాదులు, జీవరాసులు ఉద్భవింపగల సంకల్పము సర్వతంత్ర స్వతంత్రముగా నుండును. ఇది సర్వము నావరించి సర్వమునందున్నది.

**15.** ఇది మనలో అన్ని యింద్రియముల గుణములుగను భాసించు చున్నది. దాని కే యింద్రియము లేదు. సర్వమునందుండి భరించుచున్నది. దేనియందును వర్తింపదు. అన్ని గుణములను అనుభవించు చున్నది. తా నే గుణమును కాదు.

**16.** జీవుల యందును, పంచభూతముల యందును లోపల బయట అను భేదముచే తెలియబడునదిగా నున్నది. తెలియునది, తెలియబడునది అను తత్త్వములుగా పరస్పర సాపేక్షకమై చరతత్త్వమై యున్నది. దానియందీ భేదములు లేకుండుటకే అచరముగా నున్నది. ఏ తత్త్వమైనను దీనితో దీనియం దుత్పన్న మగుచున్నది గనుక, అన్నిటియందు నిండియుండియు సూక్ష్మత వలన తెలియబడక వర్తించు చున్నది. దూరమున నన్ను వస్తువునకు, ద్రష్టకు నడుమ దూరమనబడు తత్త్వముగా నున్నది. ఒకదానియం దొకటి యిమిడి యుండుట, ఉద్భవించుట, లీనమగుట అను తత్త్వములకు నడుమ సామీప్యమను తత్త్వముగా నున్నది. ఎల్లవారిచే 'అది' యని మరియొక వస్తువుగా తెలియబడుట వలన జ్ఞేయముగా నున్నది.

**17.** భూతముల యందును, జీవుల యందును విభాగములుగా నుండియు, నూలుపోగులలోని ప్రత్తివలె విభజింపబడకయే యున్నది. జీవులను తన నుండి పుట్టించుచు, తనయందు ధరించుచు, తనలోనికి మ్రింగుచున్నది.

**18.** వెలుగు లిచ్చు సూర్యాదులలో వెలుగుగా నున్నది. కాని తనకన్న వేరుగా చూడబడుట యను చీకటి గలిగి, దాని కవ్వల నున్నది. అందరి హృదయములలో తెలిసికొనబడునది, తెలిసికొనువాడు, తెలివి యనబడు త్రయీవిద్యగా నున్నది. ఇది జ్ఞేయ మనబడు పరమాత్మ.

**19.** క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము అనబడు వానిని సంగ్రహముగా తెలిపితిని. దీనిని తెలివిగా పొందుట కొకటే మార్గము. అది నా భక్తుడ వగుట, నా భావము పొందుట.

**20.** ఇక ప్రకృతి పురుషులు అనబడు విభాగమును తెలిపెదను. జ్ఞేయ మంతయును పరమాత్మ స్వరూపము. దానియందే ప్రకృతి కూడ నున్నది గనుక దానిని పురుష దందురు. వానినుండి వాని ప్రకృతి త్రిగుణములుగను, వాని వికారములుగను వెలువడుచు మరల లీనమగు చుండును. ప్రకృతి పురుష లిద్దరును ఆది, యంతము లేని శాశ్వతము లని తెలిసికొనుము.

(పురుషుని నుండి వచ్చి ప్రకృతి పురుషుని లోనికి పోవుచుండును గనుక పురుషుడు శాశ్వతుడనియు, ప్రకృతి ఆది యంతములు కలది యనియు కొందరు భావింతురు. కాని ఈ ప్రకృతి యొక్క ఆదికి, అంతమునకు ఆద్యంతములు లేవు గనుక ప్రకృతి పురుష లిద్దరును శాశ్వతులు. ప్రకృతి పురుషులు రెండును పరమాత్మయం దేకత్వము.)

**21.** ప్రకృతికిని పురుషునకు గల సంబంధ మెట్టిది? పురుషుడు సర్వము తానయైన వాడు గనుక, కార్యకారణ రూపముగా విభజన చెందినప్పుడు గాని హేతువు పుట్టదు. హేతువు పుట్టుట యనగా సృష్టింపబడుట. తన్ను తాను సృష్టించుకొనుటకు, సృష్టించు తాను, సృష్టింపబడు తాను అను విభాగము లేర్పడవలెను. కనుక సృష్టించు తానే ప్రకృతి! సృష్టింపబడు తానే జీవుడు! ఈ రెండును దేని యందున్నవో అదియే జీవునకు జ్ఞేయము, తనకు

పరమాత్మ. కార్యము, కారణము, కర్తృత్వము అనుదానికి హేతువే ప్రకృతి. సుఖ దుఃఖముల అనుభవమునకు హేతువే జీవు డనబడు పురుషుడు. పురుషునకు జీవుడుగా సుఖ దుఃఖముల యనుభూతి యున్నది. 'నేను'గా అది లేదు. ప్రకృతికి పరమైనది 'నేను', ప్రకృతి కివ్వల నున్నది జీవుడు.

**22.** పురుషుడు తన ప్రకృతియందున్న వాడై ప్రకృతి యందు పుట్టిన గుణముల ననుభవించును. నీరు మంచుగడ్డ స్థితిలోనికి దిగివచ్చి నపుడు ఆకారము, బ్రద్దలగుట మున్నగు గుణము లనుభవించుచున్నది. ఇట్లు గుణములతో గల సంబంధమే ప్రశస్తములు, అప్రశస్తములు నగు నుత్పత్తి స్థానములలో వివిధ రూపములుగా వ్యక్త మగుట, వివిధ గర్భములలో జన్మించుట జరుగుచున్నది.

**23.** ఈ దేహాదులలో నుండియు, పురుషుడు 'నేను' అను స్థితి నుండి జారిపోలేదు. అతడు ఈ స్థితుల నన్నిటిని పరికించు వాడుగను, అనుమతించు వాడుగను, భరించువాడుగను, అనుభవించు వాడుగను ఉన్నాడు. ఇదియే తన నుండి జీవుడుగా దిగివచ్చు మెట్ల వరుస. ఈ వరుసకు దిగువ నుండి కూడ తానే మహేశ్వరుడుగా నున్నాడు. అనగా ఆధిపత్యము వహించి బహిరంతర్మూర్తిగా నున్నాడు. దేహమునందు పరమ పురుషుడుగను, లోపల వెలుపల పరమాత్మగను ఉన్నాడు.

**24.** ఈ విధముగా పురుషుని, ప్రకృతిని, గుణములను తెలియవలెను. పురుషునియందు ప్రకృతిని, గుణములను తెలియవలెను. ప్రకృతియందున్న పురుషుని తెలియవలెను. గుణముల యందున్న అంతర్యామియైన పురుషుని తెలియవలెను. ఇట్లు తెలిసినవాడు ఈ తెలివియందుండి ఎట్టి ప్రవర్తన యందు వర్తించుచున్నను ఏమరుట, మరచుట, అయుక్తముగా ప్రవర్తించుట అను లొంగుబాటులు చెందడు.

**25.** కొందరు ధ్యానమునందు ఆత్మను దర్శింతురు. కొందరు తనయం దాత్మను దర్శింతురు. కొందరు తెలుసుకొనుట అను సాంఖ్య మార్గముతో యోగము చెంది ఆత్మను దర్శింతురు. కొందరు తమ సర్వ కర్మలను యజ్ఞార్థము ఆచరణ యోగము చెంది ఆత్మ ననుభవింతురు.

**26.** కొందరు ఈ మార్గములలో తమకు తామే, అనుభవము నింకను పొందజాలని స్థితియం దున్నారు. వారు ఇతరుల వలన విని, తెలిసికొని, ఆచరించి పొందుచున్నారు. వీరే శ్రుతిపరాయణులు. వీరికి శ్రుతి గ్రంథాదులును, వానిని విప్పిచెప్పు వారును ప్రమాణములు. ఈ ప్రమాణముల యాధారమున తమ స్థితిని దాటి, ప్రమాణములను దాటి తామే అదియై మృత్యువును దాటుచున్నారు.

**27.** కదల కుండునది, కదలునది, అస్తిత్వము పొందినది, ఏది సంభవించి యున్నను, అది నీకు తెలియుటయే గాని దానికి సంభవము కాదు. అది సమస్తము క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అను రూపములలో నీకును దానికిని గల సంయోగముగా తెలిసికొనుము.

**28.** నశించుచున్న పదార్థజాల మంతయు నశింపని వాని యందే ద్రష్టచే నారోపితమై యున్నది. అదియు, ద్రష్టయు కూడి క్షేత్ర క్షేత్రజ్ఞులు. వీరి సంయోగమున సర్వ జీవులయందు సమానముగా నిలిచియున్న పరమేశ్వరుని దర్శించినవాడే దర్శించినవాడు.

**29.** ఇట్లు దర్శించినవాడు సమస్తము తానే. తన్ను తాను హింసించు కొనడు గనుక తాను సృష్టికి హింసాకారణము కాడు. ఇట్టి సమబుద్ధితో నుత్తమ గతియం దుండును.

**30.** ఇతరులుగాని, తానుగాని ఆచరించుచున్న సర్వ కర్మలును ప్రకృతిచే నాచరింపబడు చుండెనని దర్శించును. తాను కర్త కాదని తెలియును.

**31.** జీవులలో వేర్వేరుగా నున్న యస్తిత్వము నాయం దేకత్వముగా అనుదర్శనము చేయును. అప్పుడిది యంతయు విస్తారమై ఆద్యంతములు లేని 'నేను'గా ననుభూత మగును. ఇదియే బ్రహ్మత్వమును పొందుట.

**32.** ఈ బ్రహ్మము అనాదియు, నిర్గుణము, జ్ఞేయము కానిది యని తెలిసినపుడు శరీరమం దున్నను ఏమియు చేయుటగాని, అంటుట గాని యుండదు.

**33.** వాయువు ఆకాశమునందు పుట్టి అందే చరించును. అది యుండుట వలన గాని, వీచుట వలన గాని ఆకాశమున కంటుకొనుట

లేదు. అట్లే పృథివ్యాది భూతములు, ప్రకృతులు, జీవులు, వారి ప్రవర్తనలు ఆకాశమునందే యున్నవి. వాని యణువుల యంతర్భాగములలో నాకాశము మునిగి తేలుచున్నను అంటుకొనుట లేదు. అట్లే ఆత్మ వాని కంటుకొనదు.

**34.** సూర్యు డొక్కడైనను సమస్త జీవులను వెలిగించును. అన్ని కోనేళ్ళ యందును, బావుల యందును ప్రతిబింబించును. ఆత్మలుగా, ప్రాణముగా, భూమి మున్నగు గృహములలోని పదార్థముగా దిగివచ్చి అస్తిత్వముగా కూడ వెలిగించును. అట్లే క్షేత్రము సమస్తమును క్షేత్రజ్ఞుడు వెలిగించు చున్నాడు.

**35.** ఈ విధముగా జ్ఞానమను కంటితో క్షేత్ర క్షేత్రజ్ఞు లను విభాగమును తెలియవలెను. దానితో వాని యేకత్వముకూడ తెలియును. ఈ తెలివి వలన పంచభూతముల, జీవుల త్రిగుణాది ప్రకృతి తెలియును. ఈ తెలివితో ప్రకృతి నుండి విమోచనము సిద్ధించును.

చతుర్దశోఽధ్యాయః ।

# గుణత్రయ విభాగయోగః ।

శ్రీభగవా నువాచ :

పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।
యజ్జ్ఞాత్వా మునయః సర్వే పరాం సిద్ధి మితో గతాః ॥ 1

ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమ సాధర్మ్య మాగతాః ।
సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ ॥ 2

మమ యోని ర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।
సమ్భవః సర్వభూతానాం తతో భవతి భారత ॥ 3

సర్వయోనిషు కౌంతేయ మూర్తయ స్సమ్భవంతి యాః ।
తాసాం బ్రహ్మ మహద్యోని రహం బీజప్రదః పితా ॥ 4

సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।
నిబధ్నంతి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥ 5

తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయమ్ ।
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంజ్ఞేన చానఘ ॥ 6

రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగ సముద్భవమ్ ।
తన్ని బధ్నాతి కౌంతేయ కరసంజ్ఞేన దేహినమ్ ॥ 7

తమ స్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్య నిద్రా భీస్తన్నిబధ్నాతి భారత ॥ 8

సత్త్వం సుఖే సంజయతి రజః కర్మాణి భారత ।
జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుతః ॥ 9

రజస్త మశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।
రజ స్సత్త్వం తమశ్చైవ తమ స్సత్త్వం రజస్తథా ॥ 10

సర్వద్వారేషు దేహేఽస్మి న్ప్రకాశ ఉపజాయతే ।
జ్ఞానం యదా తదా విద్యా ద్వివృద్ధం సత్త్వ మిత్యుత ॥ 11

లోభః ప్రవృత్తి రారంభః కర్మణా మశమః స్పృహా ।
రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥ 12

అప్రకాశోఽప్రవృతిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।
తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥ 13

యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రలయం యాతి దేహభృత్ ।
తదోత్తమవిదాం లోకా నమలాన్ ప్రతిపద్యతే ॥ 14

రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే ।
తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥ 15

కర్మణ స్సుకృతస్యాహు స్సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।
రజసస్తు ఫలం దుఃఖ మజ్ఞానం తమసః ఫలమ్ ॥ 16

సత్త్వా త్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥ 17

ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥ 18

నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి ।
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥ 19

గుణానేతా నతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।
జన్మ మృత్యు జరా దుఃఖై ర్విముక్తోఽమృత మశ్నుతే ॥ 20

అర్జున ఉవాచ :

కైర్లింగై స్త్రీన్గుణా నేతా నతీతో భవతి ప్రభో ।
కిమాచారః కథం చైతాం స్త్రీన్గుణానతివర్తతే ॥ 21

*శ్రీభగవా నువాచ :*

ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥ 22

ఉదాసీన వదాసీనో గుణైర్యో న విచాల్యతే ।
గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥ 23

సమదుఃఖసుఖః స్వస్థ స్సమలోష్టాశ్మ కాంచనః ।
తుల్యప్రియా ప్రియో ధీర స్తుల్యనిందాత్మ సంస్తుతిః ॥ 24

మానావమానయో స్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః ।
సర్వారంభపరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే ॥ 25

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగన సేవతే ।
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ 26

బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహమమృత స్యావ్యయస్య చ ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖ స్యైకాన్తికస్య చ ॥ 27

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*గుణత్రయ విభాగయోగో నామ చతుర్దశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - *14*

# మూడు గుణముల విశేషములు

**1. శ్రీకృష్ణుడు :** కనుక నిటుపైన మూడు గుణముల నుండి విమోచనము పొందుట యెట్లు – అనబడు జ్ఞానమును వివరించు చున్నాను. దీని నుపాసించి మునులెల్లరు మౌనముగా గుణవిమోచనమును పొందిరి.

**2.** ఈ జ్ఞానము నాశ్రయించి జీవులు నాతో సమాన ధర్మము పొందుదురు. అపుడు సృష్టి జరుగునపుడు పుట్టరు. ప్రళయమునందు నశించరు. (సమాన ధర్మము అనగా నన్ను స్మరించుట. దాని వలన నా లక్షణ మాపాదించుకొనుట, తదితర ధర్మముల కతీతులగుట, నాయం దుండుట, నే నగుట అను సోపాన క్రమమున నుండును. సృష్టి జరుగునప్పుడు పుట్టకుండుట యనగా శరీరాదులు కలిగినను, అందు వర్తించు చున్నను జన్మము అను ఆరోపణము లేకుండుట. జన్మించక ముందెట్లుందురో, జన్మించు చున్నప్పుడును, గర్భము నందును, జన్మించిన తరువాత వయస్సు మున్నగు ధర్మము లందును చిక్కకుండుట. ఇక ప్రళయమున నశింపకుండుట యనగా శరీరము నందున్నప్పు డెట్లుందురో, శరీరము విడచునప్పుడును, విడిచిన తర్వాతను అట్లే యుండుట. ఇది స్వదేహముల విషయముననే కాక సకల సృష్టి యొక్క భావా భావము లందుకూడ చిక్కుకొనక తానుండుట తెలియ జేయును. జీవునకు జనన మరణము లెట్లో, ఒక సృష్టి మొత్తమున కట్లే. అవియే బ్రహ్మ కల్పము, బ్రహ్మ యండము, బ్రహ్మ ప్రళయము అనునవి.)

**3.** వాని కతీతముగ ప్రవర్తింపవలెనన్నచో పుట్టుక యన నేమో తెలియవలెను. పరబ్రహ్మమునకు పుట్టుక లేదు కాని పుట్టవలెనను కోరిక కలుగుట ప్రకృతి, ఇదియే ప్రకృతి పుట్టుక. ఇది త్రిగుణాత్మకముగా, పుట్టుక లేని నాయందు ఉద్భవించును. అందిమిడి యున్న నేనే సృష్టికర్తయైన బ్రహ్మ. కనుక నా గర్భమైన ప్రకృతి యను అండమున బ్రహ్మ పుట్టుచున్నాడు. నేనే ఈ గర్భమును ధరించు చున్నాను. దాని నుండి సర్వ జీవరాసులు పుట్టు చున్నవి.

**4.** గర్భము లనగా మూర్తులు లేక యాకారములు నిర్మింపబడు ప్రకృతి ముద్రలు. వానియందు మొదటి విత్తనముగా నేనే నా తేజస్సును నిహితము చేయుచున్నాను. నేను సర్వవ్యాప్తిని గనుక బీజమునందు సర్వవ్యాపన శక్తి యుండును. ఈ నా బీజమహిమ వలననే జీవులు సూక్ష్మత్వము నుండి స్థూలత్వమునకు పెరుగుచున్నవి. గర్భము, బీజము, ఆధానము అను స్థితులు ప్రకృతి గుణములు గనుక, ఇట్లు తెలిసికొనుట వలన వానియందు వ్యామోహితము కాని స్థితి యేర్పడును. అప్పుడు జీవుడు గర్భమున పడినను పడకున్నను వ్యామోహితుడు కాడు.

**5.** సర్వాంతర్యామియైన నా తత్త్వము ఆద్యంత పరిమితముగా పుట్టుటకు దేశ కాల స్వభావాది నిబంధనమను బంధ మావశ్యకము. అదియే బీజము రూపమున గర్భమునందు దేహిగ జీవుడాధాన మగుట. ఈ బంధము చేయుటకే ప్రకృతి యున్నది, దానికి సత్త్వరజస్తమస్సులను మూడు గుణములు బంధించు త్రాళ్ళుగా పనిచేయును.

**6.** బంధింపబడుటలో, అనగా జీవుడుగా నస్తిత్వ మందుటలో సుఖ మలవడవలెను. ఆ సుఖము తెలియుటకు జ్ఞానమునం దిచ్ఛ కలుగవలెను. ఇట్లు జ్ఞాన సుఖములను జమిలిగా పేనుకొనిన నిర్మల ప్రకాశరూపమగు గుణమే సత్త్వము.

**7.** గర్భ నిబంధనము నందు కర్మము లేక వ్యాపారము జరుగవలెను. దానికగు క్రియాశక్తియే తృష్ణారూపమున పెనవేసుకొని రజోగుణ ముద్భ వించును. ఇందు రాగము, అనురాగము నిమిడి యుండును.

**8.** దేహధారణకు భౌతికత్వ మావశ్యకము. జ్ఞానమునకు నిద్రా స్థితియే ద్రవ్యత్వము లేక భౌతికత్వము. దీనితో పెనగొని తమోగుణ ముద్భవించును. ఉన్న స్థితికి కట్టుబడియుండుట, అపరిమితము పరిమితముగా భాసించుట దీని కావశ్యకము. కనుక అలసత్వము (నిర్లక్ష్యము), పొరబడుట (అపరిమితము పరిమితముగ నమ్ముట), మోహము దీనియం దిమిడి యుండును.

**9.** సత్త్వము ప్రజ్ఞను, జ్ఞానమును సుఖస్థితిలో నుంచును. రజస్సు

కర్మయందు నిలుపును. తమస్సు నిద్రాస్థితి, పొరబాటు అను వానియందు నిలుపును.

**10.** ఈ మూడిటి ప్రవర్తన మతిచిత్రము. సత్త్వము రజస్తమస్సులను జయించి పై చేయిగా నిలుచును. రజస్సు తమస్సత్వములను జయించి నిలుచును. తమస్సు సత్త్వరజస్సులను జయించి నిలుచును. ఇందు ఒక్కొక్కటి ఇంకొక దానిని జయింపలేవు. కాని యొక్కొక్కటి రెండింటి సమ్మిశ్రమును జయింపగలదు. మొత్తము మీద సత్త్వము, రజస్సు, తమస్సు క్రమముగా నైసర్గిక బలమున తక్కువగుచున్నవి.

**11.** ఉప్పు, కారము, పిండి కలసి జంతికలుగా దిగినట్లు జీవులన్నియు త్రిగుణాత్మకములు. ప్రతి జీవియందును త్రిగుణములలో నొక్కొక్కటి యొక్కొక్క కాలమున ఆధిక్యము వహించును. ఆయా గుణముల లక్షణముల ప్రకటన మును బట్టి అప్పు డే గుణము ఆధిక్యముచే వర్తించుచున్నదో తెలిసికొనవచ్చును.

దేహమునందు నేత్రాది ఇంద్రియములకు, ఇంద్రియద్వారములకు చక్కని వికాసము, సుఖ ప్రవృత్తి కలిగినప్పుడు జ్ఞానము సుగమ మగును. అప్పుడు సత్త్వగుణ మధికముగా వర్తించు చున్నదని తెలియవలెను.

**12.** ఆశ, కార్య సంకల్పము, కలుగజేసుకొనుట, చేయుచున్నది మాన లేకుండుట, కోరుట అను లక్షణములు బలీయముగా నున్నపుడు రజోగుణము ప్రవర్తించుచున్నదని తెలియవలెను.

**13.** బుద్ధిమాంద్యము, దేహమునకు చురుకుదనము తగ్గుట, ప్రవర్తింప వలసిన వానియందు బుద్ధి పుట్టకుండుట, పొరపాటు చేయుట, మోహము చెందుట అధికమైనప్పుడు తమోగుణము పనిచేయుచున్నదని తెలియవలెను.

**14.** సత్త్వ మెక్కువగా ప్రవర్తించు చున్నప్పుడు నిద్రించుట, దేహము విడచుట జరిగినచో ఉత్తమ జ్ఞానులు పొందదగిన నిర్మల లోకముల లోనికి ప్రజ్ఞ వ్యాపించును.

**15.** రజోగుణము వర్తించు చుండగా నిద్రయో, మృత్యువో కలిగినచో, మరల నిరంతర కర్మసంగము గలవాడుగా మేల్కొని, ఫలితములయందు

ఆసక్తితో తీరుబడిలేని జీవితము గడపును. తమోగుణము అధికముగా నున్నప్పుడు చనిపోయి మూఢ జన్మలు పొందును.

**16.** సాత్త్వికములైన కర్మ లాచరించినచో నిర్మలత్వమును, ప్రశాంత చిత్తతను ఫలముగా పొందును. రజోగుణము నిచ్చు కర్మల నాచరించినచో ఆధిక్యబుద్ధి, పట్టుదల, దుఃఖము పొందును. తమోగుణ కర్మ లాచ రించినచో మూఢత్వము, మందత, సోమరితనము, రోగము కలుగును.

**17.** జీవులలో నున్న సత్త్వగుణము నుండి జ్ఞాన ముద్భవించును. రజస్సు నుండి జ్ఞానమునకై లోభ ముద్భవించును. తమస్సు నుండి తా ననుకొనినది జ్ఞాన మనిపించును. దాని వలన పొరబడుట, దుష్కార్యములు చేయుట సంభవించును.

**18.** భూమిపై నిట్టనిలువుగా స్థితి పొందినవారు మానవులు. వారికి ఊర్ధ్వమార్గము స్థూలము నుండి సూక్ష్మమునకు దారి. అధోగతి సూక్ష్మము నుండి స్థూలమునకు దారి. సత్త్వమునందున్న వారు దేహేంద్రియ మనస్సుల నుండి ఊర్ధ్వముగా ఆత్మజ్ఞానమునకు దారి తీయుదురు. రజస్సునందు వర్తించువారు తమ ఆవేగోద్వేగములచే మధ్యముననే వర్తింతురు. అనగా దేహేంద్రియములకు పైన, మనోబుద్ధులకు నడుమ, విజ్ఞాన కోశమున వర్తింతురు.

తమోగుణమున వర్తించు మానవులు అధోగతికి జేరుదురు. అనగా ఆత్మ స్మృతి నుండి విడివడి జ్ఞానము మనో బుద్ధీంద్రియబద్ధమై దేహ వ్యాపారములకు దాసు లగుదురు. మరియు జఘన్యవృత్తి అనబడు నీచమైన పశుకామాభిరుచులలో మునిగిపోవుదురు.

**19.** ఈ గుణములచే జీవుడు తాను చేసిన పనులకు కర్తగా బాధ్యుడై నిలబడి, వాని మంచి చెడ్డలను కర్మఫలములుగా పులిమి కొనుచున్నాడు. అట్లుగాక గుణములను కర్తలుగా నెరిగి, తన్ను ద్రష్టగా తెలిసికొనువాడు గుణముల కతీతముగా నిలుచును. దీనికి నన్నాశ్ర యించుటయే మార్గము. 'నే' నను ప్రజ్ఞ నుపాసించువాడు తాను ద్రష్టయై, త్రిగుణములు సర్వ కర్మాచరణమునకు కర్తృత్వము వహించును.

**20.** ఈ విధముగా దేహము నందున్నవాడు దేహము నందు ఉద్భవించుచున్న త్రిగుణముల కతీతుడై నిలువవలెను. అపుడు జన్మము, మృత్యువు, ముసలితనము, దుఃఖములు దేహస్థితులు కాగా వాని నుండి విమోచన చెంది, తరుగని స్థితిలో నుండును.

**21. అర్జునుడు :** ప్రభూ! గుణాతీతుని ప్రవర్తన మెట్లుండును? ఏ లక్షణములచే అట్టివానిని తెలిసికొనవచ్చును?

**22, 23, 24, 25. శ్రీకృష్ణుడు :** వినుము. గుణాతీతునకు తన స్వభావము తన వశమున నుండును. తనయందు కలుగుచున్న ప్రకాశమును గాని, అనగా చురుకుదనమును గాని, కర్మలయందు ప్రవర్తనమునుగాని కావలెనని కోరడు. ఉన్నదానిని చూచి భయపడడు. మోహము ఒక్కొక్కప్పుడు కలిగినను భయపడుటగాని, ఆ స్థితిని ద్వేషించుటగాని, పశ్చాత్తాప పడుట గాని, నివృత్తిని కోరుట గాని చేయక మౌనియై వైదొలగును. కలుగుచున్న గుణములకు చలింపడు. వానినిగూర్చి స్మరింపక, గుణములు వాని స్వభావమునవి చూపుచున్నవని తెలిసికొనును. గుణముల నెట్లు కోరడో వాని విమోచనమును కూడ కోరికగా పెంపొందించుకొనక, వైరవృత్తి లేక విమోచన మార్గ మవలంబించును. సుఖదుఃఖములకు వేరుగా నిలిచి చూచుచుండును. మట్టి, రాయి, బంగారము ఆయా ప్రకృతులని తెలియును. ప్రియము, అప్రియము తాను కాదని చూచును. నింద, స్తుతి అనువానికి వినువాడుగా మాత్ర ముండును. సన్మానము, అవమానము సన్నివేశములుగా నెరుగును. మిత్రులు, శత్రువులు అనబడు వారిని జీవులుగా మాత్రము చూచును. తాను చేయుచున్న పనుల యెడల కూడ చేయవలెనను సంకల్పము లేదు. చేయుటలో నైపుణియు, దైవబుద్ధియు నిలుచును. ఇట్లాచరించు వాడు గుణాతీతుడు.

**26.** ఇట్టి స్థితి కలుగునట్టి సాధనమును తెలిపెద వినుము. నా యందు అన్య మెరుగని భక్తియోగము కలిగి సేవించుట వలన గుణాతీతత్త్వము కలుగును, అట్టివాడు బ్రహ్మమై వర్తించును.

(అవ్యభిచారము అను పదమునకు వి + అభిచారము లేని భక్తి అని యర్థము. నాకంటె నన్యమునందు మనస్సు వర్తింప కుండుట. సర్వమునందు నన్ను స్మరించువాడు త్రిగుణములయందు కూడ నన్నే స్మరించును. అప్పుడు గుణములు నేనగుదును. గుణములు నిలబడి, అతడు 'నేను'గా నుందును.)

**27.** నేనను ప్రజ్ఞయే ఆత్మ. ఇది బ్రహ్మమునకు స్థానము. అమృతత్త్వము నకు నివాసము. తరుగకుండుట దాని శాశ్వత ధర్మము. నాయందు భక్తి యోగమున నిలుచువాడు శాశ్వత ధర్మమూర్తి యగును. ఏకాంత సుఖమునకు స్థానమగును.

(ఏకాంత సుఖము అనగా సుఖ మొక్కటే యుండుట. అదియే 'నేను'. సుఖపడుట, సుఖమును పొందుట, సుఖమును సాధించుట మున్నగు స్థితులలో పొందువాడు వేరు, సుఖము వేరు. అతడు పొందునది సుఖమను అభిప్రాయము లేక ఇచ్ఛ. ఇది సుఖమునకు శవము వంటిదే గాని సుఖము కాదు. సుఖ మనుభూతి గనుక పొందువాడు, సుఖము అను రెండుండ రాదు. ఇట్లు ఒక్కడే వర్తించుట ఏకాంత స్థితి.)

*పంచదశోఽధ్యాయః ।*

# పురుషోత్తమ ప్రాప్తియోగః ।

*శ్రీభగవా నువాచ :*

ఊర్ధ్వమూల మధఃశాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 1

అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలాః ।
అధశ్చ మూలా న్యనుసంతతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥ 2

న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూల మసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥ 3

తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్ గతా న నివర్తంతి భూయః ।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥ 4

నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్త కామాః ।
ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛంత్య మూఢాః పదమవ్యయం తత్ ॥ 5

న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।
యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 6

మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః ।
మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥ 7

శరీరం యదవాప్నోతి యచ్చా ప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ ॥ 8

శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే ॥ 9

ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।
విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥ 10

యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।
యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్య చేతసః ॥ 11

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥ 12

గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా ।
పుష్ణామి చౌషధీ స్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః ॥ 13

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతి ర్జ్ఞాన మపోహనం చ ।
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో వేదాంతకృ ద్వేదవిదేవ చాహమ్ ॥ 15

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।
క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥ 16

ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ 17

యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపి చోత్తమః ।
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥ 18

యో మా మేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।
స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత ॥ 19

ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయాఽనఘ ।
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్కృతకృత్యశ్చ భారత ॥ 20

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*పురుషోత్తమ ప్రాప్తియోగో నామ పంచదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 15

# పురుషోత్తమ ప్రాప్తి

**1. శ్రీకృష్ణుడు :** దేశ కాలములకు తరుగని అశ్వత్థ మొకటి యున్నది. దానికి మూలము లూర్ధ్వముగను, శాఖలు క్రిందుగను ఉండును. వేదములే యాకులు. దీనిని తెలిసినవాడు వేదము తెలిసినవాడు అని పూర్వులు చెప్పిరి.

[భూమిపై నిట్టనిలువుగా మానవుడున్నాడు. వానికి పాదముల క్రింద భూమి, దానిపై జలము నున్నవి. నడుమ వాయువు, అగ్ని, ఆకాశము నున్నవి. తనకుపైన వాయువు, ఆకాశము నున్నవి. దానికిపైన సూర్యరశ్మి, సూర్యుడు ఉన్నారు. ఇట్లు క్రింది నుండి పైకి ఊర్ధ్వముగా స్థూలమునుండి సూక్ష్మమునకు మార్గ మగుచున్నది. ఊర్ధ్వము సూక్ష్మమున కారోహణ మార్గము. అధస్సు స్థూలమున కవరోహణ మార్గము. అందవరోహణ మార్గమున దివ్యతత్త్వము ప్రకృతిగా, పంచభూతాదులుగా జీవులుగా దిగివచ్చును. ఆరోహణ మార్గమున జీవుడు పరతత్త్వమున కారోహణ చేయును.

ఇందు సూక్ష్మము స్థూలమునకు కారణ మగుచున్నది. స్థూలము కార్యరూప మగుచున్నది. కారణములు మూలములుగను, కార్యములు శాఖలు గను వర్ణింపబడుటచే నీ వృక్షమునకు మూలములు పైనను, శాఖలు క్రిందను చెప్పబడినవి. చెట్టు మూలమునుండి శాఖలలోనికి పెరుగును. ఛందస్సు లనగా దేశ కాలాదికముల కొలతలు. అహోరాత్ర పక్ష మాసాదులు, సంవత్సరములు, ఋతు ధర్మములు, అంకెలు, ఆకారములు, రంగులు, శబ్దములు మున్నగునవి ఛందస్సులు. ఇవియే సృష్టిగా చిగుర్చుచున్నవి గనుక ఆకులు, ఇందిమిడియున్న బీజాంకురాది శక్తులు, వ్యాపనశీలత, అందలి అంతర్లీనములైన శాశ్వత ధర్మములు వేదము. ఈ ధర్మముల యందు అంతర్యామిత్వము నొందిన అతీతత్త్వము వేదపురుషుడు. నిట్టనిలువుగా నిలబడిన మానవుని శరీరమున కూడ వెన్నెముక కూర్ధ్వ భాగము మనో బుద్ధ్యహంకారాదు లకు స్థానము. అందీ కారణ శక్తులు మూలములుగా వ్యాపించినవి. క్రిందకు ఇంద్రియ ప్రవృత్తులు, ఇంద్రియార్థములు, కర్మలు, బాహ్య లోకముల జ్ఞానము

శాఖలుగా ప్రసరించి దిగుచున్నవి. నేర్చినవి, చేసినవి, అనుభవించినవి, వర్తించుచున్నవి, సన్నివేశములతో నిండినవి, ఆకులుగా చిగుర్చుచున్నవి. ఇవియే ఛందస్సులు, ఇవి వేదపురుషునకు అంగములు. ఛందస్సులు పాదములు, కల్పములు హస్తములు, వ్యాకరణము ఆననోచ్చారణము, శిక్ష నాసికము, జ్యోతిషము కన్ను, నిరుక్తము చెవి. పిండోత్పత్తిలో జీవుని నుండి చిగురించు చున్నవి గనుక పర్ణములు.

అశ్వము ప్రాణమయ కోశమగు వైశ్వానరాగ్నికి వేదములలో సంకేతము. ఈ జగత్తునందలి స్థూల సూక్ష్మముల దారుల మెట్లన్నియు ప్రాణమయ కోశముచే నిలబెట్టబడి వర్తించుచున్నవి. కనుక ఈ జగన్మహావృక్షము అశ్వత్థము (అశ్వమును తనయం దిముడ్చుకొనిన చెట్టు.) మానవుని దేహమునందు కూడ రస రక్త మాంసాది ధాతువులతో కూడిన అన్నమయ కోశమునుండి, విజ్ఞానమయ కోశము వరకు గల వ్యాపార మంతయు ప్రాణమయ కోశ ప్రభావముచే నిలబెట్టబడి యున్నది. ఇందణువులు మొదలు శక్తుల, భావముల వరకు వచ్చుచు పోవుచు, భావాభావ నిరంతరత్వము నిత్య నూతనమైన శాశ్వత స్వరూపమును వహించి యున్నది.

దీనిని తెలిసినవాడు వేదము నెరిగినవాడు. ఏ ప్రజ్ఞలో జీవించుచున్న మానవుడు ఆ ప్రజ్ఞనుండి దీనిని తెలియుచున్నాడు. ఇదియే జీవునకు, వేదమునకు గల సంబంధము. "చెరువులోనున్న నీటిలో దప్పిగొనినవానికి ఎన్ని జలములు కావలెనో అదే వానికి చెరువుతో గల సంబంధము. అట్లే బ్రహ్మజ్ఞానికి వేదముతో గల సంబంధము." అని *భగవద్గీత 2 అ. 46 శ్లో॥* లో కృష్ణుడు హెచ్చరించుచున్నాడు. కనుక ఎవనికి ఏ స్థితిలో దర్శనమిచ్చునో వాని కా స్థితియే వేదమై పురోగతికి దారిచూపును.]

**2.** ఈ చెట్టుకొమ్మలు క్రిందకును పైకిని కూడ వ్యాపించుచున్నవి. అవి గుణములచే బలిష్ఠము లగుచున్నవి. శబ్ద స్పర్శ రూప రస గంధములుగా చిగుర్చు చున్నవి. మూలములు క్రిందకును వ్యాపించు చున్నవి. అవి మనుష్య లోకమునందు వ్యాపించి కర్మలను అనుసంధానము చేయుచున్నవి.

(క్రిందుగా పెరిగిన కొమ్మలు క్రిందికేగాక మూలముల మీదికిని

వ్యాపించు చున్నవి. ఊర్ధ్వముగా పెరిగిన వ్రేళ్ళు పైకే గాక దిగువకొమ్మల మీదకును వ్యాపించుచున్నవి. అనగా వ్రేళ్ళును, కొమ్మలును కలిసి అల్లుకొనిపోయి మ్రాను లభ్యము కాకుండా చేయుచున్నవని భావము. పరబ్రహ్మ తత్త్వముయొక్క అంశ సృష్టిలోని స్థూల భూతములలోనికి కూడ వ్యాపించియున్నవి. ఆకాశము మిగిలిన నాలుగు భూతముల యందును వ్యాపించి యున్నది. అవియును జీవులును కలసి ఆకాశము నందే వ్యాపించియున్నవి. ఒకదాని యందు ఇంకొకదాని ప్రకృతి ధర్మముల అభావము లేదని అర్థము. ఇట్లు ప్రకృతిలోని త్రిగుణములు అసంఖ్యాకములుగా గుణితము లగుచున్నవి.

మానవునియందు కూడ మనోబుద్ధ్యహంకారాది మూలశక్తులు దేహేంద్రియ రక్షణాది స్థితులకు, కర్మాచరణమునకు ఫలితములలోనికి దిగు చున్నవి. ఈ ఫలితములు కర్మలుగా శాఖలై ఫలితముల రూపమున మరల మనోబుద్ధ్యహంకారాదులలో సంకల్పములను ప్రేరేపించుచున్నవి. వీని వలన నవియు, వాని వలన నివియు బలిష్ఠములై అల్లుకొనుచున్నవి. ఒక సంకల్పము బాహ్యప్రపంచమున విషయముల యందు వర్తించుచున్న ఇంద్రియముల మూలమున మనస్సునకు కలుగును. అది దేహమున ఆచరణరూపము దాల్చును. ఇది యంతయు త్రిగుణముల వలన శాఖలు ఉపశాఖలై ప్రసరించు విధము. దాని వలన మనస్సు మున్నగు వ్రేళ్ళు కర్మలతో, ఫలితములతో బంధించుకొనుము. ఇది వ్రేళ్ళు క్రింది కల్లుకొను విధము. ఈ సంకల్పముల కర్మల గజిబిజి అల్లికయే మనుష్యలోకమై కర్మబంధన ప్రవర్తన మగును.

ఇందు వృక్షమునందు చెప్పబడని మరికొన్ని అంశములను కూడ అనుబంధము చేసికొన్నచో రూపకల్పనము పూర్తియై ప్రధాన విషయము అలంకార మూలక వస్తుధ్వనిగా దర్శన మిచ్చును. భగవంతు డెప్పుడును వాచ్య స్వరూపమైన సృష్టికి వ్యంగ్య స్వరూపుడుగా నిలిచి జ్ఞేయ మగుచున్నాడు. విత్తనము సంస్కారము లేక వాసన. దాని నుండి వేరు సంకల్పముగా సాగును. దాని నుండి కొమ్మలు కర్మలుగా దిగును. దానినుండి పువ్వులు ఇంద్రియాదుల కర్మవాసనలుగా పుష్పించును. వానినుండి ఫలములు కర్మ ఫలములుగా విపాకమగును. ఈ ఫలము మరియొక కర్మసంగమునకు వాసనయై, చెట్లయొక్క రెండవ తరము ఉత్పత్తిని కలిగించును. ఇట్లు బీజము

నుండి అంకురము, మూలము, శాఖలు, పుష్పములు, ఫలములు అను మార్గమున మరల బీజమువరకు వృక్షము యొక్క అస్తిత్వమును కాలవిపాక రూపమున మండలావృత్తులుగా తిరుగుచుండును. ఇదియే సంసార చక్ర బంధము. ఇందు ఊర్ధ్వాధస్సులగు మార్గములు సృష్టికి ప్రవృత్తి మార్గములేగాని తదతీత స్థితికి మార్గములు కావనియు, నడుమ అనేకములగు అల్లికలు జీవు నెదుర్కొను ననియు సూచింపబడినది.)

**3.** ఈ వృక్షమునకు రూప మిచ్చుట నిహలోకమున లభింపదు. ఈ వృక్షమునకు ఆది, అంతము లేవు; ఒక ప్రత్యేక స్థానమనియు లేదు. చాల లోతుగా మాత్రము మూలములు పాదుకొని యున్నవి. దానిని అసంగము అను శస్త్రముచే నరకుట ఆరంభింపవలెను.

(అసంగ మనగా అంటకుండుట. గ్రహ గోళ తారకాదులలోగాని, పంచభూతములలోగాని, చరాచర జగత్తునగాని, జీవులలోగాని దేనితోను తనకు 'సంబంధ' మేర్పడరాదు. అనగా దానిపై, దాని నామ రూప గుణ స్వభావాదులపై చుట్టరికములు, శత్రు మిత్రత్వాదులు మున్నగు భావములు నిలబడరాదు. కర్మల ఫలితములపై, వ్యక్తులపై మంచి చెడ్డలు మున్నగు నభిప్రాయములు నిలువరాదు. ఇట్టి ప్రవృత్తినే అసంగము అందురు. అది దృఢముగా నేర్పడవలెను. ఇది శస్త్రమై ఆయా స్థితులతో మనకుగల సంబంధమును ఛేదించి, అందలి 'నేను' అను తత్త్వమునకు మార్గము చూపును. మూలము వెంటపడినచో శాఖలు దొరకును. శాఖ వెంటబడినచో మూలములు దొరకును. ఒక సంకల్పము ఒక కర్మకు దారితీయును. ఒక కర్మఫలము ఒక సంకల్పమునకు దారితీయును. కనుక ఈ మార్గము స్కందమునకు చేర్చదు. ఈ మార్గమునకు మొదలు పెట్టుట, పరిసమాప్తి జెందుట యుండదు. కనుక నీ వృక్షమునకు ఆది, యంతము లేదని చెప్పబడినది. ఎవని ప్రవృత్తి యందు వాని వృక్షము మొలచియుండును గనుక నొకచోటు అని లేదు. ఎవని వాసనలను బట్టి వానికి లభ్యమగు వైఖరు లుండును. గనుక ఈ వృక్షమునకు నొక రూపమని లేదు. మనో బుద్ధ్యహంకారాదులలో కూడ త్రిగుణాత్మక ప్రకృతియే వర్తించుచున్నది గనుక ఇది గాఢముగా వ్రేళ్లుబారిన చెట్టు. ప్రవర్తించుచున్న త్రిగుణముల నుండి యేర్పడుచున్న స్వభావములను, అభిప్రాయాదుల తార్కికబుద్ధిని పట్టించుకొన కుండుటయే అసంగ మను శస్త్రము.

దాని వలన ఏ ప్రకృతి యందైనను, ఏ గుణము నందైనను పరమాత్మనే వెదకునట్టి మార్గ మేర్పడును.)

**4.** అప్పుడు లభించిన మార్గమే అనుసరింప దగినది. దాని వెంటనే వెదకుచు పోయినవారు మరల వెనుదిరుగు నావశ్యకత లేక, ఆది పురుషునకు శరణు జొచ్చుదురు. వాడే చెట్టు మొదలు. వాని నుండియే దేశకాలాతీతమైన యీ వృక్షము ప్రసరించి ప్రవర్తించుచున్నది.

(వెదుకదగిన మార్గము అనగా సృష్టిలో కార్యకారణ సంబంధము కాదు. కార్యకారణ సంబంధము స్థూల సూక్ష్మముల పరస్పర సంబంధము తెలుపునేగాని వాని కారణమును దెలుపజాలదు. స్థూల సూక్ష్మముల దారులు మండలాకృతిగా జతపరుపబడిన నిచ్చెనలని 7, 8 అధ్యాయములలో నిరూపింపబడినది. ఆ నిచ్చెనలవెంట పోవు ప్రజ్ఞలకు నెక్కిపోవుట, దిగివచ్చుట యను మండలావృత్తి మాత్రమే శ్రమగా మిగులును. అట్లే ప్రకృతి పురుషుల సంబంధము కూడ కొమ్మల వ్రేళ్ళ సంబంధమువలె ఊర్ధ్వాధస్సులకు జీవుని గిరగిర ద్రిప్పును. సర్వకారణ కారణమునకు గొనిపోవు మార్గమొకటే అనుస రింపదగినది. అసంగము అను శస్త్రమున సంకల్పముల వ్రేళ్ళను, ఆచరణముల కొమ్మలను ఛేదించుట వలన నేర్పడును. సమీపింపవలసినది చెట్టు పుట్టిన తావుగాని, కొమ్మలును, వ్రేళ్లును కావు. ఈ చెట్టునే వర్ణించుచు ఋగ్వేద మిట్లు చెప్పుచున్నది.

"రెండు సుపర్ణములు ఈ చెట్టు నాశ్రయించి యొకటిగా కలసి యుండును. ఒకటి తీయని ఫలములు భుజించి మురియును. మరి యొకటి భుజింపకయే మురియును. ఈ సుపర్ణములు వృక్షము నాశ్రయించి యున్నవే గాని, దాని నెరిగినవి కావు. ఇవియే ప్రకృతి పురుషులు. వానినుండి అనేక సుపర్ణములు సృష్టియందలి అమృతత్త్వమున భాగమును మాత్రము పంచు కొనును. ఆ చెట్టునుండి ఎగురుచు మరల తిరిగి వచ్చుచున్నవి. ఇవియే సృష్టి నిర్వాహకులగు దేవతలు. అందెవ్వరును ఆ వృక్షాగ్రమున నున్న స్వాదుత్వమును అనుభవింపలేరు. బుద్ధిమంతులు దానిని పొందగలుగుచున్నారు." మున్నగు మంత్రార్థములలో నీ వృక్షముల యొక్క అగ్రము అనబడు మార్గము

సూచింపబడినది. ఇది వృక్ష వృత్తాంతమగు బీజాది ఫలాంత వృత్తము నందుండక దతీతముగా నుండు ననియును కీర్తింపబడినది. కఠోపనిషత్తు నందుకూడ ఊర్ధ్వమూలము, అవాక్శాఖము అగు నశ్వత్థము కీర్తింపబడినది. స్కందమును చేరు మార్గము మాత్రము ఋగ్వేదము నందుగాని, ఉపనిషత్తులందు గాని గూఢమే. ప్రస్తుత శ్లోకము నుండి యీ మార్గము శ్రీకృష్ణునిచే స్పష్టముగా నుపదేశింపబడినది. పాశ్చాత్య వేదమగు బైబిలు పూర్వభాగమున సృష్టి కాండమునందు ఈ వృక్షము మానవుని పతన కారణముగా చెప్పబడినది. ఇది అనువాదములోని ప్రమాదము. దానికి మూలములైన ఆది మానవ పురాణ పాశ్చాత్య సంహితలలో కొంత వివరింపబడినది. జ్ఞానవృక్షము (వేదము అనబడు సృష్టి సనాతన తత్త్వ వృక్షము) భగవంతుని యుద్యానమున గలదు. అందు ప్రకృతి పురుషులు విహరించుచున్నారు. పురుషుని నుండి యొక భాగముగా ప్రకృతి వెలువరింపబడినది, వారే ఆదిమ దంపతులు (ఆదాము దంపతులు). వారిని ఆ వృక్ష ఫలము తినరాదని భగవంతుడు శాసించెను. అనగా కర్మఫలము తినరాదని భావము. అతిక్రమించి తినుటవలన ఆదిమ పురుషుడు జననము, గర్భసంభవము అను ద్వారమున భౌతిక దేహమునకు పతనమయ్యెను." ఈ కథలో కూడ జీవుని కర్మఫల సంగము పాపస్థితిగా నిరసింపబడినదేగాని, పరిష్కార మార్గము లేదు. శ్రీకృష్ణుడొక్కడే ఈ పరిష్కార మార్గమును వెదకదగిన మార్గముగా వివరించి యుపదేశించెను: "స్థూల సూక్ష్మ తత్త్వములను ఖండించు శస్త్రము – వానిని భావింపక వాని యందున్న 'నేను' అను పరతత్త్వమును భావించుట. అప్పుడే స్థూల సూక్ష్మముల నడుమ జీవులుగా జనన మరణములు పొందుచున్న మండలావృత్తి కతీతమై, తదంతర్యామియందు ప్రజ్ఞ నిలుచును." దాని ఆచరణీయమైన యుపాసన తరువాత శ్లోకములలో చెప్పబడు చున్నది.)

**5.** మానము, మోహము లేనివారు, సంగమను దోషమును దాటినవారు, కామములను వెనుకకు మరల్చినవారు, సుఖదుఃఖములచే గుర్తింపబడు జంట యనుభవములనుండి విమోచన జెందినవారు, అధ్యాత్మ విద్యయందు నిత్యత్వమును నొందినవారు, మోహము చెందనివారు ఆ మార్గము ననుసరింప గలరు.

(మాన మనగా అభిమానము, తనయందుగాని, ఇతర వ్యక్తులు, బాంధవ్యములు, ధనధాన్యాదుల యందుగాని మనస్సున విలువ నిలుచుట మానము లేక అభిమానము. అందు 'నే' నను తత్త్వమును భావించుట వలన నిది తొలగును.

మోహము అనగా ప్రకృతి గుణములలో నొకదానివలన గలిగిన స్థితికి మనస్సు లొంగుట. ఆపేక్షలు, దిగులు, బెంగ దీని వ్యక్తచేష్టలు. మోహ కారణమైన వ్యక్తియందుగాని, వస్తువునందు గాని 'నన్ను' భావించుటవలన నిది కరగును.

సంగ మనగా అభ్యాసవశమున నొకదానియందు మనస్సు, ఇంద్రియ ములు అభిలాషపడుట. అట్లే కర్మఫలముల యందును, అభిలాష పరచు వస్తువులు తనచే భావింప బడుచున్నవి గనుక జ్ఞేయములు. అందు 'నన్ను' భావించుటవలన అవి జ్ఞానమై సంగదోషము తొలగును.

ఆధ్యాత్మనిష్ఠ యనగా నాత్మ నధిష్ఠించిన నిష్ఠ. ఆత్మ యనగా 'తాను'. దీని ప్రకృతి పొరలే దేహేంద్రియ మనసాదులు. తన్ను నాయందు భావించుట యను భక్తియోగమున నీ పొరలన్నియు ప్రకృతి కతీతములై పరమాత్మగా అనుభవింప బడును.

వెనుకకు మరలిన కామములు అనగా దమింపబడినవి, అణచి పెట్టబడినవి కావు. సర్వము నా నుండి బయలుదేరుచున్నది గనుక 'నా' యందు మరలించినచో కామము మాయమై 'నే' నుందును. కామమును అణచుటకు యత్నింపక నేనుగా భావించుటవలన నిది కలుగును.

సుఖ దుఃఖములచే గుర్తింపబడునవి జంట ప్రజ్ఞలు. ఒకప్పుడు సుఖ కారణములైనవి మరియొకప్పుడు దుఃఖ కారణము లగుచుండును. చలి కాలములో సుఖము నిచ్చు ఉష్ణ పానీయాదులు వేసంగిలో సుఖము నీయవు. చలిలో బాధించు శీతలోపచారములు వేసంగిలో సుఖము లనబడును. ఈ రెండిటిని స్మరించినవాడు రెండిటి నడుమ సుఖమును వ్యర్థముగా వెదకికొను చుండును. సాధన తెలియనివాడు ఈ రెండిటిని ఎదుర్కొని మోటుగా బాధపడుచుండును. ఈ రెండును నా స్వరూపములని భావించిన రాజయోగి

శీతమునందు ఉష్ణమును, ఉష్ణమునందు శీతమును సేవించియు 'నన్ను'గా సేవించును గనుక సామ్య సాధనచే వానికతీతుడై స్థిరత్వ మంది నన్ను జేరును. రాజయోగికి నిజమైన సుఖసాధనము లన్నియు 'నా' స్వరూపములే. ఈ భావనా మహిమచే నతడు భ్రమచెందుట, తాత్కాలిక సుఖములకు లొంగి చిక్కులపాలగుట జరుగదు. ఇట్టి సాధనచే సంసార వృక్షము యొక్క మూలములను భావములను, కొమ్మలు అను కర్మలను, అంటకుండుట యను కత్తిచే ఛేదించుకొనుచు చెట్టు మ్రానుకి దారి చేసికొనును. ఇదియే వెనుదిరుగని, కనుమరుగని, తరుగని, కరుగని మార్గము.)

**6.** సూర్యుడు గాని, చంద్రుడు గాని, అగ్ని గాని ఈ బాటలో వెలుగొందలేరు. అదియే ఉత్తమమైన 'నా' వెలుగు. ఈ వెలుగులోనికి ప్రవేశించినవారు వెనుదిరిగి పోరు.

(సూర్యుని వెలుగు, చంద్రుని వెలుగు, దీపపు వెలుగు కంటికి మాత్రము పనిచేయును. వాని కా వెలుగు ఎట్లబ్బినది? కంటికి చూచునట్టి శక్తి ఎట్లబ్బెనో అట్లే. కంటినుండి మనస్సు చూచుచున్నది. మనస్సు నుండి 'నేను' చూచుచున్నాను. అట్లే సూర్యుని నుండి వెలుగు వచ్చు ధర్మము సూర్యుని ప్రకృతి. ఆ ప్రకృతి నాయం దుద్భవించినది. కనుక సూర్యునియందు, కంటియందు, రెండిటి సమ్మేళనము నందు మనస్సు నందు అంతర్యామిత్వ మందిన 'నే' ననునది యీ బాటలోని వెలుగు. దానిని సూర్యాది కాంతులు వెలిగింపలేవు. కన్ను తన్ను తాను చూడలేదు. 'నే' నను వెలుగు మాత్రము పూర్ణముగా తనయందు తానుండును. దానిని భావించిన మనస్సు కూడ దానియందిమిడి, 'అది' యగును. ఇట్లు సారాంశమైన వెలుగును భావించు మనస్సు సూర్యాదుల కాంతియందు కూడ దానినే చూచును గనుక నిది వెనుదిరుగని మార్గము. 'ధామ' యను పదమునకు మార్గమనియు, వెలుగనియు నర్థము. ఇచ్చట మార్గము, వెలుగు నొక్కటియే యగును. సృష్టింపబడిన లోకములో వెదకువాడు, వెదకబడునది, వెదకుట వేర్వేరుగా నుండును. 'నే' నను ప్రజ్ఞలో మూడు నొకటిగ నుండును. మంచుగడ్డ నీటిలో నుంచినప్పుడు నీటిపై తేలును. అనగా స్థూలత్వమున నీరు వేరుగా, మంచుగడ్డ వేరుగా నుండును. అదియే కరగినపుడు నీటియందు నీరు తేలదు. రెండు నీళ్ళుండవు.

నీర మొకటిగనే యుండును. అట్లే స్థూలసృష్టి నుండి సూక్ష్మ లోకముల వెంట ప్రజ్ఞ ప్రయాణము చేసిన కొలదియు లోకములు, లోకస్థులు, లోకేశులు కరగి అలోకస్థితి యేర్పడును. అప్పుడు వేరను పెనుజీకటి కవ్వల వెలుగుగా మొత్తము మారును.)

**7.** సనాతనమైన నా యంశమే జీవలోకమున జీవుడైనది. మనస్సు ఆరవది యగు నింద్రియములను ప్రకృతియందుంచి సంచాలనము చేయించుచున్నది.

(సనాతనుడగు 'నే'నను తత్త్వమే జీవులుగా దిగివచ్చినది. దానికై జీవలోకము ప్రకృతి నుండి సృష్టింపబడినది. గోడ కన్నము నుండి గదిలోనికి ప్రవేశించిన సూర్యకిరణము గది కంతటికిని కొంత వెలుగు నిచ్చును. కిరణము వచ్చుదారిలో నున్నవేగాక, అటునిటు నున్న వస్తువులు కూడ కొంత కొంత కనుపించును. అట్లే సనాతనమైన పురుషుని యంశ గదులు గదులుగా స్థూల లోకములలోనికి దిగిరాగా నొక్కొక్క లోకమునకు తగినంత ప్రజ్ఞ పనిచేయుచున్నది. ఈ ప్రజ్ఞల లేత ముదుళ్ళన్నియు కలిసి 'నే'నను ప్రజ్ఞ నాశ్రయించి జీవు డనబడుచున్నవి. గోళ్ళు, వెంట్రుకలు, పులిపిరికాయలు మున్నగువానితో కలసియే వ్యక్తి గౌరవింప బడుచున్నాడు. వ్యక్తుల పేర్లు– దుస్తులు మున్నగు నిర్జీవ పదార్థములతోను, చర్మాదులతోను కలిసి వ్యక్తికి చెందుచున్నవి. జీవియనగా సృష్టియను వస్త్రము, శరీరాదులు ధరించిన 'నే'నను సనాతనుడు– మిగిలినవి వాని యంశలు. వ్యక్తికి చేతులు, కాళ్ళు, కన్ను, ముక్కు మున్నగునవి అతని యంశలు. ఇట్లే సృష్టియందలి ప్రకృతి పొరలన్నియు సనాతనుని యంశములు. ఈ పొరలలోనుండి సనాతనుని వెదకునట్టి మార్గమే వెనుదిరగని బాట.

ఇంద్రియములు – మనష్షష్ఠములు. అనగా మనస్సును ఆరవ దానినిగా కలవి. ప్రతి ఇంద్రియము నుండియు మనస్సే పనిచేయుచున్నది గనుక నిట్లు వర్ణింపబడినవి. మనస్సను మొగ్గ నుండి వీనిని విచ్చుకొనిన ఐదు రేకలు అనవచ్చును. ప్రతి రేకకును పువ్వు కేంద్రమే ఆధారము. దాని నుండియే ఆహారాదులు పోషింపబడును. ఒక్కొక్క పువ్వునకు దాని యాకార మెట్లు

మారక నియతమై యుండునో, మనస్సునకు నింద్రియములకు వాని స్వభావ చేష్టలకు నట్లే. కనుక నివియన్నియు స్వభావ మనబడు ప్రకృతి నుండి, ప్రకృతి వలన నుద్భవించుచున్నవి. 'నేను' అను పరతత్త్వము నుండి ప్రకృతి పుట్టినది. ఈ ప్రకృతిలో పరతత్త్వము అంశగా నున్నది. అంశయనగా వికాసములో కొంత అనియే గాని కొంత భాగమని కాదు, నేతికి పేరిన నేయి యొక అంశ. ఇది స్థితి భేదముచే పరిణామముగా నిద్రించి సన్నగిల్లిన మూలతత్త్వము తెలియజేయును. కరగిన నేతిలో అడుగున నున్న వస్తువు కనిపించును. పాత్రనుబట్టి యాకారము మారును. నేయి పేరుకొనగా నీ రెండు శక్తులను కోల్పోవును. దాని కొక ప్రత్యేక లక్షణ సముదాయ మేర్పడును. అట్లే జీవునకు జీవ లక్షణములు, మనస్సునకు నింద్రియములకు వాని లక్షణములు తాత్కాలికముగా వర్తించును. బాహ్య స్పర్శలు ఇంద్రియములను లాగును. ఇంద్రియములు మనస్సును లాగును. మనస్సు బుద్ధిని, చిత్తమును, అహంకారమును లాగును. ఒక్కమారు 'నే'నను తత్త్వము వీని నన్నిటిని తనలోని కాకర్షించును. కనుక నివి యన్నియు 'నే'నను శాశ్వత పురుషుని నుండి అంశలుగా వచ్చి వర్తించు చున్నవి. ఇట్లు వెదకికొనవలసిన మార్గ మేర్పడి యున్నది.)

**8.** శరీరమును పొందుచున్న దెవరు? దీనిని విడచిపోవుచున్న దెవరు? అది నేనే! విడచిపోవునపుడు మనస్సును, ఇంద్రియములను గొనిపోవు చున్నాను. గాలి పూలవాసనల నెట్లు గొనిపోవునో అట్లు గొనిపోవుచున్నాను. కనుక వీని కన్నిటికిని ఈశ్వరుడను నేను.

(నత్తపురుగు శరీరద్రవము నుండి చుట్టును నత్తగుల్ల కట్టుచున్నది. అట్లే ఈశ్వరుని ప్రకృతినుండి శరీరములు నిర్మాణ మగుచున్నవి. నత్తగుల్ల నత్తపురుగు శరీర భాగముగా పనిచేయుచు దానితో ప్రాకి వచ్చుచున్నది. కాని ఆవశ్యమగుచో నత్తగుల్లను విడచి పురుగు వెలికి రాగలుగుచున్నది. పాము చర్మమే కుబుసము కాగా అందుండి పాము వెలువడ గలుగుచున్నది. అట్లే ఈశ్వరుడు తన ప్రకృతి నుండి నిర్మాణమైన శరీరమును విడచి పోగలుగుచున్నాడు. పోవునపుడు శరీరధారణ స్వభావమును మాత్రము తనతో గొనిపోవుచున్నాడు. కన్ను, ముక్కు, చెవి మొదలగు ఇంద్రియముల

పెట్టెలను విడచి పోవుచున్నాడు. కాని చూచుట, వినుట మున్నగు శక్తులను తన యందు భాగములుగా కొనిపోవుచున్నాడు. వానిని మనస్సునందు మనోధర్మములుగా నిమిడ్చి, యీ మొత్తము మనస్సును మనశ్శక్తిగా సూక్ష్మపరచి, మనస్సు కూడ లేకుండ మనశ్శక్తిని గొనిపోవు చున్నాడు. ఉదాహరణమునకు ఒక నగరమున నిలిపిన యొక కార్యాలయము మరియొక నగరమునకు మార్చబడినపుడు కార్యాలయమునకై నిర్మింపబడిన భవనము, కుర్చీలు, బల్లలు ఆ నగరముననే అమ్మబడుచున్నవి. వ్యక్తులు మాత్రము భవన నిర్మాణము చేయు కూలీలు, శాస్త్రజ్ఞులతో ఇంకొక నగరమునకు పోవచ్చును. అచ్చట నొక మైదానమున మరల అట్టి భవనమే నిర్మించి అవే స్థానములో కుర్చీలు, బల్లలను నిలిపి, అవే స్థానములలో వారే యధికారులుగా కూర్చుండి, అవే కార్యములను మరల నిర్వహింతురు. ఇట్లు మనస్సును, ఇంద్రియములను ఈశ్వరుడు జీవుని యధికారమున తనతో గొనిపోవును. గాలి సుగంధమును గొని రాగలుగుటయే దీనికి మనము గ్రహింపగలిగిన నిదర్శనము.)

**9.** చెవి, కన్ను, స్పర్శజ్ఞానము, రుచి, వాసన యనునవి మనస్సు నుండి ఐదు శక్తులుగా విప్పారి, భౌతిక శరీరమున ఆయా భాగముల నాశ్రయించి పనిచేయుచున్నవి. ఇవి యన్నియు మనస్సు నధిష్ఠించియే శబ్దాది విషయములను గ్రహించు చున్నవి.

(ఇందు ఒక్కొక్క యింద్రియమునకు ముక్కు, కనుగ్రుడ్లు మున్నగు భౌతిక స్థానము లున్నవి. వానియందు ఇంద్రియములు ఆవేశించి పనిచేయుచున్నవి. వాని ప్రవర్తన యందు మనస్సే పనిచేయుచున్నది. విద్యుద్దీపము, పంకా, రేడియో, టెలిఫోను అనువాని నాశ్రయించి విద్యుచ్ఛక్తియే ఆయా కార్యములను నిర్వర్తించు చున్నది. ఈ విద్యుచ్ఛక్తి యొకచోటునుండి ప్రవహించి వచ్చినదేగాని అందుద్భవించుట లేదు. అట్లే ఇంద్రియములు, మనస్సు, దేహము మరియొక తావునుండి దిగివచ్చుచున్న ఈశ్వరుని యంశలు గనే పనిచేయును. విద్యుచ్ఛక్తి శక్త్యాలయము (Power Station) నుండి పంప బడుచున్నది. అట్లే ఈశ్వరుని శక్తి హృదయము నుండి యుద్భవింపజేయ బడుచున్నది. శక్త్యాలయమున యంత్ర నిర్మాణము నందు అయస్కాంతీకరణ చక్రము (Dynamo) యొక్క మథనమున ఆకాశమునుండి వ్యక్తము చేయ

బడుచున్నది. అట్లే హృదయమను యంత్రమున ఆకాశమునుండి ఈశ్వరుడు జీవుడుగా వ్యక్త మగుచున్నాడు.)

**10.** శరీరమునందు వున్న జీవునిగాని, విడచి వెళ్లుచున్న వానిని గాని విమూఢులు దర్శింపలేరు. జ్ఞానమను కన్ను గలవారు చూడగలరు. ఈ గుణములతో కూడిన జీవుడు, ఎట్లు ఇంద్రియార్థముల ననుభవించు చున్నాడో చూచుటకు మోహము చెందని జ్ఞాన మావశ్యకము.

(మంచుగడ్డను చూచుచున్నపుడు అందలి జలము జ్ఞప్తికి రాదు. వస్త్రమును చూచుచున్నపుడు అందలి ప్రత్తి స్మరణకు రాదు. ఆభరణమును చూచుచున్నపుడు అందలి సువర్ణము జ్ఞప్తి యుండదు. నాటకము చూచు చున్నపుడు నాటకశాల, పాత్రధారులు, కవి, సాహిత్యము జ్ఞప్తికి రావు. ఇట్టి స్థితినే మోహ మందురు. ఆ స్థితిలో నున్నవాడు మూఢు డనబడును. సృష్టిలోని ప్రకృతి వికారములకు మూఢుడైనవాడు వికార మూఢుడు, విమూఢుడు అనబడును. అట్టివానికి ఈశ్వరుడుగాని, దేహమందున్న జీవుడుగాని గోచరింపడు. ఈ విమూఢత నుండి దాటి వర్తించుట జ్ఞానస్థితి. ఈ స్థితు లన్నిటిలో నన్ను స్మరించుటవలన జ్ఞానము కలుగును. జ్ఞానదృష్టికి జీవుడు చక్కగా భాసించును. గుణములతో కూడియుండియు, గుణములకన్న విశిష్టుడుగా ధ్యానమునకు దర్శన మిచ్చు చుండును. వినుట, చూచుట చేయుచున్నపుడు కూడ ఈ గుణములు వాని నుండి ప్రసరించు చున్నట్లును వాని కతీతుడగా నత దున్నట్లును తెలియు చుండును. అనుభవముల యందు ఇంద్రియ మనస్సుల మూలమున వర్తించు నంశతో కలిసి జీవుడని గుర్తింప బడును. అంశలకన్న విశిష్టుడై ఈశ్వరుడని గుర్తింపబడును.)

**11.** యోగులు యత్నము చేసి యీ దేహములోని జీవుని స్థితిని, ఆత్మస్థితిని దర్శింప గలుగుచున్నారు. ఆత్మయందు యోగ మభ్యాసము చేయనివారు దీనిని చూచుట లేదు.

(యోగు లనగా దేహేంద్రియ మనోబుద్ధులను, ప్రకృతిని 'నేను' అను తత్త్వమున చూచువారు. నిత్యము నన్ను స్మరించు చుండుటవలన ఇందొక్కొక్కటియే 'నే'నను ఈశ్వరునిచే కాంతిమంతమై పనిచేయు చుండును. అప్పు డొకదానియం

దొకటి చక్కగా నమరి యుండును. మానికలో సోల, అందులో అరసోల మున్నగునవి వరుసగా నిమిడ్చి అమర్చినట్లు యోగియందు ఇంద్రియములు మనస్సులో, మనస్సు బుద్ధిలో, బుద్ధి ఈశ్వరుడైన 'నా'లో నిమిడియుండును. అట్టివాడు సర్వమునం దంతర్యామిగా జీవుని, వానియందు విశిష్టునిగా నాత్మను చూచును.

'నా' యందు పరిశ్రమ లేనివాడు మనోబుద్ధ్యాదులచే నెంత శ్రమించినను, యజ్ఞ యాగాది క్రతువులు చేసినను, వేద పురాణాది శాస్త్రములు నేర్చినను, అందెందును పరిష్కారము పొందలేడు. ఈ విద్య లన్నియు తనకన్న భిన్నముగా మనస్సు మడతలలో బరువెక్కు చుండును. మంచి గ్రంథములుగల బరువైన పెట్టెను మోయుచున్న వానివలె దుర్భరమగును. 'నా' యందు చూడలేని విద్యలను ఎంత ఆకలితో నభ్యసించినను ఆకలి గొనినవాడు అరటిపండ్ల గెలను మోయు చున్నట్లుండును. తిన్నవానికి మాత్రమే ఆకలి తీరినట్లు, ఆత్మయందు సాధన చేసినవానికి మాత్రమే వానివలన ఆత్మదర్శన మగును.)

**12.** ఆదిత్యుని యందుగల తేజస్సు జగత్తునంతను వెలిగించు చున్నది. అట్లే చంద్రునియందు గల వెన్నెల, అగ్నియందు గల వేడిమి, వెలుగు జీవలోకమును చక్కబెట్టుచున్నవి. అవి నా వెలుగు లని భావింపుము.

(సూర్యుని జూచి "నేను సూర్యుని చూచుచున్నాను" అని తలచువానికి 'నే' నను ప్రజ్ఞ శరీరమునను, సూర్యుడను పేరు ఆకాశము నను వేరుగా నుండును. కాని "సూర్యుడు నేను" అని యెరిగినవాడు యోగి. మనకు మన శరీర మున్నట్లు, సూర్యునికి సూర్యబింబ మున్నది. ఈ శరీరమునందు నేనను ప్రజ్ఞ యున్నట్లు సూర్యుని యందును నేనను ప్రజ్ఞ యున్నది. దానిని 'నేను' అని భావింపక, 'వాడు', 'అతడు', 'అది' మున్నగు పదములకు లక్ష్యమైన భావన చేసినచో సర్వాంతర్యామియైన ఈశ్వర భావము లభింపదు. ప్రతి జీవియు తన శరీరమున 'నేనున్నా' నని తెలిసికొనును. అదియే నా యొక్క వెలుగు వెలువడుట. ఎదుటివాని యందు "అత డున్నాడు" అను భావనచే ఈశ్వరుడు పూజింపబడక, అనాత్మ గోచరించును. అనాత్మ లేదు గనుక జ్ఞానము మోహమగును. లేని దున్నట్లు గోచరించు భ్రాంతిలో జీవితము

గడచిపోవును. ఇట్లు వివేకము చేసికొని సర్వమునందు నే నున్నానని భావన చేయవలెను. సూర్యుని యందు సూర్య ప్రకృతికి, చంద్రాదుల యందు వారి వారి ప్రకృతికి గల ప్రత్యేకత అను గూటిలో నుండి అవ్వలి వెలుగగు 'నేను' భావింప బడినప్పుడు ఆ వెలుగు 'నాది' యని దర్శనమిచ్చును.)

**13.** సకల చరాచర జీవలోకము లందును నేను ఆవశ్యకతయను వ్యూహమును కల్పించి, దానికి తగిన ప్రకృతిని గుణ సముదాయముగా కల్పించి, ఉచితములైన సృష్టి కార్యములను ఈశ్వరుడుగా నిర్వర్తించు చుండును. భూమి నావేశించి ఓజస్సు రూపమున నీశ్వరుడగు నేను జీవులను ధరించు చున్నాను. రసాత్మకుడగు సోముడై నేను ఓషధుల నన్నిటిని పరిషోషించు చున్నాను.

(ఓజస్సు అనగా ఓంకారమును జనింపచేయు శక్తి. భౌతిక పదార్థము నందు ఆవేశించియున్న ప్రాణస్పందన మిది. గర్భస్థుడగు జీవుని తొలుతగా బ్రతికించు సారమిది. గర్భము ధరించు శక్తిని ఆయా ధాతువుల కిచ్చు సారము కూడ నిదియే. "*యత్సార మాదౌ గర్భస్య యత్తద్గర్భరసా ద్రసః*" అని ఆయుర్వేదమున ఓజస్సు నిర్వచింపబడినది. ప్రాణుల హృదయములలో నావేశించి, యిది హృదయ స్పందనము కలుగజేయును. దానితో ఊపిరితిత్తులు స్పందించి, ఓంకార ముద్భవించి, యుచ్చారణ మొంది, "సోఽహం" అను శ్వాస మంత్రముగా వెలువడును. ఇది పృథివీ తత్త్వము నావేశించి సూక్ష్మ తత్త్వములలో పనిచేయు చుండును. భూమియందలి లవణాదులలో భూసార ముగా నావేశించి యుండి, జీవరాసులకు అంకురోద్భవాది సామర్థ్యముల నిచ్చును.

సోముడు బ్రహ్మాండమునకు అతీతుడైన గంధర్వుల గణము లోనివాడు. రుచి యనునది సోముని ప్రభావము. రుచి, అభిరుచి, లలితకళాసృష్టి, తన్మయీకరణము ఇతని శక్తులు. అందు రుచికొరకై జలములయందు తన ప్రకృతిని నిహితము చేయును. ఇతని ప్రభావమున ఓషధులు పుష్టి చెందును. ఓషధు లనగా ఫలపాకాంతములు (పంటతో చెట్టు చనిపోవునవి). ధాన్యము లన్నియు నోషధులను జాతివృక్షములు. సోముడు చంద్రుని కిరణముల ద్వారమున భూమిపై పనిచేయుటవలన ఓషధులు పుష్టి

చెందుచున్నవి. ఇవి యన్నియు ఆయా దేవతల ప్రకృతులుగా 'నా' నుండి అంశ లగుచున్నవి గనుక నేనే ఇన్ని ప్రకృతులలో నిర్వహించు చున్నాను.)

**14.** నేను వైశ్వానరుడుగా ప్రాణుల దేహము నాశ్రయించి, ప్రాణా పానములను సమానమునందు యోగముచేసి, నాలుగు విధములైన యన్నమును పచనము చేయుచున్నాను.

(వైశ్వానరుడు అనగా విశ్వమందలి నరులలోనున్న అగ్నిహోత్రుడు. ఇతనిని ప్రాణమయ కోశమున కధిదేవత యగు మూర్తిగా గుర్తింతురు. ఇతని కోశమువలన రక్తప్రవాహము, జీవ రసమునకు వలయు శరీరోష్ణము వ్యక్తమగుచున్నవి. ఆకలి యను రూపమునకై ఇతడు జఠర రసములను వ్యక్తము చేయును. ఆహారము జీర్ణమగుట, సారము గ్రహింపబడుట, మలములు దగ్ధమగుట యీ కోశము వలననే. దీనినే నరునిలోనున్న అశ్వముగా వేదములు కీర్తించినవి. వీనివలననే ఇందు వర్ణింపబడిన సృష్టి మహావృక్షము అశ్వత్థమని పేర్కొనబడినది.

ప్రాణాపానములను సమానమునందు యోగము చేయుట యనగా నుచ్ఛ్వాస నిశ్వాసములను శరీర వ్యాపారమునకై వినియోగించుట. ఉచ్ఛ్వాసమున ప్రాణము ప్రాణ వాయువుగా స్వీకరింపబడును. నిశ్వాసమున మృత్యువు బొగ్గుపదార్థముగా వెలికిబోవును. ఈ ప్రక్రియ నడుమ దేహమున నితర స్పందనములు పుట్టును. అవి దశ ప్రాణములుగా వేదములందు కీర్తింప బడినవి. రక్తము ప్రాణవాయువును స్వీకరించుట వలన, సూర్యుని ప్రసార తత్త్వము లోన ప్రవేశించి అవయవములను స్పందింప జేయును. అందు జఠరమున కలుగు ప్రాణాపాన స్పందనమువలన ఆకలి పుట్టును. జీర్ణరసములు మథనమున, పెరుగునుండి వెన్నవలె వెలువడుటయే ఆకలిగా వ్యక్తమగును. దాని మహిమ వలన ఆహారమును స్వీకరించు నిచ్ఛయను ప్రకృతిశక్తి పుట్టును. దీనివలన శరీరము నిలబడుటకు సమాన వాయువు అను స్పందన మేర్పడి, ఆహారములోని ద్రవ్యము శరీరముగా స్తంభింపబడుట జరుగును.

నాలుగు విధములైన అన్నము : స్వీకరించు నాహార మంతయు ఖనిజములుగా ధాతువులలోని పదార్థమగును. వృక్ష పదార్థముగా రసము,

శుక్రము, ఓజస్సు అగును. జంతుపదార్థముగా రక్త మాంసములు, ఎముకలు మున్నగునవి యగును. మనుష్య ఆహారముగా మేధస్సు, ఇంద్రియశక్తులు, మనస్సు అగును. ఈ ప్రకృతులన్నియు నా యంశలే యని ధ్యానింపవలెను.)

**15.** నేను జీవరాసుల హృదయమున ప్రవేశించియున్నాను. స్మృతి, జ్ఞానము, అపోహ యను వ్యాపారము లన్నియు నా వలననే కలుగుచున్నవి. వేదము లన్నిటిలో నేనే తెలిసికొనదగిన వాడను. నరులకు వేదాంతవిద్య నిచ్చినవాడను నేనే! వేదములను తెలిసికొనిన వాడను నేనే!

(శరీర మనో బుద్ధ్యహంకారాది వ్యాపారము లన్నియు ప్రాణ ముండుట వలన జరుగుచున్నవి. స్మరించుట, తెలిసికొనుట, పొరబడుట కూడ నట్లే. వేదములు చదువుట, ఆత్మదర్శనము చేయుట, మోక్షము నొందుట వరకును సకల వ్యాపారములును ప్రాణి ధర్మములే. ప్రాణ ముండుట వలననే ఇవి యన్నియు జరుగుచున్నవి. ఉచ్ఛ్వాస నిశ్వాసములు ప్రాణమునకు వ్యాపారములు. వానికి కారణము గుండె కొట్టుకొనుట, రక్తము ప్రసరించుట. గుండె కొట్టుకొనుటకు కారణము లేదు. కనుక 'నే' నను ప్రజ్ఞ అందు నిలువ దలచుటయే కారణము కనుక, 'నేను' సర్వజీవుల హృదయము లందు నిలిచి యుండుట యెరుగవలెను. గుండె కొట్టుకొనుట, ఆగిపోవుట ఈశ్వరాధీన ములు. ఆ ఈశ్వరుడు 'నే' నను ప్రజ్ఞ. కనుకనే వేదోపనిషత్పురాణములు హృదయ మీశ్వరునకు స్థానమని చెప్పుచున్నవి. "ఈశ్వరుడు సర్వ జీవులలో హృదయ ప్రదేశమున నున్నా"డని పరోక్షముగా నీ గ్రంథముననే చెప్పబడినది. ఇచ్చట 'నేనున్నా'నని ప్రత్యక్షముగా చెప్పబడినది.

స్మృతి అనగా స్మరణము. అదివరకు అనుభూతమైన వస్తువు యొక్క అప్రత్యక్ష జ్ఞానము. జ్ఞాన మనగా పరోక్షము, ప్రత్యక్షము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి మున్నగు స్థితులలో నుండి జ్ఞేయము అను దానిని తనలోనికి చేర్చుకొనుట జ్ఞానము. అపోహన మనగా పొరబడుట. ఒకదాని నింకొకటి యనుకొనుట. భ్రమ ప్రమాదాదులు దీని వ్యాపారములు. త్రాటిని జూచి పామనుకొనుట. తత్ఫలితముగా శరీర మానసికాది విపరిణామములు అనుభవించుట. ఇందు పూర్వరంగము జ్ఞానమే. ఉత్తరరంగము తలక్రిందులైన

స్మృతి లేక ఇంద్రియాదుల విపరీత వ్యాపారము. పూర్వమే త్రాటిని, పామును వేర్వేరుగా నెరిగి యుండనిచో రజ్జు సర్పభ్రాంతి సంభవము కాదు. జ్ఞానమే పూర్వరంగమై ఆయా ప్రయోజనముల నుద్దేశించి ప్రకృతి విపరిణామ మును 'నేను' కలిగించుటవలన నిది కలుగును. కనుక ఈ మూడును నా వలననే కలుగుచున్నవి.

వేదములయందు అగ్ని, వాయువు, వరుణుడు మున్నగు వివిధ దేవతలు మంత్రములుగా రూపొందుచున్నారు. అనగా సృష్టియందు వర్తించు చున్నారు. సృష్టియను వేదమునకు మంత్రరూపమే శ్రుతియగు వేదము. ఇందలి దేవత లందరును పురుషు డనబడు నీశ్వరుని యందు అంగాంగీ భావము చెందియున్నారు. ఈ యంగములతో నంతర్యామి యగు నీశ్వరుడే బ్రహ్మాండ పిండాండములుగా సృష్టియై దిగివచ్చు చున్నాడు. అతడు 'నే'నను రూపమున వ్యక్తమగుచున్నాడు. గనుక వేదము లన్నిటిలో 'నేనే' తెలియ దగినవాడను. ఈ 'నా' నుండియే మోక్షవిద్య యుద్భవించి, వేదాంతముగా నరుల కనుగ్రహింపబడినది. నరుడుగా వేదము చదువు జీవుడును ప్రకృతి యందు వర్తించు నీశ్వరుడే గనుక వేదము చదివి తెలిసినవాడనుకూడ 'నేనే'. వేదమంత్రములలో అనేకములు "దీని నెవ్వడు తెలిసికొనునో వాడు శోకము తరించును, అమృతత్త్వము ననుభవించును" అని కీర్తించుచున్నవి. ఈ కీర్తనము లన్నియు వ్యంగ్యముగా అధ్యయనము జేయు శిష్యునిలోనున్న పురుషరూపుడగు నీశ్వరుని గూర్చియే రచించి యంకితము చేయబడినవని తెలుపుచున్నవి. అందందు వాచ్యముగా కూడ నరుని కీశ్వరుడుగా కీర్తించు మంత్రములు 'నారాశంసి' యను పేరున నున్నవి.)

**16.** సృష్టింపబడిన లోకమున క్షరు డనియు, అక్షరు డనియు నిద్దరు పురుషులున్నారు. సర్వ జీవరాసులుగా క్షరు డున్నాడు. లోపల హృదయమున అక్షరు డున్నాడు.

(క్షరు డనగా నశించువాడు లేక అనుక్షణము మార్పులకు గురియగువాడు అని యర్థము. దేహేంద్రియ మనో బుద్ధ్యహంకారములుగానున్న పురుషుడు క్షరు డనబడును. 'నేను' అను ప్రజ్ఞ ఈ మార్పులకు గురికాదు గనుక అక్షరు

డనబడును. అతడు హృదయమున నుండును. గనుక కూటస్థుడు అనబడును. ఇతడు చేతన స్వరూపుడై యుండును. కూటస్థుడను పదమునకు నిలయమున నున్నవాడు. లోపల నిమిడి యున్నవాడు అని యర్థము. వీరిద్దరును ప్రతి యణువునందు నుందురు.)

**17.** వీరిరువురుగాక నుత్తమ పురుషుడు మరియొక డున్నాడు. అతడు పరమాత్మ యని చెప్పబడును. మూడు లోకములును నిండి యుండి భరించు చున్న యీశ్వరుడు.

(క్షర పురుషుడు సర్వజీవులుగా నున్నాడు. అక్షర పురుషుడు అందలి ప్రజ్ఞలుగా నున్నాడు. ఈ యిరువురును పరమాత్మ యనబడు పరమ పురుషుని యందున్నారు. జీవప్రజ్ఞలు పనిచేయుట, దేహములు నశించి పుట్టుచుండుట ఈ రెండును వానియందు జరుగుచుండును. అతడీ రెండిటిని అంటడు. కాని ఈ మూడు తత్త్వముల యందును అతడే నిండియున్నాడు. సృష్టియందు మొదటి రెండు తత్త్వములుగను, సృష్టిలయముల యందు అతీతుడై మూడవ తత్త్వముగను నున్నాడు. మరియు సృష్టియందు కూడ మూడవ తత్త్వ మంతర్యామిగా నున్నాడు.

“ఉత్తమః పురుషః” అనుటలో ప్రతి జీవియందును ఉత్తమ పురుష యగు “నేను, తాను” అను పదములచే తెలియదగిన వాడుగా నున్నాడు. లోకత్రయము అనగా మూడు లోకములు. అవి వేదమున భూలోకము, భువర్లోకము, సువర్లోకము అని పేర్కొనబడినవి. అందు మొదటిది ద్రవ్యమయ లోకము. రెండవది ప్రజ్ఞామయ లోకము. మూడవది ‘నే’నను వెలుగుతో నిండిన లోకము. ఈ ముగ్గురు పురుషులును ఋగ్వేదమందలి సుపర్ణసూక్తమున మొదటి మంత్రమున పలితుడు (వెలుగైనవాడు), అశ్నుడు (అనుభవించువాడు), ఘృతపృష్ఠుడు (ద్రవ్యమును పులుముకొనిన వాడు) అని కీర్తింపబడిరి. అదే సూక్తమున క్షరాక్షర పురుషులు పిప్పల వృక్షమున రెండు సుపర్ణములుగను, పురుషోత్తముడు వృక్షము యొక్క అగ్రము నందుకొనిన ధీమంతుడుగను చెప్పబడిరి.)

**18.** ఉత్తమ పురుషుడనైన నేను క్షరునకు నతీతుడను, అక్షరుని కన్న

నుత్తముడను. అందుచే లోకము నందును, వేదము నందును పురుషోత్తముడని ప్రసిద్ధుడ నైతిని.

(క్షరుడుగా కూడ నుండుట వలన క్షరుని కన్న నతీతుడు. ఉపాధ్యాయుడు తక్కువ తరగతికికూడ పాఠము చెప్పగలడనుట వంటిది. అతడే అక్షరుడుగా కూడ నుండుటవలన అక్షరునికన్న నుత్తముడు. క్షరుడు, అక్షరుడు ఉత్తమునిగా మాత్రము ఉండలేరు. సృష్ట్యంతమునగాని, యోగస్థితి యందుగాని యుత్తముడుగా మాత్ర ముండగలరు. అనగా నుత్తముని యందుండగలరు. క్షరాక్షరులు ఉత్తముని ప్రకృతి; పురుషోత్తముడు ప్రకృతి కతీతుడు.

లోకము నందును, వేదము నందును – అనగా వ్యక్తులు పిలుచుకొనుట, తెలిసికొనుట, సృష్టిగా వ్యవహరించుట యందును, వేదమూర్తులుగా కీర్తింప బడుట యందును సమానులే యని అర్థము. లోకమునందు క్షరపురుషుడు వ్యవహరించును. అక్షరుడు వ్యవహరింపజేయును. పురుషోత్తముడు వారి ప్రవర్తనమున తేజరిల్లును. అనగా వారిచే ప్రవర్తన రూపమున ప్రశంసింప బడును. ఈ మూడవ విభూతియే వేదము. లోకమునందు అనగా లోకభాషా వాఙ్మయమను పురాణ కావ్యాదుల యందు అని అర్థము. వేదమునందు అనగా వేద ఉప నిషద్బ్రాహ్మణ ఆరణ్యకములయందు అని యర్థము. ఇదికాక అన్ని భాషలయందును ప్రతి పదమునకును లోకార్థము, వేదార్థము అని రెండర్థములుండును. కృష్ణుడు, రాముడు మున్నగు పదములు వ్యక్తులను నిర్దేశించినపుడు లోకభాష యగును. అట్లుకాక సంకర్షణాపకర్షణాది కర్షణము లకు కారణభూతుడు, ధర్మమునందు రమించువాడు మున్నగు మంత్రార్థములలో వాడబడినప్పుడును, వాక్యములందు కర్త కర్మ మున్నగు కారకశక్తులను వ్యక్తము చేయునపుడును వేదార్థములు అనబడును. అందు లోకార్థము నామ రూప దేశ కాలబద్ధుడగు క్షరపురుషుని, కర్మ క్రియా స్వరూపుడగు అక్షరపురుషుని కీర్తించును. వేదార్థము తదతీతుడైన పురుషోత్తముని మాత్రమే సూచించును. వ్యక్తుల నామము లన్నియు గుణములచే వేర్వేరుగా వినియోగింపబడి, గౌణములు అగుచున్నవనియు, నాత్మలకు చెందుచున్నవనియు, స్మరణ నిచ్చునపుడు మహా + ఆత్మయగు పరమపురుషుని కీర్తించు చున్నవనియు భారతమున

భీష్ముడు 'విష్ణు సహస్రనామ ప్రశంస'లో ధర్మజున కుపదేశించెను. కనుక ప్రతి పదమును లౌకికముగను అలౌకికముగను పురుషోత్తమునే స్ఫురింపజేయును.)

**19.** సమ్మోహము చెందక నన్నీవిధముగ పురుషోత్తముడని ఎవడు తెలుసుకొనునో అతడు సమస్తము తెలిసినవాడు. అతడు సర్వ భావముల చేతను నన్నే భజించును.

(సమ్మోహము చెందక యనగా క్షరాక్షర పురుషులను జూచునపుడు పురుషోత్తముని యంశలే యని మరువక యని యర్థము. ముగ్గురు పురుషులను వేరుగా గుర్తింపనిచో విజ్ఞానము, జ్ఞాన వికాసము లేవు. ఒక్కని యంశములుగా నుండుట మరచినచో సర్వజ్ఞత, మోక్షము లేదు. క్షరాక్షరులను తెలియక పురుషోత్తమునే భావించినను అనుగ్రహ విశేషమున తెలియుట యను వికాసము తప్పదు. తెలిసిన వారెల్ల రిట్లే తెలిసికొనిరి. నిమిత్తములు శాస్త్రములు కావచ్చును. తెలియుటమాత్ర మనుగ్రహ విశేషము. సర్వభావములచే నన్ను భజించుట యనగా కంటితో శరీరమును, మనస్సుతో మనస్సును, బుద్ధితో బుద్ధిని, లౌకిక వ్యాపారములతో లోకవ్యక్తులను చూచుచుండియు పురుషోత్తముడుగా నుపాసించుట.)

**20.** ఇప్పుడు నాచే నుపదేశింపబడినది రహస్యములలో రహస్యమగు శాస్త్రము. దీనిని తెలిసినవాడు బుద్ధిమంతుడు, కృతకృత్యుడు అగును.

(అతి రహస్యమనగా దాచదగినదనికాక, సృష్టిలో దాగియున్నదని యర్థము. దీనిని తెలిసికొనుటకు 'జ్ఞాత్వా' అని వాడక 'బుద్ధ్వా' అని వాడుట వలన బుద్ధియోగముననే దీనియందు మేల్కాంచవలెనని యర్థము. ఇది దర్శనమేగాని జ్ఞేయముకాదు. క్షేత్రక్షేత్రజ్ఞులకు పరమాత్మ జ్ఞేయము. పురుషోత్తముని యందు క్షేత్రజ్ఞుడు మేల్కాంచవలెను.

కృతకృత్యు డగుట యనగా చేయబడిన కృత్యము కలవాడు. ఆచరింపవలసిన కర్మ లాచరించి కర్మబంధ విమోచనము చెందిన వాడు. ఆచరింపవలసిన కార్యములను గూర్చి పదునెనిమిదవ యధ్యాయమున వివరింపబడును.)

*షోడశోఽధ్యాయః ।*

# దైవాసుర సంపద్విభాగ యోగః ।

*శ్రీభగవా నువాచ :*

అభయం సత్త్వసంశుద్ధి ర్జ్ఞానయోగ వ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥ **1**

అహింసా సత్య మక్రోధ స్త్యాగ శ్శాంతి రపైశునమ్ ।
దయా భూతే ష్వలోలుత్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥ **2**

తేజః క్షమా ధృతి శ్శౌచ మద్రోహో నాతిమానితా ।
భవంతి సంపదం దైవీ మభిజాతస్య భారత ॥ **3**

దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।
అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపద మాసురీమ్ ॥ **4**

దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా ।
మా శుచః సంపదం దైవీ మభిజాతోఽసి పాండవ ॥ **5**

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥ **6**

ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః ।
న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥ **7**

అసత్య మప్రతిష్ఠం తే జగదాహు రనీశ్వరమ్ ।
అపరస్పర సమ్భూతం కిమన్య త్కామహైతుకమ్ ॥ **8**

ఏతాం దృష్టి మవష్టభ్య నష్టాత్మానో ఽల్పబుద్ధయః ।
ప్రభవంత్యుగ్ర కర్మాణః క్షయాయ జగతోఽహితాః ॥ **9**

కామమాశ్రిత్య దుష్పూరం దంభ మాన మదాన్వితాః ।
మోహా ద్గృహీత్వాఽ సద్గ్రాహాన్ ప్రవర్తంతేఽశుచివ్రతాః ॥ **10**

చింతా మపరిమేయాం చ ప్రలయాంతా ముపాశ్రితాః ।
కామోపభోగపరమాః ఏతావదితి నిశ్చితాః ॥ 11

ఆశాపాశ శతై ర్బద్ధాః కామక్రోధ పరాయణాః ।
ఈహంతే కామభోగార్థ మన్యాయే పార్థసంచయాన్ ॥ 12

ఇద మద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్ ।
ఇదమ స్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥ 13

అసౌ మయా హత శ్శత్రు ర్హనిష్యే చాపరానపి ।
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ ॥ 14

ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా ।
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞాన విమోహితాః ॥ 15

అనేక చిత్తవిభ్రాంతా మోహజాల సమావృతాః ।
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేఽశుచౌ ॥ 16

ఆత్మసమ్భావితాః స్తబ్ధా ధనమాన మదాన్వితాః ।
యజంతే నామయజ్ఞై స్తే దంభేనావిధిపూర్వకమ్ ॥ 17

అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।
మమాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః ॥ 18

తా నహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్ ।
క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు ॥ 19

ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।
మామప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాంగతిమ్ ॥ 20

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః ।
కామక్రోధ స్తథా లోభ స్తస్మా దేతత్త్రయం త్యజేత్ ॥ 21

ఏతై ర్విముక్తః కౌంతేయ తమోద్వారై స్త్రిభిర్నరః ।
ఆచర త్యాత్మనః శ్రేయ స్తతో యాతి పరాంగతిమ్ ॥ 22

యశ్శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః ।
న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిమ్ ॥ 23

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తు మిహార్హసి ॥ 24

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*దైవాసుర సంపద్విభాగయోగో నామ షోడశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - *16*

# దేవతలు - అసురులు

**1, 2, 3. శ్రీకృష్ణుడు :** స్వభావములనుబట్టి మానవులు అసురులు, దివ్యులు అని రెండు విధములు. అందు దివ్యసంపత్తియందు జన్మించిన వారికి ఈ దిగువ లక్షణము లుండును : 1) నిర్భీతి, అభయమిచ్చు సామర్థ్యము, 2) పరిశుద్ధమైన సత్త్వగుణము, 3) జ్ఞానమునందు కర్మలు యోగము చెందుట, 4) దానబుద్ధి, 5) ఇంద్రియ నిగ్రహము, 6) యజ్ఞార్థము కర్మ లాచరించుట, 7) ప్రమాణ గ్రంథములను పఠించి పాటించుట, 8) తపస్సు, 9) సూటిదనము, 10) అహింస, 11) సత్యము, 12) పగ సాధించు కోపము లేకుండుట, 13) ఫలములను త్యాగము చేయుట, 14) శాంతి ననుభవించుట, 15) పిసినిగొట్టుతనము లేకుండుట, 16) భూతదయ కలిగియుండుట, 17) ఇంద్రియముల రుచులయందు రమించు స్వభావము లేకుండుట, 18) ప్రవర్తనలో మృదుత్వము, 19) కూడని పనులయందు సిగ్గుపడుట, 20) కేవల కుతూహలమునకై ఆవశ్యకము లేని పనులు చేయకుండుట, 21) చురుకుదనము కలిగియుండుట, 22) ఓర్పు, 23) తనయందు తనకు ధైర్య ముండుట, 24) శరీర మనశ్శుచిత్వము, 25) కీడు తలపెట్టకుండుట, 27) తగని యభిమానము లేకుండుట. ఇవి ఎవని స్వభావమున నుండునో అతడు దైవీసంపదయందు పుట్టినవాడు.

(దైవీ యనుటవలన దైవమును దర్శనముచేయు మార్గము నిచ్చు శక్తి అని యర్థము. ఈ గుణములు లేనివారుకూడ నభ్యాసవశమున నుపాసించినచో వారి ప్రకృతి మారును. ఫలితములు కోరక కర్మాచరణము చేయుటవలననే వీని నభ్యసించుట యలవడును. కేవలము మంచి నెరిగి నిగ్రహించుకొన జూచుటవలన మారదు.)

**4.** అసుర సంపదలో జన్మించినవారికి ఈ దిగువ లక్షణము లుండును. 1) దంభము, 2) దర్పము, 3) తగని యభిమానము, 4) పగ దీర్చుకొను కోపము, 5) మనో వాక్కాయములలో మోటుదనము, 6)

అజ్ఞానము. (దంభ మనగా లేని సామర్థ్యము నాపాదించుకొనుట. దర్పమనగా లేని సామర్థ్యమున్నట్లు కనుపింపజేయుట. తగని యభిమాన మనగా తాను మిగిలినవారికన్న గొప్పవాడని నమ్ముట. అజ్ఞాన మనగా యథాస్థితిని గ్రహింపలేకుండుట, సర్వాంతర్యామి స్మరణ మాటుపడునట్లు తదితరములపై విశ్వాసము బలపడుట.)

**5.** ఈ రెండు విధములలో దైవీ సంపద మోక్షమునకును, అసురీ సంపద బంధమునకును కారణము లగుచున్నవి. అర్జునా! నీవు దైవీ సంపదతో జన్మించితివి గనుక దిగు లక్కరలేదు.

**6.** జీవుల సృష్టి యంతయు నీ విధముగా దివ్యము, ఆసురము అని రెండు విధములు. అందు దైవీ సంపదను విస్తారముగా చెప్పితిని. ఆసురమును గూర్చి మరికొంత వివరింతును.

**7.** వారికి దేనియందు ప్రవర్తింపవలెనో, దేనియందు ప్రవర్తింపరాదో తెలియదు. అనగా ధర్మాధర్మములయందు విశ్వాసము లేదు. శౌచము, ఆచారము, సత్యముకూడ వారు విశ్వసింపరు. (ప్రవృత్తి కర్మలయం దుండ వలెను. నివృత్తి ఫలములయం దుండవలెను. అట్లు ప్రవర్తించినపుడు నియత కర్మలు తన కేవియో తెలియును. ఇట్లు ధర్మప్రవర్తనము విపత్తుల నుండి రక్షించును. శౌచము దేహేంద్రియ మనస్సులకు సంబంధించినది. ఆచార మనగా ఆచరింపదగిన విధానము. దీనిని పెద్దలవలన అనుకరించి తెలియ వలెను. సత్యమనగా యథార్థతత్త్వము నంగీకరించుట. దీని వలన సృష్టిలోని సత్యములు తన స్వభావము లగును. బ్రహ్మ సత్యము అను జ్ఞానము కలుగును. ఆసురసంపత్తి కలవానికి అశక్తతకాక వీనియం దప్రమాణ బుద్ధి నిలుచును. అందుచే అసురత్వము వాసనారూపమై అనేక జన్మలు వెంటాడును.)

**8.** వారికీ జగత్తు సృష్టి సత్యములపై నాధారపడినది యను నమ్మక ముండదు. ఈ సృష్టికి అధీశ్వరుడు అగు భగవంతుడు లేడని పించును. ఒక కారణము లేక సృష్టి యెట్లో వెలువడిన దనుకొందురు. దానికి ధర్మమను ప్రకృతియందు స్థిరత్వము లేదనిపించును. కామము కారణముగా స్త్రీ పురుష

పరస్పర స్పర్శ చేతనే సృష్టి కలుగుచున్నది. అంతకుపైన నేమియు లేదని నమ్ముదురు.

**9.** ఇట్టి దృష్టి నవలంబించి వారు ఆత్మజ్ఞానమును కోల్పోవుదురు. దానితో బుద్ధి తక్కువయగును. ఉగ్రములైన కర్మల నాచరించి, జీవుల వినాశమునకు కారకులై అహితులగుదురు. (ఆత్మను కోల్పోవుట యనగా తనయందుగాని, ఇతరుల యందుగాని 'నే'నను తత్త్వ మున్నట్లు గ్రహింప కుండుట. దీనివలన 'నేను' అను పదమునకు దేహేంద్రియ మనస్సులనియే వారి ప్రమాణము. ఇట్లు అన్వయింపబడిన 'నేను' అను పదమే అహంకార మనబడును.

అల్పబుద్ధులు అనగా వివేచనము లేనివారు. ఉగ్రకర్మ లనగా బంధించుట, బాధించుట, చంపుట మున్నగునవి. జగత్తున కహితులనగా సృష్టిక్రమమునకు శత్రువులు.)

**10.** పూరింపరాని కామము, దంభము, అభిమానము, మదము గలిగి యుందురు. మోహము వలన మంచివికాని సిద్ధాంతములను, విశ్వాసము లను అవలంబించి, అపరిశుద్ధములైన వ్రతాచరణలు కలిగి యుందురు.

(కామ మనగా ఇంద్రియార్థములలో దేనియందైనను నాసక్తి పరి పోషించుట వలన నిది పెరుగును గాని తరుగదు. కనుక దుష్పూరము. మదమనగా నితరులను లెక్కచేయకుండుట. చెడ్డ సిద్ధాంతము లనగా పొరపాటు పలికినను అన్నమాట నిలబెట్టుకొన జూచుట మున్నగునవి. వీని వలన తప్పినదారి సరిపడక వినాశము వరకు పట్టుదల పనిచేయును. కనుక నిట్టివి చెడ్డ సిద్ధాంతములు. తన మాటపై నిర్మింపబడిన విశ్వాసములు. అశుచి వ్రతములు అనగా నగ్న విహారాదులు మరియు వివాహ నియమము, శీలసంపద మున్నగువాని యందు విశ్వాసము లేకుండుట.)

**11.** వారు పరిమితిలేని చింతనము చేయుదురు. దాని కంతము లేక వారి మృత్యువుతోనే అంతమగును. కోరికల ననుభవించుటయే సుఖమనియు, అదియే జీవిత సార్థక్యమనియు, దానికి పైనేమియు లేదనియు నిశ్చయము కలిగియుందురు.

(పరిమితిలేని చింతనమనగా హేతుబద్ధము కానిది, ఆవశ్యకత లేనిది, యుక్తము కానిది, ఇంకను తెగనిది, ఇందు కోరిక లూరు చుండుటయు, చేయని కర్మలనుగూడ భావించు చుండుటయు నుండును. చనిపోవుటతోగాని ఏ చింతనమునకు పరిసమాప్తి కలుగదు. మనస్సు ఫలవృత్తి నుండి విముఖము కాదు. ధనాదులు కూడబెట్టుటలోను, వానికై శ్రమపడుటలోను, స్త్రీ ద్యూత పానాదుల ప్రసక్తిలోను చనిపోవువా రిట్టివారే. సుఖమను పదమునకు ఇంద్రియలోలత్వమను సమన్వయ ముండును గనుక దాని నత్యంతము సాధింప యత్నించుటయే పరమావధి. ఇంతకన్న నేమియు లేదని వారి విశ్వాసము.)

**12.** వందలైన ఆశలచే త్రాళ్ళచేతవలె కట్టబడి యుందురు. కామ క్రోధములు ఆదర్శములుగ నుండును. కోరికలు తీర్చుకొనుటకు అన్యాయ మార్గములలో సాధన సంపత్తిని కూడబెట్టుకొందురు.

(ఆచరణకన్న ముందు ఫలితమును భావించుట ఆశ. ఇది ఆచరించిన కర్మ ఫలములయం దాసక్తికన్న నెక్కువ గట్టిగా బంధించును. దీని వలన గలిగిన కామక్రోధములు మరియు బలీయములు. అర్థ సంచయము లనగా ధనము, పొలము, గృహము, కామ్య వస్తువులు కూడబెట్టుట.)

**13, 14, 15.** వారు నిత్యమిట్లు భావించుచుందురు. "నేడు నేను దీనిని పొందగలిగితిని. ఇక మిగిలినవానిని గూడ నిట్లే పొందగలను. నేడింత కూడినది. రేపింత పెరుగును. నా ధన సంపద నిన్ని రెట్లుగా పెంచు కొందును. ఈ శత్రువును చంపితిని. ఇంకెవడైన నాకు శత్రువైనచో నిట్లే చచ్చును. నాకన్న నధికారము గలవా డెవడు? నాది భోగి జాతకము. నా సంకల్పమునకు తిరుగులేదు. నాకన్న బలవంతు డెవడు? నాది సుఖపడు జన్మ. పుట్టుక చేతనే నే నధికుడను, అందును గొప్ప వంశమున పుట్టితిని. నాతో సాటియెవడు? కొట్టదలచినచోట కొట్టెదను. పెట్టదలచిన వానికి పెట్టెదను. ఇచ్ఛను అనుసరించి సమ్మోదము పొందెదను–" ఇట్లు అజ్ఞాన ప్రలాపములు చేయుచుందురు.

**16.** వారి చిత్త విభ్రాంతులు, మోహముల జాలములు అనేకములు. తమ కామ భోగముల వలన అశుచి యను నరకమున బడుదురు.

(చిత్త విభ్రాంతి యనగా లేని కర్తవ్యములను, వ్యక్తులను గూర్చి లేని యభిప్రాయములను ఏర్పరచుకొనుట. అకారణముగా నొకడు దుష్టు డనుకొనుట, తనయం దొకరికి మోహ మున్నదనుకొనుట మొదలగునవి. మోహజాలములు అనగా నొక పరిస్థితిని గూర్చి పొరబడి భావము లల్లుకొనుట. ఉదాహరణము కీచకుడు నశించిన విధము. అశుచియైన నరక మనగా ఇంద్రియములు పట్టుసడలుట, వాత వ్యాధులు మున్నగునవి. వీని వలన మలినస్థితి నుండి శరీరమును తొలగించుకొనలేక అందే పడియుండి చనిపోవుట మున్నగునవి.)

**17.** వారు తమ్ము తామే గౌరవించు కొందురు. ధనము, అభిమానము, మదము కలిగి వినయమును కోల్పోవుదురు. పేరు ప్రతిష్ఠల కొరకు దంభముగా యజ్ఞయాగాది క్రతువు లాచరింతురు. మరియు తమ పేర యజ్ఞముల నాచరింప జేయుదురు. అవియును విధివిధానములు కావు.

(తమ్ము గౌరవించుకొనుట యనగా ఆత్మస్తుతి, సన్మానములు చేయించు కొనుట మున్నగునవి. నామ యజ్ఞము లనగా తమ క్షేమమునకై సంకల్పము చెప్పి పూజలు చేయించుట మున్నగునవి. విధివిధానము లేకుండుట యనగా గోవునకు బదులు నాణెము లిచ్చుట మున్నగునవి. ఇవి యన్నియు కామ్యకర్మల యందలి తృష్ణ వలన జరుగును.)

**18.** అహంకారము, బలము, దర్పము, కామక్రోధములు కలిగి ప్రవర్తించుట వలన తమ దేహము నందు, నితర దేహములందు అంతర్యామిగా నున్న నన్ను ద్వేషించుచు, నాయం దసూయ కలిగి యుందురు.

(ఇతరులను ద్వేషించుట యనగా వారిలోనున్న ఆత్మస్వరూపుని ద్వేషించుట, అట్లే అసూయయు.)

**19.** ఇట్లు ద్వేషించువారు క్రూరులై నరులలో నధమ శ్రేణి యందుందురు. వారియందు నేనుందును గనుక వారి నెప్పుడును ఆసురములైన జన్మల లోనికే పడద్రోయు చుందును.

(చేసిన కార్యము నేదియైనను దానికి తగిన ఫలితములను కలుగ జేయుటయందు దైవమై యుండును. కామక్రోధాత్మకములైన కర్మల వాసనలు తప్పుకొనరానివిగా పట్టుకొనును. వాని వలన అభిరుచి హెచ్చి, వారి ప్రకృతి మరల మరల అట్టి జన్మలనే పొందించుచుండును. దాని వలన దుష్ఫలితములు, భీతి, విపత్తులు తరచుగా కలుగుచుండును. ఆర్తుడై వానినుండి తప్పుకొనుటకు నుపాయము చేసుకొనుటలో నితరులయందు 'న'న్నర్థింతురు. లేదా విపత్తుల యందు తొలిసారిగా నా స్మరణ జరగవచ్చును. అప్పటినుండి ఆసుర భావము నశించును గనుక వారి కట్టి జన్మలు కలుగుచుండుట కర్మఫల నియమము.)

**20.** దుష్కర్మ వాసనలచే అనేక జన్మలు ఆసురములై మోహము నందు నన్ను స్మరింపకయే చనిపోవు చుందురు. ఇది యధమగతి.

**21.** వారికి కామము, క్రోధము, లోభము అనబడు మూడు ద్వారములు తెరచియుండి నరకమునకు దారితీయుచు ఆత్మ జ్ఞాన వినాశకము లగుచుండును. కనుక బుద్ధిమంతుడీ మూడు ద్వారముల కతీతుడు కావలెను.

**22.** ఈ మూడిటి నుండి విముక్తుడైనచో తమోగుణమునకు ద్వారములు తెరువక, తనకు శ్రేయస్కరములైన పనుల నాచరించును. వాని వలన భగవద్భక్తి, మోక్షము లభ్యమగును.

**23.** తాము కోరిన దానికై కర్మాచరణము చేయువాడు శాస్త్రవిధి నుల్లంఘించును. వానికి సిద్ధిగాని, సుఖముగాని, మోహముగాని కలుగదు.

(శాస్త్ర మనగా శాసించి రక్షించునది అని యర్థము. ఇది గ్రంథముల నుండి యభ్యసింపబడును లేదా పెద్దల వలన తెలియబడును. వారికెట్లు తెలిసినది? ప్రకృతిని, సృష్టి ధర్మములను నిరహంకారముగా దర్శించుట వలన తెలిసినది. సత్ప్రవర్తన వలన ఇంద్రియ మనోబుద్ధులకు మలినము తొలగిపోయి, యథార్థ స్వరూపజ్ఞాన మలవడును. ఇదియే అనుగ్రహము. దీనివలన చిత్తమున శాస్త్రము లుదయించును. అంతవరకు పెద్దల నుపాసించి తెలిసికొనవలెను. విధి నిషేధములకు విధేయుడు కానిచో శాస్త్ర ముదయించు సంస్కారము కలుగదు. ఉదయించి నప్పటినుండి అనుసరించినచో తాను

శాస్త్ర స్వరూపుడగును. ఎట్టి స్థితిలో నైనను శాస్త్రమే ప్రమాణము. ఆరంభ స్థితిలో శాస్త్రము దమమునకును, సిద్ధియందు శమమునకును కారణమగును. ఇచ్చట శాస్త్రమనగా నిబంధనలుగాక మార్గనివేదన వాక్యములని యర్థము.)

ఈ విధముగా చేయదగినది, చేయదగనిది యను నిర్ణయమునకు నీకు శాస్త్రమే ప్రమాణము. శాస్త్ర విధానమున చెప్పబడిన యంశము ననుసరించి కర్మాచరణము చేయవలసి యున్నావు.

(నీకు శాస్త్రము ప్రమాణము – అనగా 'నీవు' అను ప్రజ్ఞకు శాస్త్రాధ్యయన మావశ్యక మనియు, 'నే'నను ప్రజ్ఞ నాశ్రయించినపుడు శాస్త్రజ్ఞానము, కర్మాచరణము సులభముగా లభించుననియు భావము.)

*సప్తదశోఽధ్యాయః ।*

# శ్రద్ధాత్రయ విభాగయోగః ।

*అర్జున ఉవాచ :*

యే శాస్త్రవిధి ముత్సృజ్య యజంతే శ్రద్ధాయాన్వితాః ।
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥ **1**

*శ్రీభగవా నువాచ :*

త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥ **2**

సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయోఽ యం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః ॥ **3**

యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః ।
ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః ॥ **4**

అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః ।
దంభాహంకార సంయుక్తాః కామరాగ బలాన్వితాః ॥ **5**

కర్శయంత శ్శరీరస్థం భూతగ్రామ మచేతసః ।
మాం చైవాంత శ్శరీరస్థం తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్ ॥ **6**

ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।
యజ్ఞ స్తప స్తథా దానం తేషాం భేద మిమం శృణు ॥ **7**

ఆయు స్సత్త్వ బలారోగ్య సుఖ ప్రీతివివర్ధనాః ।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్విక ప్రియాః ॥ **8**

కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః ।
ఆహారా రాజస స్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥ **9**

యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥ **10**

అఫలాకాంక్షిభి ర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।
యష్టవ్యమే వేతి మనస్సమాధాయ స సాత్త్వికః ॥ 11

అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్ ।
ఇజ్యతే భరత శ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ 12

విధిహీన మసృష్టాన్నం మంత్రహీన మదక్షిణమ్ ।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥ 13

దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్ ।
బ్రహ్మచర్య మహింసా చ శరీరం తప ఉచ్యతే ॥ 14

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ 15

మనఃప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః ।
భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే ॥ 16

శ్రద్ధయా పరయాతప్తం తపస్త త్త్రివిధం నరైః ।
అఫలాకాంక్షిభి ర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే ॥ 17

సత్కార మాన పూజార్థం తపో దంభేన చైవ యత్ ।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చల మధ్రువమ్ ॥ 18

మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।
పరస్యోత్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్ ॥ 19

దాతవ్య మితి యద్దానం దీయతేఽనుపకారిణే ।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥ 20

యత్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః ।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥ 21

అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే ।
అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్ ॥ 22

ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణ స్త్రివిధః స్మృతః ।
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥ 23

తస్మా దోమిత్యుదాహృత్య యజ్ఞ దాన తపః క్రియాః ।
ప్రవర్తంతే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్ ॥ 24

తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః ।
దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః ॥ 25

సద్భావే సాధుభావే చ సదిత్యేత త్ప్రయుజ్యతే ।
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥ 26

యజ్ఞే తపసిదానే చ స్థితిః సదితి చోచ్యతే ।
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥ 27

అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।
అస దిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్యనో ఇహ ॥ 28

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*శ్రద్ధాత్రయ విభాగయోగో నామ సప్తదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ।*

అధ్యాయము - 17

# శ్రద్ధలో పోకడలు

**1. అర్జునుడు :** శాస్త్ర విధిని విడిచి శ్రద్ధతో జప హోమ యజ్ఞాది కర్మలాచరించువారు ఏ విధమైన నిష్ఠ గలిగి యుందురు? వారి నిష్ఠకు సత్త్వ రజస్తమస్సులలో నే ప్రకృతి కారణ మగుచున్నది?

**2. శ్రీకృష్ణుడు :** త్రిగుణములను బట్టి శ్రద్ధయే రాజసి, తామసి, సాత్వికి యని మూడు విధములుగా నున్నది.

**3.** ఆ జీవి ప్రకృతి ననుసరించిన శ్రద్ధ వానికి కుదురును. శ్రద్ధతో కూడినవాడు అనగా ఆ శ్రద్ధయే తా నగుచున్నాడు. (జీవుడు తనలోని ప్రకృతి ననుసరించి కర్మ స్వరూపము పొందును. గనుక వాని శ్రద్ధయనగా వాని ప్రకృతియే.)

**4.** సాత్విక ప్రకృతి గలవారు దేవతలను పూజింతురు. రాజసులు యక్ష రక్షస్సులను పూజింతురు. తామసులు భూత ప్రేత గణములను పూజింతురు. (అందరిని దేవతలనియే పిలిచినను శ్రద్ధను బట్టి పూజింపబడు లక్షణము, దేవత్వము, యక్ష రాక్షసత్వము, ప్రేత భూత గణత్వము పొందు చుండవచ్చును. ఉదాహరణకు రాజసులు శివునో, విష్ణువునో త్వరగా పెండ్లి యగుటకు పూజించినచో వాని రజః ప్రకృతి వలన మన్మథుడే శివుడో, విష్ణువో యని పిలువబడును. శత్రువు చనిపోయి పిశాచము కావలెనని పూజించినచో తమః ప్రకృతి వలన పిశాచమే శివుడో, విష్ణువో యను పేర్లతో పూజింపబడుచున్నాడు. ఇట్లు వారి వారి ప్రకృతి ననుసరించి పూజ్యస్థానము లేర్పడును.

**5.** తమోగుణ ప్రకృతి వలన శాస్త్రము ననుసరింపని ఘోర తపస్సు లాచరించుట, దానియందు దంభాహంకారములు కలిగియుండుట, కామరాగ ములు బలీయమగుట జరుగును.

(శాస్త్రమును వ్యతిరేకించు బుద్ధి తమః ప్రకోపము లేనిదే కలుగదు. అట్టివారి యుపాసన నిషిద్ధ మార్గముననే యుండును.)

**6.** కొందరు రజస్తమస్సుల ప్రకోపమున ఆసురమైన నిశ్చయములను పొంది ఘోర వ్రతాదు లాచరింతురు. శరీరమునందున్న పంచభూతములను కృశింపజేయు వ్రతము లాచరింతురు. బుద్ధి లేనివారై శరీరమునందున్న నన్నును కృశమునకు లక్ష్యము చేయుచున్నారు.

(శుష్కోపవాసాది వ్రతములు, దేహ తాడనాదులు, జాగరణము, దేహము క్షతము గావించుకొనుట మున్నగు వ్రతముల వలన శరీర ధాతువులు హాని చెందును. అందు 'నే'నను ప్రజ్ఞ కూడ వాని చేతస్సు నుండి సన్నగిల్లును గనుక 'నన్ను'ను కృశింపచేయుట యగును.)

**7.** ఆహారమునం దభిరుచి, యజ్ఞ దాన తపస్సుల విధానములు కూడ త్రిగుణముల ననుసరించి వేర్వేరుగా నేర్పబడును. వానిని వివరింతును.

**8.** సాత్త్వికునకు సాత్త్వికాహారము ప్రియమగును. ఆయువు, సత్త్వము, బలము, ఆరోగ్యము, సుఖము, ప్రీతి అనువానిని పెంపుదల జేయు నాహారము సాత్త్వికము. రసవంతములు, చమురు గలవి, స్థిరత్వము గలవి, హృదయమున కింపైనవి అగు నాహారము లిట్టివి.

(ఆయువనగా దేహ ప్రాణముల సంయోగ సామ్యము. సత్త్వమనగా కార్యభారమును దీర్ఘకాలము వహింపగల శక్తి. బల మనగా ధాతువుల వృద్ధి. ఆరోగ్యమనగా వాత పిత్త శ్లేష్మములు అను త్రిధాతువుల సామ్యము. సుఖము అనగా ఇంద్రియములకు, దేహమునకు, మనస్సునకు నడుమ సామ్యము. ప్రీతి యనగా జిహ్వకు నచ్చుట. 'రస్యము' లనగా రసముగల కాయలు, పండ్లు, పువ్వులు, ఆకులు. 'స్నిగ్ధము' లనగా నువ్వులు మున్నగు చమురుగల పదార్థములు. 'స్థిరము'లనగా దేహ ధాతువులకు స్థిరత్వమునిచ్చు పప్పులు, దుంపలు మొదలగునవి. 'హృద్యము' లనగా తేనె, నేయి మున్నగు గుండెకు బలమిచ్చు వస్తువులు. సాత్త్వికునకు ఇవియన్నియు ప్రియమై యుండును.)

**9.** రజోగుణ ప్రకృతిగల వానికి కారము, పులుపు, ఉప్పు, వేడిగా నున్నవి, జిహ్వకు తీక్షణమైన జీడిపండ్లు, కాకరకాయలు మున్నగునవి. ఎండబెట్టినవి,

కాల్చినవి యగు నాహారము లిష్ట మగును. ఇవి దుఃఖమును, శోకమును, రోగములను కలిగించును.

(రూక్షము లనగా ఒరుగులు, వడియములు మున్నగునవి. విదాహికము లనగా వేపుడులు, కాల్చిన కూరలు, మాంసము మున్నగునవి. దుఃఖము కలిగించునవి యనగా మనస్సునకు దిగులు, శోకభావము వృద్ధి పొందించునవి. ఉప్పు, పులుపు, కారము హెచ్చుగా వాడుట వలన నివి కలుగును).

**10.** తామస ప్రవృత్తి గలవానికి నచ్చునవి : 1) వండిన వెనుక మూడు గంటలు దాటినవి, 2) రుచి తప్పు వరకు నిలువ యున్నవి 3) దుర్వాసన పుట్టినవి, 4) చద్దిబోయిన పదార్థములు, అనగా నొకపూట దాటిన చద్దియన్నము మొదలగునవి, 5) తిని మిగిల్చినవి లేక ఎంగిలి పదార్థములు, 6) మేధస్సునకు పనికిరానివి.

(అమేధ్య మనగా తెలివిని, చురుకుదనమును చంపునట్టి యాహారము. మరియు సారము లేని యాహారము. ఆయా ప్రకృతి గలవారికి అవి నచ్చుటయే గాక వాని నభ్యాసము చేసినచో ఆ ప్రకృతియు భాసించును. కనుక రజస్తమః ప్రకృతులు గలవారు సాత్త్వికాహారము నందు అభిరుచి కలిగించుకొన్నచో సాత్త్విక ప్రవృత్తి యలవడును.)

**11.** యజ్ఞము కూడ మూడు ప్రకృతుల వారిచే మూడు విధములుగా నాచరింపబడును. సాత్వికుడు ఫలకాంక్ష లేక శాస్త్రవిధి ననుసరించి సత్కర్మా చరణముగా నాచరించును.

**12.** రజోగుణ ప్రకృతి గలవాడు నిర్దిష్ట ఫలమును గోరి యజ్ఞము చేయును. స్వర్గ కామములైన యజ్ఞము లన్నియు నిట్టివే. ఇంకను యజ్ఞము చేసితినని యితరుల గౌరవము పొందుటకు కూడ నత డాచరించును.

**13.** తామస ప్రకృతి గలవాడు విధి విధానమును విడచి యజ్ఞము చేయును. అది అన్నదానము లేక, మంత్రము లేక, దక్షిణ లేక, శ్రద్ధ లేక యుండును. (విధిహీనము అనగా స్తోత్ర మంత్రములతో వివాహోప నయనములు చేయుట వంటిది. అస్పృష్టాన్న మనగా ఆహారదానము లేక

యజ్ఞము చేయుట. మంత్రహీన మనగా మంత్ర మెరుగకయే హోమాదికములు చేయుట. అదక్షిణ మనగా దక్షిణలేని యజ్ఞము. దక్షిణకు సువర్ణములు, ఇష్టవస్తు స్వీకరణకై దానము చేయబడవలెను. శ్రద్ధా విరహిత మనగా పురోహితుడు పూజ చేయుచుండగా చేయించువారు లోకవృత్తములు సంభాషించుట వంటిది.)

**14.** తపస్సు రజస్తమో దోషములను హరించును. అది మూడు విధములు : ఒకటి శారీరము, రెండు వాఙ్మయము, మూడు మానసము. అందు శారీర తపస్సునందీ లక్షణము లుండును : 1) దేవ పూజ, 2) బ్రాహ్మణ పూజ, 3) గురుపూజ, 4) పండిత సన్మానము, 5) స్నానాది శుచిత్వము, 6) ఋజుప్రవర్తనము, 7) బ్రహ్మచర్యము, 8) అహింస.

(ఈ లక్షణముల వలన దేహమునందలి రజస్తమః ప్రకోపములు నశించును. యోగాభ్యాసమునకు శరీర మనుకూలమగును.)

**15.** వాఙ్మయ తపస్సున నీ లక్షణము లుండును : 1) ఇతరులకు క్లేశము, భయము, దుఃఖము మున్నగు నుద్వేగములను కలిగించు వాక్యములను పలుకకుండుట, 2) సత్యము పలుకుట, 3) ప్రియముగా పలుకుట, 4) హితముకోరి పలుకుట, 5) వేద శాస్త్రాదు లధ్యయనము చేయుట.

(దీని వలన వాగ్దేవత శుద్ధియై వాక్కు శక్తిమంత మగును. వాక్సిద్ధి, కవిత్వ శాస్త్రస్ఫురణము, శబ్దార్థ సమన్వయము, ఔచిత్యము అలవడును.)

**16.** మానస తపస్సునందీ లక్షణము లుండును : 1) మనస్సున సంతోషము నిలుపుకొనుట, 2) ఇతరులను గూర్చి సౌమ్యముగా భావించుట, 3) మౌనము, 4) ఆత్మనిగ్రహము, 5) భావములు పరిశుద్ధిగా నుంచుకొనుట.

(సౌమ్యత్వ మనగా నితరులకు కీడు భావించుట, తప్పులు పట్టజూచుట మున్నగు లక్షణములను విడచుట. మౌన మనగా ఆవశ్యకము కాని వానిని భావింపకుండుట. దీనిని బట్టి మౌనము వాక్కునకు సంబంధించినది కాదనియు మనస్సునకు సంబంధించిన దనియు తెలియుచున్నది. భావ సంశుద్ధి యనగా

నితరులకు చెప్పుటకు వీలులేనివి ఊహింపకుండుట. దీని వలన రహస్యబుద్ధి, పాపచింత, బుద్ధి సంకోచము తొలగును.)

**17.** త్రిగుణములనుబట్టి తపస్సు కూడ మూడు విధములుగా నాచరింపబడుచున్నది. సాత్త్వికుని తపస్సున నీ లక్షణము లుండును : 1) ఫలము కోరక తపస్సు చేయుట, 2) యోగాభ్యాసము, 3) ఆదరముతో కూడిన శ్రద్ధ.

**18.** రాజసికుని తపస్సున నీ లక్షణము లుండును : 1) సత్కారము కోరుట, 2) గౌరవింపబడవలెనని, తన తపస్సు గుర్తింపబడ వలెనని కోరుట, 3) పూజ్యస్థాన మలకరింపవలెనని కోరుట, 4) ఇతరులకు తెలియునట్లుగా తపస్సు చేయుట. ఇది స్థిరము లేక చంచలముగా నుండును. (పూజార్థము అనగా వశీకరణాదులు కోరి చేయుట. దంభ మనగా జపమాలలు మున్నగు వానిని పట్టుకొని తిరుగుట. వారు కోరిన సత్కారములు కలుగునపుడు ఈ తపస్సు సడలు చుండును. గనుక స్థిరత్వ ముండదు.)

**19.** తమోగుణ ప్రధానుని తపస్సున నీ లక్షణము లుండును : 1) మూఢమైన పట్టుదలతో తపస్సు చేయుట, 2) తన దేహమును పీడించుకొనుట, 3) ఇతరులకు వినాశము కోరి తపస్సు చేయుట. (మూఢ గ్రాహము అనగా మొండి పట్టుదల. ఇది సామాన్యముగా తన విశ్వాసము ననుసరించి యుండును. దేహమును పీడించుకొనుట యనగా నుపవాసాదులు, దేహ తాడనాదులు నియమ మనుకొనుట, రుచిలేని పదార్థములను తినుట మున్నగునవి. ఇతరులను నాశము చేయుట యనగా అభిచార హోమములు మున్నగునవి.)

**20.** దానము గూడ సాత్త్విక, రాజసిక, తామసిక భేదములచే మూడు విధములు. సాత్త్విక దానమునకు ఈ లక్షణము లుండును : 1) దానము తన కర్తవ్యమని నమ్ముట, 2) తగిన ప్రదేశమున చేయుట, 3) తగిన కాలము, 4) తిరిగి యుపకార మాశింపకుండ చేయుట, 5) తగిన వ్యక్తికి చేయుట. (తన కర్తవ్య మనుకొనుట, ప్రత్యుపకార మాశింపక చేయుట నిష్కామ కర్మయోగమును తెలుపును. తగిన దేశమనగా పూజా మందిరము, పెండ్లిపందిరి, పుణ్యక్షేత్రము

మున్నగునవి. కాలమనగా దేవ పితృకర్మల, శుభకార్యముల, పర్వాది దినముల కాలము.)

**21.** రజోగుణ ప్రకృతి చేయు దానమునకీ లక్షణము లుండును: 1) తిరిగి యుపకార మాశించుట, 2) ఫలము నుద్దేశించి చేయుట, 3) కష్ట పెట్టుకొని చేయుట. (ప్రత్యుపకారము కొరకు చేయునది వాణిజ్యము కనుక దానము కాదు. ఫలము నుద్దేశించుట యనగా స్వర్గ సౌఖ్యములు కోరుట, గ్రహాది పీడలు వదలించుకొనుట మొదలగునవి. కష్టపెట్టుకొని యిచ్చుట యనగా వస్తువు విలువను గాని, దానము పట్టువానితో తనకుగల సంబంధమును గాని జ్ఞప్తియం దుంచుకొనుట.)

**22.** తమోగుణ దానమున కీ లక్షణము లుండును : 1) దేశము కాలము కాకుండ దానము చేయుట, 2) పాత్రుడు కాని వాని కిచ్చుట, 3) సత్కారము లేని దానము, 4) అవమానముతో చేయునది. (ఆదేశ కాలములు అనగా మలిన ప్రదేశములందును, రాత్రి మున్నగు కాలముల లందును చేయుట. అపాత్రులకు అనగా తన బంధుమిత్రాదులకో, అధికారులకో లంచములు మున్నగునవి కట్టబెట్టుట, సత్కారము లేకుండుట యనగా పలుకుబడి, కార్యసాధనము కొరకు మ్రొక్కు చెల్లించుకొనుట. అవజ్ఞాత మనగా దానము పట్టువాడు తన కన్న నీచుడని భావించుట, ప్రవర్తించుట.)

**23.** వేదమున "*ఓం, తత్, సత్*" అను మూడు విధములైన సత్కర్మ నిర్దేశము లున్నవి. అందు మొదటి దానిచే బ్రహ్మజ్ఞాను లుద్దేశింపబడుదురు. తత్ శబ్దముచే వేదము, సత్ శబ్దముచే యజ్ఞములు ఉద్దేశింపబడును. (వేదము ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా ప్రణవమును దర్శించినవారు బ్రాహ్మణులు. తత్ అను శబ్దమునకు 'అది' యని అర్థము. ఏదియైనను పరమాత్మ అను జ్ఞానము నిచ్చునది వేదము. 'సత్' అనగా సత్కర్మలు లేక పదిమంది అస్తిత్వమునకు, లోకహితమునకు పనికివచ్చు కర్మలు. అవియే యజ్ఞార్థకర్మలు.)

**24.** 'ఓం' కారము నుచ్చరించి బ్రహ్మజ్ఞానులు చేయు యజ్ఞము, దానము, సత్కర్మలు, తపస్సులు వర్తించుచున్నవి. ఇది శాస్త్రవిధానము.

**25.** 'తత్' అను పదము నుచ్చరించి మోక్షముగోరు వారిచే ఫలమును

సన్యసించి చేయబడు యజ్ఞ దాన తపః క్రియాదులు వర్తించుట శాస్త్ర సంప్రదాయము.

**26.** 'సత్' అనగా అస్తిత్వము (పదికాలము లుండుట), సాధు భావము (మంచి జరుగుట) అని యర్థము. కనుక వివాహ పుంసవన సీమంతాదులు, ఆధానము, నామకరణాదులు సత్ శబ్దముతో నభిమంత్రించి చేయబడుట సంప్రదాయము.

**27.** యజ్ఞము, దానము, తపస్సు చిరకాలము జరుగుచుండునట్టి సంకల్పము గల కర్మలు కూడ 'సత్' పదముచే నభిమంత్రింపబడును. (దేవాలయము, యజ్ఞశాల, పూజా మందిరము, తటాకాది నిర్మాణములు చేయునపుడు కూడ 'సత్' శబ్దమును సంకల్పించుట సంప్రదాయము.)

**28.** హోమముగాని, దానముగాని, తపస్సుగాని, సత్కర్మగాని అశ్రద్ధగా నాచరించుట తగదు. అట్టి కర్మ అసత్ కర్మ యనబడును. దానివలన ఇహముగాని పరముగాని కలుగదు.

అష్టాదశోఽధ్యాయః ।

# మోక్ష సన్న్యాస యోగః ।

అర్జున ఉవాచ :

సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథ క్కేశినిషూదన ॥ 1

శ్రీభగవా నువాచ :

కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।
సర్వకర్మ ఫలత్యాగం ప్రాహు స్త్యాగం విచక్షణాః ॥ 2

త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహు ర్మనీషిణః ।
యజ్ఞదాన తపఃకర్మ న త్యాజ్య మితి చాపరే ॥ 3

నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తి తః ॥ 4

యజ్ఞ దాన తపఃకర్మ న త్యాజ్యం కార్య మేవ తత్ ।
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥ 5

ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।
కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మత ముత్తమమ్ ॥ 6

నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।
మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః ॥ 7

దుఃఖ మిత్యేవ యత్కర్మ కాయ క్లేశభయాత్త్యజేత్ ।
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥ 8

కార్య మిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగ స్సాత్త్వికో మతః ॥ 9

న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥ 10

న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్య శేషతః ।
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీ త్యభిధీయతే ॥ 11

అనిష్ట మిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।
భవత్య త్యాగినాం ప్రేత్య నతు సన్న్యాసినాం క్వచిత్ ॥ 12

పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।
సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥ 13

అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథ క్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥ 14

శరీర వాఙ్మనోభి ర్యత్కర్మ ప్రారభతే నరః ।
న్యాయ్యం వా విపరీతం వా పంచై తే తస్య హేతవః ॥ 15

తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః ।
పశ్య త్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతిః ॥ 16

యస్య నాహంకృతో భావో బుద్ధి ర్యస్య న లిప్యతే ।
హత్వాఽపి స ఇమాన్ లోకాన్న హంతి న నిబధ్యతే ॥ 17

జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥ 18

జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥ 19

సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥ 20

పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానా భావాన్ పృథగ్విధాన్ ।
వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥ 21

యత్తు కృత్స్నవ దేకస్మిన్కార్యే సక్త మహైతుకమ్ ।
అతత్త్వార్థవదల్పం చ తత్తామస ముదాహృతమ్ ॥ 22

నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్ ।
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్విక ముచ్యతే ॥ 23

యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।
క్రియతే బహుళాయాసం తద్రాజస ముదాహృతమ్ ॥ 24

అనుబంధం క్షయం హింసా మనపేక్ష్య చ పౌరుషమ్ ।
మోహాదారభ్యతే కర్మ యత్త త్తామస ముచ్యతే ॥ 25

ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహ సమన్వితః ।
సిద్ధ్య సిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥ 26

రాగీ కర్మఫలప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥ 27

అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।
విషాదీ దీర్ఘ సూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥ 28

బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణత స్త్రివిధం శృణు ।
ప్రోచ్యమాన మశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥ 29

ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।
బన్ధం మోక్షం చ యావేత్తి బుద్ధిస్సా పార్థ సాత్త్వికీ ॥ 30

యయా ధర్మ మధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।
అయథావ త్ప్రజానాతి బుద్ధిస్సా పార్థ రాజసీ ॥ 31

అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా ।
సర్వార్థా న్విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ తామసీ ॥ 32

ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియ క్రియాః ।
యోగే నావ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ సాత్త్వికీ ॥ 33

యయా తు ధర్మ కామార్థాన్ ధృత్యా ధారయ తేఽర్జున ।
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతి స్సా పార్థ రాజసీ ॥ 34

యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।
న విముంచతి దుర్మేధా ధృతిస్సా పార్థ తామసీ ॥ 35

సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।
అభ్యాసా ద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి ॥ 36

యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్ ॥ 37

విషయేంద్రియ సంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమమ్ ।
పరిణామే విష మివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥ 38

యదగ్రే చానుబంధే చ సుఖం మోహన మాత్మనః ।
నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామస ముదాహృతమ్ ॥ 39

న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।
సత్త్వం ప్రకృతిజై ర్ముక్తం యదేభిస్స్యాత్త్రిభిర్గుణైః ॥ 40

బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరన్తప ।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥ 41

శమో దమస్తపః శ్శౌచం క్షాన్తి రార్జవ మేవ చ ।
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్ ॥ 42

శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం యుద్ధేచాప్య పలాయనమ్ ।
దాన మీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥ 43

కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యం కర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥ 44

స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభతే నరః ।
స్వకర్మ నిరత స్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥ 45

యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥ 46

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥ **47**

సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।
సర్వారమ్భాహి దోషేణ ధూమే నాగ్ని రివావృతాః ॥ **48**

అసక్తబుద్ధి స్సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసే నాధిగచ్ఛతి ॥ **49**

సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాఽఽప్నోతి నిబోధ మే ।
సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥ **50**

బుద్ధ్యా విశుద్ధయా యుక్తోధృత్యాఽఽత్మానం నియమ్య చ ।
శబ్దాదీన్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ **51**

వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయ మానసః ।
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥ **52**

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమ శ్శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥ **53**

బ్రహ్మభూతః ప్రసన్నా త్మా న శోచతి న కాంక్షతి ।
సమస్స ర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥ **54**

భక్త్యా మామభిజానాతి యావా న్యశ్చాస్మి తత్త్వతః ।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥ **55**

సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।
మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్ ॥ **56**

చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।
బుద్ధియోగ ముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ ॥ **57**

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదా త్తరిష్యసి ।
అథ చేత్త్వమహంకారా న్న శ్రోష్యసి వినంక్ష్యసి ॥ **58**

యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి ॥ 59

స్వభావజేన కౌంతేయ నిబద్ధ స్స్వేన కర్మణా ।
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్య స్యవశోఽపితత్ ॥ 60

ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥ 61

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥ 62

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యా ద్గుహ్యతరం మయా ।
విమృశ్యైత దశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥ 63

సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।
ఇష్టోఽసి మే దృఢ మితి తతో వక్ష్యామి తే హితమ్ ॥ 64

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥ 65

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 66

ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥ 67

య ఇమం పరమం గుహ్యం మద్భక్తే ష్వభిధాస్యతి ।
భక్తిం మయిపరాం కృత్వా మామేవైష్య త్యసంశయః ॥ 68

న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి ॥ 69

అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాద మావయోః ।
జ్ఞానయజ్ఞేన తే నాహ మిష్టస్స్యా మితి మే మతిః ॥ 70

శ్రద్ధావా ననసూయశ్చ శృణుయాదపి యో నరః ।
సోఽపి ముక్తశ్శుభాన్ లోకాన్ ప్రాప్ను యాత్పుణ్య కర్మణామ్ ॥ **71**

కచ్చిదేత చ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చి దజ్ఞానసమ్మోహః ప్రనష్టస్తే ధనంజయ ॥ **72**

అర్జున ఉవాచ :

నష్టోమోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత ।
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥ **73**

సంజయ ఉవాచ :

ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।
సంవాద మిమ మశ్రౌష మద్భుతం రోమహర్షణమ్ ॥ **74**

వ్యాసప్రసాదా చ్ఛ్రుతవా నేత ద్గుహ్యతమం పరమ్ ।
యోగం యోగేశ్వరా త్కృష్ణాత్సాక్షాత్క థయత స్స్వయమ్ ॥ **75**

రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమ మద్భుతమ్ ।
కేశవార్జున యోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥ **76**

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూప మత్యద్భుతం హరేః ।
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునః పునః ॥ **77**

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ ॥ **78**

*ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం*
*యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే*
*మోక్ష సన్న్యాసయోగో నామ అష్టాదశోఽధ్యాయః ।*
*ఓమ్ తత్ సత్ ॥*

అధ్యాయము - *18*

# గురు శిష్య యోగము

**1. అర్జునుడు :** సన్న్యాసము, త్యాగము అను పదముల తత్త్వార్థమేమో వేరువేరుగా వివరించి తెలుపుమని కోరుచున్నాను.

**2. శ్రీకృష్ణుడు :** కామ్యములగు కర్మలను విడచుట సన్న్యాసమని కవులు నిర్వచించిరి. ఈ విచక్షణ లేక అన్ని కర్మల ఫలితమును త్యాగము చేయుట త్యాగమని విచక్షణులు తెలిపిరి.

(కామ్యకర్మలు అనగా నొక ఫలితమును కోరి చేయు పనులు. ఇవి రెండు విధములు : వైదికములు, లౌకికములు. అందు స్వర్గము అనబడు పరోక్ష ఫలమునుగోరి చేయునవి వైదిక కామ్య కర్మలు. అట్లు కాక ప్రత్యక్ష ఫలమును గోరి లోకమున చేయు సామాన్య కర్మలు లౌకికములు. ఉదాహరణకు సదాచార మవలంబించినచో ఆయువు, విద్య, యశస్సు, ధనము వర్ధిల్లును. ఇవి పరోక్ష ఫలములు. కృషి, గోరక్ష, వాణిజ్యాదులు, జీవనోపాధి, భృతి, వేతనకర్మలు మున్నగు వైశ్య శూద్ర ధర్మముల కర్మలు లౌకికములు. వీని వలన నెప్పటి కప్పుడు ప్రయోజనము కలుగుచుండును. ఈ రెండు విధములైన కర్మలను కామ్యముగా నాచరించుట వలననే ఆ కామ్యములు తీరుటయు, తీరక పోవుటయు సమానముగా జరుగు చుండును. కర్మకు ఫలితము నిశ్చయముగా కలుగునను మాట సత్యమేగాని, కామించిన ఫలితము కలుగుట నిశ్చితము కాదు. ఫలితము కర్మల యధీనమున కలుగునని వాదించువారు దుఃఖముల పాలగుదురు. వీరే వేదవాదరతులు. సృష్టిలో కర్మ ఫలములను మించి మరి యేదియు లేదను వీరి వాదము వలన వేదములను, తత్కర్మలను వీరు కలుషిత మొనర్చుచున్నారు.

కాంక్షించిన ఫలితములు కలుగనప్పుడు సత్కర్మలు కూడ దుఃఖమునే కలుగజేయు చుండుటచే దుష్కర్మలే యగుచున్నవి. కనుక కామ్యకర్మలను విసర్జించుట సన్న్యాసమని కవుల నిర్వచనము. కామ్య కర్మలు విసర్జించిన సన్న్యాసి నిష్కామ కర్మలుగా వానినే చేయవచ్చును. ఈ భేదము కర్మలో గాక

కర్త మనస్సున నుండును గనుక, కామ్యకర్మల ఫలితములపై కామ్యబుద్ధిని సన్న్యసించుట యనియే పర్యవసానము తేలును.

ఇక రెండవ మతము వారు అనగా త్యాగమును నిర్వచించు వారిట్లను చున్నారు. ఫలితములపై కోరికలను సన్యసింప దలచినపుడు కామ్యకర్మల నేరి వేరుగా సన్యసించు శ్రమయేల? విసర్జింపదలచిన ద్రవ్యములకు వర్గీకరణ మేల? కనుక సర్వకర్మల ఫలమును త్యాగము చేయుట మంచిదని విచక్షణులు, కవులు అనగా వేదమంత్ర ద్రష్టలు, పురాణోపనిషద్బ్రాహ్మణ కర్తలు. విచక్షణు లనగా వేదాదుల నుండి శాస్త్రములను వేరుగా గ్రంథ రూపములలో వివరించినవారు. వీరే శాస్త్రకారులు.)

**3.** కర్మాచరణలో కామ క్రోధాదు లెట్లును కలుగుచుండును. అగ్నికి పొగవలె, అద్దమునకు మలినమువలె ఇంద్రియ మనోబుద్ధుల నాశ్రయించి కామ క్రోధములు కర్మాచరణమున పాప కారణములై పుట్టుచుండును. కనుక అట్టి కర్మలను విడచుట త్యాగమని కొందరు చెప్పుదురు. ఏపనియైనను దోషముతో కూడియుండును గనుక, ఆచరణమును జ్ఞానియైనవాడు సన్యసింప వలెనని కొందరు చెప్పుదురు. అట్లుకాదు, యజ్ఞ దాన తపస్సు లనెడు కర్మలను త్యజింపరాదని మరికొందరు చెప్పుదురు.

**4.** ఇందు ఈ విషయమున నా నిశ్చయమును తెలుపుచున్నాను వినుము. త్యజించు బుద్ధి కలుగుటలో కూడ సత్వ రజస్తమస్సులు కారణముగా మూడు వైఖరులున్నవి.

**5.** యజ్ఞ దాన తపః కర్మలు త్యజింపనేరాదు. అవి కార్యములు అనగా తప్పక చేయవలసినవి. యజ్ఞము, దానము, తపస్సు బుద్ధిమంతుల బుద్ధిని పవిత్రీకరణము చేయుచుండును. (ఇవి సంస్కార కర్మలు. మానవుని జ్ఞానస్థితిలో నిలుపుటకు వీని యాచరణమే కారణము. ఆచరించుచున్నంత కాలము జ్ఞానము నిలుచును. కనుక శాశ్వత ఫలప్రదములు కాదనరాదు. జ్ఞానము ఫలస్వరూపము కాదు. అన్నము తిన్నచో ఆకలి తీరుట తత్కాలిక ఫలప్రదమని సన్యాసులు తినుట మానుచున్నారా? దేహ ధర్మము లెట్లు మనవిగాక ప్రకృతికి సంబంధించినవో, అట్లే ఇంద్రియ మనోబుద్ధి స్థితులు

కూడను. వానిని తానను జ్ఞానమునందు నిత్యము నిలుపుచుండుట ముముక్షువు కర్తవ్యము గనుక నివి వానికి కార్యకర్మలు.)

**6.** ఇట్లు తప్పనిసరియై వీనిని కూడ నాచరించునపుడు ఫలాపేక్షయు ఆచరణము నందు వ్యామోహమును లేకుండ తప్పనిసరిగా నాచరించి తీరవలెను. ఇది నా నిశ్చితాభిప్రాయము.

**7.** ఇట్లు చేసితీరవలె నను నియమము గల యజ్ఞ దాన తపః కర్మలు సన్యసించుట తగదు. వాని యెడల పరిత్యాగబుద్ధి మోహము వలన కలుగును. ఇది తమోగుణ ప్రకృతిని తెలియజేయును.

**8.** అట్లే ఏ పనియైనను చేయుట దుఃఖకరమని గాని, శరీరమునకు శ్రమయని గాని సన్యసించుట రజోగుణ ప్రవృత్తిని తెలుపును. కనుక నదియు త్యాగము కాదు. (దుఃఖమని పరిత్యజించుట అర్జునుని యుద్ధ విరమణ బుద్ధి వంటిది. కనుకనే బంధువులను చంపవలసి వచ్చునను దుఃఖమున అర్జునుడు సన్యసించుట క్షుద్రము, హృదయ దౌర్బల్యము అనబడినది. శరీర క్లేశము వలన మానుట యనగా కృషికర్మ మున్నగునవి విరమించుట లేదా పూజాదికము అలస బుద్ధిచే సన్యసించుట.)

**9.** నియతము అగు కార్యకర్మ సమగ్రముగా నాచరించుచు, సంగమును, ఫలమును త్యాగము చేయుట సాత్త్విక త్యాగమని నా మతము.

**10.** సత్త్వముతో నిండినవాడు తనకు ఆచరణకు కష్టమని ఏ పనిని మానడు. సుఖమని దేనినీ యాచరింపడు. అతడే త్యాగి. అతని మేధ చక్కగా పనిచేసి సంశయములు తొలగిపోవును. (క్లేశాదుల వలన కర్మలు మానినచో జీవనోపాధులు చెడును. సుఖమని ఇంద్రియార్థ సుఖములకు కర్మాచరణము చేసినచో రోగాది దుఃఖములు కలుగును. యజ్ఞము, దానము, తపస్సు, తన కర్తవ్యములుగా నాచరించుట వలన సర్వ కర్మలయందు కార్యాకార్యత్వము, ప్రవృత్తి నివృత్తులు నను నవి సుఖము, సదుపాయము, నిష్ఠురము, బాంధవ్యము మున్నగువాని కతీతములై చక్కగా భాసించుట, సంశయములు తీరుట జరుగును. ఇదియే సత్త్వ ప్రవృత్తి.)

**11.** దేహము ధరించిన వానికి కర్మలు మొత్తముగా త్యాగము చేయుట శక్యమే కాదు. కనుక కర్మధనముల త్యాగమే త్యాగము.

**12.** ఈ త్యాగము చేయనివారికి వారి కర్మాచరణము లన్నియు అనిష్టములు, ఇష్టములు, మిశ్రములు అని మూడు విధములుగా సిద్ధమగు చున్నవి. త్యాగమును సన్యసించిన వారికీ భేదములు లేవు. (అనిష్టములు అనగా నిష్టము లేనివి. రోగ నివారణయందు పథ్యపానాది నియమము లిట్టివి. ఇష్టములు అనగా ఇంద్రియార్థములకు రుచికరము లైనవి.)

**13.** సర్వకర్మలకును కారణములు సూక్ష్మముగా గ్రహింపదగినవి. సాంఖ్యులచే ఒక కర్మసిద్ధికి కారణములు ఐదు విధములని చెప్పబడినది.

**14.** 1) అధిష్ఠానము అగు ఈ శరీరము, 2) ఆచరించువాడు, 3) ఉపకరణములు, 4) వివిధములైన చేష్టలు, 5) దైవము. (అధిష్ఠానము అనగా కర్మ జరుగు స్థానము. ఇది మన శరీరము. కర్తయనగా జీవుడు. ఇతని కర్తృత్వము నిమిత్తమని తరువాత ఉపదేశింపబడును. కరణము లనగా కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, బుద్ధి, మనస్సు. చేష్ట యనగా చేయి త్రిప్పుట, పట్టుట, విడచుట మున్నగునవి. దైవమనగా మన పరిమితుల కతీతమైనది. నది నీటి రంగు, రుచి, గుణములు పాత్రలోని నీటియం దుండుటను పాత్ర మార్చలేదు. అట్లే సృష్టి కధీశ్వరుడగు మొత్తము సంకల్పమును మిగిలిన నాలు గధిష్ఠానములును మార్చలేవు.)

**15.** న్యాయమైనను అన్యాయమైనను ఒక కర్మ శరీరము, వాక్కు, మనస్సులతో ప్రారంభింపబడు చున్నప్పుడు ఈ యైదును హేతువు లగును.

**16.** ఇట్లుండగా చేయుటకుగాని, మానుటకు గాని తాను కర్తయని భావించినవాడు బుద్ధి సాధన లేనివాడు. అతని దృష్టి సరియైనది కాదు.

(ఐదు కారణములలో జీవుడు కర్తయని చెప్పబడినది. ఇచ్చట జీవుని కర్తృత్వదృష్టి సరియైనది కాదని చెప్పబడినది. జీవుని కర్తృత్వము నిమిత్తమేగాని కేవలము గాదు. సృష్టిలో జీవుడొక భాగము గనుక, వానికి ప్రారంభ కర్తృత్వ మే కర్మయందును కలుగదు. అతనికి బుద్ధి పుట్టిన తరువాత నుండి కర్తృత్వ

మారంభించును. బుద్ధి పుట్టుటకు కారణము ప్రకృతి. దానికి కారణము 'నే'నను సర్వాంతర్యామి. కనుక జీవుని కర్తృత్వము వాస్తవమునకు ప్రకృతి కర్తృత్వమే. బుద్ధి పుట్టిన వెనుక గలిగిన జీవుని కర్తృత్వము సేవకుని కర్తృత్వము వంటిది. న్యాయాధికారిగా నియుక్తు డైనవాడు స్వతంత్రించి నిర్ణయము చేసినను అది న్యాయశాస్త్ర బద్ధము, తన నియోగమునకు విధేయము అగుచున్నది గనుక అతని నిర్ణయమునకు అతడు కేవల కర్త కాజాలడు. ఇట్లు విడమరచుకొనలేక కర్తృత్వ మాపాదించుకొనుట, సాధనలేని దుర్బుద్ధిని సూచించును.)

**17.** తాను కర్తయను భావమే యహంకారము. అది లేనపుడు బుద్ధి కర్మనంటనపుడు, అట్టివాడు ఈ లోకముల నన్నిటిని జంపినను చంపినవాడు కాడు, బంధింపబడడు. (ఒక హత్య చేసినవాడు శిక్షాపాత్రుడు. వందలమందిని యుద్ధమున చంపినవాడు శిక్షాపాత్రుడు కాడు. నిప్పు అంటుకొని ఎన్ని యిండ్లు తగులబడినను నిప్పున కపరాధ మంటదు. అచ్చట కర్మారంభము లేదు గనుక కర్తృత్వము లేదు.)

**18.** కర్మాచరణమునకు ప్రేరేపణము జ్ఞానము, జ్ఞేయము, పరిజ్ఞాతయను మూడంచులు. అట్లే కర్మ జరుగు విధము- కర్త, కరణము, కర్మ అనియు మూడంచులు. (జ్ఞానము అనగా తెలివి. జ్ఞేయమనగా తెలిసికొన దగినది. పరిజ్ఞాత యనగా తెలిసికొనువాడు. ఈ మూడును కర్మను ప్రేరేపించు కారణ ములు. కర్త యనగా చేయువాడు. కర్మ యనగా చేయబడునది. కరణ మనగా చేయుటకు సాధనము. ఈ మూడును కర్మ జరుగు స్థానములు.)

**19.** కర్మకు, కర్తకు జ్ఞానముతో సంబంధముండును. ఈ మూడును త్రిగుణముల భేదముచే మూడు విధములు.

**20.** సర్వజీవులయందు నొకే తత్త్వమును చూచుట, విభజింప బడియున్న సృష్టి జీవులలో నేకముగా నున్న దైవమును తెలిసికొనుట యను లక్షణముగల జ్ఞానము సాత్త్వికము.

**21.** ఒక్కొక్క జీవినిగాని, వస్తువునుగాని ప్రత్యేకముగా దర్శించి

స్వరూపాదులచే నర్థము చేసికొనుట. సుఖదుఃఖాదులచే విలువలు, సంబంధములు నేర్పరచుకొనుట రాజసమగు జ్ఞానము.

**22.** ఒక కార్యమున సమన్వయపడు సిద్ధాంతమును శాశ్వత సత్యముగా నమ్ముట. హేతువు నంగీకరింపని నిర్ణయము తామసజ్ఞానము అనబడును. అందు సత్యము, ధర్మము, దైవము, అహింస, ప్రేమ మున్నగు పదములకు తమకు భాసించినదే నిర్వచనముగా సమన్వయ ముండును. మరియు ఆవేశాదుల భ్రమప్రమాదాదుల వలన యథార్థము లేకుండుటయో స్వల్పముగా నుండు టయో జరిగి మిగిలిన తెలియుట యంతయు తన తలపుమీదనే యాధారపడి యుండును. ఇట్లు జ్ఞానము మూడు విధములు.

**23.** కర్మలు కూడ త్రిగుణ భేదముచే మూడు విధములు. శాస్త్ర నియమము కలిగి తన యభిలాష యంటక, ఆచరించుటలో దేని యందును రాగద్వేషములు లేక, ఫలాపేక్ష లేక చేయబడు నే పని యైనను సాత్త్విక కర్మ.

**24.** ఒక కోరికచే ప్రేరేపింపబడినది, లేక అహంకారముచే ప్రేరేపింప బడినది యగు కర్మ రాజస ప్రకృతి కలది. ఇందు పట్టుదలకై మిక్కిలి ప్రయాస, వ్యయాదులు నుండును.

**25.** బంధనము మున్నగు స్థితులకు, వినాశమునకు, హింసకు లెక్కచేయక జీవుని శక్తి వ్యర్థము చెందు కర్మలు మోహాద్యావేశములచే సంకల్పితము లగును. అవి తామస కర్మలు.

**26.** ఇట్లే కర్తకూడ మూడు విధములు – సంగము లేనివాడు, నేను చేసితినని తలవనివాడు, కార్యసిద్ధి, కార్య భంగముల యందు మార్పు లేనివాడు, ధైర్యోత్సాహములతో కూడినవాడు, సాత్త్విక కర్తయగు చున్నాడు.

**27.** ఒకదానియం దానుకూల్యబుద్ధి ప్రత్యేకముగా వహించినవాడు, కర్మల ఫలితములయందు ఆసక్తి కలవాడు, హింసకు, అశుచిత్వమునకు నంగీకరించువాడు, తీవ్ర సంతోష దుఃఖములు పొందుచుండువాడు రాజసకర్త యనబడును.

**28.** మనస్సు నిలుకడ లేనివాడు, అవగతము చేసికొనలేని వాడు, వినయము లేనివాడు, మోసము నంగీకరించువాడు, ఇతరుల నవమానించు స్వభావము గలవాడు, సోమరి, విషాదచిత్తము గలవాడు, సుదీర్ఘ కాల మాలోచించుచుండు వాడు తామసకర్త యనబడును. (ప్రాకృతు డనగా పరిస్థితు లర్థము చేసుకొనలేని వాడు. స్తబ్ధుడనగా వినయము లేనివాడు, శఠుడనగా మోసము చేయువాడు. నైకృతికుడు అనగా నితరుల నవమానించు స్వభావము కలవాడు. విషాదమనగా స్థానముగాని స్థానమున జాలి, దుఃఖము ననుభ వించుట. దీర్ఘసూత్రి యనగా తెగలాగి చిరకాలము ఆలోచించు వాడు. ఒకే యూహ నెక్కువ కాలము పట్టుకొని యుండుట సంగము.)

**29.** ఇట్లే బుద్ధియందును, ధృతియందును కూడ త్రిగుణముల భేదము లున్నవి. ఒక్కొక్క దానినే విడిగా చెప్పుచున్నాను వినుము. బుద్ధి మంచిచెడ్డలను నిర్ణయించు శక్తి. ధృతి యనగా ధైర్యము. అందు త్రిగుణాత్మక మైన బుద్ధివలన మూడు విధములైన నిర్ణయములు జరుగును. ధృతివలన మూడు రకములైన రక్షణల నాశ్రయించుట జరుగును.

**30.** చేయదగిన దానియందు ప్రవర్తించుట, తగని పనుల యందు నివృత్తి పొందుట, ఏ కర్మ బంధించునో ఏది విమోచనము చేయునో తెలియ గలుగుట సాత్త్వికబుద్ధి యనబడును.

**31.** ధర్మాధర్మములు, కార్యాకార్యములు యథాతథముగా గ్రహింప బడక, తర్కాదులచే గ్రహించు బుద్ధి రాజసము. (దీనివలన నిర్ణయమున తప్పొప్పులు సమ్మిశ్రముగా నుండును. పదిమందితో సంప్రదించి నిర్ణయించుట. పరిస్థితుల ఆనుకూల్యమును బట్టి నిర్ణయించుట మున్నగునవి రాజస బుద్ధి లక్షణములు.)

**32.** అధర్మమును ధర్మముగా నంగీకరించుట, సమస్తమును విపరీత ముగా తలచుట తామసబుద్ధి లక్షణము. (ఇది బుద్ధియొక్క అప్రవృత్తిని సూచించును. తన దోషములను తెలిసినవానిని దూషించుట, తన కిష్టములేని వారిని చంపజూచుట మున్నగునవి తామస బుద్ధిని తెలియజేయును.)

**33.** ఏ ధారణా విధానమున మనస్సు, ప్రాణము, ఇంద్రియముల

వ్యాపారములు అన్యములేని యోగమునకు పరిణమించునో అది సాత్త్విక ధారణ లేక ధృతి యనబడును (ధారణ యనగా విశ్వాసము).

**34.** ధర్మార్థ కామములను తన చేయిదాటి పోకుండ చూచుకొన వలెననియు, దానివలననే తన జీవితమునకు సుఖాది ఫలములు సమకూడు ననియు ధరించు విశ్వాసము రాజసము. (ఉపకారమైనను తానే చేయవలెనని యుండుట, చేయ లేనప్పుడు తాను కర్త కాడని తలపక అవమానము కలిగినట్లు భావించుట ఇందనుభూతము లగును. అట్లే పుణ్యకర్మలు తా నాచరింపవలసినవి ఇతరు లాచరించుటచే తన పుణ్యము దొంగిలింపబడినట్లు భావించుట కూడను. ఇవి యన్నియు కర్తృత్వ భ్రాంతిని, తీవ్ర ఫలాపేక్షను తెలియజేయును.)

**35.** నిద్ర, భయ, శోకములు, విషాదము, మదము, దుర్బుద్ధి విడువని ధారణ తామసము. (ఇన్ని గంటలకు నిద్రపోయి తీరవలెనని విశ్వసించుట, ఇతరుల వలనగాని, దైవము వలనగాని భయపడి తీరవలెనని నమ్ముట, జీవితమున శోకవిషాదములు తప్పవని భావించుట, కొందరియందు మర్యాద చూపరాదని తలచుట, కొందరికి కీడు చేయక తప్పదని నమ్ముట దీని లక్షణములు.)

**36, 37.** సుఖభావన కూడ గుణభేదములచే త్రివిధము. ఏది సుఖమో తెలియుటలోను, పొందుటలోను సత్యాసత్యములు దీని ననుసరించి యుండును. మరలమరల ప్రయత్నించి సన్మార్గ మవలంబించుట వలన దుఃఖమును తరింప గలుగుట సాత్త్విక సుఖము. అది తొలుత దుఃఖకారణములను తొలగించు కొనుటలో అసౌకర్యముతో ప్రారంభించి రానురాను తరుగని సుఖము కలుగ జేయును. ఈ సుఖము వలన ఆత్మయందు బుద్ధి తేటబడును. (ఫలముల యాపేక్షలను విడచుటకు, శరీర వ్యాయామాదు లాచరించుటకు, ఔషధసేవ, పథ్యపానాదులకు వలయు ప్రయత్నము అసౌకర్యముగా నుండును. కాని సుఖముగా పరిణమించి ఆరోగ్య తత్త్వజ్ఞానముల బుద్ధి ఆత్మ కున్ముఖ మగును.)

**38.** శబ్ద స్పర్శాదులు ఇంద్రియములను స్పృశించుట వలన కలుగు సుఖము రాజసము. ఇది తొలుత తరుగనిది వలె కనుపించి పరిణామమున

దుఃఖానుభూతి నిచ్చును. (అన్నపానీయాదుల రుచుల కోసము భుజించుట, విద్యుక్త ధర్మముల సమయములలో విలాసాదులను మరగుట ఇట్టివి. వీని వలన సుఖకారణముగా పతనము సంభవించును.)

**39.** ప్రారంభమునగాని, పరిణామమునగాని మోహము గలుగ జేయు సుఖము తామసము. నిద్ర, సోమరితనము, పరాకు పడుట వలన నిది కలుగును. (మద్యపానము వలన దారిద్ర్యాది బాధలు మరపునకు వచ్చును. నిద్రనుండి మేల్కాంచుట కష్ట మనిపించును. శరీరమును శ్రమ పెట్టకుండుట సుఖ మనిపించును. ఇతరులకు చేయవలసిన విధివర్తనము మరచిపోవుట సుఖ మనిపించును. ఇవి తామస లక్షణములు.)

**40.** భూమిపైగల జీవులయందే గాక, స్వర్గములోని దేవతల యందు కూడ ప్రకృతి గుణములచే బంధింపబడని శుద్ధసత్త్వమను ప్రజ్ఞ యెచ్చటను లభింపదు. (రజస్తమస్సులచే స్పృశింపబడని సత్త్వము శుద్ధసత్త్వము. రజస్తమస్సు లతో సత్త్వము మూడవది యగుచున్నది. రజస్తమస్సుల అభావమున నిది గుణాతీత మగుచున్నది. అట్టి శుద్ధప్రజ్ఞ దేవమనుష్య లోకములలో నెచ్చటను లేదు. కనుక సమ్మిశ్రమున పుట్టిన విభేదముచే సృష్టి భిన్న లక్షణములు గల జీవరాసులతో నిండియున్నది. ఈ భిన్న లక్షణముల పరస్పరత్వమే చక్కగా సమన్వయింపబడి, సృష్టి నిర్వాహక హేతువగు చున్నది. ఇది లేనిచో ప్రళయ స్థితియే యుండెడిది. భూమిపై జాతి భేదములు, మత భేదములు, ఆచార వ్యవహారాదుల భేదములు వీనివలననే జరుగుచున్నవి. బుద్ధిమంతులు దీనివలన సృష్టిని వర్గీకరించి, వ్యవస్థ లేర్పరచి జీవితమును సుగమము, బంధనిర్ముక్తము చేయుచున్నారు. వేదములు, ఉపనిషత్పురాణ ధర్మ శాస్త్రములు ఈ భేదముల పరిశీలన వలనను, అందలి సామ్య దర్శనము వలనను కలిగినవి. అన్నిటి యందును త్రిగుణములే యుండుట సామ్యమును సూచించును. కనుక ఆహార నిద్రా భయాదులయందు జీవసామ్య మున్నది. సుఖేచ్ఛ, జిజ్ఞాస, ముముక్షుత్వము అనువానియందు మానవ బుద్ధి సామ్యము సిద్ధించును. ఈశ్వర ధ్యానమునందు సర్వసృష్టి సామ్యము సిద్ధించును. త్రిగుణముల సమ్మిశ్ర భిన్నతయందు వ్యక్తి లక్షణములు, ప్రత్యేకతలు భాసించును. ఈ

ప్రత్యేకతల వలన వారి వారికి స్వభావములుగా కనుపించి యాకర్షించు కార్యకర్మలు భాసించును.)

**41.** బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల స్వభావములును, వారి కర్మల విభాగమును గుణ సమ్మిశ్ర భేదము వలననే యేర్పడినవి. (మానవుడు వర్ణ ధర్మములను, పురుషార్థములను దర్శించి కర్మ విభాగ మేర్పరచుకొనుట దీని వలననే జరుగుచున్నది.)

**42.** మనస్సు శాంతించుట, ఇంద్రియములు నిగ్రహింపబడుట, తపస్సు, శుచిత్వము, ఓర్పు, సూటియైన ప్రవర్తనము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యబుద్ధి, బ్రాహ్మణునకు స్వభావములగు కర్మలు. (అనగా ఎవని స్వభావమున కివి నచ్చునో అతడు బ్రాహ్మణ ప్రకృతి కలవాడు. శమమనగా మనస్సునకు కుతూహలములు లేకుండుట. దమమనగా నింద్రియ వ్యాపారములు బుద్ధి వివేకమునకు లొంగుట. తపస్సు అనగా వాక్కును, మనస్సును, శరీరమును సౌమ్యములు చేయు నభ్యాసము. శౌచమనగా స్నానము, ప్రశస్త పదార్థ భోజనము, పాకాది కర్మల శుద్ధియు మున్నగునవి. క్షాంతి యనగా ఇతరులు తనకు చేసిన యపకారములను సహించి కినియకుండుట. ఆర్జవ మనగా తాను సత్యమని నమ్మినదానిని పలుకుటకు, నాచరించుటకు జంకకుండుట. జ్ఞాన మనగా శాస్త్రముల యందున్న సత్యత్వము దర్శనమిచ్చుట. విజ్ఞాన మనగా వివిధ శాఖల విద్యల పరిచయము. ఆస్తిక్యము అనగా ధర్మము, దైవము కలవనియు, ఇతరులలో దైవాంశ కలదనియు, సత్ప్రవర్తనమునకు విలువ యున్న దనియు విశ్వసించుట.)

**43.** పరాక్రమము, కీర్తి, ధైర్యము, దాక్షిణ్యము, యుద్ధమున పారి పోకుండుట, దానము, ఈశ్వరత్వము కలిగియుండుట క్షత్రియునకు స్వభావము లైన కర్మలు. (శౌర్య మనగా నితరులను దమించు శక్తి. అధర్మపరులు హద్దులలో నుండుట కుపకరించును. తేజస్సు అనగా నితరులు తన్ను గుర్తింపగల ప్రజ్ఞ. ఇది కీర్తి యనబడును. దీని వలన శాసక శక్తికి తన పరోక్షమునందు కూడ అంతర్యామిత్వము సిద్ధించును. ధృతి యనగా ధైర్యము. దీని వలన నితరులు తనయందు ధైర్యము వహింతురు. దాక్ష్యము అనగా

సామర్థ్యము. దీని వలన రక్షింపబడువారికి, శిక్షింపబడు వారికి తన యావశ్యకత సిద్ధించును. యుద్ధము రక్షణ కర్మ గనుక అపలాయనము ముఖ్యము. దీని వలన ప్రాణభీతి నశించును. ఈశ్వర భావ మనగా ఇతరులు గౌరవము చెల్లించునపుడును, తనకు లొంగి వర్తించునపుడును వినయపడకుండని గాంభీర్యము. ఇది ఈశ్వర విభూతి. ఇది కలవాడే పరిపాలించుట కర్హుడు!)

**44.** భూమి పండించుట, పశుగణములను రక్షించుట, సంపదను వినిమయము చేయుట వైశ్యునకు స్వాభావిక ధర్మములు. పరిచర్య చేయుట శూద్రునకు స్వభావకర్మ. (కృషి యనగా భూమిని దున్ని పండించుట. గోరక్ష యనగా పశుగణములను రక్షించుట. దీనివలన క్షీరాది సంపద్వృద్ధి. ప్రజల కాహార ప్రాప్తి సిద్ధించును. వాణిజ్య మనగా సంపదను యిచ్చిపుచ్చుకొనుటతో దేశ ప్రజలకు పంచుట. పరిచర్య యనగా నితరులను సేవించుట. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యకర్మలలో నిమగ్నులగు వారికి గృహ క్షేత్రాదులు, శరీర సౌఖ్యము చూచుటకు శూద్రకర్మ మావశ్యకము. దీని నవలంబించుట వలన వినయము, భక్తిభావము, బంధ విమోచనము కలుగును.)

**45.** ఎవడైనను తనతన స్వభావజమైన కర్మయందు అభిలాషను గలిగియున్నప్పుడే సంసిద్ధి కలుగును. స్వకర్మ యందు నిమగ్నుడైనవాడు సిద్ధి యెట్లు పొందునో తెలిపెదను వినుము. (ఒకని యభిలాష ఇంద్రియ మనః ప్రవృత్తుల తాత్కాలిక సంసర్గము ననుసరించి మారుచుండును. స్వభావము మాత్రము త్రిగుణముల సమ్మిశ్రము వలన కలుగునది. గనుక అట్లు మారదు. పూర్వకర్మ వాసనలు, దాని ననుసరించిన జన్మ పరిస్థితులు అను వానిపై నాధారపడి స్వభావ మేర్పడును. ఇది బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్ర స్వభావ ములలో నొకటియై యుండును. దాని ననుసరించి అతని కర్మసిద్ధి యుండును. అవి యతనికి స్వకర్మలు అనబడును. వాని నాచరించుట స్వధర్మ మనబడును. అభిలాష వాతావరణమును బట్టి తాత్కాలికముగా మారుచుండును గనుక దానిని బట్టి కర్మల నెన్నుకొన్నచో సంసిద్ధి కలుగదు కనుక అభిలాషను స్వభావమును బట్టి మార్చుకొని స్వధర్మమును అనుష్ఠింపవలెను. విద్యా భ్యాసాదులు కూడ స్వభావమును బట్టి ఎన్నుకొనవలెను.)

**46.** జీవరాసుల ప్రవర్తన మెచ్చటనుండి కలుగుచున్నది? దేనిచే ఈ సృష్టియంతయు నిండియున్నది? దానిని స్వకర్మచే నర్చించి మానవుడు సిద్ధి పొందుచున్నాడు. ( జీవరాశుల, పంచభూతముల ప్రవృత్తి త్రిగుణాత్మకము. అవి ప్రకృతి నుండి వచ్చుచున్నవి. ఈ సృష్టియంతయు ప్రకృతిచే నిండియున్నది. ఆ ప్రకృతి వలన నేర్పడిన తన స్వభావ మార్గమున నితరులలో నున్న ఆ ప్రకృతినే యర్చింపవలెను. దీని వలన ప్రకృతిని దాటి పరమేశ్వరుని యందు వసించుట జరుగును. మనకు స్వభావ మిచ్చినది ప్రకృతి గనుక, ఆ స్వభావమునకు దగిన కర్మాచరణముచే నితరులలోని ప్రకృతిని ఆరాధింపవలెను. అపుడు ఘర్షణ లేక సర్వజీవ మైత్రి, భూతదయ సిద్ధించును. వైరాగ్య శమదమాదులు సహజముగా నలవడి, బ్రహ్మభావనలో నివసించుట యేర్పడును.

చాతుర్వర్ణ్యాత్మకములైన వ్యక్తిగత ప్రకృతులు పితృ పితామహ క్రమమున లభించి తీరవలెనను నిర్ణయము లేదు. స్వధర్మాచరణము చేయనివాడు రజస్తమస్సుల విపరిణామములను పొంది, వైషమ్యము వలన తన స్వభావము నకు వ్యతిరిక్తులైన తల్లిదండ్రులకు సుతుడుగా జన్మింపవచ్చును. యోగాభ్యాస సంకల్పము గలవాడు మాత్రమే తన ధర్మమున కనుకూలమైన వంశమున జన్మించును. విషమ స్వభావ జన్మముచే వర్ణ ధర్మ వ్యతిరేకమైన వంశమున జన్మము కలుగవచ్చును. కనుక ధర్మ సాంకర్యము కలిగినపుడెల్ల మరల వ్యక్తులు వర్ణ ధర్మముల లోనికి విభజింపబడుచుండు టావశ్యకము. ప్రకృతి శక్తివలన నట్లు జరుగుచునే యుండును. సాంకర్యము లేని తావులయందు, కాలము లందు కర్మ వాసనల ననుసరించి, ఏ వర్ణమువారు ఆ వర్ణమువారి కుటుంబముననే సామాన్యముగా జన్మించు చుందురు. స్వభావమునకే ప్రాధాన్య మిచ్చి, స్వధర్మము నిర్ణయించుకొని మానవుడు సంసిద్ధిని పొందవలెను.)

**47.** స్వధర్మ మెప్పుడును గుణవంతము కాకపోయినను శ్రేయస్సు కలిగించును. ఎంత క్రమశిక్షణతో పరిపూర్ణముగా నాచరించినను తన స్వభావమునకు వేరైన ధర్మము శ్రేయస్సును కలిగింపదు. తన స్వభావముచే నెన్నుకొనబడిన కర్మ నాచరించుట వలన మానవునకు పాప మంటదు. (విగుణము అనగా గుణవంతము కానిది. గృహములను శుభ్రపరచుట, బరువులు మోయుట, మాంస విక్రయము చేయుట మున్నగు వృత్తులు గుణ

వంతులు కానివి వలె నభిరుచికి గోచరింపవచ్చును. అది తన కర్మయైన స్వభావము కలవానికి దానిని మాని చదువుకొనుట, ఉద్యోగము చేయుట, అధికారము కలిగియుండుట మంచివి యనిపించవచ్చును. కాని అవి తన స్వభావమునకు సరిపడనప్పుడు చదువున పరాజయము. కర్తవ్య నిర్వహణము నందు అహంకార మమకారాదు లావేశించుటయు జరుగును. దానితో రజస్సు, తమస్సు ప్రకోపించి స్వభావము సమ్మిశ్రమై ఆసురాది ప్రవృత్తులయందు ప్రవేశించును. కర్మబంధనమున చిక్కుకొని, వాసనా బలమున దుష్టజన్మము లెత్తుచుండును. మానవులకు సంక్షేమము కుంటుపడును. అట్లుకాక స్వాభావిక మైన కర్మ విగుణమైనను నాచరించి ధర్మవ్యాధునివలె నుత్తమ గౌరవమునకు పాత్రుడై కర్మ విమోచనము నొంది పరమాత్మ ననుభవించుచు బ్రాహ్మణాదులకు గురువు కూడ కాగలడు.)

**48.** తన స్వభావమునకు సహజమైన కర్మ దోషములతో కూడినదైనను దానిని త్యజింపరాదు. అగ్నితో ధూమము తప్పనిసరి యైనట్లు, ఏ కర్మ ప్రవర్తనమైనను దోషము లేనిది లేదు. (కర్మాచరణమునందు అశౌచత్వాదు లంటుచుండును. కాని అర్చనబుద్ధితో యజ్ఞార్థకర్మగా స్వధర్మ మాచరించి దోషములనుండి విముక్తుడగు చుండవలెను. యుద్ధము చేయుటయందు చంపుట యను దోషమున్నది. ధర్మరక్షణ బుద్ధితో దానిని పూజ్య మొనర్చి, తనకై యుద్ధము చేయకుండుట వలన సంగము నుండి ఫలము నుండి విమోచనము చెంది వర్తింప వచ్చును.)

**49.** స్వధర్మాచరణమునందు కర్మల నంటని బుద్ధితో కోరికలు లేక మనోబుద్ధ్యహంకారములను జయించి, సర్వఫలములను సన్యసించి, కర్మ చేయనివాని సిద్ధిని నరుడు పొందుచున్నాడు.

**50.** ఇక మానవుడు పొందిన జ్ఞానమునకు పరమావధి యేయో అట్టి పరబ్రహ్మానుభూతియందు సిద్ధిపొందు విధానము నుపదేశించు చున్నాను, వినుము.

**51.** పరిశుద్ధమైన బుద్ధితో దేహేంద్రియ మనస్సులను యోగము

పొంది, తన్ను తాను ధారణ చేసుకొనవలెను. శబ్ద స్పర్శాదులైన ఇంద్రియార్థములు త్యాగము చేయవలెను. రాగద్వేషములు విడువవలెను.

**52.** ఏకాంత స్థితిని సేవింపవలెను. లఘువుగా భుజింపవలెను. శరీరము, మనస్సు, వాక్కు నియమము నందుంచవలెను. వైరాగ్య మవలంబించి ధ్యాన యోగము నాశ్రయింపవలెను.

**53.** అహంకారము, బలీయ ప్రవర్తనము, దర్పము, కామక్రోధములు విడువవలెను. తనను ఆశ్రయించిన వారియందు ఆశ్రిత బుద్ధిని విరమింప వలెను. మమకారము తొలగి శాంతుడై బ్రహ్మమగుట సంభవించును.

(ఒంటరితనము అనగా సర్వజీవుల యందును తా నొక్కడే యుండుట. ఇది లేనిచో గుహలలో దాగినను భావమునం దితరు లుందురు. లఘువుగా భుజించుట యనగా బరువైన ఆహారమును మానుట. సాత్త్వికాహారమున చెప్పబడిన గవ్యములు, తేనె, ఫలరసములు మున్నగునవి ఆకలిని బట్టి మితముగా సేవించుట. శరీరమును వశపరచుకొనుట యనగా పనికివచ్చు యజ్ఞార్థ కర్మలయందే నియోగించుట. వాని కార్యసిద్ధికి సంబంధించియే మాటాడుట వాఙ్నియమము. వానినే భావించుట మనోనియమము. ఈ సాధనలో ప్రకృతి వలన ప్రవర్తనము సన్నగిల్లి ప్రవర్తనమే నూతన ప్రకృతిని సృష్టించుకొనును. పరిగ్రహము అనగా ఆశించుట, దానాదు లపేక్షించుట. మరియు తనయందు వ్యామోహముగల దారాపుత్రాదుల పరిగ్రహములు. వారి వ్యామోహమునకు బుద్ధి భేదము కలిగింప రాదుగాని తాను వ్యామోహము మానవలెను. తన్ను విడువలేని వారిని విడువరాదుగాని, విడువలేకుండ రాదు.)

**54.** బ్రహ్మమైన వారికి ఆత్మ ప్రసన్నమగును. శోకము, కోరిక యుండవు. సర్వజీవులయందు నన్నుజూచు భక్తి కలుగును. కనుక సమదృష్టి, సమ ప్రవర్తనము కలుగును. (బ్రహ్మ, ఆత్మ అను పదములు ఒకే తత్త్వమును సూచించును. ఒక దేహమునందు గుర్తింపబడిన బ్రహ్మమే ఆత్మ. సర్వదేహము లందు గుర్తింపబడిన ఒకే యాత్మ- బ్రహ్మము. భక్తియనగా దేహేంద్రియ మనోబుద్ధులు ఆత్మత్వము నాశ్రయించుట.)

**55.** ఈ సాధనలో భక్తి పెంపొంది, మొదట నే నెంతవాడనో తెలియును. అటుపైన నా తత్త్వమేమో తెలియును. తత్త్వము తెలియుట వలన తన తత్త్వము నా తత్త్వమగును. తాను నేనగును. ఇట్లు నాయందు ప్రవేశించును. (ఎంతవాడో తెలియుట యనగా పరిమాణముల కతీతుడని తెలియుట, ప్రారంభదశలో జ్ఞానము పరిమాణ జ్ఞేయముగా నుండును. బ్రహ్మము పరిచయమైన కొలదియు కొలతలు కూడ నందుండి పుట్టినవే యని తెలియును.

తత్త్వముచే నెట్టివాడనో అనగా తొలుత బ్రహ్మములోని యొక్కొక్క విభూతినే బ్రహ్మతత్త్వము అనుకొని యుపాసించును. క్రమముగా బ్రహ్మమునకు తత్త్వము లేదనియు, తన సాధనా గమ్యమే తత్త్వ మనబడిన దనియును తెలియును. తత్త్వము లేకుండు స్థితి తెలియుటయే తానందు ప్రవేశించుట.)

**56.** అందరి వలెనే సర్వకర్మలను ఆచరించును గాని, నన్నాశ్రయించి నా ప్రసాదము వలన శాశ్వతమైన స్థితిని పొందును. (నా ప్రసాదము అనగా నేనను భావము ప్రసాద స్థితి చెందుట. బ్రహ్మమునందు తన భావము తేటబడుటయే బ్రహ్మము తనయందు అనుగ్రహము చూపుట. అంతకుముందు కూడ బ్రహ్మము ప్రసన్నమేగాని అన్యధాత్వము లేదు. తన యనుభూతికి మాత్రము ఎప్పటినుండి ప్రసాదము కలుగునో అప్పటినుండి బ్రహ్మము ప్రసన్నమయ్యె ననిపించును.)

**57.** చిత్తముచే సర్వకర్మలను నాయందు సన్యసించి నన్ను పరునిగా నుపాసించి బుద్ధియోగము నాశ్రయించుము. ఇట్లు నీ బుద్ధిని నాయం దధీనము చేయుము. (బుద్ధిని బ్రహ్మమునం దుంచుట వలన నరుని బుద్ధి యగుట మాని బ్రహ్మమునందున్న బుద్ధి యగును.)

**58.** ఇట్లు చిత్తము నా కర్పించినచో ప్రసాదము వలన నితరులకు దాటరానివి యగు అడ్డంకులను దాటుదువు. అట్లుకాక అహంకారము వహించి విననిచో నశింపగలవు. (చిత్తము నర్పింపక తనయందుంచుకొని పరబ్రహ్మము నుపాసింప జూచుట యహంకారము. అప్పుడు సర్వజీవులలో నున్న పరబ్రహ్మము చెప్పునట్టివాడు, వినునట్టివాడు అను రూపములతో

భాసించి వినుట – వినకుండుట, నచ్చుట – నచ్చకుండుట మున్నగు ద్వంద్వ ములలో పడి ఆత్మజ్ఞానము విస్మృత మగుటయే నశించుట.)

**59.** నీవు అహంకారము వహించి యుద్ధము చేయనని సంకల్పించినచో నీ ప్రయత్నము వ్యర్థము. ప్రకృతియే నిన్ను యుద్ధము నందు నియోగించును. (కర్తృత్వము తనయం దారోపించుకొనుట యహంకారము. క్షత్రియ ప్రకృతి విజృంభించి, శత్రువుల అవహేళనలు నిమిత్తముగా అర్జునుని యందు రజో గుణము ప్రకోపించి యుద్ధ మారంభమగును. జరుగవలసిన దానికి భంగము లేదు గాని అర్జునుని యోగస్థితి భంగ మగును.)

**60.** నీ స్వభావముచే నియమింపబడిన స్వధర్మము నాచరింపుము. మోహము వలన చేయుట కిష్టపడనిచో ఇష్టములేని పనినే చేయవలసి వచ్చును. (యుద్ధము క్షత్రియ స్వభావమునకు ధర్మము. అర్జునునకు బంధు మిత్రాదుల యందు మమకారము మోహము. దాని వలన చేయ నిష్టపడనిచో ప్రకృతి క్రోధమును ప్రేరేపించును. అప్పుడును క్రోధమువలన మోహముచే అర్జునుడు యుద్ధము చేయును. ఒకే కర్మ బ్రహ్మభావనలో నాచరింపబడుట సాధ్యము కాగా, దానినే రజః ప్రకోపముతో నాచరించుట యగును.)

**61.** సర్వజీవులకును హృదయమునం దీశ్వరు డున్నాడు. సృష్టి యంత్రమున జీవుల నెక్కించి భ్రమణము చేయించుచున్నాడు. మాయచే త్రిప్పించు చున్నాడు. (హృదయమున ప్రాణస్పందనకు కారణమగు 'నే'నను వ్యక్తిత్వ మీశ్వరుడు. హృదయ స్పందనముపై నాధారపడి పంచప్రాణములు, దేహేంద్రియ మనోబుద్ధి వ్యాపారములు తిరుగుచున్నవి. అట్లు త్రిప్పుటకు నేర్పరచిన యంత్రమే దేహము. అన్ని దేహముల యందును ఈశ్వరు డున్నాడు గనుక ఈ దేహము లన్నియు నొకే యంత్రమున భాగములవలె నిమిడియున్నవి. ఒకరి యందొకరికి గలిగిన భిన్న భావమే మాయ. దానిచే కర్మాచరణముగా యంత్రము త్రిప్పబడుచున్నది. ఈ మాయయే ప్రకృతి. ఈశ్వరు డనుమతించుటయు, ప్రకృతి ప్రేరేపించుటయు కర్మల ప్రవర్తనమునకు కారణములు. ఇక జీవులకు మిగిలినది దర్శించి విమోచన మొందుటయో, దర్శింపక బద్ధు లగుటయో మాత్రమే.)

**62.** సర్వభావముల చేతను ఆ యీశ్వరునే శరణాగతి పొందుము. వాని ప్రసాదము వలన శాంతియు, శాశ్వత పదప్రాప్తియు పొందగలవు. (సర్వభావములచే అనగా దేహేంద్రియ మనో బుద్ధి వ్యాపారములచే నని యర్థము.)

**63.** రహస్యము లన్నిటిలో పరమ రహస్యమగు జ్ఞానము నీకు తెలుపబడినది. దీనిని చక్కగా, నిశ్శేషముగా విమర్శించుకొని, నీ యిచ్ఛ ప్రకారము ప్రవర్తింపుము. (రహస్యమనగా సృష్టిలో దాగి యున్నదని యర్థము. అశేషముగా విమర్శించుట యనగా విమర్శించువాడు కర్తయగు నహంకారముగా మిగులకుండ నని యర్థము. అపుడు ఇచ్ఛ ప్రకారము అనగా కర్తృత్వ మారోపించుకొనిన తాను లేడు గనుక, ఈశ్వరుని యిచ్ఛ ప్రకారమని యర్థము.)

**64.** ఇంకను నిటుపైని కూడ నొక్క రహస్యము మిగిలియున్నది. అది అన్నిటికన్న పైమాట. నీవు నాకు మిక్కిలి ఇష్టుడవని, నీ హితముగోరి దీనిని చెప్పుచున్నాను. (ఇంతకుముందు చెప్పబడిన బ్రహ్మజ్ఞానము ఎల్లరకును చెప్పదగినది. అనగా నెల్లరకు నచ్చునది. ఇటుపైన చెప్పబోవునది ఈశ్వరుని యొకవ్యక్తిలో నంగీకరించుట. దీనినే గురుశిష్య సంబంధ మందురు. సర్వజీవులలో నున్నాడని యంగీకరించుటకు అసుర ప్రవృత్తి లేనివారి కెవరికి నభ్యంతరముండదు. ఒక వ్యక్తిలో ఈశ్వరుని దర్శించు సాధనకు మాత్రము చిట్టచివరి యహంకార మడ్డురావచ్చును. అందుచే ఇష్టుడు, సఖుడు, తనయందు గౌరవము గలవాడు అనబడు లౌకిక ధర్మముల దివ్యలీలా విభూతి ఆవశ్యకము. అందరికి చెప్పదగిన మాట కాదనగా నచ్చునది కాదని యర్థము.)

**65.** నీ మనస్సు నాకర్పించి నా భక్తుడవగుము. నన్ను యజ్ఞమూర్తిగా నారాధింపుము. నాకు నమస్కరింపుము. నన్ను నీవానినిగా పొందగలవు. నీవు నాకు ప్రియుడవని యీ సత్యమును ప్రతిజ్ఞ చేయుచున్నాను. (ఒకనికి మనస్సర్పించుట, నమస్కరించుట, పూజించుట యనునవి గురురూపమైన ఈశ్వర శరణాగతికి సాధనములు. అవియే అర్హత కలిగినదో లేదోయని పరీక్షించుటకు కూడ మార్గములు.)

**66.** సర్వ ధర్మములను నాయందు పరిత్యాగము చేయుము. నన్నొక్కనినే శరణు పొందుము. నిన్ను సర్వపాపముల నుండి నేను విమోచన చేయగలను. దిగులు పడవలదు. (సర్వ ధర్మములను పరిత్యాగము చేయుట యనగా, తన కర్తవ్యమును గూర్చిన ధర్మాధర్మ నిర్ణయముపై అధికారము ఇంకొకనికి వదలి సన్యసించుట. అటుపైన ఆచరించుటకు, మానుటకు తన నిర్ణయ ముండదు. 'నన్ను శరణు జెందుము' అనగా గురువులోనున్న 'నేను' అనబడు ప్రజ్ఞకు శరణాగతి చెందు క్షణమున చరమ బంధ విమోచనము కలిగి, అన్ని జీవులలో నున్న 'నేను' అను ప్రజ్ఞను దైవముగా దర్శించుట సిద్ధించును. ఈ దర్శనమున ప్రవర్తనయందు కారణములు నశించును. కనుక పాపము లంటవు. బాంధవ్యాది బంధము లుండవు గనుక అది మోక్షస్థితి. ఆ స్థితిలో దిగులుండదు.)

**67.** ఈ చరమ రహస్యమును భక్తి లేనివారికి, తపస్సు లేనివానికి, శుశ్రూష నంగీకరింపని వానికి తెలుపవలదు. నా యందు అసూయపడు వానికి తెలుపవలదు. (శుశ్రూష యనగా నింకొకడు చెప్పునది వినగోరుట. యోగసాధనలో నింకొకనికి హృదయమున ఈశ్వరుడుండుట తెలియును గనుక, అందరి వాక్కుల నుండియు నీశ్వర వాక్కును వినుట, ఇదియొక గురువుకడ నభ్యసించు బుద్ధితో మాత్రమే యలవడును. నా యందు అసూయ చెందువాడు అనగా ఏ జీవునియందైనను గల 'నే'నను ప్రజ్ఞయందు గాని విభూతి యందుగాని అసూయ చెందువాడు.)

**68.** ఈ చరమ రహస్యమును నా భక్తులయందు ఎవడు అనుసంధానము చేయునో, వాడు నాయందు భక్తిని పెంపొందించుచు నన్నే పొందుచున్నాడు. (దీనిని బట్టియే రహస్యమనగా, బ్రహ్మవిద్యలో చెప్పకూడనిది కాదనియు, అంగీకరించుట కష్టమైనదనియు తెలియుచున్నది. నా భక్తులయందు అనుసంధానము చేయుటయనగా ప్రేమ, దయ మున్నగు భావములతో జీవులలోనున్న నాతో మైత్రిపొందిన వానికని యర్థము.)

**69.** దీనిని అనుసంధానము చేయువానికన్న నా కెక్కువ ప్రియుడు మనుష్యులలో నుండడు. భవిష్యత్తున కూడ అట్టివానికన్న అన్యుడు నాకకెక్కువ

ప్రియుడు కాడు. (ఈ మోక్ష ధర్మమును ఉపదేశించుట యనగా జీవులయందు అపార కరుణ కలిగి యుండుట. దానివలన జీవులయందున్న ఈశ్వరునకు ప్రియతము డగును. భవిష్యత్తులో కూడ ననగా నిదియొక వ్యక్తిచే మరియొకనికి అనుసంధానము చేయబడు చున్నను, వ్యక్తులకు, దేశ కాలములకు నతీతమని భావము.)

**70.** ఈ ధర్మమును గూర్చిన మన సంవాదమునందు ద్వేషము లేక మనస్సు నిలుపుట కూడ జ్ఞానయజ్ఞము. అట్టివానికి కూడ నే నిష్టుడ నగుదును. (ఇందలి సంధానము జీవునకు ఈశ్వరత్వము దర్శనము చేయించు నది కావున దేహములతో సంబంధము లేదు. ఎవరెవరికి చెప్పిరను విషయ ముతో సంబంధము లేదు. ఒకడే చెప్పవలెనను నియమము లేదు. భక్తితో ఈ సన్నివేశము ఎచ్చట నెప్పుడు జరిగినను నరనారాయణులు అచ్చట నుందురు.)

**71.** అసూయ లేక దీనిని శ్రద్ధతో విని స్వీకరించు వాడును, యజ్ఞ యాగాది పుణ్యకర్మలు, తపస్సులు నాచరించినవాని స్థితులను పొంది, సకల బంధ విమోచనము చెందును. (సకల పుణ్య కర్మలును స్వభావములోని త్రిగుణముల కతీతుడై కర్మబంధ విమోచనము పొందుట కొరకే. అది యీ సంవాదమున సిద్ధించును గనుక అట్టి లోకములను ఇతడును పొందును.)

**72.** బాగుగా వింటివా? నీ చిత్తము ఏకాగ్రమైనదా? అజ్ఞాన సమ్మోహము తొలగినదా? (ఏకాగ్రమగు చిత్తము అనగా దేహేంద్రియ మనస్సులు బుద్ధియందు నిలుచుట. ఈ యోగస్థితికి నిదర్శనము అజ్ఞానము తొలగుట.)

**73. *అర్జునుడు :*** నా మోహము తొలగినది. స్మృతి లభించినది. నీ యనుగ్రహమున నేను నిశ్చలత్వ మందితిని. సందేహములు తొలగినవి. నీ మాట ప్రకారము ఆచరించెదను. (మోహ మనగా జీవుల యందు బంధుమిత్ర శత్రుత్వాదుల బుద్ధి, క్షుద్రమగు అట్టి హృదయ దౌర్బల్యము తోనే అర్జునుని మోహ మారంభమైనది. ఈ యుపదేశమున తొలగినది. గత సందేహుడు అనగా బంధువులను జంపుట పాపమగునా కాదా, యుద్ధము క్రూరకర్మ యగునా కాదా మున్నగు సందేహములు తొలగుట. యుద్ధాదికర్మల హింసా

హింసాదు లెట్టివియైనను వానితో సంబంధము లేక కృష్ణుని నిర్ణయమునే ధర్మముగా స్వీకరించుట శరణాగతి లక్షణము.)

**74.** ***సంజయుడు :*** మహాత్ముడైన వాసుదేవునకు, పార్థునకు ఈ విధముగా జరిగిన సంవాదమును వింటిని. ఆశ్చర్య పూరితుడనై రోమాంచ మనుభవించితిని.

**75.** వ్యాసుని యనుగ్రహము వలన యోగేశ్వరుడగు కృష్ణుడు స్వయముగా యోగస్థితిని ప్రసాదించిన ఈ రహస్య వాక్కులను వింటిని. (గీతోపదేశమున గురుశిష్య సంబంధము చరము ధర్మము గనుక, సంజయుడు వ్యాసుని స్మరించెను. ఉపదేశించినది కృష్ణుడైనను తాను దర్శించుటకు కారణమైనవాడు వ్యాసుడు. యోగేశ్వరుడు అనగా యోగమున కీశ్వరుడు. అందరిలో గల 'నేను' అను ప్రజ్ఞ.)

**76.** రాజా! కృష్ణార్జునుల నడుమ జరిగిన పవిత్రమైన ఈ యాశ్చర్య సంవాదమును తలచుకొని తలచుకొని మురిసిపోవుచున్నాను. (స్మరణ మాత్రముచే అనుభూతి కలిగించు దేశ కాలాతీతమగు మంత్రత్వము దీనియం దాపాదింప బడినది.)

**77.** ఆ విశ్వరూప దృశ్యమును నేను స్మరించి స్మరించి అచ్చెరువు పడుచున్నాను. మరల మరల హర్షము చెందుచున్నాను. (ఇచ్చట ధ్యానము యొక్క అభ్యాసము నిర్దేశింపబడినది. మరల మరల స్మరించుటయే ధ్యానాభ్యాసము.)

**78.** ఎచ్చట యోగమున కీశ్వరుడగు కృష్ణుడును, విల్లందిన పార్థుడును గలరో అచ్చట సంపద, విజయము, వైభవము, స్థిరత్వము, నీతి నిలుచునని నా మతము. (విల్లందిన పార్థుడు అనగా విషాద యోగమును విడచినవాడు. కృష్ణుని యాజ్ఞనే తన ధర్మముగా శరణాగతి చెందినవాడు అని భావము.)

*ఓం తత్ సత్.*

# శ్రీమద్భగవద్గీత - శ్లోకానుక్రమణిక

ప్రతి శ్లోకములోని మొదటిపాదము ఇందు మూలముగా పొందుపరచబడి యున్నది.


**అ**

అకీర్తిం చాపి భూతాని 02-34
అక్షరం బ్రహ్మ పరమమ్ 08-03
అక్షరాణా మకారోఽస్మి 10-33
అగ్నిర్జ్యోతి రహః శుక్లః 08-24
అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయం 02-24
అజోఽపి సన్నవ్యయాత్మా 04-06
అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ 04-40
అత్ర శూరా మహేష్వాసా 01-04
అథ కేన ప్రయుక్తోఽయమ్ 03-36
అథ చిత్తం సమాధాతుమ్ 12-09
అథ చే త్త్వ మిమం ధర్మ్యమ్ 02-33
అథ చైనం నిత్యజాతమ్ 02-26
అథవా బహునైతేన 10-42
అథవా యోగినా మేవ 06-42
అథ వ్యవస్థితాన్ దృష్ట్వా 01-20
అథైతద ప్యశక్తోఽసి 12-11
అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా 11-45
అదేశకాలే యద్దానమ్ 17-22
అద్వేష్టా సర్వభూతానామ్ 12-13
అధర్మం ధర్మ మితి యా 18-32
అధర్మాభిభవా త్కృష్ణ 01-41
అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖాః 15-02
అధిభూతం క్షరో భావః 08-04
అధియజ్ఞః కథం కోఽత్ర 08-02
అధిష్ఠానం తథా కర్తా 18-14
అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్ 13-12
అధ్యేష్యతే చ య ఇమమ్ 18-70
అనన్తవిజయం రాజా 01-16
అనన్తశ్చాస్మి నాగానామ్ 10-29
అనన్యచేతా స్సతతమ్ 08-14
అనన్యా శ్చిన్తయన్తో మామ్ 09-22
అనపేక్ష శ్శుచి ర్దక్షః 12-16
అనాదిత్వా న్నిర్గుణత్వాత్ 13-32
అనాదిమధ్యాన్త మనన్తవీర్యమ్ 11-19
అనాశ్రితః కర్మఫలమ్ 06-01
అనిష్ట మిష్టం మిశ్రం చ 18-12
అనుద్వేగకరం వాక్యమ్ 17-15
అనుబన్ధం క్షయం హింసామ్ 18-25
అనేక చిత్తవిభ్రాన్తాః 16-16
అనేకబాహూదరవక్త్రనేత్రమ్ 11-16
అనేకవక్త్రనయనమ్ 11-10
అన్తకాలే చ మామేవ 08-05
అన్తవత్తు ఫలం తేషామ్ 07-23
అన్తవన్త ఇమే దేహా 02-18
అన్నా ద్భవన్తి భూతాని 03-14
అన్యే చ బహవ శూరా 01-09
అన్యే త్వేవ మజానన్తః 13-26
అపరం భవతో జన్మ 04-04
అపరే నియతాహారాః 04-30

అపరేయమిత స్త్వన్యామ్ 07-05
అపర్యాప్తం తదస్మాకమ్ 01-10
అపానే జుహ్వతి ప్రాణమ్ 04-29
అపి చేత్సుదురాచారః 09-30
అపి చేదసి పాపేభ్యః 04-36
అప్రకాశో’ ప్రవృత్తిశ్చ 14-13
అఫలాకాంక్షిభిర్యజ్ఞః 17-11
అభయం సత్త్వసంశుద్ధిః 16-01
అభిసన్ధాయ తు ఫలమ్ 17-12
అభ్యాసయోగయుక్తేన 08-08
అభ్యాసే’ వ్యసమర్థో’సి 12-10
అమానిత్వమదమ్భిత్వమ్ 13-08
అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః 11-26
అమీ హి త్వాం సురసంఘా విశన్తి 11-21
అయతిః శ్రద్ధయోపేతః 06-37
అయనేషు చ సర్వేషు 01-11
అయుక్తః ప్రాకృతః స్తబ్ధః 18-28
అవజానన్తి మాం మూఢాః 09-11
అవాచ్య వాదాంశ్చ బహూన్ 02-36
అవినాశి తు తద్విద్ధి 02-17
అవిభక్తం చ భూతేషు 13-17
అవ్యక్తం వ్యక్తిమాపన్నమ్ 07-24
అవ్యక్తాదీని భూతాని 02-28
అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః 08-18
అవ్యక్తో’క్షర ఇత్యుక్తః 08-21
అవ్యక్తో’య మచిన్త్యో’యమ్ 02-25
అశాస్త్రవిహితం ఘోరమ్ 17-05
అశోచ్యానన్వశోచస్త్వమ్ 02-11
అశ్రద్ధధానాః పురుషాః 09-03
అశ్రద్ధయా హుతం దత్తమ్ 17-28
అశ్వత్థః సర్వవృక్షాణామ్ 10-26
అసంయతాత్మనా యోగః 06-36
అసంశయం మహాబాహో 06-35
అసక్తబుద్ధిః సర్వత్ర 18-49
అసక్తి రనభిష్వఙ్గః 13-10
అసత్య మప్రతిష్ఠం తే 16-08
అసౌ మయా హతః శత్రుః 16-14
అస్మాకం తు విశిష్టా యే 01-07
అహంకారం బలం దర్పమ్ 16-18
అహంకారం బలం దర్పమ్ 18-53
అహం క్రతు రహం యజ్ఞః 09-16
అహం వైశ్వానరో భూత్వా 15-14
అహం సర్వస్య ప్రభవః 10-08
అహం హి సర్వయజ్ఞానామ్ 09-24
అహ మాత్మా గుడాకేశ 10-20
అహింసా సత్య మక్రోధః 16-02
అహింసా సమతా తుష్టిః 10-05
అహోబత మహత్పాపమ్ 01-45


### ఆ


ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపః 11-31
ఆచార్యాః పితరః పుత్రాః 01-34
ఆఢ్యో’భిజనవా నస్మి 16-15
ఆత్మసమ్భావితాః స్తబ్ధాః 16-17
ఆత్మౌపమ్యేన సర్వత్ర 06-32
ఆదిత్యానా మహం విష్ణుః 10-21
ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం 02-70
ఆబ్రహ్మ భువనాల్లోకాః 08-16
ఆయుః సత్త్వబలారోగ్య 17-08
ఆయుధానా మహం వజ్రమ్ 10-28

ఆరురుక్షో ర్మునే ర్యోగమ్ 06-03
ఆవృతం జ్ఞాన మేతేన 03-39
ఆశాపాశశతై ర్బద్ధాః 16-12
ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చి దేనమ్ 02-29
ఆసురీం యోని మాపన్నాః 16-20
ఆహారస్త్వపి సర్వస్య 17-07
ఆహు స్త్వా మృషయః సర్వే 10-13

ఇ

ఇచ్ఛాద్వేషః సుఖం దుఃఖమ్ 13-07
ఇచ్ఛాద్వేషసముత్థేన 07-27
ఇతి క్షేత్రం తథా జ్ఞానమ్ 13-19
ఇతి గుహ్యతమం శాస్త్రమ్ 15-20
ఇతి తే జ్ఞాన మాఖ్యాతమ్ 18-63
ఇత్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా 11-50
ఇత్యహం వాసుదేవస్య 18-74
ఇదం జ్ఞాన ముపాశ్రిత్య 14-02
ఇదం తు తే గుహ్యతమమ్ 09-01
ఇదం తే నాతపస్కాయ 18-67
ఇదం శరీరం కౌన్తేయ 13-02
ఇద మద్య మయా లబ్ధమ్ 16-13
ఇన్ద్రియ స్యేన్ద్రియ స్యార్థే 03-34
ఇన్ద్రియాణాం హి చరతామ్ 02-67
ఇన్ద్రియాణి పరా ణ్యాహుః 03-42
ఇన్ద్రియాణి మనోబుద్ధిః 03-40
ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్ 13-09
ఇమం వివస్వతే యోగమ్ 04-01
ఇష్టాన్ భోగాన్ హి వో దేవాః 03-12
ఇహైకస్థం జగత్కృత్స్నమ్ 11-07
ఇహైవ తైర్జితః సర్గః 05-19

ఈ

ఈశ్వరః సర్వభూతానామ్ 18-61

ఉ

ఉచ్చైః శ్రవస మశ్వానామ్ 10-27
ఉత్క్రామన్తం స్థితం వాపి 15-10
ఉత్తమః పురుషస్త్వన్యః 15-17
ఉత్సన్నకుల ధర్మాణామ్ 01-44
ఉత్సీదేయు రిమే లోకాః 03-24
ఉదారాః సర్వ ఏవైతే 07-18
ఉదాసీన వదాసీనః 14-23
ఉద్ధరే దాత్మనాత్మానమ్ 06-05
ఉపద్రష్టానుమన్తాచ 13-23

ఊ

ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః 14-18
ఊర్ధ్వమూల మధఃశాఖమ్ 15-01

ఋ

ఋషిభి ర్బహుధా గీతమ్ 13-05

ఏ

ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య 11-35
ఏతద్యోనీని భూతాని 07-06
ఏత న్మే సంశయం కృష్ణ 06-39
ఏతాం దృష్టి మవష్టభ్య 16-09
ఏతా న్న హన్తు మిచ్ఛామి 01-35
ఏతాం విభూతిం యోగం చ 10-07
ఏతాన్యపి తు కర్మాణి 18-06
ఏతై ర్విముక్తః కౌన్తేయ 16-22

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ 04-15
ఏవం పరమ్పరా ప్రాప్తమ్ 04-02
ఏవం ప్రవర్తితం చక్రమ్ 03-16
ఏవం బహువిధా యజ్ఞా 04-32
ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా 03-43
ఏవం సతతయుక్తా యే 12-01
ఏవ ముక్తో హృషీకేశః 01-24
ఏవ ముక్త్వా తతో రాజన్ 11-09
ఏవ ముక్త్వార్జునః సంఖ్యే 01-47
ఏవ ముక్త్వా హృషీకేశమ్ 02-09
ఏవ మైత ద్యథాత్థ త్వమ్ 11-03
ఏషా తే'భిహితా సాంఖ్యే 02-39
ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ 02-72

## ఓ

ఓం తత్సదితి నిర్దేశః 17-23
ఓమిత్యేకాక్షరం బ్రహ్మ 08-13

## క

కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ 18-72
కచ్చిన్నోభయవిభ్రష్టః 06-38
కట్వామ్లలవణాత్యుష్ణ 17-09
కథం న జ్ఞేయ మస్మాభిః 01-39
కథం భీష్మ మహం సంఖ్యే 02-04
కథం విద్యా మహం యోగిన్ 10-17
కర్మజం బుద్ధియుక్తా హి 02-51
కర్మణః సుకృత స్యాహుః 14-16
కర్మణైవ హి సంసిద్ధిమ్ 03-20
కర్మణో హ్యపి బోద్ధవ్యమ్ 04-17
కర్మణ్యకర్మ యః పశ్యేత్ 04-18
కర్మణ్యేవాధికారస్తే 02-47
కర్మబ్రహ్మోద్భవం విద్ధి 03-15
కర్మేన్ద్రియాణి సంయమ్య 03-06
కర్శయన్తః శరీరస్థమ్ 17-06
కవిం పురాణ మనుశాసితారమ్ 08-09
కస్మాచ్చ తే న నమేర న్మహాత్మన్ 11-37
కాంక్షన్తః కర్మణాం సిద్ధిమ్ 04-12
కామ ఏష క్రోధ ఏష 03-37
కామ క్రోధ వియుక్తానామ్ 05-26
కామ మాశ్రిత్య దుష్పూరం 16-10
కామాత్మానః స్వర్గపరాః 02-43
కామైస్తై స్తైర్హృతజ్ఞానాః 07-20
కామ్యానాం కర్మణాం న్యాసమ్ 18-02
కాయేన మనసా బుద్ధ్యా 05-11
కార్పణ్యదోషోపహతస్వభావః 02-07
కార్యకారణకర్తృత్వే 13-21
కార్యమిత్యేవ యత్కర్మ 18-09
కాలో'స్మి లోకక్షయకృత్ప్రవృద్ధః 11-32
కాశ్యశ్చ పరమేష్వాసః 01-17
కిం కర్మ కిమకర్మేతి 04-16
కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మమ్ 08-01
కిం పునర్బ్రాహ్మణాః పుణ్యాః 09-33
కిరీటినం గదినం చక్రహస్తం 11-46
కిరీటినం గదినం చక్రిణం చ 11-17
కుత స్త్వా కశ్మల మిదమ్ 02-02
కులక్షయే ప్రణశ్యన్తి 01-40
కృపయా పరయావిష్టః 01-28
కృషి గోరక్షవాణిజ్యమ్ 18-44
కైర్లిఙ్గై స్త్రీన్ గుణా నేతాన్ 14-21

క్రోధా ద్భవతి సమ్మోహః 02-63
క్లేశో'ధికతరస్తేషామ్ 12-05
క్లైబ్యం మా స్మ గమః పార్థ 02-03
క్షిప్రం భవతి ధర్మాత్మా 09-31
క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ 13-35
క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి 13-03

## గ

గత సఙ్గస్య ముక్తస్య 04-23
గతిర్భర్తా ప్రభుః సాక్షీ 09-18
గాణ్డీవం స్రంసతే హస్తాత్ 01-30
గా మావిశ్య చ భూతాని 15-13
గుణా నేతా నతీత్య త్రీన్ 14-20
గురూ నహత్వా హి మహానుభావాన్ 02-05

## చ

చంచలం హి మనః కృష్ణ 06-34
చతుర్విధా భజన్తే మామ్ 07-16
చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్ 04-13
చిన్తామపరిమేయాం చ 16-11
చేతసా సర్వకర్మాణి 18-57

## జ

జన్మ కర్మ చ మే దివ్యమ్ 04-09
జరామరణమోక్షాయ 07-29
జాతస్య హి ధ్రువో మృత్యుః 02-27
జితాత్మనః ప్రశాన్తస్య 06-07
జ్ఞానం కర్మ చ కర్తా చ 18-19
జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా 18-18
జ్ఞానం తే'హం సవిజ్ఞానమ్ 07-02
జ్ఞానయజ్ఞేన చాప్యన్యే 09-15
జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా 06-08
జ్ఞానేన తు తదజ్ఞానమ్ 05-16
జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి 13-13
జ్ఞేయం స నిత్య సంన్యాసీ 05-03
జ్యాయసీ చేత్కర్మణస్తే 03-01
జ్యోతిషామపి తజ్జ్యోతిః 13-18

## త

తం తథా కృపయావిష్టమ్ 02-01
త్వం విద్ధ్యా ద్దుఃఖసంయోగ 06-23
తచ్చ సంస్మృత్య సంస్మృత్య 18-77
తతః పదం తత్పరిమార్గితవ్యమ్ 15-04
తతః శంఖాశ్చ భేర్యశ్చ 01-13
తతః శ్వేతై ర్హయై ర్యుక్తే 01-14
తతః స విస్మయావిష్టః 11-14
తత్త్వవిత్తు మహాబాహో 03-28
తత్ర తం బుద్ధిసంయోగమ్ 06-43
తత్ర సత్త్వం నిర్మలత్వాత్ 14-06
తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః 01-26
తత్క్షేత్రం యచ్చ యాదృక్ చ 13-04
తత్రైకస్థం జగత్కృత్స్నమ్ 11-13
తత్రైకాగ్రం మనః కృత్వా 06-12
తత్రైవం సతి కర్తారమ్ 18-16
తదిత్యనభిసన్ధాయ 17-25
తద్బుద్ధయస్తదాత్మానః 05-17
తద్విద్ధి ప్రణిపాతేన 04-34
తపస్విభ్యో'ధికో యోగీ 06-46
తపామ్యహ మహం వర్షమ్ 09-19
తమస్త్వజ్ఞానజం విద్ధి 14-08

తమువాచ హృషీకేశః 02-10
తమేవ శరణం గచ్ఛ 18-62
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే 16-24
తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ 03-41
తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ 11-33
తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం 11-44
తస్మాత్సర్వేషు కాలేషు 08-07
తస్మాదజ్ఞానసమ్భూతమ్ 04-42
తస్మాదసక్తః సతతమ్ 03-19
తస్మా దోమిత్యుదాహృత్య 17-24
తస్మాద్యస్య మహాబాహో 02-68
తస్మా న్నార్హా వయం హన్తుమ్ 01-37
తస్య సంజనయన్ హర్షమ్ 01-12
తా నహం ద్విషతః క్రూరాన్ 16-19
తాని సర్వాణి సంయమ్య 02-61
తుల్యనిన్దాస్తుతిర్మౌనీ 12-19
తేజః క్షమా ధృతిః శౌచమ్ 16-03
తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలమ్ 09-21
తేషాం జ్ఞానీ నిత్యయుక్తః 07-17
తేషాం సతతయుక్తానామ్ 10-10
తేషామహం సముద్ధర్తా 12-07
తేషామేవానుకమ్పార్థమ్ 10-11
త్యక్త్వా కర్మఫలం సంగమ్ 04-20
త్యాజ్యం దోషవదిత్యేకే 18-03
త్రిభిర్గుణమయైర్భావైః 07-13
త్రివిధం నరకస్యేదమ్ 16-21
త్రివిధా భవతి శ్రద్ధా 17-02
త్రైగుణ్య విషయా వేదాః 02-45
త్రైవిద్యా మాం సోమపాః పూతపాపాః 09-20
త్వమక్షరం పరమం వేదితవ్యమ్ 11-18
త్వమాదిదేవః పురుషః పురాణః 11-38


## ద


దంష్ట్రాకరాలాని చ తే ముఖాని 11-25
దణ్డో దమయతా మస్మి 10-38
దమ్భో దర్పో'భిమానశ్చ 16-04
దాతవ్యమితి యద్దానమ్ 17-20
దివి సూర్యసహస్రస్య 11-12
దివ్యమాల్యామ్బరధరమ్ 11-11
దుఃఖమిత్యేవ యత్కర్మ 18-08
దుఃఖేష్వనుద్విగ్నమనాః 02-56
దూరేణ హ్యవరం కర్మ 02-49
దృష్ట్వా తు పాణ్డవానీకమ్ 01-02
దృష్ట్వేదం మానుషం రూపమ్ 11-51
దేవద్విజగురుప్రాజ్ఞ 17-14
దేవాన్ భావయతానేన 03-11
దేహినో'స్మిన్ యథా దేహే 02-13
దేహీ నిత్య మవధ్యో'యమ్ 02-30
దైవమేవాపరే యజ్ఞమ్ 04-25
దైవీ సమ్పత్ విమోక్షాయ 16-05
దైవీహ్యేషా గుణమయీ 07-14
దోషైరేతైః కులఘ్నానామ్ 01-43
ద్యావా పృథివ్యోరిదమన్తరం హి 11-20
ద్యూతం ఛలయతామస్మి 10-36
ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞాః 04-28
ద్రుపదో ద్రౌపదేయాశ్చ 01-18
ద్రోణం చ భీష్మం చ
జయద్రథం చ 11-34
ద్వావిమౌ పురుషౌ లోకే 15-16

ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ 16-06

## ధ

ధర్మక్షేత్రే కురుక్షేత్రే 01-01
ధూమేనావ్రియతే వహ్నిః 03-38
ధూమో రాత్రి స్తథా కృష్ణః 08-25
ధృత్యా యయా ధారయతే 18-33
ధృష్టకేతుశ్చేకితానః 01-05
ధ్యానేనాత్మని పశ్యన్తి 13-25
ధ్యాయతో విషయాన్ పుంసః 02-62

## న

న కర్తృత్వం న కర్మాణి 05-14
న కర్మణామనారమ్భాన్ 03-04
న కాంక్షే విజయం కృష్ణ 01-32
న చ తస్మాన్మనుష్యేషు 18-69
న చ మత్స్థాని భూతాని 09-05
న చ మాం తాని కర్మాణి 09-09
న చైతద్విద్మః కతరన్నో గరీయః 02-06
న జాయతే మ్రియతే వా కదాచిత్ 02-20
న తదస్తి పృథివ్యాం వా 18-40
న తద్భాసయతే సూర్యః 15-06
న తు మాం శక్యసే ద్రష్టుమ్ 11-08
న త్వేవాహం జాతు నాసమ్ 02-12
న ద్వేష్ట్యకుశలం కర్మ 18-10
న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య 05-20
న బుద్ధిభేదం జనయేత్ 03-26
నభస్స్పృశం దీప్తమనేకవర్ణమ్ 11-24
నమః పురస్తా దథ పృష్ఠతస్తే 11-40
న మాం కర్మాణి లిమ్పన్తి 04-14
న మాం దుష్కృతినో మూఢాః 07-15
న మే పార్థాస్తి కర్తవ్యమ్ 03-22
న మే విదుః సురగణాః 10-02
న రూపమస్యేహ తథోపలభ్యతే 15-03
న వేద యజ్ఞాధ్యయనై ర్న దానైః 11-48
నష్టో మోహః స్మృతిర్లబ్ధా 18-73
న హి కశ్చిత్ క్షణమపి 03-05
న హి జ్ఞానేన సదృశమ్ 04-38
న హి దేహభృతా శక్యం 18-11
న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ 02-08
నాత్యశ్నతస్తు యోగోఽస్తి 06-16
నాదత్తే కస్యచిత్పాపమ్ 05-15
నాన్తోఽస్తి మమ దివ్యానామ్ 10-40
నాన్యం గుణేభ్యః కర్తారమ్ 14-19
నాసతో విద్యతే భావః 02-16
నాస్తి బుద్ధిరయుక్తస్య 02-66
నాహం ప్రకాశః సర్వస్య 07-25
నాహం వేదై ర్న తపసా 11-53
నిమిత్తాని చ పశ్యామి 01-31
నియతం కురు కర్మ త్వమ్ 03-08
నియతం సంగరహితమ్ 18-23
నియతస్య తు సన్న్యాసః 18-07
నిరాశీ ర్యతచిత్తాత్మా 04-21
నిర్మానమోహా జితసఙ్గదోషాః 15-05
నిశ్చయం శ్రుణు మే తత్ర 18-04
నిహత్య ధార్తరాష్ట్రా న్నః 01-36
నేహాభిక్రమనాశోఽస్తి 02-40
నైతే సృతీ పార్థ జానన్ 08-27
నైనం ఛిన్దన్తి శస్త్రాణి 02-23

నైవ కించిత్కరోమీతి 05-08
నైవ తస్య కృతేనార్థః 03-18

### ప

పఞ్చైతాని మహాబాహో 18-13
పత్రం పుష్పం ఫలం తోయమ్ 09-26
పరం బ్రహ్మ పరం ధామ 10-12
పరం భూయః ప్రవక్ష్యామి 14-01
పరస్తస్మాత్తు భావోఽన్యో 08-20
పరిత్రాణాయ సాధూనామ్ 04-08
పవనః పవతామస్మి 10-31
పశ్య మే పార్థ రూపాణి 11-05
పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రాన్ 11-06
పశ్యామి దేవాం స్తవ దేవ దేహే 11-15
పశ్యైతాం పాణ్డుపుత్రాణామ్ 01-03
పాంచజన్యం హృషీకేశః 01-15
పార్థ నైవేహ నాముత్ర 06-40
పితాసి లోకస్య చరాచరస్య 11-43
పితాహమస్య జగతః 09-17
పుణ్యో గన్ధః పృథివ్యాం చ 07-09
పురుషః ప్రకృతిస్థో హి 13-22
పురుషః స పరః పార్థ 08-22
పురోధసాం చ ముఖ్యం మామ్ 10-24
పూర్వాభ్యాసేన తేనైవ 06-44
పృథక్త్వేన తు యద్ జ్ఞానమ్ 18-21
ప్రకాశం చ ప్రవృత్తిం చ 14-22
ప్రకృతిం పురుషం చైవ 13-01
ప్రకృతిం పురుషం చైవ 13-20
ప్రకృతిం స్వామవష్టభ్య 09-08
ప్రకృతేః క్రియమాణాని 03-27
ప్రకృతే ర్గుణసమ్మూఢాః 03-29
ప్రకృత్యైవ చ కర్మాణి 13-30
ప్రజహాతి యదా కామాన్ 02-55
ప్రయత్నాద్యతమానస్తు 06-45
ప్రయాణకాలే మనసా చలేన 08-10
ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ 05-09
ప్రవృత్తిం చ నివృత్తిం చ 16-07
ప్రవృత్తిం చ నివృత్తిం చ 18-30
ప్రశాన్త మనసం హ్యేనం 06-27
ప్రశాన్తాత్మా విగతభీః 06-14
ప్రసాదే సర్వదుఃఖానామ్ 02-65
ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్ 10-30
ప్రాప్య పుణ్యకృతామ్ లోకాన్ 06-41

### బ

బన్ధురాత్మాత్మన స్తస్య 06-06
బలం బలవతాం చాహమ్ 07-11
బహిరన్తశ్చ భూతానామ్ 13-16
బహూనాం జన్మనామన్తే 07-19
బహూని మే వ్యతీతాని 04-05
బాహ్యస్పర్శేష్వసక్తాత్మా 05-21
బీజం మాం సర్వభూతానామ్ 07-10
బుద్ధియుక్తో జహాతీహ 02-50
బుద్ధిర్జ్ఞాన మసమ్మోహః 10-04
బుద్ధేర్భేదం ధృతేశ్చైవ 18-29
బుద్ధ్యా విశుద్ధయా యుక్తః 18-51
బృహత్సామ తథా సామ్నాం 10-35
బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ 14-27
బ్రహ్మణ్యాధాయ కర్మాణి 05-10
బ్రహ్మభూతః ప్రసన్నాత్మా 18-54

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః 04-24
బ్రాహ్మణక్షత్రియవిశామ్ 18-41

**భ**

భక్త్యా త్వనన్యయా శక్యః 11-54
భక్త్యా మామభిజానాతి 18-55
భయాద్ రణాదుపరతమ్ 02-35
భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ 01-08
భవాప్యయౌ హి భూతానామ్ 11-2
భీష్మద్రోణప్రముఖతః 1-25
భూతగ్రామః స ఏవాయమ్ 8-19
భూమిరాపో'నలో వాయుః 7-4
భూయ ఏవ మహాబాహో 10-1
భోక్తారం యజ్ఞతపసామ్ 5-29
భోగైశ్వర్య ప్రసక్తానామ్ 02-44

**మ**

మచ్చిత్తః సర్వదుర్గాణి 18-58
మచ్చిత్తా మద్గతప్రాణా 10-09
మత్కర్మకృన్మత్పరమః 11-55
మత్తః పరతరం నాన్యత్ 07-07
మదనుగ్రహాయ పరమమ్ 11-01
మనః ప్రసాదః సౌమ్యత్వమ్ 17-16
మనుష్యాణాం సహస్రేషు 07-03
మన్మనా భవ మద్భక్తః 18-65, 9-34
మన్యసే యది తచ్ఛక్యమ్ 11-04
మమ యోని ర్మహద్బ్రహ్మ 14-03
మమైవాంశో జీవలోకే 15-07
మయా తత మిదం సర్వమ్ 09-04
మయాధ్యక్షేణ ప్రకృతిః 09-10
మయా ప్రసన్నేన తవార్జునేదమ్ 11-47
మయి చానన్యయోగేన 13-11
మయి సర్వాణి కర్మాణి 03-30
మయ్యావేశ్య మనో యే మామ్ 12-02
మయ్యాసక్తమనాః పార్థ 07-01
మయ్యేవ మన ఆధత్స్వ 12-08
మహర్షయః సప్త పూర్వే 10-06
మహర్షీణాం భృగు రహం 10-25
మహాత్మానస్తు మాం పార్థ 09-13
మహాభూతా న్యహంకారః 13-06
మాం చ యో' వ్యభిచారేణ 14-26
మాం హి పార్థ వ్యపాశ్రిత్య 09-32
మా తే వ్యథా మా చ
విమూఢభావః 11-49
మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ 02-14
మానావమానయోస్తుల్యః 14-25
మాముపైత్య పునర్జన్మ 08-15
ముక్తసఙ్గో'నహంవాదీ 18-26
మూఢగ్రాహేణాత్మనో యత్ 17-19
మృత్యుః సర్వహరశ్చాహమ్ 10-34
మోఘాశా మోఘకర్మాణః 09-12

**య**

య ఇదం పరమం గుహ్యమ్ 18-68
య ఏవం వేత్తి పురుషమ్ 13-24
య ఏవం వేత్తి హన్తారమ్ 02-19
యం యం వాపి స్మరన్ భావమ్ 08-06
యం లబ్ధ్వా చాపరమ్ లాభమ్ 06-22
యం సన్న్యాసమితి ప్రాహుః 06-02
య హి న వ్యథయన్త్యేతే 02-15

| | |
|---|---|
| యః శాస్త్రవిధి ముత్సృజ్య | 16-23 |
| యః సర్వత్రానభిస్నేహః | 02-57 |
| యచ్చాపహాసార్థ మసత్కృతోఽసి | 11-42 |
| యచ్చాపి సర్వభూతానామ్ | 10-39 |
| యజన్తే సాత్త్వికా దేవాన్ | 17-04 |
| యద్జాత్వా న పునర్మోహమ్ | 04-35 |
| యజ్ఞదానతపః కర్మ | 18-05 |
| యజ్ఞ శిష్టామృత భుజః | 04-31 |
| యజ్ఞశిష్టాశినః సన్తః | 03-13 |
| యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర | 03-09 |
| యజ్ఞే తపసి దానే చ | 17-27 |
| యతః ప్రవృత్తి ర్భూతానామ్ | 18-46 |
| యతతో హ్యపి కౌన్తేయ | 02-60 |
| యతన్తో యోగినశ్చైనం | 15-11 |
| యత్కరోషి యదశ్నాసి | 09-27 |
| యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం | 05-05 |
| యతేన్ద్రియ మనో బుద్ధిః | 05-28 |
| యతో యతో నిశ్చలతి | 06-26 |
| యత్తదగ్రే విషమివ | 18-37 |
| యత్తు కామేప్సునా కర్మ | 18-24 |
| యత్తు కృత్స్నవ దేకస్మిన్ | 18-22 |
| యత్తు ప్రత్యుపకారార్థం | 17-21 |
| యత్ర కాలే త్వనావృత్తిమ్ | 08-23 |
| యత్ర యోగేశ్వరః కృష్ణః | 18-78 |
| యత్రోపరమతే చిత్తం | 06-20 |
| యథాకాశస్థితో నిత్యం | 09-06 |
| యథా దీపో నివాతస్థః | 06-19 |
| యథా నదీనాం బహవోఽమ్బువేగాః | 11-28 |
| యథా ప్రకాశయ త్యేకః | 13-34 |
| యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గః | 11-29 |
| యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ | 13-33 |
| యథైధాంసి సమిద్ధోఽగ్నిః | 04-37 |
| యదక్షరం వేదవిదో వదన్తి | 08-11 |
| యదగ్రే చానుబన్ధే చ | 18-39 |
| యదహంకారమాశ్రిత్య | 18-59 |
| యదా తే మోహకలిలమ్ | 02-52 |
| యదాదిత్యగతం తేజః | 15-12 |
| యదా భూతపృథగ్భావమ్ | 13-31 |
| యదా యదా హి ధర్మస్య | 04-07 |
| యదా వినియతం చిత్తమ్ | 06-18 |
| యదా సంహరతే చాయమ్ | 02-58 |
| యదా సత్త్వే ప్రవృద్ధే తు | 14-14 |
| యదా హి నేన్ద్రియార్థేషు | 06-04 |
| యది మామప్రతీకారమ్ | 01-46 |
| యది హ్యహం న వర్తేయమ్ | 03-23 |
| యదృచ్ఛయా చోపపన్నం | 02-32 |
| యదృచ్ఛాలాభ సంతుష్టః | 04-22 |
| యద్యదాచరతి శ్రేష్ఠః | 03-21 |
| యద్యద్విభూతిమత్సత్త్వమ్ | 10-41 |
| యద్యప్యేతే న పశ్యన్తి | 01-38 |
| యయా తు ధర్మకామార్థాన్ | 18-34 |
| యయా ధర్మ మధర్మం చ | 18-31 |
| యయా స్వప్నం భయం శోకం | 18-35 |
| యస్త్వాత్మరతి రేవ స్యాత్ | 03-17 |
| య స్త్విన్ద్రియాణి మనసా | 03-07 |
| యస్మాత్క్షరమతీతోఽహమ్ | 15-18 |
| యస్మాన్నో ద్విజతే లోకః | 12-15 |
| యస్య నాహంకృతో భావః | 18-17 |

యస్య సర్వే సమారమ్భాః 04-19
యాతయామం గతరసం 17-10
యా నిశా సర్వభూతానాం 02-69
యాన్తి దేవవ్రతా దేవాన్ 09-25
యామిమాం పుష్పితాం వాచమ్ 02-42
యావత్సంజాయతే కించిత్ 13-27
యావ దేతా న్నిరీక్షే’హమ్ 01-22
యావానర్థ ఉదపానే 02-46
యుక్తః కర్మఫలం త్యక్త్వా 05-12
యుక్త్యాహార విహారస్య 06-17
యుంజన్నేవం సదాత్మానమ్ 06-15
యుంజన్నేవం సదాత్మానం 06-28
యుధామన్యుశ్చ విక్రాన్తః 01-06
యే చైవ సాత్త్వికా భావాః 07-12
యే తు ధర్మ్యామృత మిదమ్ 12-20
యే తు సర్వాణి కర్మాణి 12-06
యే త్వక్షర మనిర్దేశ్యమ్ 12-03
యే త్వేతదభ్యసూయన్తః 03-32
యే’ప్యన్యదేవతాభక్తా 09-23
యే మే మత మిదం నిత్యం 03-31
యే యథా మాం ప్రపద్యన్తే 04-11
యే శాస్త్రవిధి ముత్సృజ్య 17-01
యేషాం త్వన్తగతం పాపం 07-28
యేషా మర్థే కాంక్షితం నః 01-33
యే హి సంస్పర్శజా భోగాః 05-22
యోగయుక్తో విశుద్ధాత్మా 05-07
యోగసన్న్యస్త కర్మాణం 04-41
యోగస్థః కురు కర్మాణి 02-48
యోగినామపి సర్వేషాం 06-47
యోగీ యుంజీత సతతం 06-10
యోత్స్యమానా నవేక్షే’హమ్ 01-23
యోన హృష్యతి న ద్వేష్టి 12-17
యో’న్తఃసుఖో’న్తరారామః 05-24
యో మాం పశ్యతి సర్వత్ర 06-30
యో మా మజ మనాదిం చ 10-03
యో మా మేవ మసమ్మూఢః 15-19
యో’యం యోగ స్త్వయా ప్రోక్తః 06-33
యో యో యాం యాం
తనుం భక్తః 07-21


## ర


రజసి ప్రలయం గత్వా 14-15
రజ స్తమ శ్చాభిభూయ 14-10
రజో రాగాత్మకం విద్ధి 14-07
రసో’హమప్సు కౌన్తేయ 07-08
రాగద్వేష విముక్తైస్తు 02-64
రాగీ కర్మఫలప్రేప్సుః 18-27
రాజన్ సంస్మృత్య సంస్మృత్య 18-76
రాజవిద్యా రాజగుహ్యమ్ 09-02
రుద్రాణాం శంకరశ్చాస్మి 10-23
రుద్రాదిత్యా వసవో
యే చ సాధ్యాః 11-22
రూపం మహత్తే బహువక్త్రనేత్రమ్ 11-23


## ల


లభన్తే బ్రహ్మ నిర్వాణమ్ 05-25
లేలిహ్యసే గ్రసమానః సమన్తాత్ 11-30
లోకే’స్మిన్ ద్వివిధా నిష్ఠా 03-03
లోభః ప్రవృత్తి రారంభః 14-12

### వ

వక్తు మర్హస్యశేషేణ 10-16
వక్త్రాణి తే త్వరమాణా విశన్తి 11-27
వాయుర్యమో'గ్ని ర్వరుణః 11-39
వాసాంసి జీర్ణాని యథా విహాయ 02-22
విద్యావినయ సంపన్నే 05-18
విధిహీన మసృష్టాన్నమ్ 17-13
వివిక్తసేవీ లఘ్వాశీ 18-52
విషయా వినివర్తన్తే 02-59
విషయేన్ద్రియ సంయోగాత్ 18-38
విస్తరేణాత్మనో యోగమ్ 10-18
విహాయ కామా న్యః సర్వాన్ 02-71
వీతరాగ భయక్రోధా 04-10
వృష్ణీనాం వాసుదేవో'స్మి 10-37
వేదానాం సామవేదో'స్మి 10-22
వేదావినాశినం నిత్యం 02-21
వేదాహం సమతీతాని 07-26
వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ 08-28
వ్యవసాయాత్మికా బుద్ధిః 02-41
వ్యామిశ్రేణేవ వాక్యేన 03-02
వ్యాస ప్రసాదాచ్ఛ్రుతవాన్ 18-75

### శ

శక్నోతీహైవ యః సోఢుం 05-23
శనైః శనై రుపరమేత్ 06-25
శమో దమ స్తపః శౌచం 18-42
శరీరం యదవాప్నోతి 15-08
శరీరం వాఙ్మనోభిర్యత్ 18-15
శుక్ల కృష్ణే గతీహ్యేతే 08-26
శుచౌ దేశే ప్రతిష్ఠాప్య 06-11
శుభా శుభ ఫలై రేవం 09-28
శౌర్యం తేజో ధృతి ర్దాక్ష్యం 18-43
శ్రద్ధయా పరయా తప్తం 17-17
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం 04-39
శ్రద్ధావా ననసూయశ్చ 18-71
శ్రుతి విప్రతిపన్నా తే 02-53
శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ 04-33
శ్రేయాన్ స్వధర్మో విగుణః 03-35
శ్రేయాన్ స్వధర్మో విగుణః 18-47
శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ 12-12
శ్రోత్రం చక్షుః స్పర్శనం చ 15-09
శ్రోత్రాదీ నీన్ద్రియాణ్యన్యే 04-26
శ్వశురాన్ సుహృదశ్చైవ 01-27

### స

స ఏవాయం మయా తే' ద్య 04-03
సంకరో నరకాయైవ 01-42
సంకల్పప్రభవాన్ కామాన్ 06-24
సంనియమ్యేన్ద్రియగ్రామమ్ 12-04
సన్న్యాసం కర్మణాం కృష్ణ 05-01
సన్న్యాసః కర్మయోగశ్చ 05-02
సన్న్యాసస్తు మహాబాహో 05-06
సన్న్యాసస్య మహాబాహో 18-01
సక్తాః కర్మణ్యవిద్వాంసః 03-25
సఖేతి మత్వా ప్రసభం యదుక్తం 11-41
స ఘోషో ధార్తరాష్ట్రాణాం 01-19
సతతం కీర్తయన్తో మామ్ 09-14
స తయా శ్రద్ధయా యుక్తః 07-22


| | |
|---|---|
| సత్కార మాన పూజార్థమ్ | 17-18 |
| సత్త్వం రజ స్తమ ఇతి | 14-05 |
| సత్త్వం సుఖే సంజయతి | 14-09 |
| సత్త్వాత్సంజాయతే జ్ఞానం | 14-17 |
| సత్త్వానురూపా సర్వస్య | 17-03 |
| సదృశం చేష్టతే స్వస్యాః | 03-33 |
| సద్భావే సాధుభావే చ | 17-26 |
| సన్తుష్టః సతతం యోగీ | 12-14 |
| సమం కాయశిరో గ్రీవం | 06-13 |
| సమం పశ్యన్హి సర్వత్ర | 13-29 |
| సమం సర్వేషు భూతేషు | 13-28 |
| సమః శత్రౌ చ మిత్రేచ | 12-18 |
| సమ దుఃఖ సుఖః స్వస్థః | 14-24 |
| సమోఽహం సర్వభూతేషు | 09-29 |
| సర్గాణా మాదిరన్తశ్చ | 10-32 |
| సర్వకర్మాణి మనసా | 05-13 |
| సర్వ కర్మాణ్యపి సదా | 18-56 |
| సర్వగుహ్యతమం భూయః | 18-64 |
| సర్వతః పాణిపాదం తత్ | 13-14 |
| సర్వద్వారాణి సంయమ్య | 08-12 |
| సర్వద్వారేషు దేహేఽస్మిన్ | 14-11 |
| సర్వధర్మాన్ పరిత్యజ్య | 18-66 |
| సర్వభూతస్థ మాత్మానం | 06-29 |
| సర్వభూతస్థితం యో మాం | 06-31 |
| సర్వభూతాని కౌన్తేయ | 09-07 |
| సర్వభూతేషు యేనైకం | 18-20 |
| సర్వమేతదృతం మన్యే | 10-14 |
| సర్వయోనిషు కౌన్తేయ | 14-04 |
| సర్వస్య చాహం హృది సన్నివిష్టః | 15-15 |
| సర్వాణీన్ద్రియ కర్మాణి | 04-27 |
| సర్వేన్ద్రియగుణాభాసం | 13-15 |
| సహజం కర్మ కౌన్తేయ | 18-48 |
| సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా | 03-10 |
| సహస్రయుగ పర్యన్తం | 08-17 |
| సాంఖ్య యోగౌ పృథగ్బాలాః | 05-04 |
| సాధిభూతాధిదైవం మాం | 07-30 |
| సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ | 18-50 |
| సీదన్తి మమ గాత్రాణి | 01-29 |
| సుఖం త్విదానీం త్రివిధం | 18-36 |
| సుఖ దుఃఖే సమే కృత్వా | 02-38 |
| సుఖ మాత్యన్తికం యత్తత్ | 06-21 |
| సుదుర్దర్శ మిదం రూపం | 11-52 |
| సుహృన్మిత్రార్యుదాసీన | 06-09 |
| స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా | 11-36 |
| స్థితప్రజ్ఞస్య కా భాషా | 02-54 |
| స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ | 05-27 |
| స్వధర్మమపి చావేక్ష్య | 02-31 |
| స్వభావజేన కౌన్తేయ | 18-60 |
| స్వయమే వాత్మనాత్మానం | 10-15 |
| స్వే స్వే కర్మణ్యభిరతః | 18-45 |



### హ


| | |
|---|---|
| హతో వా ప్రాప్స్యసే స్వర్గం | 02-37 |
| హన్త తే కథయిష్యామి | 10-19 |
| హృషీకేశం తదా వాక్యం | 01-21 |

# మాస్టర్ ఇ.కె. గ్రంథమాల






































**ప్రతులకు :**

**కులపతి బుక్ ట్రస్ట్, 15-7-1, 'ఏంజిల్స్ ఎన్‌క్లేవ్', కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.**

☏ 0891-2565291, 2701531.  e-mail : kulapathibooktrust@gmail.com



## కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య
## (మాస్టర్ ఇ.కె.)

- మానవజాతికి సర్వకాలములందును కావలసిన యుపదేశము భగవద్గీత. అది సర్వసమస్యల పరిష్కారము. సత్యమైన సుఖము కోరినవాడావశ్య మాచరింపవలసిన మార్గ మిందున్నది.
- "మంత్రగీత" యను నీ గ్రంథము జగత్ప్రసిద్ధమగు భగవద్గీతను తెనుగున మరల రచించు ప్రయత్నమే.
- ఇది భగవద్గీత శ్లోకముల కనువాదము కాదు. భగవద్గీతలో మంత్రముగా అనగా అంతర్లీనమైయున్న యుపదేశమునకు శ్లోకముల ననుసరించి చేసిన వివరణము.
- పరిశుద్ధమైన ఆస్తికహృదయము కలిగి పాండిత్య భారము లేని సామాన్య సాధుజనులలో భగవద్గీత నభ్యసించుటకు కావలసిన వివరణ మిందు చేయబడి యున్నది.
- మూలము ఉపదేశించుటకు ఆవశ్యకములైన యుదాహరణలు, దృష్టాంతములు నిందు కూర్చబడినవి. మూలమందలి సంకేత పదములు, కవి సమయములు, శాస్త్ర సమయములు ప్రత్యేకముగా వివరించబడినవి.
- బుద్ధిమంతులై సమగ్రముగా గీతోపదేశ మభ్యసింపదలచిన వారి కొరకు మాత్రమే ఈ మంత్రగీత యుద్దేశింపబడినది.

ఎక్కిరాల కృష్ణమాచార్య

ISBN 978-93-82199-65-6

కులపతి బుక్ ట్రస్ట్